www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
శనివారం | 2-8-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 125 | వరంగల్

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం; తిథి: అష్టమి ఉ.7.24 తదుపరి నవమి; నక్షత్రం: విశాఖ పూర్తి; వర్జ్యం: ఉ.9.56-11.44; దుర్ముహూర్తం: ఉ.5.58-7.40; అమృతఘడియలు: రా.8.43-10.30, రా.8.42-10.30, రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 5.58, సూర్యాస్తమయం: 6.44

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


గొర్రెల పంపిణీ పథకంలో వెయ్యి కోట్ల స్కాం!

7 జిల్లాల్లో కాగ్ నివేదికలో పేర్కొన్న నష్టం కేవలం రూ.254 కోట్లు

మొత్తం 33 జిల్లాల లెక్కలు తీస్తే రూ.వెయ్యి కోట్లు దాటే అవకాశం


మాజీ మంత్రి తలసాని ఓఎస్డీ కల్యాణ్ కుమార్‌దే క్రియాశీల పాత్ర

ప్రైవేటు ఖాతాలకు నిధుల బదిలీ: ఈడీ



హైదరాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ సర్కారు హయాంలో చేపట్టిన గొర్రెల పంపిణీ పథకంలో.. రూ.వెయ్యి కోట్ల కుంభకోణం జరిగినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గుర్తించింది. కేవలం 7 జిల్లాల్లో కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) అధ్యయనం చేస్తేనే రూ.253.93 కోట్ల మేర నిధులు దుర్వినియోగం అయినట్లు లెక్కతేలిందని.. మొత్తం 33 జిల్లాల

మిగతా 13వ పేజీలో...



బ్రో.. ఏడు అవార్డులు

71వ జాతీయ చలనచిత్ర అవార్డుల్లో సత్తా చాటిన తెలుగు సినిమా



కాసర్ల శ్యామ్




రోహిత్

- ఉత్తమ తెలుగు చిత్రంగా 'భగవంత్ కేసరి'
- ఉత్తమ గేయ రచయిత కాసర్ల శ్యామ్.. ఉత్తమ గాయకుడు రోహిత్
- ఉత్తమ బాలనటిగా 'గాంధీ తాత చెట్టు' నటి సుకృతి వేణి
- హను-మాన్, బేబీ సినిమాలకు వేర్వేరు విభాగాల్లో రెండేసి అవార్డులు
- జాతీయ ఉత్తమ చిత్రం ట్వల్త్ ఫెయిల్
- ఉత్తమ నటులు షారుక్‌ఖాన్, విక్రాంత్.. ఉత్తమ నటి రాణీ ముఖర్జీ

తెలుగు చలన చిత్ర సీమ మరోసారి తెలుగు వారంతా గర్వపడేలా చేసింది. సినీ ప్రపంచంలో తెలుగోడి సత్తాను చాటి చెబుతూ 71వ జాతీయ సినిమా అవార్డుల్లో ఏడు పురస్కారాలతో అదరగొట్టింది. 2023 సంవత్సరానికి గాను కేంద్ర ప్రభుత్వం శుక్రవారం జాతీయ అవార్డులు ప్రకటించింది. ఇందులో 'ఊరూ.. పల్లెటూరు..' అంటూ తెలంగాణ గ్రామీణ సంస్కృతిని వివరిస్తూ 'బలగం' సినిమా కోసం పాట రాసిన కాసర్ల శ్యామ్‌ను ఉత్తమ గేయ రచయిత అవార్డు వరించింది. అలాగే, ఉత్తమ తెలుగు చిత్రంగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో బాలకృష్ణ కథానాయకుడిగా తెరకెక్కిన 'భగవంత్ కేసరి' అవార్డు దక్కించుకోగా, హనుమాన్ సినిమా ఉత్తమ యానిమేషన్- విజువల్ ఎఫెక్ట్స్, ఫైట్స్ కొరియోగ్రఫీ విభాగాల్లో రెండు అవార్డులు సాధించింది. 'బేబీ' చిత్రం.. ఉత్తమ స్క్రీన్ ప్లే (సాయి రాజేశ్), ఉత్తమ గాయకుడి (పీవీఎన్ఎస్ రోహిత్) విభాగాల్లో రెండు పురస్కారాలు సాధించగా, 'గాంధీతాత చెట్టు' చిత్రంతో నటించిన దర్శకుడు సుకుమార్ కుమార్తె సుకృతి వేణి ఉత్తమ బాలనటి పురస్కారానికి ఎంపికయ్యారు. ఇక, 2023కి గాను 'ట్వల్త్ ఫెయిల్' జాతీయ ఉత్తమ చిత్రం అవార్డు దక్కించుకోగా.. షారుక్ ఖాన్(జవాన్), విక్రాంత్ మస్సె(ట్వల్త్ ఫెయిల్) సంయుక్తంగా ఉత్తమ కథానాయకుడి అవార్డుకు ఎంపికయ్యారు. అలాగే, మిసెస్ చటర్జీ వర్సెస్ నార్వే చిత్రానికి గాను రాణీ ముఖర్జీకి ఉత్తమ నటి అవార్డు దక్కింది.


10



షారూక్‌ఖాన్



రాణీ ముఖర్జీ



విక్రాంత్ మస్సె

కర్త కర్మ క్రియ కేసీఆరే



శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో రేవంత్‌రెడ్డికి పీసీ ఘోష్ కమిషన్ నివేదికను అందజేస్తున్న అధికారులు. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సీఎస్ రామకృష్ణారావు



బ్యారేజీల నిర్మాణ నిర్ణయం, వైఫల్యానికి కారణం ఆయనే

- పరీక్షలు జరపకుండా నిర్మాణం 'బ్లండర్ మిస్టేక్'
- కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణానికి మంత్రివర్గ ఆమోదం లేదు
- ముందే నిర్ణయాలు తీసుకొని సీడబ్ల్యూసీ నివేదికను సాకుగా చూపించారు
- హరీశ్‌రావు అడ్డగోలుగా ఆదేశాలు ఇచ్చారు
- నిర్మాణ నాణ్యతను ఆయన ఆదేశాలు ప్రభావితం చేశాయి
- కాళేశ్వరంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దెబ్బతింటుందని తెలిసినా ఆర్థిక మంత్రిగా ఈటల మౌనం వహించారు
- స్మితా సబర్వాల్, ఎస్‌కే జోషి, మాజీ ఈఎన్‌సీలంతా బాధ్యులే!
- జస్టిస్ పీసీ ఘోష్ సంచలన నివేదిక.. సీఎంకు అందజేత

హైదరాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీల నిర్మాణంలో లోపాలు, వైఫల్యాల్లో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ పాత్ర కీలకమని జస్టిస్ పినాకిచంద్ర ఘోష్ కమిషన్ తేల్చింది. ఈ విషయంలో ఆయన పాత్ర విస్మరించలేనిదని తెలిపింది. ఆయనతోపాటు ఆనాటి నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు, ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ తమ బాధ్యతలను సరిగా నిర్వర్తించలేదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. అంతేకాకుండా.. అప్పటి సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్, ఈఎన్‌సీలుగా పనిచేసినవారు, మరికొందరు అధికారులను కూడా వైఫల్యాలకు బాధ్యులుగా పేర్కొంది. బ్యారేజీల నిర్మాణానికి మంత్రివర్గ ఆమోదమే తీసుకోలేదని తెలిపింది. బ్యారేజీలపై ముందుగానే నిర్ణయం తీసుకొని.. తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదన్న సీడబ్ల్యూసీ నివేదికను కేవలం సాకుగా చూపించారని వెల్లడించింది. పైగా బ్యారేజీల నిర్మాణానికి ముందు భూ భౌతిక పరీక్షలను శాస్త్రీయ ప్రమాణాలతో జరపలేదని పేర్కొంది. కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై విచారణ జరిపిన కమిషన్ గురువారం ప్రభుత్వానికి నివేదిక ఇవ్వగా.. దానిని శుక్రవారం

మిగతా 12వ పేజీలో...

నివేదికపై త్రిసభ్య కమిటీ

- మూడు శాఖల ఉన్నతాధికారులతో ఏర్పాటు
- అధ్యయనం చేసి, సారాంశం సిద్ధం చేసే బాధ్యత
- 4న ఏకైక ఎజెండాతో మంత్రివర్గ సమావేశం
- కాళేశ్వరం కమిషన్ నివేదికపై క్యాబినెట్‌లో చర్చ
- తదుపరి చర్యలపై విధాన నిర్ణయం

12

ఓనమాలు రానోడూ జర్నలిస్టే!

- కాగితం ఇస్తే అక్షరాలు రాయడం చేతకాని వాళ్లు.. పిచ్చిరాతలతో వ్యవస్థలను నాశనం చేస్తున్నారు
- ఇంటి పేరులా 'జర్నలిస్టు' అని పెట్టుకుంటున్నారు
- సోషల్ మీడియాలో అసభ్య భాషతో జర్నలిజాన్ని నిర్వీర్యం చేస్తున్నారు
- కనీస అర్హతలు లేకుండా జర్నలిస్టులుగా చలామణీ అవుతున్న వాళ్లని సీనియర్లే పక్కన పెట్టాలి
- మీడియా సమావేశాల్లో కాలు మీద కాలేసుకునే ఆ జర్నలిస్టులను చూస్తే కొట్టాలనిపిస్తుంది
- 'నవ తెలంగాణ' 10వ వార్షికోత్సవంలో సీఎం రేవంత్



నవ తెలంగాణ 10వ వార్షికోత్సవంలో సీఎం రేవంత్‌తో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ. చిత్రంలో బీవీ రాఘవులు, మంత్రి పొంగులేటి

హైదరాబాద్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): రాజకీయ నాయకులపై విశ్వసనీయత దెబ్బతిన్నట్టుగానే జర్నలిస్టుల విశ్వసనీయత కూడా క్రమంగా తగ్గుతోందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఒకప్పుడు పత్రికలు, ప్రసార సాధనాలంటే ప్రజలకు విశ్వసనీయత ఉండేదని, ప్రస్తుతం జర్నలిస్టు విలువలు పూర్తిగా తగ్గిపోయాయని వ్యాఖ్యానించారు. ఓనమాలు రాని వాళ్లు, కాగితం ఇస్తే అక్షరాలు రాయడం రాని వాళ్లు జర్నలిస్టులుగా చలామణీ అవుతూ జర్నలిజాన్ని నిర్వీర్యం చేస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన్ కేంద్రంలో శుక్రవారం

మిగతా 13వ పేజీలో...

13

జనవరి నుంచి 4 వేల మెగావాట్లు

డిసెంబరులోగా వైటీపీఎస్ యూనిట్ల పూర్తి: భట్టి

800 మెగావాట్ల యూనిట్-1 జాతికి అంకితం

5000 కోట్ల అప్పు కోసం ఆర్బీఐకి సర్కారు ఇండెంటు

త్వరలో కేంద్ర క్యాబినెట్
పునర్వ్యవస్థీకరణ!

- పలువురు మంత్రులకు ఉద్వాసన?.. కూర్పుపై ఆరెస్సెస్ ప్రభావం
- ఆగస్టు 15 తర్వాత బీజేపీ అధ్యక్షుడి ఎంపిక
- దక్షిణాది నుంచి బీసీకి ఉపరాష్ట్రపతి పదవి లభించే అవకాశం?
- మంత్రివర్గం నుంచి విముక్తి కల్పించండి: బండి సంజయ్

న్యూఢిల్లీ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ముగిశాక (ఆగస్టు 20 తర్వాత).. ఏ రోజైనా కేంద్ర మంత్రివర్గాన్ని పెద్ద ఎత్తున పునర్వ్యవస్థీకరించే అవకాశం ఉందని విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. ఈ పునర్వ్యవస్థీకరణలో పలువురు మంత్రులకు ఉద్వాసన పలుకుతారని.. ముఖ్యంగా కొంతమంది మాజీ బ్యూరోక్రాట్లను పక్కన పెడతారని భావిస్తున్నారు. వారి స్థానంలో.. పార్టీలో చిరకాలం పనిచేసిన, సంఘ్‌కు సన్నిహితులైన వారికి స్థానం లభిస్తుందని, మంత్రివర్గ కూర్పుపై సంఘ్ ప్రభావం ఉంటుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. విదేశాంగమంత్రి జైశంకర్‌తో పాటు హర్దీప్ పురి, అర్జున్ రాం మేఘ్వాల్, అశ్వినీ వైష్ణవ్.. బ్యూరోక్రసీ నుంచి వచ్చి మోదీ ప్రభుత్వంలో మంత్రులుగా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. వీరిలో ఎవరిని తప్పిస్తారన్న విషయం చర్చనీయాంశంగా మారింది. వీరు కాక అనేకమందిని పనితీరు

మిగతా 12వ పేజీలో...

ప్రభుత్వ పథకాలకు బతికున్న నేతల
పేర్లు పెట్టొద్దు

- ప్రభుత్వ ప్రకటనల్లో మాజీ సీఎంలు, పార్టీల నేతల ఫొటోలు వద్దు.. ఇది సుప్రీం మార్గదర్శకాలకు విరుద్ధం
- సంక్షేమ స్కీముల అమలును మేం అడ్డుకోవడం లేదు
- ప్రచారం తీరుపైనే అభ్యంతరం: మద్రాస్ హైకోర్టు
- విచారణ ఈ నెల 13వ తేదీకి వాయిదా

చెన్నై, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు బతికున్న రాజకీయ నేతల పేర్లు పెట్టకూడదని మద్రాస్ హైకోర్టు స్పష్టంచేసింది. అలాగే ప్రభుత్వ ప్రకటనల్లో మాజీ ముఖ్యమంత్రులు, పార్టీ సిద్ధాంతకర్తల పేర్లు, ఫొటోలు ఉండకూడదని స్పష్టం చేసింది. తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్‌కు షాక్ ఇచ్చింది. 'ఉంగళుడన్ స్టాలిన్ (మీతోనే స్టాలిన్)' అనే పథకంలో స్టాలిన్ పేరు, ఆ స్కీం ప్రకటనలో దివంగత మాజీ సీఎం కరుణానిధి ఫొటో వాడకుండా అడ్డుకోవాలని

మిగతా 2వ పేజీలో...



ప్రజ్వల్ రేవణ్ణ దోషే

- అత్యాచారం కేసులో నేరం రుజువు
- తీర్పు వెలువరించిన బెంగళూరు కోర్టు
- నేడు శిక్ష ఖరారు
- తీర్పు విని కోర్టు హాల్లో ఏడ్చిన ప్రజ్వల్
- జేడీఎస్ మాజీ ఎంపీపై నమోదైన నాలుగు అత్యాచార కేసుల్లో ఇదొకటి

2

జీతం 15 వేలు.. ఆస్తి
వంద కోట్లు!

- కర్ణాటకలో ఓ కాంట్రాక్టు ఉద్యోగి భారీ అవినీతి
- లెక్కల్లో చూపని అనేక ఆస్తులు లోకాయుక్త దాడులతో వెలుగులోకి
- 24 ఇళ్లు, 40 ఎకరాల భూమి, 5 ఇంటి స్థలాలు, కార్లు, బంగారం గుర్తింపు

2

బెట్టింగ్ యాప్‌ల విషయంలో కేంద్రంపై
సుప్రీం సీరియస్

- కౌంటర్ దాఖలు చేయకపోవడంపై ఆగ్రహం
- మరోసారి కేంద్రంతోపాటు రాష్ట్రాలు, యాప్‌ల నిర్వహణ సంస్థలకు నోటీసులు
- తదుపరి విచారణ ఈ నెల 18కి వాయిదా

2

మనపై 25%.. పాక్‌పై 19%

తమతో ఒప్పందం కుదుర్చుకోని 69 దేశాలపై సుంకాల భారం.. ఉత్తర్వుపై ట్రంప్ సంతకం

రష్యా దగ్గర్లోకి అమెరికా జలాంతర్గాములు

మెద్వెదేవ్ వ్యాఖ్యలకు ప్రతిగా ట్రంప్ నిర్ణయం

అనిల్ అంబానీపై లుక్‌అవుట్ నోటీసులు



- రూ.3 వేల కోట్ల రుణం దారి మళ్లింపు కేసులో జారీ చేసిన ఈడీ
- 5న విచారణకు రావాలని సమన్లు కూడా..
- దేశం విడిచి వెళ్లకుండా లుక్‌అవుట్

2

'షక్సగాం'లో చైనా చొరబాటు

2

- లోయలో ముమ్మరంగా రోడ్ల నిర్మాణం
- వెల్లడించిన ఉపగ్రహ ఛాయా చిత్రాలు
- అక్సాయ్‌చిన్ హైవేతో కలిపేలా రహదారి
- షక్సగాం.. భారత్‌కు వ్యూహాత్మక ప్రాంతం

బీజేపీ కోసం ఈసీ ఓట్ల చోరీ

2

- ఆటంబాంబు వంటి ఆధారం ఉంది
- పేల్చితే దాక్కోడానికి ఈసీకి చోటుండదు
- ఇది విద్రోహ చర్య... బాధ్యులు రిటైరైనా కూడా వదిలిపెట్టబోం: రాహుల్‌గాంధీ

మెక్-సేవక్, మెక్ నిరీక్షక్!

- యంత్రాల్లోని లోపాలను చెప్పే పర్యవేక్షక వ్యవస్థలు
- హైదరాబాద్ బిట్స్ పిలానీ పరిశోధకుల ఆవిష్కరణ

14

జీతం 15 వేలు.. ఆస్తి వంద కోట్లు!

» కాంట్రాక్టు ఉద్యోగి భారీ అక్రమాలు

» లోకాయుక్త దాడులతో వెలుగులోకి

బెంగళూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేసే ఆయన జీతం నెలకు రూ.15 వేలు. కానీ ఆయన మొత్తం ఆస్తి విలువ దాదాపు రూ.100 కోట్లు. జీతం, ఆస్తికి సంబంధించిన ఈ రెండు అంకెలను పోల్చి చూస్తే ఎవరికైనా దిమ్మతిరిగి పోవాల్సిందే!! ఒక క్లర్క్‌గా పనిచేసే ఆయన.. కీలక అధికారులను తనకు అనుకూలంగా మలచుకొని, వారితో కలిసి భారీగా అక్రమాలకు పాల్పడినట్లు తెలుస్తోంది. లోకాయుక్త తాజా దాడుల్లో ఈ వ్యవహారం బయటపడింది. ఏకంగా లెక్కల్లో చూపని రూ.30 కోట్లకు పైగా ఆస్తులను అధికారులు గుర్తించారు. వీటిల్లో 24 ఇండ్లు, ఐదు ప్లాట్‌లు, 40 ఎకరాల వ్యవసాయ భూములు, కార్లు, బంగారం తదితరాలు ఉన్నాయి. వివరాల్లోకి వెళ్తే.. కర్ణాటక గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ(కేఆర్ఐడీఎల్)లో కళకప్ప నిడగుంది అనే వ్యక్తి కాంట్రాక్టు పద్ధతిన 2003లో చెత్త ఊడ్చే పనిలో చేరాడు. అప్పట్లో అతని నెల జీతం రూ.200 మాత్రమే. 17 ఏళ్ల సర్వీసు తర్వాత ఉద్యోగోన్నతిపై క్లర్క్ స్థాయికి చేరాడు. ఈ క్రమంలో కేఆర్ఐడీఎల్‌లో పనిచేసే కొందరు అధికారులతో కలిసి భారీగా అక్రమాలకు పాల్పడ్డాడు. 2023-24 మధ్య చేపట్టిన పనుల్లో రూ.72 కోట్ల దాకా అక్రమాలు జరిగాయని, 96 అసంపూర్తి ప్రాజెక్టులకు నకిలీ పత్రాలు సృష్టించి.. ఈ సొమ్మును కాజేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఇందులో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చించోళ్కర్, కళకప్ప పాత్ర ఉన్నట్లు తేలింది. దీంతో 2024లో వీరిద్దరినీ సస్పెండ్ చేశారు. అప్పటికి కళకప్ప నెల జీతం రూ.15 వేలు. ఇతని అక్రమాల గురించి లోకాయుక్త బృందం సమగ్ర ఆధారాలు సేకరించింది.

పేదరికం నుంచి రూ.కోట్లకు పడగలెత్తాడు!

డీఎస్పీ వసంతకుమార్ నేతృత్వంలో కొప్పళ జిల్లా కేంద్రంలోని కళకప్ప నివాసం, గతంలో పనిచేసిన కార్యాలయంలో గురువారం ఏకకాలంలో దాడులు చేసింది. కళకప్పకు కొప్పళ, భాగ్యనగరలో 24 ఇళ్లలు ఉన్నట్లు గుర్తించింది. హిట్నాళ్, హుళగి, యలబురగలో 40 ఎకరాల భూమి, 5 ఇంటి స్థలాలను గుర్తించింది. వీటితో పాటు రెండు కార్లు, రెండు బైకులు, 350 గ్రాముల బంగారం,



కళకప్ప

కేజీన్నరకు పైగా వెండి వస్తువులను కూడా అధికారులు సీజ్ చేశారు. ఈ ఆస్తులు కళకప్ప, ఆయన భార్య, సోదరుడి పేర్లపై ఉన్నాయి. పలువురి బినామీల పేరిట కూడా ఆస్తులు బయటపడ్డాయి. కాగా, సస్పెండ్ అయిన చించోళ్కర్ కోర్టు నుంచి స్టే తెచ్చుకుని దావణగెరెలో మళ్లీ విధులకు చేరారు. కళకప్పపై సస్పెన్షన్ కొనసాగుతోంది. కాగా, ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో లోకాయుక్త అధికారులు గత కొద్ది రోజులుగా పలువురు ప్రభుత్వ అధికారులకు చెందిన ఇళ్లు, ప్రాంతాల్లో తనిఖీలు చేస్తున్నారు. జూలై 23నఐఏఎస్ అధికారి వసంతి అమర్‌తో సహా 8మంది అధికారులకు సంబంధించిన ప్రాంతాల్లో సోదాలు చేపట్టారు. రూ.37.42 కోట్ల విలువైన ఆస్తులను సీజ్ చేశారు.



ప్రభుత్వ పథకాలకు బతికున్న నేతల పేర్లు పెట్టొద్దు

(మొదటిపేజీ తరువాయి)

కోరుతూ అన్నాడీఎంకే ఎంపీ సీవీ షణ్ముగం ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మణీంద్రమోహన్ శ్రీవాస్తవ, జస్టిస్ సుందర్ మోహన్‌తో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపి.. పై ఆదేశాలు జారీచేసింది. ప్రభుత్వ ప్రకటనలకు సంబంధించి సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలు, మార్గదర్శకాల ప్రకారం ప్రభుత్వ ప్రకటనల్లో సీఎం స్టాలిన్ ఫొటో ఉండవచ్చని.. అయితే దివంగత పార్టీ నేతలు, మాజీ ముఖ్యమంత్రుల ఫొటోలు, పార్టీ చిహ్నాలు, జెండాలు ఉండరాదని, వాటికి అనుమతి లేదని స్పష్టంచేసింది. ప్రభుత్వ ప్రకటనల్లో అధికార పార్టీ పేరు, చిహ్నం ఉపయోగించడం సుప్రీంకోర్టు, ఎన్నికల కమిషన్ ఉత్తర్వులకు విరుద్ధమని తెలిపింది. రాష్ట్రప్రభుత్వం కొత్తగా ప్రారంభించబోయే పథకాలు, అమలులో ఉన్న పథకాలకు సంబంధించిన ప్రకటనల్లో రాజకీయ నేతల పేర్లు, ఫొటోలు లేకుండా చూసుకోవాలని ఆదేశించింది. పథకాల ప్రారంభోత్సవాలు, అమలుకు సంబంధించి ఎలాంటి వ్యతిరేక ఉత్తర్వులూ జారీచేయడం లేదని పేర్కొంది. అయితే సంక్షేమ పథకాలను అమలు చేయకుండా ప్రభుత్వాన్ని తాము అడ్డుకోవడం లేదని.. వాటిని ప్రచారం చేస్తున్న తీరుపైనే అభ్యంతరమని స్పష్టత ఇచ్చింది. 'ఉంగలుడన్ స్టాలిన్' పథకాన్ని తమిళనాడు ప్రభుత్వం ఇటీవలే ప్రారంభించింది. ఆయన పేరుతోనే శనివారం మరో ఆరోగ్య పథకాన్ని ప్రారంభించనుంది. పిటిషనర్ షణ్ముగం తరఫున సీనియర్ న్యాయవాది విజయ్ నారాయణ్ వాదనలు వినిపించారు. కొందరు రాజకీయ నేతలను ప్రమోట్ చేయడానికి రాష్ట్రప్రభుత్వం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తోందని, 2014నాటి సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ఉల్లంఘిస్తోందని తెలిపారు. అయితే రాజకీయ చిహ్నాలు కనిపించే ఎలాంటి మెటీరియల్ ఉన్నా చట్టనిబంధనలను ఉల్లంఘించినట్లేనని హైకోర్టు స్పష్టంచేసింది.

సెప్టెంబరు 9న ఉపరాష్ట్రపతి ఎన్నిక

» ఈ నెల 7న నోటిఫికేషన్ జారీ..అదే రోజు నామినేషన్లు

న్యూఢిల్లీ, ఆగస్టు 1: ఉపరాష్ట్రపతి ఎన్నికకు ఎన్నికల కమిషన్ (ఈసీ) షెడ్యూల్ ప్రకటించింది. ఈ నెల ఏడో తేదీన నోటిఫికేషన్ జారీ అవుతుందని.. అదే రోజు నామినేషన్ల దాఖలు మొదలవుతుందని.. 21వ తేదీ వరకు నామినేషన్లకు గడువు ఉంటుందని సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. 22న నామినేషన్లు పరిశీలిస్తారు. పోటీ నుంచి ఉపసంహరించుకునేందుకు ఆఖరి గడువు 25వ తేదీ. అనివార్యమైతే వచ్చే నెల 9వ తేదీన పోలింగ్ జరుగుతుందని ఈసీ తెలిపింది. గత నెల 21న జగ్‌దీప్ ధన్‌ఖడ్ ఆకస్మిక రాజీనామాతో ఉపరాష్ట్రపతి పదవి ఖాళీ అయిన సంగతి తెలిసిందే. షెడ్యూల్ ప్రకారం సెప్టెంబరు 9న పార్లమెంటు భవనం మొదటి అంతస్తులో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. అదే రోజు ఓట్లు లెక్కించి ఫలితం ప్రకటిస్తారు.

'షక్సగాం'లో చైనా చొరబాటు

న్యూఢిల్లీ ఆగస్టు 1: సరిహద్దు ప్రాంతాల్లోని భారత భూభాగంలో చైనా అక్రమ చొరబాట్లు కొనసాగుతూనే ఉన్నాయి. భారత్‌కు వ్యూహాత్మక ప్రాంతమైన షక్సగాం వ్యాలీలో డ్రాగన్ కంట్రీ రోడ్ల నిర్మాణంతోపాటు మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తోంది. అత్యంత క్లిష్టమైన ఈ లోయలో చైనా చేపట్టిన రహదారి విస్తరణ, మౌలిక సదుపాయాల పనులను ఉపగ్రహ ఛాయా చిత్రాలు స్పష్టం చేశాయి. షక్సగాంలో చేపట్టిన కొత్త రోడ్డు.. చైనాలోని అక్సాయ్‌చిన్(జీ219) జాతీయ రహదారిని కలుపుతుంది. వాస్తవానికి షక్సగాం వ్యాలీ భారత్ పరిధిలో, ఉత్తర లడఖ్‌లోని సియాచిన్‌కు సమీపంలోనే ఉంది. అయితే.. 1963లో పాకిస్థాన్ ఓ ఒప్పందం ద్వారా దీనిని చైనాకు అప్పగించింది. ఫలితంగా అప్పటి నుంచి ఈ లోయపై చైనా నియంత్రణే కొనసాగుతోంది. కానీ, సదరు ఒప్పందాన్ని భారత్ తిప్పికొడుతోంది. దీనిని చట్టవిరుద్ధమని పేర్కొంటోంది. కాగా, ప్రస్తుత ఉపగ్రహ ఛాయా చిత్రాలపై ఓపెన్-సోర్స్ ఇంటెలిజెన్స్ విశ్లేషకుడు నాథన్ రూసర్, పరిశోధకులు నేత్రా దేశాయ్ స్పందిస్తూ.. అత్యంత క్లిష్టమైన షక్సగాంలో చైనా రహదారుల నిర్మాణం చేపడుతున్నట్లు స్పష్టంగా తెలుస్తోందన్నారు.

బెట్టింగ్ యాప్‌ల విషయంలో కేంద్రంపై సుప్రీం సీరియస్

న్యూఢిల్లీ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): బెట్టింగ్ యాప్‌ల విషయంలో కేంద్ర ప్రభుత్వంపై సుప్రీంకోర్టు సీరియస్ అయింది. ఈ అంశంపై కేంద్రం కౌంటర్ దాఖలు చేయకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేసింది. అన్ని ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లపై నిషేధం విధించాలని కోరుతూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ మార్చి 26న సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసిన సెలబ్రిటీలపై చర్యలు తీసుకోవాలని, దీనికి సంబంధించి ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చేలా కేంద్రానికి ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. కాగా, గత విచారణ సందర్భంగా దీనిపై స్పందించాలని కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ పిటిషన్‌పై శుక్రవారం సుప్రీంకోర్టు మళ్లీ విచారణ చేపట్టింది. అయితే, గత విచారణ సందర్భంగా నోటీసులు ఇచ్చినప్పటికీ, కౌంటర్ దాఖలు చేయకపోవడంతో కేంద్రంపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. బెట్టింగ్ యాప్‌లను కేంద్రం సమర్థిస్తుందా? వ్యతిరేకిస్తుందా? బెట్టింగ్ యాప్‌ల నిషేధానికి ఎలాంటి యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తుంది? అంటూ కేంద్రాన్ని ప్రశ్నించింది. కేంద్రం వైఖరి తెలుసుకునేందుకు మరో అవకాశం కల్పిస్తున్నామని తెలిపింది. తదుపరి విచారణను ఈ నెల 18కి వాయిదా వేసింది.

వాణిజ్య సిలిండర్ ధర రూ.33.50 తగ్గింపు

న్యూఢిల్లీ, ఆగస్టు 1: కేంద్ర ప్రభుత్వ రంగ చమురు సంస్థలు వాణిజ్య అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్ (19 కిలోలు) ధర స్వల్పంగా రూ.33.50 తగ్గిస్తూ గురువారం నిర్ణయం తీసుకున్నాయి. దీంతో వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర రూ.1,631.50 లకు చేరుకున్నది. తద్వారా వాణిజ్య వినియోగదారులకు ఉపశమనం లభించనుంది. తగ్గించిన ధర శుక్రవారం నుంచి అమల్లోకి వచ్చింది. కానీ, గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ (14.2 కిలోలు) ధరలో ఎటువంటి మార్పు లేదు.

రష్యా సమీపంలోకి అమెరికా అణు జలంతర్గాములు

వాషింగ్టన్, ఆగస్టు 1: తనను ఉద్దేశించి వ్యంగ్య వ్యాఖ్యలు చేసిన రష్యా మాజీ అధ్యక్షుడు, ఆ దేశ భద్రతా మండలి డిప్యూటీ చైర్మన్ దిమిత్రి మెద్వెదేవ్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా విరుచుకుపడ్డారు. మెద్వెదేవ్ వ్యాఖ్యలు రెచ్చగొట్టేలా ఉన్నాయని, రెండు అణు జలంతర్గాములను రష్యాకు సమీపంలో మోహరించాలని తమ సైనికాధికారులను ఆదేశించానని శుక్రవారం ప్రకటించారు. భారత్, రష్యాలను పతన ఆర్థిక వ్యవస్థ (డెడ్ ఎకానమీ)లు అంటూ అభివర్ణించిన ట్రంప్‌ను వ్యంగ్యంగా విమర్శిస్తూ.. 'ట్రంప్‌కు ఇష్టమైన వాకింగ్ డెడ్ వంటి రక్త పిశాచి సినిమాలు ఆయనను వెంటాడుతున్నట్టున్నాయి' అని మెద్వెదేవ్ గురువారం పేర్కొన్నారు. ప్రచ్ఛన్న యుద్ధకాలం నాటి ఆటోమేటిక్ అణ్వస్త్ర దాడి వ్యవస్థ 'డెడ్ హ్యాండ్'ను గుర్తు తెచ్చుకోవాలంటూ.. పరోక్షంగా అణు దాడికీ సిద్ధమే అన్నట్టు హెచ్చరించారు.

ట్రంప్ సుంకాలతో అమెరికా కుటుంబాలపై దెబ్బ!

» సగటున 2,400 డాలర్ల వ్యయం పెరగొచ్చు.. ఎస్బీఐ రిపోర్టు

న్యూఢిల్లీ, ఆగస్టు 1: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తమ దేశంలోకి వచ్చే వివిధ దేశాల ఉత్పత్తులపై కొత్తగా విధించిన సుంకాలు అమెరికన్ కుటుంబాలను గణనీయంగా ప్రభావితం చేయవచ్చన్న అంచనాలు వెలువడుతున్నాయి. సుంకాల దెబ్బతో ద్రవ్యోల్బణం పెరుగుతుందని, ఫలితంగా స్వల్పకాలంలో అమెరికన్ కుటుంబాల సగటు వ్యయాలు దాదాపు 2,400 డాలర్లు (దాదాపు రూ.2.09లక్షలు) పెరిగే అవకాశం ఉందని ఎస్‌బీఐ పరిశోధనా నివేదిక పేర్కొంది. పెరిగిన కుటుంబాల వ్యయాల భారం అన్ని కుటుంబాలకు ఒకే విధంగా ఉండదని, తక్కువ ఆదాయం కలిగిన కుటుంబాలు దాదాపు 1,300 డాలర్ల నష్టాన్ని చవిచూసే అవకాశం ఉందని పేర్కొంది. ఈ భారం సంపన్న కుటుంబాలతో పోల్చితే దాదాపు మూడు రెట్లు ఎక్కువని తెలిపింది. మరోవైపు అధిక ఆదాయ కుటుంబాలు 5,000 డాలర్ల వరకు నష్టాన్ని ఎదుర్కొవచ్చని అంచనా వేసింది. కొత్త సుంకాలతో భారత్‌కన్నా అమెరికా ఆర్థిక వ్యవస్థనే ఎక్కువగా దెబ్బతీయవచ్చని పేర్కొంది. తక్కువ జీడీపీ వృద్ధి అంచనా, పెరుగుతున్న ద్రవ్యోల్బణానికి తోడు కొత్త సుంకాలతో అమెరికా ఆర్థిక వ్యవస్థ మరింత నష్టపోతుందన్న అంచనాలు వెలువడుతున్నాయి. ఇక అమెరికాలో ద్రవ్యోల్బణం పెరుగుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయని, కొత్త సుంకాల ప్రభావంతో ద్రవ్యోల్బణం అమెరికా ఫెడరల్ రిజర్వు 2026 నాటికి లక్ష్యంగా పెట్టుకున్న 2 శాతం కన్నా ఎగువన ఉండవచ్చని నివేదిక పేర్కొంది. సుంకాల సంబంధిత ఒత్తిళ్ల ఫలితంగా అమెరికా జీడీపీపై దాదాపు 40 నుంచి 50 బేసిస్ పాయింట్ల మేర దెబ్బ పడవచ్చని తెలిపింది. ఇక భారత్‌పై ఆర్థిక ప్రభావం తక్కువగా ఉండనుందని ఎస్బీఐ అంచనా వేసింది.

ప్రజ్వల్ రేవణ్ణ దోషి




బెంగళూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకతో పాటు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన అత్యాచారం కేసులో జేడీఎస్ బహిష్కృత నేత, మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ (34)ను బెంగళూరు కోర్టు దోషిగా తేల్చింది. గత ఏడాది హాసన్ జిల్లాలో ఆయనపై నమోదైన నాలుగు రేప్ కేసుల్లో ఒకదానిలో దోషిగా తేలుస్తూ స్థానిక ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించింది. న్యాయాధికారి సంతోష్ గజానన్ భట్ శనివారం శిక్ష ఖరారు చేయనున్నారు. జడ్జి తీర్పు వినగానే.. ప్రజ్వల్ రేవణ్ణ కోర్టు హాల్‌లోనే విలపించాడు. తమ కుటుంబానికి చెందిన ఓ ఫాంహౌస్‌లో ఇంట్లో పనిచేసే మహిళపై అత్యాచారం చేసి, ఆ దురాగతాన్ని వీడియో తీసినట్లు పేర్కొంటూ నమోదైన కేసులో కోర్టు తాజాగా తీర్పు వెలువరించింది. ప్రజ్వల్ రేవణ్ణ దీంతో సహా నాలుగు రేప్ కేసుల్లో నిందితుడిగా ఉన్నారు. రేవణ్ణ పలువురు మహిళలపై లైంగిక దాడులకు పాల్పడినట్లు ఆరోపిస్తూ 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు భారీగా వీడియోలు బయటకు రావడం సంచలనం రేపిన విషయం తెలిసిందే. ఈ పరిణామం తర్వాత ఆయనపై నాలుగు రేప్ కేసులు నమోదయ్యాయి. అప్పుడు హాసన్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి జేడీఎస్ అభ్యర్థిగా పోటీచేసిన రేవణ్ణ ఓడిపోయారు. ప్రజ్వల్ రేవణ్ణ మాజీ ప్రధాని, జేడీఎస్ జాతీయ అధ్యక్షుడు హెచ్‌డీ దేవెగౌడ మనవడు. ప్రజ్వల్ రేవణ్ణపై రేప్ కేసు నమోదైన తర్వాత ఆయన్ను జేడీఎస్ నాయకత్వం పార్టీ నుంచి బహిష్కరించింది.

ప్రస్తుత కేసు నేపథ్యమిదీ..

మైసూరు జిల్లా కేఆర్ నగర్‌కు చెందిన 48 ఏళ్ల ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా గత ఏడాది ఏప్రిల్ 28న ప్రజ్వల్‌పై అత్యాచార కేసు నమోదైంది. హాసన్ జిల్లా హొళెనరసీపురలోని వారి కుటుంబానికి చెందిన ఫాంహౌస్‌లో పనిచేసే మహిళ.. రేవణ్ణ తనపై 2021లో రెండుసార్లు అత్యాచారానికి పాల్పడ్డాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫాంహౌస్‌లో, బెంగళూరు బసవనగుడిలోని ఆయన తండ్రి రేవణ్ణ నివాసంలో అత్యాచారం చేసినట్లు బాధితురాలు పేర్కొన్నారు. ఆ దురాగతాన్ని మొబైల్ ఫోన్‌లో వీడియో తీశాడని తెలిపారు. ప్రజ్వల్ కేసు దర్యాప్తు కోసం ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో బాధితురాలిని ప్రజ్వల్ తండ్రి రేవణ్ణ, తల్లి భవాని కిడ్నాప్ చేశారు. సిట్ పోలీసులు 2024 సెప్టెంబరులో ఆమెను రక్షించారు. అంతకుముందు మహిళలపై లైంగిక వేధింపులకు సంబంధించిన వీడియోలు 2024 ఏప్రిల్ 26న బయటకు వచ్చిన తర్వాత ప్రజ్వల్ జర్మనీకి పారిపోయాడు. తిరిగొచ్చిన రేవణ్ణను పోలీసులు బెంగళూరు విమానాశ్రయంలో మే 31 పోలీసులు అరెస్టు చేశారు. హోలేనరసీపుర పోలీసుస్టేషన్‌లో నమోదైన కేసులో ముమ్మర దర్యాప్తు జరిపిన ప్రత్యేక దర్యాప్తు బృందం 1,632 పేజీలతో గత ఏడాది డిసెంబరులో చార్జిషీట్ దాఖలు చేసింది. 113 మంది సాక్షులను విచారించినట్లు పేర్కొంది. ఆ తర్వాత ఈ ఏడాది ఏప్రిల్ 3న అభియోగాలు మోపింది. ప్రజ్వల్ పరప్పన అగ్రహార సెంట్రల్ జైలులో 14 నెలలుగా ఉంటున్నారు. బాధిత మహిళకు న్యాయం జరిగిందని కాంగ్రెస్ మాజీ ఎంపీ, నటి రమ్య ఎక్స్‌లో స్పందించారు.

అనిల్ అంబానీపై లుక్‌అవుట్ నోటీసులు



న్యూఢిల్లీ, ఆగస్టు 1: ప్రముఖ వ్యాపారవేత్త, అనిల్ ధీరుభాయ్ అంబానీ గ్రూప్ (ఏడీఏజీ) చైర్మన్ అనిల్ అంబానీ చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. రూ.3 వేల కోట్ల బ్యాంకు రుణ మోసానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో ఆయనపై ఈడీ లుక్ అవుట్ నోటీస్ జారీ చేసింది. ఈ కేసులో ఈనెల 5న ఢిల్లీలోని ఈడీ ప్రధాన కార్యాలయంలో విచారణకు హాజరు కావాలంటూ తొలుత ఆయనకు సమన్లు ఇచ్చింది. అయితే ఆయన దేశం విడిచిపోకుండా చూసే ఉద్దేశంతో అనంతరం లుక్‌అవుట్ సర్క్యులర్ కూడా జారీ చేసింది. 2017-19 మధ్య అంబానీ గ్రూప్ కంపెనీలకు యెస్ బ్యాంకు ఇచ్చిన రూ.3 వేల కోట్ల రుణాలను దారి మళ్లించారనే ఆరోపణలపై ఈడీ దర్యాప్తు చేపట్టింది. రుణం మంజూరు చేయడానికి యెస్ బ్యాంకు ప్రమోటర్లకు ముడుపులు ఇచ్చారన్న అభియోగాలున్నాయి. అలాగే రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తీసుకున్న రూ.10 వేల కోట్ల రుణాలను కూడా దారి మళ్లించారనే ఆరోపణలున్నాయి. ఇటు ఆర్‌కామ్-కెనరా బ్యాంకుల మధ్య రూ.1,150 కోట్ల రుణం విషయంలో అవకతవకలు.. ఏటీ-1 బాండ్లలో రిలయన్స్ మ్యూచువల్ ఫండ్ పెట్టిన రూ.2,850 కోట్ల పెట్టుబడుల్లోనూ 'క్విడ్ ప్రో కో' జరిగినట్లు ఆరోపణలున్నాయి. మొత్తంగా రూ.17 వేల కోట్ల ఆర్థిక అవకతవకలకు సంబంధించి అనిల్ అంబానీని ప్రశ్నించి.. ఈడీ ఆయన వాంగ్మూలాన్ని రికార్డు చేయనుంది.

ఎస్ఐఆర్‌పై చర్చకు పట్టు

న్యూఢిల్లీ, ఆగస్టు 1: బిహార్‌లో ఓటరు జాబితా ప్రత్యేక సవరణపై చర్చ విషయంలో విపక్షాలు పట్టువీడడం లేదు. ఎస్ఐఆర్ అంశం శుక్రవారం కూడా పార్లమెంట్ ఉభయసభలను కుదిపేసింది. దీంతో విపక్ష సభ్యుల ఆందోళనల నడుమ పలుమార్లు వాయిదా పడుతూ జరిగిన లోక్‌సభ, రాజ్యసభ ఎలాంటి చర్చలు లేకుండానే సోమవారానికి వాయిదా పడ్డాయి. ఇక, రాజ్యసభ వెల్‌లోకి దూసుకొచ్చిన సభ్యులను మార్షల్స్ అడ్డుకోవడం వివాదాస్పదంగా మారింది. రాజ్యసభను పారామిలటరీ చేతికి అప్పగించారంటూ కాంగ్రెస్ సహా విపక్షాలన్నీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. తొలుత ఉదయం 11 గంటలకు లోక్‌సభ సమావేశం కాగా స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాల నిర్వహణకు సిద్ధమయ్యారు. కానీ ప్రతిపక్ష పార్టీల సభ్యులు ఎస్ఐఆర్‌పై చర్చ, ఉపసంహరణకు డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తుండడంతో సభ మొదలైన మూడు నిమిషాలకే మధ్యాహ్నం రెండు గంటలకు వాయిదా వేశారు. రెండు గంటలకు సభ పునఃప్రారంభమైన తర్వాత గోవా శాసనసభలో ఎస్టీలకు సీట్లు కేటాయింపునకు సంబంధించిన బిల్లుపై చర్చను స్పీకర్ ప్రతిపాదించగా ప్రతిపక్ష సభ్యులు సహకరించలేదు. మరో పక్క, ఎస్ఐఆర్‌పై రాజ్యసభలోనూ ఇదే తరహా ఆందోళనలు కొనసాగగా.. ప్రశ్నోత్తరాలు, జీరో అవర్ జరగకుండానే సభ వాయిదా పడింది. ఇదిలా ఉండగా, ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నట్టుగా ఎస్ఐఆర్‌పై పార్లమెంట్‌లో చర్చించలేమని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెన్ రిజిజు శుక్రవారం తెలిపారు. ఈసీకి సంబంధించిన అంశాలపై పార్లమెంట్‌లో చర్చించలేమంటూ కాంగ్రెస్ నేత, దివంగత బలరాం జాఖర్ లోక్‌సభ స్పీకర్‌గా ఉన్నప్పుడు ఇచ్చిన ఉత్తర్వులనే తాము అనుసరిస్తున్నామని రిజిజు పేర్కొన్నారు.

బీజేపీ కోసం ఈసీ ఓట్ల చోరీ

దీనిపై ఆటంబాంబు వంటి ఆధారం మా వద్ద ఉంది.. దాన్ని పేల్చితే దాక్కోడానికి ఈసీకి చోటు కూడా దొరకదు

» ఆరు నెలలపాటు దర్యాప్తుచేసి ఈసీ గుట్టును పట్టాం: రాహుల్



శుక్రవారం పార్లమెంటు ఆవరణలో రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): బీజేపీ కోసం ఎన్నికల సంఘం ఓట్లను చోరీ చేస్తోందని నిరూపించే ఆటంబాంబు వంటి ఆధారం తమ వద్ద ఉన్నదని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ వెల్లడించారు. ఆ ఆటంబాంబును పేల్చితే ఈసీకి దేశంలో దాక్కోవడానికి చోటు కూడా మిగలదని వ్యాఖ్యానించారు. ఈసీ చర్య విద్రోహం కిందకే వస్తుందని, ఇందులో భాగస్వాములైన ఉన్నతాధికారుల నుంచి కింది సిబ్బంది వరకు ఎవరినీ వదిలిపెట్టబోమని, ఒకవేళ రిటైరు అయి ఎక్కడెక్కడో ఉన్నా వెతికిమరీ పట్టుకుంటామని రాహుల్ హెచ్చరించారు. బిహార్‌లో ఎస్ఐఆర్ తర్వాత ముసాయిదా ఓటర్ల జాబితాను ఈసీ శుక్రవారం విడుదల చేసింది. ఈ నేపథ్యంలో రాహుల్ ఈసీపై విమర్శలు గుప్పించారు. నిజానికి, ఈ నెల ఐదో తేదీన కర్ణాటకలో ఈసీ అక్రమాలను బయటపెడతామని గురువారమే కాంగ్రెస్ పార్టీ హెచ్చరించింది. దీనిపై రాహుల్ గాంధీ నాయకత్వంలో బెంగళూరులో భారీ నిరసన ప్రదర్శన కూడా ఉంటుందని ఆ పార్టీ జాతీయ కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలిపారు. ఈ నేపథ్యంలో రాహుల్‌గాంధీ చేసిన 'ఆటంబాంబు' వ్యాఖ్య ఆసక్తిని రేపుతోంది. "ఈసీ ఓట్ల చోరీకి పాల్పడుతోందని ముందునుంచీ నేను చెబుతూనే ఉన్నాను. ఇప్పుడు దానికి సంబంధించిన ఆధారం కూడా మాకు లభించింది" అని పార్లమెంటు ఆవరణలో రాహుల్ అన్నారు. 2023లో మధ్యప్రదేశ్ ఎన్నికలు, ఆ మరుసటి ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికలు, ఇటీవలి మహారాష్ట్ర ఎన్నికల్లో పోలింగ్ ఉల్లంఘనలు జరిగాయన్నారు. "మహారాష్ట్రలో ఓటర్ల సవరణ పేరిట కోటిమందిని కొత్తగా ఎన్నికల జాబితాలో చేర్చారని మేం ఇప్పటికీ నమ్ముతున్నాం. ఆధారాలతో ఈసీని కలిసినా అప్పట్లో ఉపయోగం లేకపోయింది. దీంతో మేమే రంగంలోకి దిగాం. సొంతంగా ఆరునెలలపాటు దర్యాప్తు జరిపి.. ఈసీకి వ్యతిరేకంగా 'ఆటంబాంబు' వంటి ఆధారం కనుగొన్నాం." అని రాహుల్‌గాంధీ వివరించారు. మరోవైపు, 'ఓట్లచోరీ' అంటూ రాహుల్ చేసిన వ్యాఖ్యలను ఈసీ తోసిపుచ్చింది. అలాంటి నిరాధార ఆరోపణలను పట్టించుకోనక్కర్లేదని తన సిబ్బందికి స్పష్టంచేసింది. "ఈసీపై నిరాధార ఆరోపణలు చేయడం, బెదిరింపులకు పాల్పడటం రోజువారీ వ్యవహారంగా మారింది. బాధ్యత లేని ఇలాంటి ప్రకటనలను పట్టించుకోకుండా, పారదర్శకంగా విధులు నిర్వహించాలని మా సిబ్బందిని కోరాం." అని వివరించింది. తమ వద్ద 'ఆటంబాంబు' లాంటి ఆధారం ఉన్నదన్న రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ ఘాటుగా స్పందించింది. 'ఆటంబాంబులా పేలొద్దు. నీరులా ప్రవహించండి' అంటూ ఎద్దేవాచేసింది. మర్యాద లేకుండా ఈసీపై అప్రజాస్వామిక భాషను రాహుల్ వాడటం సరికాదని సంబిత్ పాత్రా మండిపడ్డారు.

బిహార్‌లో 65 లక్షల ఓట్లు 'మిస్సింగ్'

బిహార్‌లో ఎస్ఐఆర్ కసరత్తు పూర్తయిన నేపథ్యంలో ముసాయిదా ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం శుక్రవారం విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 65 లక్షల మంది ఇందులో చేర్చలేదని స్పష్టమైంది. ఎస్ఐఆర్‌కు ముందు రాష్ట్రంలో 7.9 కోట్ల ఓట్లు ఉండగా, తాజాగా ఆ సంఖ్య 7.24 కోట్లకు తగ్గింది. మొత్తం 243 అసెంబ్లీ నియోజకవర్గాల్లో, 90,817 పోలింగ్ స్టేషన్ల పరిధిలో ఓటర్ల జాబితాను ఈసీ క్షుణ్ణంగా పరిశీలించింది. మృతి చెందిన, వలస వెళ్లిన, ఒకసారి కంటే ఎక్కుసార్లు రిజిస్టర్ అయిన, చిరునామాలేని ఓటర్లను జాబితా నుంచి తొలగించింది. రాజధాని పాట్నాలో అత్యధికంగా 3.95 లక్షల మంది చోటు కోల్పోయారు.

పాకిస్థాన్‌పై 19 శాతమే!

» తమతో ఒప్పందం కుదుర్చుకోని 69 దేశాలపై ట్రంప్ సుంకాలు

» ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం

» ఆగస్టు 7 నుంచి అమల్లోకి



న్యూయార్క్/వాషింగ్టన్, ఆగస్టు 1: సుంకాల రంకెలు వేస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. తమతో ఇంకా ఒప్పందం కుదుర్చుకోని 69 దేశాలపై టారిఫ్‌ల భారాన్ని ఖరారు చేశారు. భారత ఉత్పత్తులపై 25 శాతం సుంకాల భారం మోపిన ఆయన.. పాకిస్థాన్ ఉత్పత్తులపై 19 శాతమే విధిస్తున్నట్టు వెల్లడించారు. ఈమేరకు.. 'ఫర్దర్ మాడిఫయింగ్ ద రెసిప్రోకల్ టారిఫ్' పేరిట రూపొందించిన కార్యనిర్వాహక ఉత్తర్వుపై ట్రంప్ సంతకం చేశారు. తమతో ఇప్పటికే చాలా దేశాలు అర్థవంతమైన వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్నాయని.. మరికొన్ని దేశాలు కుదుర్చుకునే దిశగా అడుగులు వేస్తున్నాయని అందులో తెలిపారు. "మిగతా దేశాలు చర్చలు జరుపుతున్నప్పటికీ.. అమెరికాతో ఉన్న వాణిజ్య అసమతౌల్యాలను పరిష్కరించే దిశగా సరైన ప్రతిపాదనలు చేయట్లేదని నాకు అనిపిస్తోంది" అని పేర్కొన్నారు. అలాంటి దేశాలపై సుంకాలు విధిస్తున్నట్టు తెలిపారు. ట్రంప్ పేర్కొన్న అలాంటి దేశాల జాబితాలో భారత్ కూడా ఉంది. ఈసారి లావోస్, మయన్మార్ దేశాలపై అత్యధికంగా 40% సుంకం, స్విస్ ఎగుమతులపై 39%, కెనడాపై 35% విధించిన ట్రంప్.. జపాన్‌పై 15%, పాకిస్థాన్, థాయ్‌ల్యాండ్, మలేసియా దేశాలపై 19%, శ్రీలంకపై 20 శాతం సుంకాలు విధించారు. కెనడాపై సుంకాల బాదుడు శుక్రవారం నుంచే (ఆగస్టు 1) అమల్లోకి రాగా.. మిగతా దేశాలపై 7వ తేదీ నుంచి అమలవుతుందని తెలిపారు. రష్యా నుంచి చమురు కొంటున్నందుకు భారత్‌పై అదనంగా జరిమానా కూడా వేస్తామన్న ఆయన.. కార్యనిర్వాహక ఉత్తర్వులో మాత్రం ఆ ప్రస్తావనే తేకపోవడం గమనార్హం. కాగా.. ఇప్పటికే అమెరికాకు ఎగుమతి అయ్యి, దారిలో ఉన్న ఉత్పత్తులపై, లోడింగ్ పూర్తయి ఆగస్టు 7లోగా బయల్దేరడానికి నౌకల్లో సిద్ధంగా ఉన్న ఉత్పత్తులపై.. కొత్త సుంకం వర్తించదని 'భారత ఎగుమతి సంఘాల సమాఖ్య' డైరెక్టర్ జనరల్ అజయ్ సహాయ్ తెలిపారు. ట్రంప్ సుంకాల భారం నేపథ్యంలో.. దేశ ప్రయోజనాలను కాపాడడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని భారత ప్రభుత్వం పేర్కొంది. అమెరికాతో వాణిజ్య చర్చల్లో వ్యవసాయ, పాల ఉత్పత్తుల రంగ ప్రయోజనాలను పరిరక్షిస్తామని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ తెలిపారు. "మన ఇంధన అవసరాలను తీర్చుకోవడానికి.. మార్కెట్లో అందుబాటులో ఉన్నదానిని బట్టి, అంతర్జాతీయ పరిస్థితులను బట్టి నిర్ణయం తీసుకుంటాం" అని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. తద్వారా.. రష్యా నుంచి చమురును కొనుగోలు చేయడం ఆపబోమని ఆయన చెప్పకనే చెప్పారు.

ఇవీ లెక్కలు!

18%

2021-25 నడుమ.. అమెరికా భారతదేశ అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉంది. మన మొత్తం ఎగుమతుల్లో 18 శాతానికిపైగా ఒక్క అమెరికాకే వెళ్లాయి.

6.22%

మన దిగుమతుల్లో అమెరికా ఉత్పత్తుల వాటా కేవలం 6.22 శాతం.

రూ.15.51 లక్షల కోట్లు

వస్తువులు, సేవలు.. అన్నీ కలిపి 2024-25లో ఇరుదేశాల మధ్య జరిగిన వాణిజ్యం విలువ 186 బిలియన్ డాలర్లు (సుమారు రూ.15.51 లక్షల కోట్లు). ఇందులో భారతదేశ ఎగుమతులు 86.5 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.7.21 లక్షల కోట్లు) కాగా.. అమెరికా నుంచి భారత్‌కు దిగుమతి అయిన ఉత్పత్తుల విలువ 45.3 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.3.77 లక్షల కోట్లు). సేవల రంగంలో అమెరికాకు భారత ఎగుమతుల విలువ 28.7 బిలియన్ డాలర్లు (రూ.2.39 లక్షల కోట్లు) కాగా.. దిగుమతుల విలువ 25.5 బిలియన్ డాలర్లు (రూ.2.13 లక్షల కోట్లు). అంటే.. 3.2 బిలియన్ డాలర్ల (రూ.26,720 కోట్లు) మిగులు.

రూ. 3.43 లక్షల కోట్లు

అమెరికాతో భారత్‌కు వాణిజ్య మిగులు నానాటికీ పెరుగుతోంది. 2022-23లో అది 27.7 బిలియన్ డాలర్లుగా (దాదాపు రూ.2.31 లక్షల కోట్లు) ఉండగా.. 2023-24లో 35.32 బిలియన్ డాలర్లకు (రూ.2.95 లక్షల కోట్లు), 2024-25లో 41 బిలియన్ డాలర్లకు (3.43 లక్షల కోట్లకు) పెరిగింది.

తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ లిమిటెడ్
"టూరిజం హౌస్" #3-5-891, హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన సం.TGTDC/PRJ/J2/08/2025-26 తేది: 01.08.2025

క్ర.సం.	పనిపేరు	బిడ్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది	బిడ్ దాఖలుకు ఆఖరి తేది
1	తెలంగాణ రాష్ట్రంలో స్పెషల్ టూరిజం ఏరియాలు (STAs) అభివృద్ధి కొరకు టూరిజం మాస్టర్ ప్లానింగ్ కన్సల్టెంట్ల జాబితా రూపొందించుట కొరకు ఆసక్తి వ్యక్తీకరణ (EOI)	02.08.2025	18.08.2025

అర్హత గల కాంట్రాక్టర్ల నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫామ్ పై బిడ్లను కోరుచున్నారు. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ **www.tender.telangana.gov.in** పై చూడగలరు.
సం/- జనరల్ మేనేజర్ (ప్రాజెక్ట్స్), TGTDC, హైదరాబాద్
DIPR RO NO: 5883-PP/CL/ADVT/1/2025-26, తేది: 01.08.2025

తెలంగాణ ప్రభుత్వం
నగరపాలక సంస్థ :: ఖమ్మం
File No.A1/KMC/987/2025 Date: 31.07.2025
ఆసక్తి వ్యక్తీకరణ
కమిషనర్, ఖమ్మం నగర పాలక సంస్థ వారు "రెవెన్యూ మెరుగు పరుచుట కొరకు ఇంటింటి సర్వే చేపట్టుట మరియు బేస్ మ్యాపు రూపొందించుట కొరకు సేవలు అందచేయుటలో వారి ఆసక్తి సూచించుటకు అర్హత గల కన్సల్టింగ్ సంస్థల నుండి "ఆసక్తి వ్యక్తీకరణ (EOI)" ఆహ్వానిస్తున్నారు. ఆసక్తి గల కన్సల్టింగ్ సంస్థల వారు దిగువ సంతకం దారు నుండి EOI డాక్యుమెంటును పొందగలరు. "ఆసక్తి వ్యక్తీకరణ" Dt: 04.08.2025 ISTన మధ్యాహ్నం 3.00 గంటల వరకు ఈ కార్యాలయమునకు వ్రాతపూర్వకముగా అందజేయవలెను.
సం/- కమిషనర్
నగర పాలక సంస్థ, ఖమ్మం
DIPR RO.No: 5867-PP/CL/ADVT/1/2025-26, Dt: 01.08.2025

కలెక్టర్/చైర్మన్ కార్యాలయము, జిల్లా కొనుగోలు కమిటీ
అదిలాబాద్ జిల్లా
Rc No.B1/408/2025, **టెండర్ ప్రకటన**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుపబడుచున్న అన్ని రకాల గురుకుల పాఠశాలలు మరియు కళాశాల (TSWREIS, MJBPTBCWRS,TTWRS, TMREIS) యందు ఈ క్రింద పేర్కొన్న విధంగా 2025-26 విద్యా సంవత్సరం కొరకు అర్హత కలిగిన సరఫరాదారుల / కాంట్రాక్టర్స్ నుండి సీల్డ్ టెండర్స్ కోరడమైనది.
1.ఆహార పదార్థాలు, 2. కూరగాయలు మరియు పండ్లు, 3. మటన్, చికెన్, 4. కేటరింగ్ కాంట్రాక్టు ఆహార పదార్థాలను జిల్లా యూనిట్ గా, కూరగాయలు & పండ్లు, మటన్ చికెన్ ను మండలం యూనిట్ గా తీసుకోబడును.
టెండరు ఫారం కొరకు రూ.2000/- రెండు వేల రూపాయలు డిమాండ్ డ్రాఫ్ట్ ని జిల్లా కలెక్టర్ అదిలాబాద్ గారి పేరు మీద చెల్లుబాటు అగునట్లు SBI బ్యాంకులో తీసిన DD ని క్రింద పేర్కొన్న కార్యాలయంలో సమర్పించి టెండరు ఫారం ని పొందగలరు.
టెండర్ ఫారంలు తేది 02.08.2025, నుండి 14.08.2025 అన్ని పని దినములలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఇవ్వబడును, టెండరు ఫారంలు సమర్పించు చివరి తేది.18.08.2025 సాయంత్రం 4 గంటల లోగ క్రింద అడ్రస్ లో సమర్పించగలరు. ఆలస్యంగా వచ్చిన దరఖాస్తులను ఎట్టి పరిస్థితిలో అంగీకరించబడవు.
సీల్డు టెండరు బాక్సులు జిల్లా కలెక్టర్ గారి సమక్షంలో తేది.26.08.2025న ఉదయం 11.00 గంటలకు కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్ వద్ద తెరువబడును.
పూర్తి వివరాలకు క్రింది అడ్రస్ యందు సంప్రదించగలరు. టెండర్ నిబంధనలను మార్చు లేదా రద్దు చేయు అధికారము క్రింది సంతకందారులకు కలదు.
డిస్ట్రిక్ట్ మైనారిటీస్ వెల్ఫేర్ ఆఫీసర్ మరియు జిల్లా కోఆర్డినేటర్ అదిలాబాద్ జిల్లా, 7993357077.
సం/- జిల్లా కలెక్టర్ మరియు చైర్మన్
అదిలాబాద్ జిల్లా
DIPR RO.No: 5875-PP/CL/ADVT/1/2025-26, తేది: 01.08.2025

ఫారం-VII
(సెక్షన్ - ఉప నియమం (1) యొక్క నియమం - 25 మరియు సెక్షన్ - 19(1) యొక్క చట్టం - 30/2013)
తెలంగాణ ప్రభుత్వం
రెవెన్యూ (భూసేకరణ) శాఖ
రూఢీ ప్రకటన
గెజిట్ నం.75/2025 తేది: 28.07.2025
నెం.ఎఫ్/767/2025 తేది: 24..07.2025
నెం.జి/189/2025 తేది: 28.07.2025
ప్రజా ప్రయోజనము నిమిత్తం అనగా నారాయణపేట కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణంలో భాగంగా లీడ్ ఛానల్ నిర్మాణం కొరకు నారాయణపేట జిల్లా, ఉట్కూరు మండలం, దంతన్‌పల్లి గ్రామం పరిధిలో మొత్తం ఎ.59.37 గుంటలు భూమి అవసరమై ఉన్నదని తెలంగాణ ప్రభుత్వం/ జిల్లా కలెక్టర్ నారాయణపేట వారు భావించుచున్నారు.
కావున ఇట్టి ప్రకటన ద్వారా నారాయణపేట జిల్లా, ఉట్కూరు మండలంలోని దంతన్‌పల్లి గ్రామంలో పైన పేర్కొన్న ప్రాజెక్ట్ కోసం భూమి కొలిచి ఎక్కువ లేదా తక్కువ ఎ.59.37 గుంటలు అంటే 24.02 హెక్టార్లు దీని వివరణాత్మక వర్ణన ఈ క్రింద విధంగా ఉంది.

క్ర. సం.	సర్వే నం	భూమి స్వభావం	భూమి రకం	భూసేకరణ క్రింద తీసుకోబడిన విస్తీర్ణం	ఆసక్తి గల వ్యక్తుల పేర్లు	సరిహద్దులు తూ	ప	ఉ	ద	చెట్లు రకం	సంఖ్య	కట్టడాలు రకం	విస్తీర్ణం
1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14
1	47అ/ఆ	పట్టా	మెట్ట	2.01	మోత్కూర్ గోపాల్ రెడ్డి తండ్రి నర్సిములు	46	47	47	59	-	-	-	-
2	47ఆ/ఇ	పట్టా	మెట్ట	2.02	మోత్కూర్ ప్రకాష్ రెడ్డి తండ్రి నర్సిములు	46	47	47	59	-	-	[illegible]	-
3	47	పట్టా	మెట్ట	1.30	పి.రాములు తండ్రి ప్రతాప్ రెడ్డి	46	47	47	59	-	-	-	-
4	47	పట్టా	మెట్ట	0.11	బి.టి.రోడ్	46	47	47	59	-	-	-	-
5	48అ/2	పట్టా	మెట్ట	0.29	మోత్కూర్ సునీత భర్త రాంరెడ్డి	47	48	48	50	-	-	-	-
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
62	113/అ/1	పట్టా	మెట్ట	0.07	అబ్దుల్ గఫర్ ఖుర్షీ తండ్రి అబ్దుల్ గని	112	110	113	114	-	-	-	-
63	113ఆ	పట్టా	మెట్ట	0.35	మొగులమ్మగొల్ల శివసాయి తండ్రి ఎస్.శ్రీవయ్య	112	110	113	114	-	-	బోరు	-
మొత్తం	ఎ. 59.37 గుంటలు												

30/2013 చట్టంలోని u/s 15 అందించిన విధంగా ఆసక్తి గల వ్యక్తుల అభ్యంతరాలను విన్న తర్వాత మరియు తగిన విచారణ తర్వాత ఈ ప్రకటన చేయబడింది.
భూసేకరణ, పునరావాసం మరియు పునఃస్థాపనలో న్యాయమైన పరిహారం మరియు పారదర్శకత హక్కు చట్టం (30/2013 చట్టం) లోని సెక్షన్ 16 ప్రకారం, ప్రభావిత కుటుంబాల కోసం గ్రామ సభలు మరియు సామాజిక ఆర్థిక సర్వే నిర్వహించబడ్డాయి. భూసేకరణ చేయు భూమిలో ఎటువంటి నివాస గృహములు లేవు, వ్యవసాయ భూమి భాగములు మాత్రమే సేకరించబడుచున్నవి. ఇట్టి ప్రాజెక్టు భూసేకరణ ద్వారా ఏ యొక్క కుటుంబము కూడా భూ నిర్వాసితులు కావడం లేదు. ఏ ఒక్క వృత్తి కళాకారులు కాని, చిరు వ్యాపారులు కాని, వాణిజ్య సముదాయములు కానీ, ప్రజల సామూహిక సౌకర్యములు అనగా రోడ్లు, నీటి ట్యాంకులు, పార్కులు సేకరించబడుట లేదు. సర్వే ఫలితాల ప్రకారం భూసేకరణ చట్టంలోని u/s 19 ప్రకారం పునరావాసం మరియు పునఃస్థాపన కేవలం (5) ఐదు ప్రభావిత కుటుంబ సభ్యులకు వర్తిస్తుంది.
ఈ భూమి కింద ఉన్న బొగ్గు, ఇనుప రాయి, స్లేట్ లేదా ఇతర ఖనిజాల గనులు లేదా పేర్కొన్న భూమిలోని ఏదైనా నిర్దిష్ట భాగం తప్ప, భూమిని సేకరించే ఉద్దేశ్యంతో ప్రాజెక్ట్ నిర్మాణ దశలో తవ్వడానికి లేదా తొలగించడానికి లేదా ఉపయోగించాల్సిన గనులు మరియు ఖనిజాల భాగాలు తప్ప, అవసరం లేదు.
నారాయణపేట లోని భూసేకరణ అధికారి & రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో ఏదైనా పని రోజున భూమి యొక్క ప్రణాళికను తనిఖీ చేయవచ్చును.
సం/- భూసేకరణ అధికారి & రాజస్వ మండలాధికారి నారాయణపేట | సం/- అదనపు కలెక్టర్ (రెవెన్యూ) నారాయణపేట | సం/- జిల్లా కలెక్టర్ నారాయణపేట
DIPR RO NO.435/LA-PP/ADVT/PUBLICATION/2025-26

సంతాన సాఫల్య కేంద్రాలపై నజర్

తనిఖీల కోసం రంగంలోకి 35 బృందాలు.. నేటి నుంచి 3 రోజులు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పరిశీలన

- దశలవారీగా మిగతా జిల్లాల్లో
- పోలీసుల విచారణకు సహకరించని డాక్టర్ నమ్రత
- తనను ఇరికించారని ఆరోపణ

హైదరాబాద్/హైదరాబాద్‌సిటీ/అడ్డగుట్ట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కృత్రిమ గర్భధారణ చికిత్స(ఐవీఎఫ్), సరోగసీ పేరిట శిశువుల అక్రమ రవాణాకు పాల్పడిన 'సృష్టి' ఫర్టిలిటీ ఘటనతో సంతాన సాఫల్య కేంద్రాలపై ప్రభుత్వం దృష్టిసారించింది. శనివారం నుంచి ఫర్టిలిటీ కేంద్రాల్లో విస్తృతంగా తనిఖీలు చేయనుంది. ఇందుకోసం వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ ఆధ్వర్యంలో 35 తనిఖీ బృందాలను రంగంలోకి దింపింది. తొలుత గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మూడు రోజుల పాటు తనిఖీలు చేపడతారు. తర్వాత దశలవారీగా జిల్లాల్లో నిర్వహిస్తారు. శుక్రవారం కమిషనర్ కార్యాలయంలో ఈ బృందాల్లో ఉండే సభ్యుల పేర్లను ఖరారు చేశారు. తనిఖీలకు సంబంధించిన అంశాలపై దిశానిర్దేశం చేశారు. మూడు రోజుల్లో నివేదిక ఇవ్వాలని కమిషనర్ సంగీతా సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా 307 సంతాన సాఫల్య కేంద్రాలు ఉన్నాయి. అందులో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే 157 వరకు ఉన్నాయి. సంతాన సాఫల్య కేంద్రాల్లో తనిఖీల కోసం 29 అంశాలతో కూడిన చెక్‌లిస్టును కమిషనర్ కార్యాలయం సిద్ధం చేసింది. గ్రేటర్ హైదరాబాద్ తర్వాత ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లో ఫర్టిలిటీ కేంద్రాలు ఎక్కువగా ఉన్నాయి. వాటిలో తనిఖీల కోసం రాష్ట్ర స్థాయి నుంచి అధికారులను పంపే అవకాశం ఉందని వైద్య వర్గాలు పేర్కొన్నాయి.


వైద్య పరీక్షల కోసం డాక్టర్ నమ్రతను గాంధీ ఆస్పత్రికి తీసుకొస్తున్న పోలీసులు

విచారణకు సహకరించని నమ్రత

సంతాన సాఫల్య చికిత్స కోసం వచ్చిన దంపతులను మోసం, శిశువుల విక్రయం కేసులో అరెస్టయిన 'సృష్టి' సంతాన సాఫల్య కేంద్రం నిర్వాహకురాలు డాక్టర్ నమ్రతను గోపాలపురం పోలీసులు శుక్రవారం విచారించారు. కోర్టు ఐదు రోజుల కస్టడీకి అనుమతించిన నేపథ్యంలో శుక్రవారం ఉదయం చంచల్‌గూడ జైలు నుంచి ఆమెను కస్టడీలోకి తీసుకున్నారు. గాంధీ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించి, నార్త్‌జోన్ డీసీపీ కార్యాలయానికి తరలించారు. సాయంత్రం 6గంటల దాకా విచారించి, బేగంపేట మహిళా పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అయితే విచారణలో అధికారుల ప్రశ్నలకు నమ్రత సమాధానం ఇవ్వకుండా దాటవేసినట్టు తెలిసింది. తానె లాంటి తప్పూ చేయలేదని చెబుతూ వచ్చినట్టు సమాచారం. మరోవైపు సృష్టి ఫర్టిలిటీ కేంద్రంలో చికిత్స చేయించుకున్న వారి వివరాలను సేకరిస్తున్నారు. బాధితులపై నమ్రత కుమారుడు జయంత్ కృష్ణ బెదిరింపులకు పాల్పడ్డారన్న ఆరోపణలపైనా ఆరా తీస్తున్నారు. కాగా, వైద్య పరీక్షల కోసం గాంధీ ఆస్పత్రికి తీసుకువచ్చిన సమయంలో నమ్రత మాట్లాడుతూ.. రాజస్థాన్ దంపతులు, పోలీసులు తనను ఈ కేసులో ఇరికించారని ఆరోపించారు. తాను బయటికి వచ్చాక అన్ని విషయాలు చెబుతానన్నారు.

నిజామాబాద్ జిల్లాలో ఆపరేషన్ ముస్కాన్ ద్వారా గత సంవత్సర కాలంలో 154 మంది బాల బాలికలకు విముక్తి కలిగించినట్లు పోలీస్ కమిషనర్ సాయిచైతన్య శుక్రవారం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తప్పి పోయిన, వదిలివేసిన, కార్మికులుగా ఉన్న బాలల సమాచారం సేకరించి, పనిచేయించిన వారిపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

SARDAR VALLABHBHAI PATEL NATIONAL POLICE ACADEMY
(Government of India: Ministry of Home Affairs)
Shivarampally, Hyderabad - 500 052
No.11011/1/2022/Estt/A1(E-18097) Dated: 01August, 2025
TEXT FOR ADVERTISEMENT
Applications are invited from eligible individuals for filling up one vacant post of 'Network Administrator' in Sardar Vallabhbhai Patel National Police Academy, Hyderabad-500052, **purely on outsourcing basis for period upto 31.03.2026 or** till filling up the post on regular basis, whichever is earlier. The details and applicaion form are available in Academy website http://www.svpnpa.gov.in and click on 'Vacancies' tab.
Sd/- Administrative Officer (Estt.)

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర మంచినీటి సరఫరా & మురుగు నీటిపారుదల మండలి
చీఫ్ జనరల్ మేనేజర్ (Engg.) కార్యాలయం, రెవెన్యూ సర్కిల్, ఖైరతాబాద్, హైదరాబాద్- 500 004, తెలంగాణ
ఇ-టెండరు ప్రకటన

EP. నం.	పని పేరు	ECV
EP. No. 65 (2nd call)/ CGM(E)/ Rev.Circle/ 2025-26, తేది: 01.08.2025	ఫైల్ నం.2025-1-460 ప్రకారం SD III, O & M Div-VI (రీచ్-I) మరియు (రీచ్-II) ఫతేనగర్ సెక్షన్ క్రింద సనత్‌నగర్ 5ML GLSR నుండి BSNL కార్యాలయం వరకు అవసరమైన స్పెషల్స్‌తో పాటు 10 mm థిక్ MS ప్లేట్‌తో ఫ్యాబ్రికేట్ చేయబడిన 450mm మరియు 600/450 mm దయా ఇన్‌లైన్ మరియు అవుట్‌కోటెడ్ MS పైప్‌లైన్ తయారీ, సరఫరా, బట్వాడ, లోయరింగ్, లేయింగ్, జాయింటింగ్, టెస్టింగ్ మరియు కమిషనింగ్.	రూ. 4,12,68,277=06ps

(1) ఇ-టెండరు వివరాలు & డాక్యుమెంట్ వెబ్‌సైట్ https://tender.telangana.gov.in లో 01.08.2025న సా.05.30 గం. నుండి ఆన్‌లైన్ ద్వారా లభ్యమగును. ఇ-టెండరు బిడ్ డాక్యుమెంట్ల దాఖలుకు ఆఖరి తేది 04.08.2025న సా.05.30 గం.లకు. (2) ఇ-టెండరు కోరుతున్న అధికారి పేరు మరియు చిరునామా: చీఫ్ జనరల్ మేనేజర్ (E), HMWSSB, రెవెన్యూ సర్కిల్, ఖైరతాబాద్, హైదరాబాద్- 500004.
సం/- చీఫ్ జనరల్ మేనేజర్ (Engg), రెవెన్యూ సర్కిల్, ఖైరతాబాద్, హైదరాబాద్-500004. TG

అవినీతి ఉద్యోగుల ఆటకట్టు

- ఏడు నెలల్లో 168 ఏసీబీ కేసులు
- 145 మంది ప్రభుత్వ ఉద్యోగుల అరెస్టు
- లంచం అడిగితే.. టోల్ ఫ్రీ నం.1064

హైదరాబాద్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాలకు పని నిమిత్తం వచ్చే వారిని లంచాలు అడుగుతున్న అక్రమార్కులకు ఏసీబీ గట్టి షాక్ ఇస్తోంది. జూలైలో ప్రత్యేక ఆపరేషన్ చేపట్టి పలువురు లంచగొండుల ఆటకట్టించింది. ఒక్క నెలలోనే మెరుపు దాడులు చేసి 22 కేసులు నమోదు చేసింది. ఇందులో 13 ట్రాప్ కేసులు, ఆదాయానికి మించిన ఆస్తుల కేసు, అధికార దుర్వినియోగం కేసు, సాధారణ తనిఖీ కేసు, ఆరు ఆకస్మిక తనిఖీ కేసులు ఉన్నాయని ఏసీబీ విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. ఈ ఆపరేషన్లలో 20 మంది ప్రభుత్వ అధికారులు, ఇద్దరు ప్రైవేటు వ్యక్తులను ఏసీబీ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని అరెస్ట్ చేసింది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీబీ అధికారులు రూ.11.50లక్షల విలువైన అక్రమ ఆస్తులను గుర్తించారు. అంతేకాకుండా రిజిస్ట్రార్ కార్యాలయాలపై జరిపిన ఆకస్మిక దాడుల్లో లెక్కల్లో చూపని రూ.1,49,880 నగదును సీజ్ చేశారు.

ఏడు నెలల్లో రూ.కోట్ల ఆస్తులు స్వాధీనం..

ఈ ఏడాది జనవరి నుంచి జూలై వరకు ఏసీబీ 168 కేసులను నమోదు చేసింది. ఇందులో 15 అక్రమ ఆస్తుల కేసులు, 11 అధికార దుర్వినియోగం కేసులు, 17 సాధారణ తనిఖీలు, 3 విచక్షణాధికార పరిశీలనలు, 145 మంది ప్రభుత్వ ఉద్యోగులను అరెస్ట్ చేసిన ట్రాప్ కేసులు ఉన్నాయి. ఈ ఏడు నెలల్లో ఏసీబీ రూ.39,16,60,526 విలువైన అక్రమ ఆస్తులను బయటపెట్టింది. జూలైలో 21 కేసులను పూర్తి చేసి తుది నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. అవినీతిని నిర్మూలించడానికి ప్రజల సహకారం కూడా అవసరమని ఏసీబీ అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వ అధికారులు లంచం డిమాండ్ చేస్తే టోల్ ఫ్రీ నంబరు 1064కు ఫోన్ చేయాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ప్రజలకు అవగాహన కల్పించడానికి ఏసీబీ పోస్టర్లు, స్టిక్కర్లను కూడా ప్రదర్శిస్తోంది.

రూ. 4 వేలు తీసుకుంటూ చిక్కిన ఏఆర్ఐ



భూత్పూర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కల్యాణ లక్ష్మీ ఫైల్ కదలాలంటే డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేసిన ఏఆర్ఐ ఏసీబీకి చిక్కాడు. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండల వాసి ఒకరు తన కూతురు వివాహానికి కల్యాణ లక్ష్మి కింద లబ్ధి పొందడానికి దరఖాస్తు చేసుకున్నాడు. ఆ దరఖాస్తును పరిశీలించి పంచనామా నివేదిక ఇవ్వడానికి భూత్పూర్ తహసీల్దార్ కార్యాలయంలోని ఏఆర్ఐ బాలసుబ్రమణ్యం రూ.8,000 లంచం డిమాండ్ చేశాడు. తన దగ్గర అంత డబ్బు లేదని బాధితుడు చెప్పాడు. కనీసం రూ.6,000 అయినా ఇవ్వాలని బేరమాడి.. రూ.4,000కు అంగీకరించాడు. అనంతరం బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచన మేరకు శుక్రవారం భూత్పూర్‌కు సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద బాలసుబ్రమణ్యానికి బాధితుడు రూ.4,000 ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

ఇద్దరు పిల్లలకు ఒకే ఆధార్ నంబర్

- రెండు కుటుంబాలకు ఇక్కట్లు
- వరంగల్ జిల్లా గుండ్లపహాడ్‌లో ఘటన



మనుబోతుల ధనుష్ ఆధార్ కార్డు



కత్తెరపెల్లి శివ ఆధార్ కార్డు

నల్లబెల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం గుండ్లపహాడ్‌లోని రెండు కుటుంబాలకు చెందిన ఇద్దరు బాలురకు ఒకే ఆధార్ నంబర్ వచ్చింది. దీంతో ఆ బాలుర కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. గుండ్లపహాడ్ గ్రామానికి చెందిన మనుబోతుల సుమన్ కుమారుడు ధనుష్, కత్తెరపెల్లి బాబు కుమారుడు శివకు ఒకే ఆధార్ నంబర్ (3996 7128 3843) జారీ అయింది. ప్రస్తుతం ధనుష్ 4వ తరగతి, శివ 5వ తరగతి చదువుతున్నారు. పాఠశాలలో చేర్పించేటప్పుడు ఇద్దరి ఆధార్ నంబర్లు ఒకటే అన్న విషయం వెలుగులోకి వచ్చింది. ఈ విషయమై అధికారులకు, ఆధార్ సెంటర్లకు ఫిర్యాదు చేసినా.. పరిష్కారం లభించలేదు. అయితే, ఇద్దరి ఆధార్ కార్డులకు సంబంధించిన ఓటీపీలు కత్తెరపెల్లి బాబు ఫోన్ నంబర్‌కు వస్తున్నాయి. ఈ సమస్యపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, ఇద్దరికీ వేర్వేరు ఆధార్ నెంబర్‌లను కేటాయించాలని రెండు కుటుంబాలు కోరుతున్నాయి.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


బూదరి నరేందర్

జగదేవ్‌పూర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక ఓ యువ రైతు చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం తీగుల్ గ్రామానికి చెందిన బూదరి నరేందర్(34) తన 18 గుంటల భూమితో పాటు మరో మూడు ఎకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. పొలం పనులు లేని సమయంలో గజ్వేల్ మండలం అక్కారం గ్రామంలోని ఓ గోదాంలో హమాలీ పని చేస్తున్నాడు. కుటుంబ పోషణ, వ్యవసాయానికి చేసిన అప్పులు రోజురోజుకూ పెరిగిపోతుండటంతో నరేందర్ తీవ్ర మనోవేదనకు గురయ్యేవాడు. ఇటీవల 8 గుంటల భూమిని అమ్మి కొన్ని అప్పులు కట్టాడు. అయినప్పటికీ బాకీలు తీరలేదు. శుక్రవారం గ్రామంలో పంట చిట్టి ఉండటంతో చిట్టికి డబ్బు కట్టలేక తీవ్ర మనస్తాపం చెంది పొలంలో చెట్టుకు ఉరేసుకున్నాడు. నరేందర్‌కు భార్య, ముగ్గురు పిల్లలున్నారు.

పురపాలక సంఘ కార్యాలయం
అచ్చంపేట పురపాలక సంఘం, నాగర్‌కర్నూల్ జిల్లా (తెలంగాణ)
ఇ-ప్రొక్యూర్‌మెంట్ అత్యవసర టెండరు ప్రకటన
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్ ఫారంపై 2 పనులు (అంచనా వ్యయం రూ.16.00 లక్షలు) కొరకు టెండరుకు పిలుపునిచ్చారు. **బిడ్ల దాఖలు ప్రారంభ తేది:** 02.08.2025న ఉ.10.30 గం.లకు, **బిడ్ల దాఖలు ముగింపు తేది:** 04.08.2025న ఉ.10.35 గం.లకు. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా **https://tender.telangana.gov.in** ను చూడగలరు, బిడ్లను కోరు కార్యాలయం, కమిషనర్, అచ్చంపేట పురపాలక సంఘం తెలంగాణ రాష్ట్రం. ఫోన్:9398573135, 8639579279. సం/- కమిషనర్, అచ్చంపేట పురపాలక సంఘం
DIPR RO No.5876-PP/CL/ADVT/1/2025-26,Dt.01.08.2025

GHMC
జాతీయ పోటీ బిడ్డింగ్
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
O/o సూపరింటెండింగ్ ఇంజనీర్ (ప్రాజెక్ట్స్ - C,N&EZ), GHMC, హైదరాబాద్
టెండరు ప్రకటన
నం. 04/SE (P-C,N&EZ)/GHMC/2025-26 తేది: 31.07.2025
ఐటం నం.1: పని పేరు: ఇంజనీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ & కన్‌స్ట్రక్షన్ (EPC)/ టర్న్ కీ ప్రాతిపదికన AOC సెంటర్ చుట్టూ ఆల్టర్నేట్ రోడ్ల నిర్మాణం. IBM విలువ: రూ.30700.74 లక్షలు. క్ర.సం.- కార్యక్రమాలు - తేది మరియు సమయం:- 1)ప్రారంభ తేది: 04.08.2025న సా.04.00 గం. నుండి. 2) ప్రీ - బిడ్ సమావేశం: 12.08.2025న మ.3.00 గం.లకు, ప్రదేశం: O/o చీఫ్ ఇంజనీర్ (ప్రాజెక్ట్స్), GHMC 6వ అంతస్తు, GHMC ప్రధాన కార్యాలయం, ట్యాంక్ బండ్, హైదరాబాద్ 3) బిడ్ల స్వీకరణకు ఆఖరి తేది & సమయం: 22.08.2025న మ.3.00 గం.ల వరకు. 4) సాంకేతిక బిడ్ తెరుచు తేది: 22.08.2025న సా.4.00 గం. తరువాత. 5) ధర బిడ్ తెరుచు తేది: 23.08.2025న సా.4.00 గం.ల తరువాత. గమనిక: బిడ్ డాక్యుమెంట్ మరియు EPC ప్రాజెక్ట్ టెండరు డ్రాయింగ్స్ డౌన్‌లోడ్ చేసుకొనుటకు బిడ్డర్లు www.tender.telangana.gov.in ను దర్శించవలసిందిగా సూచించడమైనది. ఏవైనా స్పష్టీకరణలు seprojectsnez@gmail.com కు పంపగలరు. సంబంధిత అధికారి చిరునామా: శ్రీ పి.మోహన్ రెడ్డి SE (P-C,N&EZ), 9989930369, సూపరింటెండింగ్ ఇంజనీర్ (P-C,N&EZ), హైదరాబాద్ మహానగర పాలక సంస్థ, ట్యాంక్‌బండ్ రోడ్, హైదరాబాద్. తదుపరి వివరాలు 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ https://tender.telangana.gov.in ను చూడగలరు.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్ (ప్రాజెక్ట్స్ P-C,N&EZ), GHMC
DIPR RO No.5892-PP/CL/ADVT/1/2025-26 తేది: 01.08.2025

తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ గౌరవ సమక్షంలో
విద్యుత్ నియంత్రణ్ భవన్, జి.టి.ఎస్.కాలనీ, కల్యాణ్‌నగర్, హైదరాబాద్ - 500045
తెలంగాణ పవర్ జనరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్
బహిరంగ ప్రకటన
1. తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (జనరేషన్ టారిఫ్ నియమ నిబంధనలు) రెగ్యులేషన్స్, 2019 మరియు తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (బహుళ సంవత్సరాల టారిఫ్) రెగ్యులేషన్ నం.2 ఆఫ్ 2023తో చదువబడు మరియు ఎలక్ట్రిసిటీ యాక్ట్, 2003లోని సెక్షన్ 62/64 మరియు 86(1)(ఎ) క్రింద ప్రస్తుత థర్మల్ మరియు హైడెల్ స్టేషన్ల కోసం FY 2023-24 కొరకు ట్రూఅప్ కోసం తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (TGERC) సమక్షంలో తెలంగాణ పవర్ జనరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (TGGENCO) 23.06.2025న ఫైలు దాఖలు చేసిందని ఇందుమూలముగా యావన్మందికి నోటీసు ఇవ్వడమైనది.
2. రిఫర్ చేయబడిన ఫైలింగ్‌ల కాపీలు దిగువ పేర్కొన్న కార్యాలయాల వద్ద లభిస్తాయి:
(i) చీఫ్ ఇంజనీర్/ కోల్ & కమర్షియల్/ రూమ్ నం.255, TGGENCO, విద్యుత్ సౌధ, ఖైరతాబాద్, హైదరాబాద్ - 500082 మరియు దిగువ పేర్కొన్న TGGENCO జనరేటింగ్ స్టేషన్ల కార్యాలయాల వద్ద లభిస్తాయి:
(ii) చీఫ్ ఇంజనీర్ O&M, కొత్తగూడెం TPS-V&VI స్టేజీలు, కొత్త పాల్వంచ, భద్రాద్రి కొత్తగూడెం (జిల్లా), తెలంగాణ - 507115
(iii) చీఫ్ ఇంజనీర్ O&M, కొత్తగూడెం TPS-VII స్టేజీ, కొత్త పాల్వంచ, భద్రాద్రి కొత్తగూడెం (జిల్లా), తెలంగాణ - 507115
(iv) చీఫ్ ఇంజనీర్ O&M, కాకతీయ TPP-I&II, చేల్పూర్ గ్రామం, ఘన్‌పూర్ మండలం, జయశంకర్ భూపాలపల్లి (జిల్లా), తెలంగాణ - 506168
(v) చీఫ్ ఇంజనీర్ O&M, భద్రాద్రి TPS, మణుగూరు, భద్రాద్రి కొత్తగూడెం (జిల్లా), తెలంగాణ - 507115
(vi) చీఫ్ ఇంజనీర్ O&M, SLBPH, TGGENCO, శ్రీశైలం డ్యామ్ (వెస్ట్), ఈగలపెంట, నాగర్‌కర్నూల్ (జిల్లా), తెలంగాణ - 509326
(vii) చీఫ్ ఇంజనీర్ O&M, NSPH, TGGENCO, NSHES, నాగార్జునసాగర్ పైలాన్, నాగార్జునసాగర్, నల్లగొండ (జిల్లా), తెలంగాణ - 508203
ఆసక్తిగల వ్యక్తులు సదరు ఫైలింగ్స్‌ను పైన తెలిపిన ఏదేని కార్యాలయం వద్ద కార్యాలయ వేళలలో ఉచితంగా తనిఖీ/ పరిశీలించుకోవచ్చును మరియు నోట్ చేసుకోవచ్చును. ఈ ప్రతిపాదనలు www.tggenco.comలో కూడా లభిస్తాయి. ఈ ఫైలింగ్స్ యొక్క కాపీని ఫోటోకాపీయింగ్ చార్జీల చెల్లింపుపై పైన తెలిపిన కార్యాలయాల నుండి 02.08.2025 నుండి పొందవచ్చును. సదరు పిటీషన్‌ను TGERC వెబ్‌సైట్ www.tgerc.telangana.gov.inలో కూడా యాక్సెస్ చేయవచ్చును.
3. సదరు ఫైలింగ్స్‌పై ఏవేని అభ్యంతరములు/ సూచనలు ఉంటే, వాటిని సపోర్టింగ్ మెటీరియల్‌తో పాటు Chief Engineer/ Coal & Commercial/, Room No.255/ TGGENCO, Vidyut Soudha, Khairatabad, Hyderabad - 500082 వారికి 23.08.2025న లేదా ఆలోగా సా.5 గం.లోగా చేరేవిధంగా స్వయంగా లేదా రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా పంపవచ్చును. వాటి కాపీని పైన పేర్కొన్న చిరునామాలోని Secretary, TGERC వారికి కూడా తప్పనిసరిగా దాఖలు చేయాలి. అభ్యంతరాలు/ సూచనలపై సక్రమంగా సంతకం చేయాలి మరియు అభ్యంతరాలు/ సూచనలను పంపే వ్యక్తి(ల) పూర్తి పేరు, తపాలా చిరునామా, ఇ-మెయిల్ ఐడి & ఫోన్ నంబర్ కలిగి ఉండాలి. అభ్యంతరాలు/ సూచనలు ఏదైనా సంస్థ తరపున లేదా ఏదేని వర్గం వినియోగదారుల తరపున దాఖలు చేయబడితే, దానిని స్పష్టంగా పేర్కొనాలి. ఒకవేళ అభ్యంతరం తెలిపే వ్యక్తి విచారణను స్వయంగా వినాలనుకుంటే దానిని కూడా ప్రత్యేకంగా పేర్కొనవలెను. అభ్యంతరం/ సూచన దిగువ తెలిపిన నివేదిక వెనుక జతచేయవలెను.

అభ్యంతరం తెలిపేవారి పేరు, పూర్తి చిరునామా, ఇ-మెయిల్ ఐడి & ఫోన్ నంబర్	అభ్యంతరం(లు)/ సూచన(ల) సంక్షిప్త వివరాలు	TGGENCO కార్యాలయంలో అభ్యంతరం & డెలివరీ రుజువు కాపీ జతచేయబడినది (అవును/కాదు)	అభ్యంతరం తెలిపే వ్యక్తి స్వయంగా విచారణ వినాలనుకుంటున్నారు (అవును/కాదు)

4. FY 2023-24 కొరకు TGGENCO ట్రూఅప్ పిటీషన్ ఫైలింగ్స్ సారాంశం దిగువ షెడ్యూలులో సూచించబడినవి.
5. 12.09.2025 (శనివారం) రోజున ఉ.11.30 గం. నుండి TGERC కోర్టు హాల్‌లో బహిరంగ విచారణ నిర్వహించడానికి తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ భావిస్తోంది. స్వయంగా విచారణ వినాలనుకునే వాటాదారులు కమిషన్ సెక్రటరీ, TGERC వారికి బహిరంగ విచారణ తేదీలోగా తెలియజేయవలెను.
ప్రదేశం: హైదరాబాద్ సం/- చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్
తేది: 02.08.2025 TGGENCO
షెడ్యూలు

FY 2023-24 కొరకు ట్రూఅప్‌లో క్లెయిము చేయబడిన స్టేషన్-వారీగా వార్షిక స్థిర చార్జీలు (రూ. కోట్లలో)

క్ర.సం.	స్టేషన్	యూనిట్లు	విలువలు
I. థర్మల్		రూ. కోట్లలో	
1	KTPS-V	రూ. కోట్లలో	487.70
2	KTPS-VI	రూ. కోట్లలో	596.54
3	KTPS-VII	రూ. కోట్లలో	1453.93
4	RTS-B	రూ. కోట్లలో	135.79
5	KTPP-I	రూ. కోట్లలో	432.86
6	KTPP-II	రూ. కోట్లలో	872.32
7	BTPS	రూ. కోట్లలో	1787.39
II. హైడెల్			
8	నాగార్జున కాంప్లెక్స్ HES	రూ. కోట్లలో	430.09
9	శ్రీశైలం LB HES	రూ. కోట్లలో	520.56
10	స్మాల్ హైడెల్	రూ. కోట్లలో	60.96
11	మినీ హైడెల్	రూ. కోట్లలో	11.19
12	పోచంపాడు II HES	రూ. కోట్లలో	12.17
13	ప్రియదర్శిని జూరాల HES	రూ. కోట్లలో	127.68
14	దిగువ జూరాల HES	రూ. కోట్లలో	288.29
15	పులిచింతల HES	రూ. కోట్లలో	111.20

FY 2023-24 కొరకు ట్రూఅప్‌లో క్లెయిము చేయబడిన స్టేషన్-వారీగా విద్యుత్ చార్జీలు (రూ. కోట్లలో)

క్ర.సం.	స్టేషన్	యూనిట్లు	విలువలు
I. థర్మల్			
1	KTPS-V	రూ. కోట్లలో	1213.834
2	KTPS-VI	రూ. కోట్లలో	1118.084
3	KTPS-VII	రూ. కోట్లలో	1964.284
4	RTS-B	రూ. కోట్లలో	122.610
5	KTPP-I	రూ. కోట్లలో	1133.637
6	KTPP-II	రూ. కోట్లలో	1366.841
7	BTPS	రూ. కోట్లలో	2287.688

FY 2023-24 కొరకు ట్రూఅప్‌లో క్లెయిము చేయబడిన చార్జీల సారాంశం (రూ. కోట్లలో)

క్ర.సం.	కాంపోనెంట్స్	యూనిట్లు	విలువలు
1	స్థిర చార్జీలు	రూ. కోట్లలో	968.17
2	అదనపు పెన్షన్ బాధ్యత	రూ. కోట్లలో	138.70
3	నీటి చార్జీలు	రూ. కోట్లలో	-50.35
4	విద్యుత్ చార్జీలు	రూ. కోట్లలో	-234.69
5	FY: 2022-23 కొరకు PRC*	రూ. కోట్లలో	271.69
	మొత్తం ట్రూఅప్ క్లెయిము	రూ. కోట్లలో	1093.52

*గమనిక: వాస్తవిక ట్రూఅప్ క్లెయిము లాభనష్టాలు సర్దుబాటు చేసుకున్న తరువాత గౌరవ TGERCచే నిర్ధారించబడును.
DIPR RO No.5897-PP/CL/ADVT/1/2025-26, Dt: 01.08.2025

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

చెడిన స్నేహం..!

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు భారతప్రధాని నరేంద్రమోదీని మించిన స్నేహితుడు, ఆత్మీయుడు ఈ భూప్రపంచంమీద ఇంకెవ్వరూ లేరనీ, ఉండబోరనీ బీజేపీ నాయకులే కాదు, దేశప్రజల్లో అత్యధికులు కూడా ఎంతోకాలంగా నమ్ముతున్నారు. భౌగోళిక సరిహద్దులు, వాణిజ్యబంధాలు, అయుధలావాదేవీలను దాటిన మోదీ–ట్రంప్ ఆలింగనాల స్థాయి స్నేహం వల్ల దేశానికి ఎంతో ప్రయోజనం చేకూరిందనీ, భారత్ ఖండాంతరఖ్యాతికి ఈ సాన్నిహిత్యం పునాదిగా ఉపకరించిందన్న విశ్లేషణలనూ జనం విశ్వసించారు. హౌడీ మోడీ, అబ్‌కీ బార్ ట్రంప్ సర్కార్ అంటూ చరిత్రలో కనీవినీ ఎరుగనిరీతిలో వీరిద్దరూ పరస్పరం ఎన్నికల్లో సహకరించుకున్నారు. మిత్రుడి మనసు అంతగా ఎరిగిన మోదీ ఇప్పుడు ఆయనతో ఎందుకు సమర్థవంతంగా వ్యవహరించలేకపోతున్నారో అర్థంకావడం లేదు.

భారతదేశాన్ని దారికి తేవడానికీ, అన్ని అడ్డుగోడలూ కూలిన ఇక్కడి మార్కెట్లోకి అమెరికన్ ఉత్పత్తులను కుమ్మరించడానికీ ట్రంప్ పట్టుదలగా ప్రయత్నిస్తున్నారన్నది వాస్తవం. అన్ని దేశాలతోనూ సుంకాల యుద్ధం చేస్తున్న ట్రంప్ ఒత్తిడి వ్యూహాలనూ అర్థంచేసుకోవచ్చు. భారతదేశంతో వాణిజ్య వ్యవహారంలో కాఠిన్యం ఉండవచ్చును గానీ, మోదీ విషయంలో మాత్రం కాస్తంత ప్రేమ, కాసిన్ని మినహాయింపులూ ఉంటాయనుకోవడం భ్రమ అని ఇప్పుడు తేలిపోయింది. వీళ్ళిద్దరికీ ఎక్కడో చెడిందన్న అనుమానాలూ మొదలైనాయి. లోక్‌సభ ఎన్నికల్లో మెజారిటీ కోల్పోయిన మోదీని, అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఘనంగా గెలిచివచ్చిన గర్వంతోనే ట్రంప్ నిర్లక్ష్యం చేస్తున్నారని కొందరి అనుమానం.

ట్రంప్‌తో మోదీ అతివేగంగా కాల్పుల విరమణ ఒప్పందం, అంటే, వాణిజ్య ఒప్పందం చేసుకుంటే కొంతమేరకు శాంతింపచేయవచ్చునని విశ్లేషకుల సలహా. భారీ సుంకాలతో భారత్‌ను బాధించేప్రయత్నం చేస్తున్న ట్రంప్ ఆ మేరకు సంతృప్తిపడితే దాడి తగ్గవచ్చును. కానీ, 'డెడ్ ఎకానమీ' వంటి వ్యాఖ్యలు భారత్ పైన కాక, మోదీ ఏలుబడిమీద దాడి అని ఆయనకు తెలియకపోదు. భారతఆర్థికవ్యవస్థ రేపోమాపో మూడోస్థానానికి చేరుకోబోతున్నదని ఉధృత ప్రచారం జరుగుతున్నప్పుడు ఈ వ్యాఖ్య ప్రభావం చిన్నదేమీ కాదు. మోదీ యుద్ధాలు చేస్తున్న పొరుగుదేశంతోనే ట్రంప్ చమురు వెలికితీత ఒప్పందాలవంటివి చేసుకోవడం ద్వారా ప్రపంచానికి ఏ సందేశం వెడుతుందో ప్రత్యేకంగా చెప్పుకోనక్కరలేదు. అమెరికా అధ్యక్షుడితో అత్యంత సాన్నిహిత్యం ఉన్న ఒక అంతర్జాతీయస్థాయి నాయకుడుగా నరేంద్రమోదీకి ఉన్న ఖ్యాతిని ట్రంప్ తన వరుసచర్యలతో, వ్యాఖ్యలతో బలహీనపరుస్తున్నారు. భారత్–పాక్ యుద్ధం తానే ఆపానని ముప్పైసార్లు ప్రకటించి, మోదీని నిత్యం ఆత్మరక్షణలోకి నెట్టేశారు ఆయన. యుద్ధం ఆపమని తనకు ఎవరూ చెప్పలేదని నిండుసభలో మోదీ ప్రకటించిన వెనువెంటనే ట్రంప్ మళ్ళీ అదే ప్రకటన చేసి ఇంటాబయటా ఇరకాటంలో పడేశారు. ఇక, పాక్ సైనికాధికారి మునీర్‌కు ఘనస్వాగతం, కడుపునిండా భోజనం, మోదీతో సమం చేస్తున్న ఆ ప్రశంసల జల్లుల ప్రభావం కాదనలేనిది. ట్రంప్ ఇక ఏమాత్రం మోదీపక్షాన లేరని, ఆయన పూర్తిగా పాక్‌తో అంటకాగుతున్నారని తేలిపోవడం వల్ల వచ్చే నష్టమేమీ లేదు. ఏకైక అగ్రరాజ్యానికి ఏ దేశం దగ్గరదో వేగంగా స్పష్టత రావడం మంచిదే. కానీ, ట్రంప్‌ను పూర్తిగా నమ్మి, తనతోపాటు దేశాన్ని కూడా అటుగా మోహరించిన మోదీ ఇప్పుడు నాలుగురోడ్ల కూడలిలో వదిలేశారన్న విమర్శలు తప్పవు. పరాధీనతనుంచి స్వతంత్రతకు మళ్ళడం, కనీసం అలా కనిపించడం అంత సులభమేమీ కాదు.

స్వార్థం, స్వలాభం తప్ప, రాజనీతిజ్ఞతలేని ట్రంప్ నమ్మదగ్గవ్యక్తి కాదన్నది సుస్పష్టం. అమెరికా అధ్యక్షుడిని గట్టిగా ఓ మాట అనలేని, వ్యాఖ్యలకు దీటుగా జవాబు ఇవ్వలేని, నిలదీయలేని స్థాయిలో మనం ఉన్నాం. యుద్ధం ఆపింది ఆయనేనని పొరుగుదేశం మాదిరిగా ఒప్పుకోలేక, ఆయన చెబుతున్నది పచ్చిఅబద్ధమని అనలేక, అంతవేగంగా ఎందుకు వెనక్కుతగ్గామో చెప్పలేక మన పాలకులు విపరీతంగా నలిగిపోవడం కనిపిస్తూనే ఉంది. ట్రంప్ అధికారంలోకి రాగానే వేలకోట్ల విలువైన ఆయుధాల కొనుగోలుకూ, భారీ చమురు దిగుమతులకు సంతకాలు చేసినా అమెరికా సంతృప్తిచెందడం లేదు. ఇప్పుడు మనకంటే ఓ తొమ్మిదిశాతం తక్కువ సుంకంతో తన పాక్‌ప్రేమను ట్రంప్ స్పష్టంచేశారు. నాయకుల అతిశయాలూ అహంకారాలూ దేశాల మధ్య సంబంధాలను, ద్వైపాక్షిక ప్రయోజనాలను ప్రమాదంలోకి నెట్టివేయడం సరికాదు.

సిందూర్ విజయాలు, పాలకుల వైఫల్యాలు!



▪ పి. చిదంబరం

'పళని' పలుకు

పార్లమెంటు ఉభయ సభలలో గత వారం ఆపరేషన్ సిందూర్‌పై చర్చ జరిగింది. ఆ సైనిక చర్య లక్ష్యాలు నెరవేరాయని, తత్కారణంగా దాన్ని తుదకు (తాత్కాలికంగా) విరమించడం జరిగిందని, మన సైనిక కార్యకలాపాలు సాధారణమైన క్రమ పద్ధతికి వచ్చాయనే అభిప్రాయాన్ని ప్రభుత్వం కలిగించింది. పరిస్థితి నిజంగా అలా ఉన్నదా? లేదు. ప్రభుత్వం కలిగించిన అభిప్రాయం తప్పు. నిజమేమిటంటే మన సైన్యం ఒక కఠినమైన ఆట ఆడుతుండగా ప్రభుత్వం బలవంతంగా బంతిని లాక్కోవడం జరిగింది! మన సైనిక దళాల ధైర్య సాహసాలకు జేజేలు.

ఆపరేషన్ సిందూర్ కొన్ని కట్టుకథలను బద్దలుగొట్టింది. అపోహలు, తప్పుడు నమ్మకాలను తొలగించింది. పాకిస్థాన్‌పై యుద్ధం, విజయ సాధన చాలా సులభం; సంప్రదాయ యుద్ధంలో భారత్ ఆధిక్యత చెక్కు చెదరకుండా కొనసాగుతుంది; భారత్‌కు ప్రపంచ వ్యాప్తంగా మిత్ర దేశాలు ఉన్నాయి, పాకిస్థాన్‌కు శ్రేయోభిలాషులు ఎవరూ లేరు మొదలైనవే ఆ కట్టుకథలు.

మన సైనిక దళాల నాయకత్వం విలక్షణ రీతిలో వ్యవహరించింది. సైనిక చర్యలకు ఉదాహరణప్రాయంగా ఆపరేషన్ సిందూర్‌ను అవి నిర్వహించాయి. సైనిక కార్యాచరణ విషయంలో స్వేచ్ఛనివ్వాలని ప్రభుత్వాన్ని సైన్యం కోరింది. సైన్యం అభ్యర్థనను సర్కార్ అంగీకరించింది. సైనిక చర్యకు సంకల్పించింది, తొట్ట తొలుత రంగంలోకి దిగింది భారత సైన్యమే గనుక దానికి సహజంగానే ప్రారంభ సానుకూల ప్రయోజనాలు దక్కాయి: పాకిస్థాన్ భూభాగాలలోను, ఆక్రమిత కశ్మీర్‌లోను ఉన్న తొమ్మిది వేర్వేరు ఉగ్రవాద స్థావరాలపై కేవలం కొన్ని నిమిషాల వ్యవధిలో చేసిన దాడులు సంపూర్ణంగా విజయవంతమయ్యాయి. ఉగ్రవాద కార్యకలాపాల సదుపాయాలు, సాధనాలు సమస్తమూ ధ్వంసమైపోవడంతో పాటు పలువురు ఉగ్రవాదులు హతులయ్యారు. అయితే పాకిస్థాన్ సైనిక దళాలు త్వరితగతిన కోలుకున్నాయి. చైనాలో తయారైన యుద్ధ విమానాలు (జె–10), చైనా ఉత్పత్తి చేసిన మిస్సైల్స్ (పి–15), తుర్కియే సరఫరా చేసిన డ్రోన్‌లతో మే 7–8 రాత్రి, పాకిస్థాన్ ప్రతిదాడులు నిర్వహించింది.

తమ వ్యూహ సంబంధిత లోపాలు, లొసుగులను మన సైనిక దళాల నాయకత్వం వెన్వెంటనే గుర్తించి, కొత్త యుద్ధ తంత్రంతో పాకిస్థాన్‌ను ఎదుర్కొన్నది. అదీ సరైన, సమర్థ నాయకత్వం. పునః ప్రారంభమైన సైనిక చర్యలు మే 9, 10 తేదీల్లో పాకిస్థాన్‌లోని 11 సైనిక వైమానిక స్థావరాలను తీవ్రంగా దెబ్బతీశాయి. ఆపరేషన్ సిందూర్ సందర్భంగా సహజంగానే భారత సైన్యానికి కొన్ని నష్టాలు వాటిల్లాయి. అత్యున్నతస్థాయి సైనికాధికారులు ఈ వాస్తవాన్ని అంగీకరించారు. ఇది, సమర్థ నాయకత్వానికి మరొక ఉదాహరణ.

మరి మన రాజకీయ నాయకత్వం కూడా సైనిక నాయకత్వం మాదిరిగా వ్యవహరించిందా? లేదు. తన తప్పులను అంగీకరించలేదు. నష్టాలు వాటిల్లినట్టు ఒప్పుకోలేదు (తలను ఇసుకలో దూర్చి తననెవరూ చూడటం లేదని భావించే) ఉష్ట్రపక్షిలా మన రాజకీయ నాయకత్వం వ్యవహరించింది. ఆపరేషన్ సిందూర్‌లో ఒక 'నిర్ణయాత్మక విజయం' సమకూరిందని పదే పదే ప్రకటించింది. నిజమేనా? నిర్ణయాత్మక విజయం సమకూరి ఉన్నట్టయితే తనకు సానుకూలంగా ఉన్న పరిస్థితులను మరిన్ని సైనిక విజయాల సాధనకు ఎందుకు ఉపయోగించుకోలేదు? పాకిస్థాన్ ప్రభుత్వం నుంచి రాజకీయ రాయితీలను డిమాండ్ చేసి ఎందుకు పొందలేదు? పాకిస్థాన్ డీజీఎమ్ఓ (డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్) ఫోన్ చేసీ చేయగానే ఎందుకు సానుకూలంగా ప్రతిస్పందించారు? కాల్పుల విరమణకు షరతులు ఎందుకు విధించలేదు? ఈ ప్రశ్నలకు ప్రభుత్వం నుంచి సమాధానాలు లేవు (యుద్ధంలో ఒక నిర్ణయాత్మక విజయానికి తిరుగులేని ఉదాహరణ డిసెంబర్ 16, 1971న పాకిస్థాన్ సైనికాధికారి జనరల్ నియాజీ భారత సైనికాధికారి జనరల్ అరోరాకు లొంగిపోవడం).

ఆపరేషన్ సిందూర్ సందర్భంగా నెలకొన్న ఒక వాస్తవాన్ని మన రాజకీయ నాయకత్వం అంగీకరించలేదు: పాకిస్థాన్, చైనాలు తమ సైనిక, రాజకీయ సంబంధాలను మరింతగా పటిష్ఠం చేసుకున్నాయి. పాకిస్థాన్‌కు కొత్త తరం యుద్ధ విమానాలు, మిస్సైల్స్‌ను చైనా సరఫరా చేస్తోంది. తాము ఉత్పత్తి చేసిన సైనిక సామగ్రి మన్నికను ఆపరేషన్ సిందూర్ సందర్భంగా చైనా పరీక్షించుకున్నది. బీజింగ్–ఇస్లామాబాద్ సైనిక బంధం ఆపరేషన్ సిందూర్‌లో స్పష్టంగా కనిపించింది. రాజకీయ రంగంలో చైనా విదేశాంగమంత్రి వాంగ్ యి 'ఉగ్రవాదంపై పాకిస్థాన్ నిశ్చయాత్మక చర్య'ను ప్రశంసించారు. పాకిస్థాన్‌కు అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ, ప్రపంచ బ్యాంక్, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్‌లు భారీ మొత్తంలో రుణాలు మంజూరు చేసేందుకు చైనా సంపూర్ణ మద్దతునిచ్చింది.

అమెరికాతో పాకిస్థాన్ (కనీసం పాకిస్థాన్ సైన్యం) బంధం మరింతగా దృఢతరమవడం మరొక వాస్తవం. పాక్ ఆర్మీ చీఫ్ జనరల్ అసీమ్ మునీర్‌ను అధ్యక్షుడు ట్రంప్ వైట్ హౌస్‌లో విందుకు ఆహ్వానించారు. దేశ సార్వభౌమాధినేత లేదా ప్రభుత్వాధినేత కాని వ్యక్తులకు మున్నెన్నడూ ఇటువంటి గౌరవం లభించలేదు. 'యుద్ధాన్ని కొనసాగించకుండా, ముగించినందుకు జనరల్ మునీర్‌కు ట్రంప్ కృతజ్ఞతలు చెప్పారు. తన విజ్ఞప్తి మేరకే కాల్పుల విరమణకు భారత్, పాకిస్థాన్‌లు అంగీకరించాయని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఆ రెండు దేశాల మధ్య అణు యుద్ధాన్ని తానే నివారించానని ట్రంప్ పదే పదే చెప్పుకున్నారు.

ఆపరేషన్ సిందూర్ విషయమై ప్రభుత్వాన్ని నిలదీస్తున్న ప్రతిపక్షాలను ప్రధానమంత్రి, హోం మంత్రి ఘాటుగా విమర్శించారే గానీ అమెరికా, చైనా అధ్యక్షులు, వారి విదేశాంగ మంత్రుల ప్రకటనలను ఖండించే సాహసం చేయలేకపోయారు. ప్రతిపక్షాల విమర్శలు నిరాధారమైనవని ఎందుకు నిరూపించలేకపోయారు? అంతర్జాతీయ వాణిజ్యంలో ఆధిక్యతకు పోటీపడుతున్న అమెరికా, చైనాలు పాకిస్థాన్‌ను సైనికంగా, రాజకీయంగా, ఆర్థికంగా ఆదుకోవడంలో ఒకే విధంగా వ్యవహరించాయన్నది మరొక విస్మరించలేని వాస్తవం. ఈ రెండు దేశాలు తమ విభేదాలు విస్మరించి పాకిస్థాన్‌కు మద్దతునిచ్చేందుకు, ప్రోత్సహించేందుకు అంగీకరించాయి. మరింత ఘోరమైన విషయమేమిటంటే పహల్గాం దాడిలో పాకిస్థాన్ ప్రమేయాన్ని చాటి చెప్పేందుకు ప్రపంచ దేశాలకు భారత ప్రభుత్వం పంపిన దౌత్య ప్రతినిధుల బృందాలు తమ లక్ష్యాన్ని సంపూర్ణంగా సాధించలేకపోయాయి. ఉగ్రవాద దాడి బాధితుల కుటుంబాలకు సంతాపాన్ని, భారత్‌కు సానుభూతిని వ్యక్తం చేశాయేగానీ ఆ దుర్మార్గానికి పాకిస్థాన్‌దే బాధ్యత అని ఏ ఒక్క దేశమూ ఖండించనేలేదు. ఈ వాస్తవాలను అంగీకరించేందుకు భారతదేశ రాజకీయ నాయకత్వం తిరస్కరిస్తోంది. పాకిస్థాన్‌కు మిత్ర దేశాలు లేవని, భారత్‌కు ప్రపంచ వ్యాప్తంగా మిత్రులు ఉన్నారనే భ్రమలోనే ఇప్పటికీ ఉన్నది!



> పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకార చర్యగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సాధించిన విజయాలు దుస్సాహసాలకు పాల్పడకుండా పాకిస్థాన్‌ను నిరోధించవచ్చు. అయితే మన ప్రత్యర్థి దేశానికి అమెరికా, చైనాల కుటిల మద్దతును ఎండగట్టడంలో భారత రాజకీయ నాయకత్వం పిరికితనం ప్రదర్శించింది. దీనివల్ల మన సైనిక విజయాలు వ్యర్థమైపోయి పాకిస్థాన్ మరోసారి మనపై కాలుదువ్వేందుకు సాహసించవచ్చు.

జమ్మూ–కశ్మీర్‌లో ఉగ్ర ఆవరణం (టెర్రర్ ఎకోసిస్టమ్ – ఉగ్రవాద ఆవిర్భావం, వ్యాప్తి, నిలకడకు దోహదం చేసే పరస్పర అనుసంధానిత కారకాల సంక్లిష్ట వ్యవస్థ) ధ్వంసమైపోయిందనే భ్రమలో కూడా దేశ రాజకీయ నాయకత్వం ఉన్నది. సత్యం భిన్నంగా ఉన్నది, సందేహం లేదు. పహల్గాం ఉగ్రదాడి (ఏప్రిల్ 22, 2025) సంభవించిన రెండు రోజుల అనంతరం (ఏప్రిల్ 24) ప్రభుత్వం నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో హోం మంత్రిత్వ శాఖ ఈ క్రింది వివరాలు వెల్లడించింది: జూన్ 2014– మే 2024 మధ్య కశ్మీర్‌లో 1643 ఉగ్రవాద సంఘటనలు, 1925 చొరబాటు ప్రయత్నాలు, 726 సఫల చొరబాట్లు సంభవించాయి; 576 మంది భద్రతా సిబ్బంది హతమయ్యారు. అటల్ బిహారీ వాజపేయి (1998–2004), మన్మోహన్‌సింగ్ (2004–2014) ప్రధాన మంత్రిత్వాల కాలంలో కూడా ఉగ్రవాద దాడులు సంభవించాయి, హతులు, క్షతగాత్రులు గణనీయంగా ఉన్నారు.

ఉగ్ర ఆవరణంలో ఉన్నదెవరు? పాకిస్థాన్ నుంచి భారత భూభాగాల్లోకి చొరబడినవారు, భారత్‌లో, ముఖ్యంగా కశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్నవారు. ఈ రెండు వర్గాలవారు తరచు కలిసికట్టుగా పనిచేస్తున్నారు, కలిసికట్టుగా ఉగ్ర చర్యలకు పాల్పడుతున్నారు, పరస్పరం సహాయ సహకారాలు అందించుకుంటున్నారు. ఏప్రిల్ 26, 2025న ప్రభుత్వం కశ్మీర్ లోయలో పలు గృహాలను కూల్చివేసింది. 'పహల్గాం ఊచకోతతో సంబంధమున్న ఉగ్రవాదులు' అని అనుమానించిన వారి గృహాలను కూల్చివేసినట్టు ప్రభుత్వం వివరణ ఇచ్చింది. కూల్చివేతకు గురైన గృహాల యజమానులు భారతదేశానికి చెందిన ఉగ్రవాదులే. జూన్ 2025లో నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ), ఉగ్రవాదులుగా అనుమానిస్తున్న వారికి ఆశ్రయమిచ్చినందుకు ఇద్దరు భారతీయులను అరెస్ట్ చేసింది. జూలై 27–28న ఉగ్రవాదులు అని శంకిస్తున్న వ్యక్తులను నిరాయుధులను చేసి, వారు చొరబాటుదారులు అని గుర్తించారు.

భారతదేశానికి చెందిన ఉగ్రవాదులు గతంలో ఉగ్రవాద హింసాకాండకు పాల్పడ్డారు. 2006లో ముంబై సబర్బన్ రైలులో బాంబు పేలుళ్ళు, 2008లో తాజ్‌మహల్ హోటల్‌పై దాడి, 2011లో జావేరీ బజార్ ఘటన సదరు ఉగ్రవాద హింసాకాండకు ఉదాహరణలు. 2006 ఉగ్రవాద దుర్మార్గానికి పాల్పడింది భారత్‌కు చెందిన ఉగ్రవాదులే. 2008 ఘటనకు పాల్పడినవారు కసబ్‌తో సహా పది మంది పాకిస్థానీ చొరబాటుదారులు. 2011 ఘటన భారత్‌కు చెందిన ఉగ్రవాదుల క్రూర కృత్యమే. భారత్‌లో ఉగ్ర ఆవరణాన్ని (టెర్రర్ ఎకో సిస్టమ్) నిర్మూలించినట్టు ప్రభుత్వం చేస్తున్న వాదన నిస్సందేహంగా తప్పు. ప్రభుత్వ వాదన నిజమే అయితే పహల్గాం దాడి ఎలా సంభవించింది? గూఢచార వర్గాల వైఫల్యం, పహల్గాంలో భద్రతా దళాలు లేకపోవడం వల్లే ఏప్రిల్ 22న ఆసేతు హిమాచలం ప్రతి ఒక్కరినీ కలచివేసిన బీభత్స విషాదం చోటుచేసుకున్నది. ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్న ఏ ఒక్కరూ ఆ అమానుష హింసాకాండకు బాధ్యత తీసుకోలేదు. ఇది గర్హనీయం కాదా? పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకార చర్యగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సాధించిన విజయాలు దుస్సాహసాలకు పాల్పడకుండా పాకిస్థాన్‌ను నిరోధించవచ్చు. అయితే మన ప్రత్యర్థి దేశానికి అమెరికా, చైనాల కుటిల మద్దతును ఎండగట్టడంలో భారత్ రాజకీయ నాయకత్వం పిరికితనం ప్రదర్శించింది. దీనివల్ల మన సైనిక విజయాలు వ్యర్థమైపోయి పాకిస్థాన్ మరోసారి మనపై కాలుదువ్వేందుకు సాహసించవచ్చు.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

అనుసంధానభాషగా హిందీని కాదనలేం!

భాషాప్రయుక్త రాష్ట్రాలు ఉనికిలోకి వచ్చిన తర్వాత, మన దేశంలో ఆయా భాషల చరిత్ర–వికాసం తదితర అంశాల పట్ల ఆసక్తి పెరిగింది. వివిధ భాషల పరస్పర అనువాదాలతో భారతీయ సాహిత్యం విస్తరించింది. కాలక్రమంలో పాలనా సౌలభ్యం దృష్ట్యా ఉత్తరాది, తదితర రాష్ట్రాల విభజన మరోమారు జరిగింది. అయినా ఉమ్మడిగా ఉండి విడిపోయిన రాష్ట్రాల భాష మాత్రం ఒకటిగానే ఉంది. ఇక కొన్ని రాష్ట్రాలలో అక్కడి భాషాభిమానం రాజకీయాల మూలాన దురభిమానానికి దారితీసింది (ఉదాహరణకు తమిళనాడు). కేరళ, కర్ణాటక రాష్ట్రాలు తమ భాషాభిమానాన్ని రాజకీయంగా చాటుకుంటున్నాయి. తెలుగునాట మాత్రమే ఉదారవాద చరిత్ర వల్ల ఇంగ్లీష్ మోజులో మాతృభాష ఉనికికి ప్రమాదం ఏర్పడింది.

ప్రస్తుతం దేశంలో త్రిభాషా సూత్రం అమలులో ఉన్నందువల్ల రెండో భాషగా హిందీ బోధన పట్ల వివాదం చోటుచేసుకొంది. ఇంగ్లీషుతో పాటు హిందీ ఒక అనుసంధాన భాషగా ఆరు, ఏడు దశాబ్దాలుగా దేశమంతా వ్యాపించిన తరువాత, ఇప్పుడు కొన్ని రాష్ట్రాలు తమ విద్యాలయాల్లో హిందీని రెండో భాషగా వ్యతిరేకిస్తున్నాయి.

రాజ్యాంగరీత్యా హిందీ 'రాజ్యభాష'గా అమల్లోకి వచ్చిన తర్వాత కూడా, ఇంగ్లీషుతో పాటు మిగతా 22 భారతీయ భాషలను సమానస్థాయిగా జాతీయ భాషలుగా ఆమోదిస్తున్నారు. అయితే కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ల అత్యుత్సాహ ప్రకటనల వల్ల ఇతర భాషలపై హిందీ పెత్తనం వహిస్తున్నదనే భావన బలపడుతున్నది. అధికార రాజకీయాల వివాదాల మధ్య హిందీ బోధన మరోసారి చర్చనీయాంశంగా మారిపోయింది. హిందీ భాషా రాష్ట్రాలు త్రిభాషా బోధన విషయంలో మాతృభాష హిందీతో పాటు ఇంగ్లీషు, సంస్కృతం తప్ప దక్షిణాది భాషలను బోధించడం లేదు. ఆచరణలో హిందీ భాషీయులకు ఇతర భారతీయ భాషలను నేర్చుకోవాలనే ఉత్సాహం లేదు. పైగా దక్షిణాది భాషల పట్ల ఒక అంతర్గత చులకన భావం హిందీని వ్యతిరేకించే వాతావరణాన్ని రాజకీయంగా పెంచి పోషించింది.



భాషాపరమైన రాజకీయాలు, ఇష్టాయిష్టాలను పక్కన పెడితే, జనబాహుళ్యంలో హిందీకి ఉన్న వాడుకను తక్కువగా అంచనా వేయలేము. దేశవ్యాప్తంగా వ్యాపార వాణిజ్య రంగాలలో పర్యాటక క్షేత్రంలో, ముంబై సినీరంగం వల్ల, హిందీ గీతాలు, వెబ్ సిరీస్‌లతో హిందీ భాష ఎంతగానో విస్తరించింది. తమిళనాడు, మహారాష్ట్రలకు అక్కడి రాజకీయ పార్టీల, గ్రూపుల అధికార రాజకీయ ప్రయోజనాల రీత్యా హిందీ పట్ల అభ్యంతరం ఉండొచ్చు. కాని ఆచరణలో ఒక ఆధునికభాషగా హిందీని ఎవరైనా సులువుగా నేర్చుకోగలరనే వాస్తవాన్ని నిరాకరించలేం.

మరోవైపు ఉత్తరాది హిందీ రాష్ట్రాలలో భోజ్‌పురి, మైథిలి, మాగధి, బొందిలి తదితర ప్రాంతీయ (స్థానీయ) భాషలను హిందీ మింగివేసిందనే వాదనలో బలం లేదు. అక్కడి ప్రాంతీయ మాండలికాలకు హిందీ పాలనా భాషగా ఒక చారిత్రక అవసరంగా పరిణమించింది. ఎలాగైతే గోండి, సవర, బంజారా తదితర భాషలకు పరిమితులున్నాయో వాటికీ అంతే!

జాతీయోద్యమ కాలం నుంచి, ఈ దేశంలోని వివిధ భాషల మధ్య ఖడిబోలీ హిందీ ఒక అనుసంధాన భాషగా రూపొందింది. ఇంగ్లీష్‌తో పాటు హిందీ ఈ రోజు దేశ ప్రజలను ఏకం చేసే వాహికగా ఉన్నది. బోధన, శిక్షణ పరంగా కేంద్రీయ హిందీ సంస్థాన్, నిదేశాలయ్ తదితర హిందీ విభాగాల ద్వారా కేంద్ర ప్రభుత్వం గత 50 సంవత్సరాలుగా వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టింది. దక్షిణ భారత హిందీ ప్రచారసభతో పాటు ఇతర ప్రాంతాల హిందీ ప్రచార సంస్థలు ఆ భాషా వ్యాప్తికి కృషి చేస్తున్నాయి.

ప్రస్తుతం హిందీ కేవలం ఉత్తరాది భాషగా కొన్ని రాష్ట్రాలకే పరిమితం కాకుండా, ఇతర భారతీయ భాషలతో పాటు జాతీయ స్వభావాన్ని సంతరించుకొంది. ఒక లంకెగా, అనుసంధాన భాషగా అభివృద్ధి చెందింది. అయితే ఉర్దూ పదాలను తొలగించి సంస్కృత పదభూయిష్టంగా మారిన మాట వాస్తవం.

ఇతరత్రా మణిపురి, సంతాలీ భాషలు తప్ప, ఆయా తెగలకు, గిరిజనులకు చెందిన భాషలు విస్తరించే అవకాశం లేదు. ఉపాధి, ఉద్యోగ అవకాశాల నిమిత్తం ఇంగ్లీషు, ప్రాంతీయ భాషలను నేర్చుకోవలసిందే! మన దేశ కాల పరిస్థితుల్లో జాతీయ–అంతర్జాతీయ అవకాశాలను అందిపుచ్చుకోవాలనుకుంటే ఇంగ్లీషు–హిందీ తప్ప ప్రత్యామ్నాయాలున్నాయా? విదేశాల్లో ఉద్యోగాల కోసం జర్మనీ, ఫ్రెంచి మొదలైన భాషలను నేర్చుకోవడం అతి కొద్ది మందికే సాధ్యం.

• నిఖిలేశ్వర్

'టాటా ఉదంతం ఓ హెచ్చరిక!

ప్రముఖ ఐటీ కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ఒకేసారి 12,200 మంది ఉద్యోగులను తొలగించబోతున్నట్లు ప్రకటించడం అందరినీ షాక్‌కి గురిచేసింది. సంస్థ మొత్తం ఉద్యోగుల సంఖ్యలో ఇది రెండు శాతం. ఈ స్థాయిలో ఉద్యోగాలకు ఉద్వాసన పలకడం భవిష్యత్‌లో జాబ్ మార్కెట్‌లో జరగబోతున్న పరిణామాలకు తొలి సంకేతం. ప్రమాద హెచ్చరిక కూడా. ఉద్యోగాల తొలగింపు అన్నది ఒక ఐటీ రంగానికి లేదా భారత్‌కి మాత్రమే సంబంధించిన కుదుపు కాదు. ప్రపంచ వ్యాప్తంగా, అన్ని రంగాల్లో ఎదురవబోయే కీలక మార్పులకు అద్దం పడుతుంది. ఐటీ రంగంలో ఇప్పటికే కృత్రిమ మేధ ప్రభావం వేగం అందుకుంది. కోడింగ్‌లో ముప్పై శాతం మేరకు కృత్రిమ మేధ ఆక్రమించుకున్నట్లు తెలుస్తోంది. మిగతా రంగాల్లో కూడా దాని ప్రభావం విస్తృతమవుతోంది. ఫలితంగా లక్షలాది ఉద్యోగాలకు ఎసరు తప్పదు. అయితే పాత తరహా ఉద్యోగాలకు కాలం చెల్లినా, కొత్త అవకాశాలు, నూతన నైపుణ్యాల అవసరం ఉన్నవి ఆ వాక్యూమ్‌ని భర్తీ చేస్తాయి. కంప్యూటర్లు వచ్చిన మొదట్లో జరిగింది ఇదే.

ప్రభుత్వం కానీ, ప్రైవేట్ రంగ విద్యాసంస్థలు కానీ భవిష్యత్‌కి సరిపడే రీతిలో విద్యావకాశాల్ని పెంచాలి. శిక్షణా కేంద్రాలు నెలకొల్పి ప్రపంచ స్థాయి అవకాశాల్ని అందిపుచ్చుకోవాలి. ప్రస్తుతం మన దేశంలో యువ శక్తి గణనీయంగా ఉంది. ఆ వనరుల్ని బలంగా మార్చుకోవాలంటే అందుకు తగ్గట్టుగా సమాయత్తం కావాలి. ప్రస్తుత ఉద్యోగ సంక్షోభాన్ని ఎదుర్కొనే ప్రణాళికలు ఉండాలి. ఒక్క కృత్రిమ మేధ వల్లనే ఈ సంక్షోభం ఎదురవడం లేదు. అమెరికా, ఇతర పాశ్చాత్య దేశాల వాణిజ్య నిర్ణయాలు, యుద్ధాలు, రాజకీయాలు... కరోనా అనంతర ప్రపంచాన్ని సమూలంగా మార్చివేశాయి. దేశం ముందున్న దారి ఒక్కటే. ఆర్థికంగా, సామాజికంగా, విజ్ఞాన పరంగా బలోపేతం కావడం. అందులో భాగంగా వ్యవసాయం, పరిశ్రమలు లాభసాటిగా మార్చడం, ఉత్తమ క్వాలిటీ విద్యను అందించడం ద్వారా యువశక్తిని బలోపేతం చెయ్యడం. నిరుద్యోగిత తగ్గించడంతో బాటు ప్రపంచ స్థాయి ఉద్యోగాలకు అర్హులుగా విద్యార్థి దశలోనే తీర్చిదిద్దడం. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌లో జరుగుతున్న భారీ స్థాయి ఉద్వాసనను భారత్ ఓ హెచ్చరికగా భావించాల్సిన తరుణం ఇది.

– డి.వి.జి. శంకరరావు, మాజీ ఎంపీ


ప్రభుత్వ భూములను పరిరక్షించాలి

గ్రామాల్లోని ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. వందల ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నట్లుగా రెవెన్యూ రికార్డులు చూపుతుంటే, వాస్తవంలో మాత్రం అందులో సగం భూమి కూడా ఉండడం లేదు. పలువురు వెంచర్లు, ఇతర నిర్మాణాలు చేపడుతూ సమీపంలోని ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్నారు. ఆయా భూముల పరిరక్షణకు ప్రభుత్వం తొలుత గ్రామాల్లో సర్వేలు నిర్వహించాలి. భూ వివరాలు, సరిహద్దులు, ప్రభుత్వ హెచ్చరికలతో కూడిన బోర్డులను ఆయా ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలి. ఉపాధిహామీ పనుల ద్వారా ఆ భూముల చుట్టూ కందకాలు తవ్వించాలి. కుంటల్లో పూడిక తీయించాలి. తవ్విన మట్టిని రైతులు తమ పొలాలకు తరలించుకోవచ్చు. ఆయా కుంటల్లో చేపల పెంపకం వంటివి చేపట్టవచ్చు.

– సముద్రాల రామకిషన్‌రావు, జనగామ

మూఢ విశ్వాసాలు సంస్కృతిలో భాగమా?

ఆచార వ్యవహారాలు ప్రజల జీవన విధానాల్లో భాగంగా, సామరస్యంగా పాటించుకోవాలి. ప్రజలు సాధారణ ధోరణిలో జరుపుకొనే ఈ పర్వాలను ప్రభుత్వం పట్టించుకోవాలని డిమాండ్ చేయడం వల్ల ఇవి రాజకీయాలకు కేంద్రాలుగా మారుతున్నాయి. ఒక జాతి సాంస్కృతిక ఆచారాలు, పండుగల నిర్వహణ ప్రభుత్వ బాధ్యత కాదు. దాని కోసం ఖజానా నిధులు, అధికార యంత్రాంగ వినియోగం అనవసరం. వాటిని ఆయా జాతుల ప్రజలే సొంత వనరులతో జరుపుకుంటారు. తరతరాలుగా ఇలాగే అవి కొనసాగుతున్నాయి.



బతుకమ్మ తెలంగాణ మహిళల ఇష్టమైన పండుగ. పూలతో బతుకమ్మలను పేర్చి వాటి చుట్టూ తిరుగుతూ పాటలు పాడడం ఓ సాంస్కృతిక సమారోహం. ఆ పాటల్లో స్త్రీల జీవితాలకు చెందిన గొప్ప సాహిత్యం ఉంది. ఆ పండుగ ఎలా పుట్టింది అనడానికి ఎన్ని కథనాలున్నా అవన్నీ అప్రస్తుతం. కొత్త బట్టలు, ఆట పాటలు, పుట్టింటికి ప్రయాణం, బంధు మిత్రుల ప్రేమపూర్వక ఆలింగనాలు, సుఖదుఃఖాల ప్రస్తావనలు ఇవన్నీ ఆడజన్మకు ఏడాదికోసారి దొరికే అపురూప కానుకలు. ఇవి చాలు బతుకమ్మను కొలవడానికి. తెలంగాణ ఉద్యమంలో బతుకమ్మ ఓ అంశమైంది. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ పండుగ ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురవుతోందని ఓ వాదన మొదలైంది. తెలంగాణ వచ్చాక ఏర్పడ్డ ప్రభుత్వం జనాన్ని ఆకట్టుకునేందుకు బతుకమ్మను ప్రభుత్వం తరఫున నిర్వహించడం మొదలుపెట్టింది. స్టేడియంలలో వేలాది మంది మహిళలతో బతుకమ్మ ఆటలను ఏర్పాటు చేసింది. బుక్ రికార్డుల కోసం ఊర్లో చేసుకొనే పండుగను నగరంలోకి తెచ్చింది. ఆఫీసుల్లో ఉద్యోగినులతో వాటి నిర్వహణ చేపట్టింది. నోరారా పాడే బతుకమ్మ పాటలను డీజే సౌండ్‌గా మార్చింది. చప్పట్లు కొడుతూ సాగే తంతును దాండియా స్థాయికి తీసుకెళ్ళింది. రాష్ట్ర నిధులను వెచ్చించి ప్రభుత్వం చేస్తున్న ఈ తీరు బతుకమ్మ పండుగ ప్రాశస్త్యాన్ని కనుమరుగు చేస్తోంది. ఈ కాలుష్యం ద్వారా బతుకమ్మ చివరకు ఓ హంగామాగా మారిపోయింది.

బోనాలు జంట నగరాల్లో సాగే సామూహిక పర్వం. వాటి నిర్వహణ పిల్లలు జడుసుకొనేలా ఉంటోంది. వాయిద్య చప్పుళ్లతో నగరం మారుమోగిపోతుంది. ఈ ముగింపుగా 'రంగం' అనే భవిష్యవాణి పలికే కార్యక్రమం ఉంటుంది. నగరానికి చెందిన ఒక జోగిని కుటుంబంలోని స్త్రీలు వారసత్వ రీతిలో ఈ భవిష్యవాణిని వినిపిస్తున్నారు. మహంకాళి దేవత ఆవహించి ఆమెతో ఈ వాణిని పలికిస్తుందని భక్తుల నమ్మకం. ఈసారి ఆమె నోటి వెంట 'తనకు రక్తం చూపించకపోతే ఊరుకోను' అని మాట వచ్చింది. కొంతకాలంగా ఆ ఆలయంలో కోడి, మేక లాంటి జంతు బలులను నిషేధించారట. దానికి కోపగిస్తూ 'నాలుగు కాళ్ల లేదా చిన్న జీవి అయినా సరే.. కొద్దిగానైనా రక్తం చూపించాలని' ఆ మాతంగి పలికారు.

దేవత ఆవహింపు అనే దానిని విజ్ఞానశాస్త్రం ఒప్పుకోదు. అయినా భక్తుల నమ్మకమే ఇక్కడ ప్రధానం. 'రంగం' ఆ పర్వదిన ప్రహసనం మాత్రమే. ప్రజల భక్తి విశ్వాసాలకు సంబంధించిన విషయం. అయితే ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఓ మంత్రి మాట్లాడుతూ, నిషేధించిన జంతుబలుల గురించి ప్రభుత్వం పరిశీలిస్తుందని, భవిష్యవాణిలో చెప్పినట్లుగా అన్ని జాగ్రత్తలు చేపడతామని అన్నారు. ఇలాంటి విషయాల్లో ప్రభుత్వ ప్రమేయం, హామీలు అవసరమా? ప్రజల విశ్వాసాలు సంస్కృతిలో భాగమే. అశాస్త్రీయ, మూఢ నమ్మకాలను వారి ఇష్టానికే వదిలేయాలి కాని వాటికి సంస్కృతిలో చోటు కల్పించకూడదు. సంస్కృతి జాతి ఉన్నతీకరణకు తోడ్పడాలి కానీ మూఢనమ్మకాలను పెంచి పోషించకూడదు.

– బద్రి నర్సన్

ఆ తీర్పుతో తెలుగు రాష్ట్రాలకు అన్యాయం

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో తాజా నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) రాజ్యాంగ విరుద్ధం అంటూనే, జమ్మూకశ్మీర్‌కు మాత్రం ప్రత్యేకంగా చట్టబద్ధమని సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పు అసంతృప్తి కలిగించింది. ఈ తీర్పు ద్వారా భారత న్యాయవ్యవస్థ రాష్ట్రాల మధ్య సమానత్వం అనే తత్వాన్ని విస్మరించిందా? అనిపించింది.

2014లో రాష్ట్ర విభజన తరువాత తెలుగు రాష్ట్రాల్లో జిల్లాలు, నియోజకవర్గాలు, అభివృద్ధి ప్రాంతాలు అన్నీ కొత్తగా ఏర్పడ్డాయి. ప్రజల జనాభా, నగరీకరణ, ప్రజా అవసరాలు వంటివన్నీ మారిపోయాయి. కానీ ఇప్పటికీ 2008లో చేసిన డీలిమిటేషన్ ఆధారంగానే ఎన్నికలు జరుగుతున్నాయి. ఉదాహరణకు– హైదరాబాద్ మౌలికంగా మారిపోయినా, ఒక నియోజకవర్గంలో ఎక్కువ జనాభా, మరొక నియోజకవర్గంలో తక్కువ జనాభా ఉంది. అలాగే తెలంగాణలోని రంగారెడ్డి, మేడ్చల్, వరంగల్, కరీంనగర్, ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, గుంటూరు వంటి ప్రాంతాల్లో జనాభా వేగంగా పెరిగినా, ఇప్పటికీ పాత నియోజకవర్గ లెక్కలకే పరిమితమవుతున్నారు. ఈ పరిస్థితిలో సమానమైన ప్రజాప్రాతినిధ్యం ఉండడం లేదు.

జమ్మూకశ్మీర్‌లో ఒక ప్రత్యేక చట్టం (Reorganisation Act, 2019) పేరిట డీలిమిటేషన్ చేసిన కేంద్రం, దేశంలో ఉన్న ఇతర రాష్ట్రాలకు మాత్రం ఇది రాజ్యాంగ వ్యతిరేకమని చెప్పడం రెండు రకాల న్యాయం కాదా? ఇది రాజ్యాంగ సమానత్వానికి (ఆర్టికల్ 14) విఘాతం. ప్రత్యేక చట్టం తీసుకొచ్చి, రాజకీయ అవసరాల కోసం జమ్మూకశ్మీర్‌లో డీలిమిటేషన్ చేస్తే, అదే విధంగా తెలుగు రాష్ట్రాల పునర్విభజన నేపథ్యంలో ప్రత్యేక చట్టం తీసుకురావడం ఎందుకు సాధ్యం కాదు? 84వ రాజ్యాంగ సవరణ ద్వారా 2026 వరకు డీలిమిటేషన్‌ను ఫ్రీజ్ చేయాలని చెప్పినా, రాష్ట్రాలు విడిపోయాక ఏర్పడిన అసమానతలు మాత్రం రాజ్యాంగం చెప్పిన సమయంలో కలుగలేదు. తెలుగు రాష్ట్రాల పునర్విభజన తర్వాత ఏర్పడిన కొన్ని సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాలేదు. 2026 వరకు ప్రజల ప్రాతినిధ్య హక్కులను ఇలా మూగబోయించడం న్యాయమా? సుదీర్ఘకాలంగా దక్షిణ భారతదేశం– ముఖ్యంగా తమిళనాడు, కేరళ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ – జనాభా నియంత్రణలో ముందుండగా, ఉత్తర భారతదేశంలో జనాభా పెరుగుతోంది. 2026 తర్వాత డీలిమిటేషన్ చేస్తే ఎంపీ సీట్లు ఉత్తరాది రాష్ట్రాలకు ఎక్కువ, దక్షిణ రాష్ట్రాలకు తక్కువ వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో, 2026లో డీలిమిటేషన్‌తో దక్షిణ రాష్ట్రాల ప్రాధాన్యత తగ్గించాలన్న రాజకీయ ఎజెండా ముందుగానే రూపొందిందా?

తెలుగు రాష్ట్రాలు నష్టపోతున్నాయని తెలిసీ, ఎందుకు ఇప్పటికీ కేంద్రం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావడం లేదు? జమ్మూకశ్మీర్‌లో ఉన్న "జాతీయ భద్రత, ప్రత్యేక పరిస్థితులు" లాజిక్, బైఫరకేషన్ వల్ల సంక్లిష్టంగా మారిన తెలుగు రాష్ట్రాలకు ఎందుకు వర్తించకూడదు? సుప్రీంకోర్టు ప్రజల ప్రాథమిక హక్కులు, సమర్థమైన ప్రాతినిధ్యం వంటి అంశాలను ఎంతమేరకు గౌరవించింది? ఈ తీర్పు ద్వారా ప్రజాస్వామ్యంలోని అసమానతలు మరింత పెరుగుతాయి. సుప్రీంకోర్టు నిర్ణయం రాజ్యాంగంలో చెప్పిన నిబంధనల ప్రకారం సరైనదిగా అనిపించవచ్చు. కానీ ప్రజాస్వామ్యంలో ప్రజల అభిప్రాయాలకు, అవసరాలకు అనుగుణంగా స్పందించాలి. ప్రజల ప్రాతినిధ్యం అనేది ప్రాథమిక హక్కు. దీన్ని కాలపరిమితి, రాజకీయ అజెండాల పేరుతో వాయిదా వేయడం అనైతికం.

– నాగేందర్‌రెడ్డి కాసర్ల, ప్రెసిడెంట్, బీఆర్ఎస్ ఆస్ట్రేలియా



మాట్లాడుతున్న కడియం శ్రీహరి

జేఎన్‌ఎస్‌లో స్పోర్ట్స్ స్కూల్

- మాజీ ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి
- జేఎన్‌ఎస్‌లో ఎమ్మెల్యేలు, అధికారులతో కలిసి పరిశీలన

వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో వసతులు పరిశీలించిన తర్వాత స్పోర్ట్స్ స్కూల్ కం సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీని ఇక్కడ తాత్కాలికంగా ప్రారంభించేందుకు నిర్ణయం తీసుకున్నామని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. స్టేడియంలో స్పోర్ట్స్ స్కూల్ కం సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ తాత్కాలిక ప్రారంభానికి అవసమైన సదుపాయాలను ఎమ్మెల్యే కడియం నేతృత్వంలో ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ స్నేహ శబరీష్, గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్‌తో కలిసి శుక్రవారం క్షేత్రస్థాయిలో పర్యటించి వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేడియం ఆవరణలో ఉన్న హాస్టల్ భవనాలు, ఇండోర్, ఔట్‌డోర్ క్రీడా మైదానాలను పరిశీలించి చేపట్టాల్సిన మరమ్మతులు, కల్పించిన సదుపాయాలను అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా డీఎస్‌వో అశోక్ స్టేడియంలో ఉన్న పరిస్థితులను

(మిగతా 8లో...)

స్టెప్పులేసిన సీపీ సన్‌ప్రీత్



పోలీస్ డ్యూటీ మీట్‌ను పురస్కరించుకొని పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ స్టెప్పులేసి అధికారులు, సిబ్బందిలో ఉత్సాహం నింపారు. డ్యూటీ మీట్ రెండు రోజులు విజయవంతం కొనసాగి శనివారం ముగుస్తున్న సందర్భంగా శుక్రవారం రాత్రి మామునూరు పీటీసీలో కల్చరల్ ఈవెంట్ ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. హిందీ, తెలుగు పాటలకు ఇతర అధికారులతో కలిసి సీపీ సరదాగా నృత్యం చేశారు. సీపీతో పాటు ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్, జనగామ ఏఎస్పీ, ఏఆర్ అడిషనల్ డీసీపీ సురేశ్‌కుమార్, ఆర్‌ఐ కాశీరాం వేదికను పంచుకున్నారు.

- ఆంధ్రజ్యోతి, వరంగల్ క్రైం



మునిసిపల్ ఎన్నికలకు కసరత్తు

- హైకోర్టు ఆదేశంతో కదలిక
- అధికారులకు అందిన ఆదేశాలు
- మొదలైన ఏర్పాట్లు
- ఓటర్ల జాబితాల తయారీపై దృష్టి
- పాతవాటితో పాటు కొత్త మునిసిపాలిటీలకు ఎన్నికలు
- ఉమ్మడి జిల్లాలో మొత్తం 12 పురపాలక సంఘాలు



హనుమకొండ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తున్న ప్రభుత్వం.. మరో పక్క పురపాలక సంఘాలకు కూడా ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. ఈ మేరకు పురపాలక సంఘాల అధికారులకు సంకేతాలను ఇచ్చింది. ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లను మొదలు పెట్టవలసిందిగా సూత్రప్రాయంగా ఆదేశాలిచ్చింది. ప్రభుత్వ సూచన మేరకు అధికారులు కసరత్తు మొదలు పెడుతున్నారు. రాష్ట్రంలో పురపాలక సంస్థలకు ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారని హైకోర్టు రాష్ట్రప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఇప్పటివరకు ఎన్నికలు ఎందుకు నిర్వహించలేదని నిలదీసింది. ఎప్పటిలోగా నిర్వహిస్తారో చెప్పాలని ఆదేశిచింది. కాలపరిమితి పూర్తయినప్పటికీ ఇంకా ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించింది. ఈ అంశంపై సమగ్ర వివరాలు అందించాలని ఆదేశించింది. ఈ ఏడాది మార్చి 25న నిర్మల్ మున్సిపాలిటీ పాలక వర్గం కాలపరిమితి ముగిసినప్పటికీ అక్కడ ఎన్నికలు నిర్వహించడం లేదని ఒక పౌరుడు హైకోర్టును ఆశ్రయించడంతో ప్రభుత్వంలో కదలిక వచ్చింది. ఈ నేపథ్యంలో పురపాలిక ఎన్నికలు వీలైనంత త్వరగా నిర్వహించాలనే నిర్ణయానికి వచ్చింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 12 పురపాలక సంఘాలు ఉన్నాయి. వీటిలో మూడు ఇటీవల కొత్తగా ఏర్పాటయ్యాయి. పాత వాటితో పాటు కొత్త వాటికి కూడా ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించనున్నది.

ఏడు నెలలుగా..

ఈ ఏడాది జనవరిలో పాలక వర్గాల గడువు ముగిసింది. ఏడు నెలలుగా ప్రత్యేకాధికారుల పాలనలో అవి కొనసాగుతున్నాయి. పాలక వర్గాలు లేకపోవడంతో అడిగే వారు లేక వార్డుల్లో పరిపాలన గాడితప్పింది. వార్డుల్లో సమస్యలు ఎక్కడికక్కడ పేరుకుపోతున్నాయి. పాలకవర్గం ఉన్నంతకాలం పట్టణవాసులు సమస్యలను వార్డు కౌన్సిలర్ల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకునే వారు. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి ప్రజల్లో నెలకొన్నది. దీంతో అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. పురపాలికలకు నిధుల రాబడి కూడా తగ్గింది. పారిశుధ్యం క్షీణిస్తోంది. రోడ్లు, డ్రైనేజీలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీనితో పట్టణవాసులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పాత, కొత్తవి కలుపుకొని..

ఉమ్మడి జిల్లాలో 12 పురపాలక సంఘాలు ఉన్నాయి. నర్సంపేట, పరకాల, జనగామ, మహబూబాబాద్, తొర్రూరు, మరిపెడ, వర్ధన్నపేట, భూపాలపల్లి, డోర్నకల్ పాతవి. ములుగు, కేసముద్రం, స్టేషన్ ఘనపూర్ ఇటీవల కొత్తగా ఏర్పాటయ్యాయి. పాతవాటితో పాటు కొత్తవాటికి కూడా ఎన్నికలు నిర్వహించనున్నారు. చుట్టుపక్కల ఉన్న గ్రామ పంచాయతీలను విలీనం చేయడం ద్వారా కొత్త మున్సిపాలిటీలను ఏర్పాటు చేశారు. నర్సంపేట మున్సిపాలిటీలో కూడా కొన్ని గ్రామాలు విలీనం అయ్యాయి. ప్రభుత్వం ఇటీవల ఉమ్మడి జిల్లాలో నాలుగు కొత్త మండలాలు కేజే మల్లంపల్లి, ఇనుగుర్తి, సీరోలు, గోరికొత్తపల్లిలను ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో కొన్ని గ్రామ పంచాయతీలను విలీనం చేయడం ద్వారా మూడు కొత్త మున్సిపాలిలను ఏర్పాటు చేసింది. మండలాలు, పంచాయతీలు, మున్సిపాలిటీ పునఃవ్యవస్థీకరణ ప్రక్రియ పూర్తయినందు వల్ల స్థానిక సంస్థలతో పాటు మున్సిపల్ ఎన్నికలకు మార్గం సుగమం అయింది. మున్సిపల్ ఎన్నికలు ఇన్నాళ్లు జరపకపోవడానికి పునఃవ్యవస్థీకరణ కూడా ఒక కారణంగా చెబుతున్నారు.

ఏర్పాట్లు

పురపాలక సంఘాల ఎన్నికల నిర్వహణకు సిద్ధమవుతున్న అధికారులు.. మొదట ఓటర్ల తాజా జాబితాలపై దృష్టిసారించారు. 2020 జనవరిలో ఎన్నికలు జరిగాయి. అయిదేళ్లలో పురపాలికల్లో జనాభా, గృహాల సంఖ్య పెరిగింది. కొన్ని విస్తరించాయి. ఆ మేరకు ఓటర్ల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. దీనితో ఓటర్ల జాబితాలను సిద్ధం చేస్తున్నారు. కొత్త ఓటర్లను గుర్తించాల్సి ఉంది. దీనికి తోడు కొత్తగా ఏర్పాటైన మున్సిపాలిటీల్లో వార్డుల విభజన చేపట్టాల్సి ఉంది. కొత్తగా ఓటర్ల జాబితాలను సిద్ధం చేయాలి. రిజర్వేషన్ల ప్రక్రియ కూడా జరగాలి.

వార్డుల పునర్విభజన

కొత్తగా ఏర్పడ్డ మున్సిపాలిటీల్లో వార్డుల ఖరారుపై మున్సిపల్ శాఖ అధికారి ఇటీవల జీవో జారీ చేశారు. ఈ మేరకు మున్సిపల్ అధికారులు ప్రతిపాదనలను సిద్ధం చేశారు. వార్డుల విభజనకు సంబంధించి నోటిఫికేషన్ జూన్‌లోనే నోటిఫికేషన్ జారీ అయింది. జూన్ 21 వరకు వార్డుల విభజన ప్రక్రియ పూర్తిచేసేలా అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ఇప్పటికే గ్రామాలు, పంచాయతీ వార్డుల విభజన, ఓటరు జాబితాలను తయారు చేసింది. ఎంపీటీసీల విభజన, ఓటరు జాబితాను సిద్ధం చేసి ఎన్నికలకు సిద్ధమవుతోంది. త్వరలో ఎన్నికలకు అవసరమైన రిజర్వేషన్లను ఖరారు చేయనున్నది. ఈ నేపథ్యంలో పట్టణాల్లోనూ వార్డుల విభజన చేపట్టడంతో ఆ తర్వాత ఓటరు జాబితా పూర్తికానున్నది.

రాజకీయ పార్టీల్లో కదలిక

పురపాలిక సంఘాలకు ఎన్నికలు అనగానే రాజకీయ పార్టీల నాయకులు క్రియాశీలకమవుతున్నారు. మున్సిపాలిటీల్లో పట్టు సాధించాలనే పట్టుదలతో కార్యరంగంలోకి దూకపోతున్నారు. ప్రధాన పార్టీల నాయకులు ప్రత్యేక సమావేశాలకు సిద్ధమవుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లాలోని దాదాపు అన్ని పురపాలక సంఘాలు ఆ పార్టీ గుప్పిట్లోకి వెళ్లిపోయాయి. మెజారిటీ సంఘాలకు చైర్మన్లుగా, వార్డు సభ్యులుగా బీఆర్ఎస్ పార్టీకి చెందినవారే ఎన్నికయ్యారు. మున్సిపల్ ఎన్నికలు ఆ పార్టీ సవాల్‌గా తీసుకోనున్నది. కానీ రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు మారాయి. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నది. స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు పురపాలికలను సైతం హస్తగతం చేసుకోవాలనే దృఢ సంకల్పంతో ఉన్నది. మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆ మేరకు పావులు కదుపుతోంది. బీజేపీ సైతం మున్సిపల్ ఎన్నికల్లో సత్తాచాటేందుకు సమాయత్తం అవుతోంది. పార్టీ కార్యకర్తలనను ఇప్పటి నుంచే సన్నద్ధులను చేస్తోంది. బీసీ రిజర్వేషన్లు పెరిగే అవకాశం ఉండడంతో బీసీ సామాజిక వర్గాలకు చెందిన ఆశావహులు ఈ సారి ఎక్కువగా పోటీ పడనున్నారు.

అనుమానం పెనుభూతమై..

- భార్యను హత్య చేసిన భర్త
- ఏనుమాముల బాలాజీ నగర్‌లో ఘటన



మట్టెవాడ (వరంగల్), ఆగస్టు 1 (ఆంధ్ర జ్యోతి): అతడిది సొంత రాష్ట్రం కాకపోయినా ప్రేమించానని చెపితే నమ్మి ఐదేళ్ల క్రితం పెళ్లి చేసుకుంది. కొంతకాలం అన్యోన్యంగా కలిసి కాపురం చేశారు. ఇద్దరు పిల్లలు కలిగారు. ఇంతవరకు బాగానే ఉన్నా ఇటీవల భార్యపై తను అనుమానం పెంచుకున్నాడు. చివరికి ఉన్మాదిలా మారి ఆమె ఉసురు తీశాడు. వరంగల్ జిల్లా కేంద్రంలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

ఉత్తర ప్రదేశ్‌కు చెందిన రితీష్‌సింగ్ అలియాస్ పద్దు ఠాగూర్ అనే యువకుడు ఐదేళ్ల క్రితం వరంగల్‌కు వచ్చి ఐస్‌క్రీమ్ అమ్ముతున్నాడు. ఈ క్రమంలో వరంగల్ పట్టణం బాలాజీ నగర్‌కు చెందిన రేష్మ (23)తో పరిచయం ఏర్పడింది. క్రమంగా ప్రేమగా మారి పెళ్లి చేసుకున్నారు. ఇద్దరు పిల్లలు కలిగాక భార్యపై అనుమానం కలిగింది. దీంతో ఇద్దరి మధ్య కొన్ని నెలలుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో గురువారం రాత్రి రేష్మ నిద్ర పోయాక కాళ్లను కట్టేసి, చున్నీతో గొంతునులిమి చంపేసి పరార్ అయ్యాడు. శుక్రవారం ఉదయం రేష్మ తల్లి రజియా సుల్తానా గమనించి ఏనుమాముల పోలీసులకు సమాచారం ఇచ్చింది. వారు హత్య జరిగిన తీరును పరిశీలించారు. సీఐ సురేశ్ కేసు నమోదు చేశారు. నిందితుడు పరారీలో ఉన్నాడని, పట్టుకునేందుకు రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని మామునూరు ఏసీపీ వెంకటేశ్ తెలిపారు.

మూడు నెలలుగా భర్తకు దూరంగా..

రేష్మ మూడు నెలలుగా భర్తకు దూరంగా ఉంటోందని, నాలుగు రోజుల క్రితమే భర్త రితీష్‌సింగ్ వద్దకు వెళ్లిందని రేష్మ తల్లిదండ్రులు తెలిపారు. అయినా గొడవలు జరుగుతూనే ఉన్నాయని తెలిపారు. కలిసి ఉందామని చెప్పి నమ్మించి రితీష్‌సింగ్ తమ కూతురును హత్య చేశాడని ఆరోపించారు. రేష్మకు నాలుగు సంవత్సరాల కుమారుడు, మూడేళ్ల కూతురు ఉన్నారు.

శ్యామ్ పాటకు పట్టం

'బలగం' సినిమాలోని 'ఊరూ.. పల్లెటూరు..' పాటకు పురస్కారం

- జాతీయ స్థాయి సినీ అవార్డుల్లో ఉత్తమ గేయంగా ఎంపిక
- 22 ఏళ్లుగా సినీ పరిశ్రమలో తనదైన ముద్ర
- ఎన్నో హిట్‌పాటల రచయితగా గుర్తింపు



హనుమకొండ కల్చరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): 2023 సంవత్సరానికి గాను జాతీయస్థాయిలో ప్రకటించిన సినీ అవార్డుల జాబితాలో ఓరుగల్లు పాట పట్టం కట్టించుకుంది. హనుమకొండకు చెందిన సినీ గేయరచయిత కాసర్ల శ్యామ్ బలగం సినిమా కోసం రాసిన 'ఊరూ.. పల్లెటూరు' పాటకు జాతీయస్థాయిలో అవార్డును ప్రకటించడం విశేషం. వేణు దర్శకత్వంలో విడుదలైన బలగం సినిమాలో అన్ని పాటలు కాసర్ల శ్యామ్ రాయడం విశేషం. దాదాపు అన్ని పాటలు ప్రజాదరణ పొందాయి. భీమ్స్ సంగీతం వహించగా కాసర్ల శ్యామ్ రాసిన 'ఊరూ.. పల్లెటూరు..' పాట జాతీయస్థాయిలో తెలుగు విభాగంలో ఉత్తమ గేయంగా నిలిచింది.

> **ఓరుగల్లు మట్టి పరిమళమే..**
>
> ఓరుగల్లు మట్టి పరిమళమే తన పాట సాహిత్యానికి పునాది అని కాసర్ల శ్యామ్ 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు. తాను రాసిన పాటకు జాతీయ అవార్డు రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. తనకు సాహిత్యంలో, సంగీతంలో ఓనమాలు నేర్పిన శంకరన్న, సారంగపాణిల సహచర్యం సాహిత్య అభిలాష సినీ గేయ రచయితగా తనకో స్థానం కల్పించాయని చెప్పారు.

శ్యామ్ ప్రస్థానం

2003లో బి.జయ దర్శకత్వంలో రూపొందించిన చంటిగాడు సినిమాలో కొక్కొరకో పాటతో పరిశ్రమలో గేయ రచయితగా అడుగుపెట్టిన శ్యామ్.. రెండు దశాబ్దాల తరువాత జాతీయస్థాయిలో తన ప్రతిభను నిరూపించుకోవడం విశేషం. వంద సినిమాల్లో ఇప్పటి వరకు సుమారు 280కి పైగా పాటలు రాశారు. శ్రీకాంత్ హీరోగా 2009లో విడుదలైన మహాత్మా సినిమాలో శ్యామ్ రాసిన 'నీలపూరి గాజుల ఓ నీలవేణి' పాట మొదలు.. 2020లో అలా వైకుంఠపురం సినిమాలో 'రాములో రాములా..' పాటకు ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. అదే విధంగా 2022లో డీజే టిల్లు, 2023లో దసరా సినిమాలో 'చమ్కీలా అంగిలేసి' పాట ప్రేక్షక ఆదరణ పొందాయి. కృష్ణవంశీ, రాంగోపాల్‌వర్మ మొదలు అనేక మంది ప్రసిద్ధ దర్శకుల సినిమాల్లోనూ ఆయనకు అవకాశాలు వెతుక్కుంటూ వచ్చాయి.



హనుమకొండ బ్రాహ్మణవాడలో ప్రముఖ రంగస్థల నటుడుగా పేరొందిన మధుసూదన్‌రావు, మాధవి దంపతులకు జన్మించిన శ్యామ్ వరంగల్‌లో శంకర్, సారంగపాణి బృందంలో అనేక కార్యక్రమాలతోపాటు వినాయకచవితి వేడుకల్లో తన పాటలతో నగరవాసులను అలరింపజేశారు. చిన్నప్పటి నుంచే సాహిత్యం పట్ల అభిలాష ఉన్న శ్యామ్.. సినిమాల్లోకి రాకముందు 50 ఆల్బమ్స్ రూపొందించాడు. అందులో కాలేజీ పిల్ల చూడరో.. యమ ఖతర్నాక్ ఉందిరో.. అన్న ఓ జానపద ఆల్బం ఆ రోజుల్లోనే పెద్ద హిట్ అయ్యి శ్యామ్‌ను పరిశ్రమ వైపు దృష్టి మళ్లించేలా చేసింది. కిందటేడు సారంగి ఫిల్మ్ అవార్డుతోపాటు పలు స్వచ్ఛంద సంస్థలు, అనేక అవార్డులతో శ్యామ్‌ను సత్కరించాయి.

రేవంత్‌రెడ్డి డమ్మీ సీఎం

- ఢిల్లీ వెళ్లుడు.. కాంగ్రెస్ పెద్దల కాళ్లు మొక్కుడే ఆయన పని
- తెలంగాణ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెడుతున్నారు
- పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలి
- బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్సీ తక్కళ్లపెల్లి రవీందర్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తక్కళ్లపెల్లి రవీందర్‌రావు

హనుమకొండ టౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చలేక.. ప్రజలకు ముఖం చూపించలేక సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లుడు.. కాంగ్రెస్ పెద్దల కాళ్లు మొక్కుడు చేస్తున్నాడని ఎమ్మెల్సీ తక్కళ్లపెల్లి రవీందర్‌రావు విమర్శించారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఎమ్మెల్సీ రవీందర్‌రావు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడుతూ.. 2023 నవంబరులో బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుపై గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించిన 10 మంది ఎమ్మెల్యేల అంశంపై సుప్రీంకోర్టు గురువారం కీలక తీర్పునిచ్చిందన్నారు. ఏళ్ల తరబడి ఫిరాయింపు పిటీషన్లు పెండింగ్‌లో ఉంచడం సరికాదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ నేతృత్వంలోని అత్యున్నత ధర్మాసనం తెలిపిందని అన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలను ప్రజలు ఛీకొడుతున్నారని తెలిపారు. ఒక పార్టీ గుర్తుపై గెలిచి మరో పార్టీలో చేరిన ఎమ్మెల్యేల సభ్యత్వం వెంటనే రద్దు అయ్యేలా చట్టాన్ని మార్చాలని కోరారు. ప్రజలు నమ్మి కాంగ్రెస్‌ను గెలిపిస్తే ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని రవీందర్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ చేతుల్లోనే కాంగ్రెస్ పార్టీ రిమోట్ కంట్రోల్‌గా మారిందని అన్నారు. తెలంగాణలో మీనాక్షి నటరాజన్ రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరిస్తున్నారని, సెక్రటేరియేట్‌లో ప్రభుత్వ అధికార యంత్రాంగంతో సమీక్షలు జరపడానికి ఆమె ఎవరు అని ప్రశ్నించారు. సంగారెడ్డి ఫ్యాక్టరీ అగ్నిప్రమాదం ఘటనలో మంత్రులతో సమీక్ష చేయడంపై మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి డమ్మీ సీఎం అని లీడర్‌కు, క్యాడర్‌కు ఎప్పుడో తెలిసిపోయిందని అన్నారు. రేవంత్‌ను పక్కకు బెట్టి మీనాక్షినటరాజన్ తెలంగాణలో పాదయాత్రలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసంచేసి అమలు చేయలేక చేతులెత్తేసిన కాంగ్రెస్‌పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో తప్పకుండా బుద్ధి చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జనార్దన్‌గౌడ్, పులి రజినీకాంత్, బుద్దె వెంకన్న, కోడెపాక దేవమ్మ, పోలెపల్లి రాంమూర్తి, వీరేందర్, నయీమొద్దీన్, మహేందర్, మూటిక రాజు, రమేష్, శ్రీకాంతాచారి, సతీష్, గౌస్‌ఖాన్, రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల నాణ్యత ఇలాగేనా?

- వేలేరు బాలుర గురుకుల పాఠశాలలో కాంట్రాక్టర్‌పై కలెక్టర్ ఫైర్
- భోజనం నాణ్యతలో రాజీపడవద్దని ఆదేశం
- గురుకులం నిర్వహణ తీరుపై అసహనం

8



పాఠశాలలోని వంట గదినిలో సామాగ్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ స్నేహ శబరీష్

CUB
TRUST AND EXCELLENCE SINCE 1904

సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్
క్రెడిట్ రికవరీ మరియు మేనేజ్‌మెంట్ శాఖ
పరిపాలనా కార్యాలయము: నం. 24-B, గాంధీనగర్, కుంబకోణం - 612001. ఇ-మెయిల్ ID: crmd@cityunionbank.in
ఫోన్ : 0435-2432322, ఫ్యాక్స్ : 0435-2431746

SARFAESI చట్టం 2002 క్రింద రీ-టెండరు - సహిత - వేలం అమ్మకం ప్రకటన

రుణగ్రహీతలు/హామీదారులు నం.1)మెసర్స్ అన్నపూర్ణ ఎంటర్‌ప్రైజెస్ పి. నం.4-105-4, బాలాజీ నగర్, ఏనుమాముల, వరంగల్-506002. నం.2) శ్రీ ఎమ్.బొదకుంట్ల రవి శంకర్, తండ్రి ముత్తిలింగం, ఇం.నం.11-22-588, ప్రతాపరుద్ర వీధి, కాశిబుగ్గ, వరంగల్-506002. నం.3) శ్రీమతి బొదకుంట్ల శ్రీలత, భర్త బొదకుంట్ల రవి శంకర్, ఇం.నం.11-22-588, ప్రతాపరుద్ర వీధి, కాశిబుగ్గ, వరంగల్-506002. వారి నుండి 30.06.2025 నుండి చార్జి చేయబడే తదుపరి వడ్డీ, ఇతర ఖర్చులు, బకాయితో కలిపి 29.06.2025 నాటికి రూ.81,18,446/- (రూపాయలు ఎనభై ఒక్క లక్షల పద్దెనిమిది వేల నాలుగు వందల నలభై ఆరు మాత్రమే)లను రాబట్టుకొనుటకు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూలు 8(6) & 9 క్రింద, SARFAESI చట్టం 2002, క్రింద, సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్‌కు తనఖాపెట్టిన దిగువ ఆస్తి / ఆస్తులు బ్యాంక్ అధీకృత అధికారిచే రీ-టెండరు-సహిత-బహిరంగ వేలంలో విక్రయించబడును.

మా బ్యాంకుకు తనఖాపెట్టిన స్థిరాస్తి
షెడ్యూలు-E: (శ్రీ ఎం. బొదకుంట్ల రవి శంకర్, తండ్రి ముత్తిలింగంకు చెందిన ఆస్తి)
రిజిస్ట్రేషన్ జిల్లా వరంగల్ మరియు వరంగల్ (అర్బన్) సబ్ రిజిస్ట్రేషన్ పరిధిలో వరంగల్ మహానగర పాలక సంస్థ పరిధిలోని వరంగల్ అర్బన్ జిల్లా & మండలం, మట్టెవాడ రెవెన్యూ గ్రామం యొక్క సర్వే నం.526లో 1240.00 చ.గ.లులేదా సరిసమాన 1036.76 చ.మీ.ల విస్తీర్ణ ఖాళీ ప్లాట్ నం.లు 18,19,20,21,22 &23 యావత్తు. సరిహద్దులు: తూర్పు: 30 అడుగులు-0 అంగుళాల వెడల్పు రోడ్, పశ్చిమం: 30 అడుగులు-0 అంగుళాల వెడల్పు రోడ్. ఉత్తరం: ఖాళీ ప్లాట్ నం.లు 17 & 24. దక్షిణం: 40 అడుగులు-0 అంగుళాల వెడల్పు రోడ్డు.

రిజర్వు ధర: రూ. 1,35,00,000/-
(రూపాయలు ఒక కోటి ముప్పై ఐదు లక్షలు మాత్రమే)

రీ-వేలం వివరాలు	
రీ-టెండరు-సహిత-వేలం అమ్మకం తేది :	ప్రదేశం
25-08-2025	సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, వరంగల్ శాఖ, నం.9-10-2, జె.పి.ఎన్.రోడ్, వరంగల్-506002. టెలిఫోన్ నం. 0870-2421124, సెల్ నం. 9347205227

రీ-టెండరు-సహిత-వేలం అమ్మకం నియమ నిబంధనలు :
1. కాగోరు బిడ్డర్లు వేలంలో స్వయంగా పాల్గొనవలెను మరియు వ్యక్తిగతంగా పాల్గొనాలి మరియు అందుకు సంబంధించి అతని/ఆమె కొరకే అతను/ఆమె బిడ్డింగ్ వేస్తున్నట్లు వ్రాతపూర్వక ప్రకటన ఇవ్వవలసి ఉంటుంది. 2. కాగోరు బిడ్డర్లు ది మేనేజర్, సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, వరంగల్ శాఖ, నం.9-10-2, జె.పి.ఎన్.రోడ్, వరంగల్-506002 వారి నుండి టెండరు ఫారాలను పొందవచ్చును. 3. కాగోరు బిడ్డర్లు వారి బిడ్లను "సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్" పేరున తీసిన రిజర్వు ధరలో 10 శాతం బయానా కొరకు డిమాండ్ డ్రాఫ్ట్ / పే ఆర్డర్ రూపంలో ఉన్నదానితోపాటుగా ఇందులో తెలిపిన టెండరు-సహిత-వేలం అమ్మకం తేదీన ఉ.12.00 గం.కు లేదా అలోగా అధీకృత అధికారి, సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్ వారి చిరునామాకు సీల్డు ఎన్వలప్‌లలో నిర్దిష్టపరిచిన టెండరు ఫారంలో మాత్రమే వారి బిడ్లను దాఖలు చేయవలెను. 4. ఆస్తి తనిఖీ మరియు ఇతర వివరాల కొరకు కాగోరు కొనుగోలుదారు టెలిఫోన్ నం. 0870-2421124, సెల్ నం. 9347205227లను సంప్రదించవచ్చును. 5. ఆస్తి / ఆస్తులు "ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలా", "అక్కడ ఏది ఉన్నదో అది" మరియు "ఏది ఎక్కడ ఉంటే అదే" ప్రాతిపదికన విక్రయించబడతాయి. 6. ఇందులో తెలిపిన టెండరు-సహిత-వేలం అమ్మకం తేదీన మ.01.00 గం.కు కాగోరు బిడ్డర్ల సమక్షంలో సీల్డ్ టెండర్లు తెరవబడతాయి. అమ్మకం సాధారణంగా ముగింపు టెండర్ల రూపంలోనే ఉంటుంది. అధీకృత అధికారి అతని విచక్షణ మేరకు టెండరు ప్రక్రియ ముగింపు సమయంలో స్వీకరించబడిన దానికన్నా అత్యధిక బిడ్‌ను కోట్ చేయుటకు ఆసక్తి వ్యక్తం చేసిన బిడ్డర్ల మధ్య బహిరంగ వేలం నిర్వహించవచ్చును మరియు అటువంటి సందర్భంలో అత్యధిక బిడ్ వేసిన వ్యక్తికే అమ్మకం సంక్రమిస్తుంది. అయితే అమ్మకం సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్ నిర్ధారణకు లోబడి ఉంటుంది. 7. గెలుపొందిన బిడ్డరు అమ్మకం పూర్తయిన వెంటనే అమ్మకం మొత్తంలో 25% (చెల్లించిన బయానా కలిపి) చెల్లించాలి మరియు మిగిలిన 75% మొత్తమును అమ్మకం నిర్ధారణ తేదీ నుండి 15 రోజులలోగా చెల్లించాలి. లేనిచో ముందుగా డిపాజిట్ చేసిన 25% మొత్తం స్వాధీనం చేసుకొనబడుతుంది. 8. ఇందులో నిర్దిష్టపరచిన కాలపరిమితిలోగా మొత్తం అమ్మకపు ప్రతిఫలం అందుకున్న తరువాత మాత్రమే గెలుపొందిన కొనుగోలుదారు పేరు మీద అమ్మకం సర్టిఫికెట్‌ను అధీకృత అధికారి జారీ చేస్తారు. 9. చట్టం క్రింద వర్తించు విధంగా స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు వంటి ట్రాన్స్‌ఫర్ కొరకు చెల్లించాల్సిన చార్జీలు/ఫీజులు గెలుపొందిన కొనుగోలుదారు భరించవలసి ఉంటుంది. 10. ప్రభుత్వానికి, ప్రభుత్వ రంగ సంస్థలకు మరియు స్థానిక సంస్థలకు బకాయిలు ఉన్న ఏవేని చట్టబద్ధ బకాయిలు (న్యాయపరంగా ఇంటి పన్ను, విద్యుత్ చార్జీలు మరియు ఇతర బకాయిలు) TDS, GST గెలుపొందిన బిడ్డరే చెల్లించాలి. 11. ఎటువంటి కారణం తెలియజేయకుండా బిడ్లను అంగీకరించు లేదా తిరస్కరించు లేదా అమ్మకాన్ని వాయిదా వేయు లేదా రద్దు వేయు అన్ని అధికారాలు అధీకృత అధికారి కలిగి ఉన్నారు.

ప్రదేశం : కుంబకోణం, తేది : 31-07-2025
అధీకృత అధికారి

నమోదిత కార్యాలయం: 149, T.S.R. (Big) స్ట్రీట్, కుంబకోణం, తంజావూరు జిల్లా, తమిళనాడు-612001, CIN - L65110TN1904PLC001287
టెలిఫోన్ నం.0435-2402322, ఫ్యాక్స్:0435-2431746, వెబ్‌సైట్:www.cityunionbank.com

ఏషియా తైక్వాండో పోటీల్లో కాంస్య పథకం


కృష్ణవేణి

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మలేషియా దేశంలో జరిగిన ఏషియా పారా తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీల్లో పారా పూంసాయి ఇండియా ఉమెన్స్ సీనియర్ పీ-52 విభాగంలో మండలంలోని విశ్వనాథపురంనకు చెందిన మాచర్ల కృష్ణవేణి జూలై 31న మలేషియాలో జరిగిన పోటీల్లో కాంస్య పథకం సాధించింది. కృష్ణవేణి మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరిస్తున్న ప్రతీ ఒక్కరికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. పారా ఒలంపిక్స్‌లో బంగారు పథకం సాధించడమే లక్ష్యంగా కృషి చేస్తానని తెలిపారు.

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సులో బాలుడికి చోటు


ఏకాంబరానికి ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్

రఘునాథపల్లి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో రఘునాథపల్లి మండల కేంద్రానికి చెందిన ఆరేళ్ల బాలుడు రాజా ఏకాంబరం చోటు సంపా. దించుకున్నాడు. కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆ బాలుడికి శుక్రవారం కలెక్టరేట్‌లో ప్రశంసాపత్రం అందజేశారు. మండల కేంద్రానికి చెందిన పసునూరి సురేష్-రమ్య దంపతుల కుమారుడు రాజా ఏకాంబరం మండల కేంద్రలోని సెయింట్ మేరీస్ స్కూల్‌లో రెండో తరగతి చదువుతున్నాడు. హర్యానా రాష్ట్రానికి చెందిన ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ ఐబీఆర్ అచీవర్ పేరుతో గత నెలలో ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన క్విజ్ పోటీలో పాల్గొన్న ఏకాంబరం సంస్థ ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పి అబ్బురపరిచాడు. అతి పిన్న వయస్సులోనే ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకున్న రాజా ఏకాంబరంతో పాటు అతని తల్లిదండ్రులను స్కూల్ యాజమాన్యం, గ్రామస్థులు అభినందించారు.

రేపు పద్మశాలి వధూవరుల వివాహ పరిచయ వేదిక

హనుమకొండ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో 9వ రాష్ట్ర స్థాయి పద్మశాలి వధూవరుల వివాహ పరిచయ వేదిక 3న (ఆదివారం) మధ్యాహ్నం 1.30 గంటలకు వరంగల్ పోచమ్మమైదాన్ సమీపంలోని రత్న హోటల్‌కు ఎదురుగా గల హనుమాన్ గుడి వీధిలోని వరంగల్ జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్టు అసోసియేషన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కోడం రవిప్రకాశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. పద్మశాలి వధూవరుల పూర్తి వివరాలతో పాటు పాస్‌పోర్టు సైజ్‌ఫోటోతో హాజరుకావాలని కోరారు. వివరాలకు తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం కార్యాలయం కార్యదర్శి ములుక శ్రీనివాస్ సెల్‌నెంబర్ 9704360703లో సంప్రదించవలసిందిగా కోరారు.

బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్


బీసీ లేఖను విడుదల చేస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, తదితరులు

కేయూ క్యాంపస్ ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్‌రెడ్డి బీసీలకు ఇచ్చిన 42 శాతం రిజర్వేషన్లను అమలు జరిగే విధంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చొరవ తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం కేయూ దూరవిద్య కేంద్రంలోని జాఫర్ నిజాం సెమినార్ హాల్‌లో పూలే ఆశయ సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సంగాని మల్లేశ్వర్ నేతృత్వంలో బీసీ మేధావులు సదస్సు జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బీసీ 42 శాతం రిజర్వేషన్లను అమలుచేసి కేంద్రంలోని బీజేపీ పార్టీ తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని అన్నారు. అందుకు రాష్ట్రంలోని కేంద్రమంత్రులు బీజేపీ మంత్రులు, నేతలు ఢిల్లీలో ధర్నా చేయాలని అన్నారు. ఈనెల రెండోవారంలో బీసీ రిజర్వేషన్ల అమలు కోరుతూ కేంద్రంపై నిరసనలో భాగంగా సడక్‌బంద్ చేస్తామన్నారు. బీసీలకు బీఆర్ఎస్ అధ్యక్ష పదవిని ఇవ్వాలన్నారు.

ఈ సందర్భంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు చేయాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రాసిన లేఖలను ఆవిష్కరించారు. బీసీ యానిటీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చెలుమల్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. బీసీ భావజాల వ్యాప్తికి కార్యాచరణ రూపొందించమన్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ డాక్టర్ సంగాని మల్లేశ్వర్ మాట్లాడుతూ.. మూడు పార్టీలు బీసీలను రాజ్యాధికారంలో భాగస్వామ్యం చేయాలని అన్నారు. తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కూరపాటి వెంకట్ నారాయణ మాట్లాడుతూ.. బీసీల రిజర్వేషన్లకోసం ఐక్య ఉద్యమాలు చేస్తామని అన్నారు. కేయూ రిటైర్డు ప్రొఫెసర్ల సంఘం కార్యదర్శి ప్రొఫెసర్ వడ్డె రవీందర్ మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్లు సాధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నేతలు బైరి రవికృష్ణ, పాస్ రాష్ట్ర కార్యదర్శి చందా మల్లయ్య, పాస్‌జిల్లా అధ్యక్షుడు టి.శాస్త్రి, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణు గోపాల్‌గౌడ్, నల్లాని శ్రీనివాస్, బాబుయాదవ్, డాక్టర్ తిరుణహరి శేషు, విజయబాబు, కట్ల రాజేందర్, స్వర్ణలత, రాధికారాణి, సుజాత, గడ్డం కృష్ణ, నాగయ్య, బ్రహ్మయ్య, అరగొంటి నాగరాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు. సదస్సు ప్రారంభంలో పూలే దంపతుల విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు.

ఇద్దరికీ ఒకటే ఆధార్ నెంబర్

- ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు బాలురకు కేటాయింపు
- ఇబ్బందులు పడుతున్న రెండు కుటుంబాలు



మనుబోతుల ధనుష్ ఆధార్ కార్డు, కత్తెరపెల్లి శివ ఆధార్ కార్డు

నల్లబెల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లపహాడ్ గ్రామంలో ఇద్దరు బాలురకు ఒకే ఆధార్ నెంబర్ వచ్చింది. పేర్లు వేర్వేరుగా ఉన్నా ఆధార్ నెంబర్ ఒకటే రావడంతో చిన్నారుల ఇబ్బందులు పడుతున్నామని కుటుంబసభ్యులు మనుబోతుల సుమన్, కత్తెరపెల్లి బాబు శుక్రవారం తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం..

గుండ్లపహాడ్ గ్రామానికి చెందిన మనుబోతుల సుమన్ కుమారుడు మనుబోతుల ధనుష్, కత్తెరపెల్లి బాబు కుమారుడు కత్తెరపెల్లి శివల పేర్లతో ఒకే ఆధార్ నెంబర్ 3996 7128 3843 వచ్చింది. ఈ క్రమంలో తమ కుమారులను స్కూల్లో జాయిన్ చేసినప్పుడు ఉపాధ్యాయుడు ఆధార్ కార్డును పరిశీలించగా, ఇద్దరి పేర్లతో ఆధార్ నెంబరు ఒకటే చూపిస్తోందన్నారు. ప్రస్తుతం మనుబోతుల ధనుష్ 4వ తరగతి, కత్తెరపెల్లి శివ 5వ తరగతి చదువుతున్నారు. వీరి ఇద్దరి పేర్లతో ఒకే ఆధార్ నెంబర్ ఎలా వచ్చిందో అర్థం కావడం లేదన్నారు. కానీ, ఇద్దరి ఆధార్ ఓటీపీలు మాత్రం కత్తెరపెల్లి బాబు ఫోన్ నెంబర్‌కు వస్తోంది. అయితే ఈ విషయమై అధికారులను కలిసి విన్నవించినా , ఆధార్ సెంటర్లకు వెళ్లినా ఫలితం లేదన్నారు. కాగా, తమ కుమారుల ఇద్దరి ఆధార్ కార్డులను పరిశీలించి వేరు, వేరు ఆధార్ నెంబర్ కార్డులను ఇవ్వాలని సంబంధిత శాఖను వారు కోరారు.

చర్లపల్లి - పాట్నా వీక్లీ స్పెషల్ రైలు పొడిగింపు

కాజీపేట, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): రైల్వే ప్రయాణికుల రద్దీ దృష్ట్యా చర్లపల్లి - పాట్నా మధ్య నడిచే స్పెషల్ వీక్లీ రైళ్లను పొడిగించి (స్టేషన్ల సంఖ్య పెంపు) నడుపుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. (03253) పాట్నా - చర్లపల్లి మధ్య నడిచే వీక్లీ స్పెషల్ రైలు సోమ, బుధవారాల్లో ఈ నెల 4 నుంచి 29 వరకు జహనాబాద్ వరకు పొడిగించి నడిపిస్తున్నట్లు చెప్పారు. (07255) చర్లపల్లి - పాట్నా మధ్య నడిచే వీక్లీ ఎక్స్‌ప్రెస్ ప్రతీ బుధవారాల్లో ఈ నెల 6 నుంచి సెప్టెంబరు 1 వరకు పొడగించి నడిపించనున్నారు. (07256) చర్లపల్లి - పాట్నా మధ్య ప్రతీ శుక్రవారం నడిచే ఈ వీక్లి స్పెషల్ రైలు ఈ నెల 8 నుంచి 26 వరకు పొడిగించి నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు చెప్పారు. ఈ రైలు సికింద్రాబాద్, కాజీపేట, పెద్దపల్లి, బెల్లంపల్లి, సిర్పూర్‌కాగజ్‌నగర్, బల్లార్షా నాగపూర్, గోండియా, దర్గ్, రాయ్‌పూర్, బిలాస్‌పూర్, జార్సీగూడ, రౌర్కెలా, హాతియా, రాంచి, బొకారో, గోమో, కొడెర్మా, జయా, జెహనాబాద్, రైల్వేస్టేషన్‌లలో హాల్టింగ్ సౌకర్యం కల్పించినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

యోగా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

వడ్డెపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): యోగా కోర్సుల శిక్షణకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రముఖ యోగా మాస్టర్ అంజనేయులు తెలిపారు. హ్యాపీ లివింగ్ యోగా అండ్ వెల్‌నెస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఒక సంవత్సరం వ్యవధిలో నిర్వహించే యోగా డిప్లొమా కోర్సుకు ఇంటర్మీడియేట్ / డిగ్రీ, ఆర్నెళ్ల వ్యవధిలో నిర్వహించే యోగా సర్టిఫికెట్ కోర్సుకు ఎస్సెస్సీ అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. యోగాసన స్పోర్ట్స్ ఏషియన్ గోల్డ్ మెడలిస్టు నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో అడ్వాన్స్ ఆసనాలు నేర్పడం జరుగుతుందని తెలిపారు. తమ వద్ద యోగా శిక్షణ పొందిన అభ్యర్థులకు కాకతీయ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ప్రామాణిక సర్టిఫికెట్లను ప్రదానం చేస్తామని తెలిపారు. వివరాలకు సెల్ నంబర్ :95534 89862 లో సంప్రదించాలని ఆయన కోరారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నాం : మంత్రి సీతక్క


ఓటాయిలో మహిళలతో కలిసి నృత్యం చేస్తున్న మంత్రి సీతక్క

కొత్తగూడ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమమే ప్రభుత్వం ధ్యేయమని అందులో భాగంగానే ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు ఇస్తున్నామని, దేశంలో తెలంగాణలో మాత్రమే సన్నబియ్యం ఇస్తున్నామని పంచాయతీ రాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో మహబూబాబాద్ జిల్లా 3స్థానంలో ఉందని పేర్కొన్నారు. కొత్తగూడ మండలంలో శుక్రవారం మంత్రి సీతక్క పర్యటించారు. మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు 649 నూతన రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వనమహోత్సవంలో మంత్రి సీతక్క మొక్కను నాటారు. బూరుగు గుంపులో సబ్ సెంటర్‌ను, మొండ్రాయిగూడెంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని, ఓటాయి పొగుళ్లపల్లి మధ్య నిర్మించిన వంతెనను ప్రారంభించారు. ఓటాయిలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. రైతువేదికలో నిర్వహించిన సమావేశంలో సీతక్క మాట్లాడుతూ గత పదేళ్లుగా పేదలు రేషన్‌కార్డుల కోసం, ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎదురుచూశారని పేర్కొన్నారు.

నాడు భయపెట్టి పార్టీలో చేర్చుకున్నారు

నాడు బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఇతర పార్టీల ఎమ్మెల్యేలను కేసులు పెడుతామని భయపెట్టి, బీఆర్ఎస్ పార్టీలో చేర్చుకున్నారు... నేడు కాంగ్రెస్ పార్టీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే చేరితే భయపడుతున్నారని మంత్రి సీతక్క ఎద్దేవాచేశారు. గుంజేడులో విలేకరులతో మాట్లాడుతూ నాడు లేని కోర్టులు, చట్టాలు నేడు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం స్పీకర్ నిర్ణయం మేరకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంటుందని పేర్కోన్నారు.

నైపుణ్యం పెంచేందుకే డ్యూటీ మీట్‌లు

పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

నేడు ముగింపు.. హాజరుకానున్న డీజీపీ

మామునూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పోలీసులలో నైపుణ్యం పెంచేందుకు పోలీస్ డ్యూటీ మీట్‌లు దోహదపడతాయని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. మామునూరు పీటీసీలో శుక్రవారం రెండో రోజు పోలీస్ డ్యూటీ మీట్ వేడుకలు అట్టహాసంగా కొనసాగాయి.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్యూటీ మీట్‌లో భాగంగా బాంబ్ డిస్పోజ్, కంప్యూటర్, వీడియోగ్రఫీ, సైంటిఫిక్ ఎయిడ్ విభాగాల్లో పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. అదేవిధంగా పోలీస్ జాగిలాలలకు సైతం నాలుగు విభాగాల్లో తర్ఫీదు ఇచ్చామన్నారు. ఈ డ్యూటీ మీట్ ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించిన అదనపు డీసీపీలు రవి, సురేష్‌కుమార్, శ్రీనివాస్‌లతో పాటు ఇతర పోలీస్ అధికారులను సీపీ సన్ ప్రీత్ సింగ్ అభినందించారు. పోలీస్ డ్యూటీ మీట్ వేడుకలు శనివారం సాయంత్రం ముగుస్తాయని సీపీ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. ముఖ్యఅతిథిగా డీజీపీ జితేందర్, విశిష్ట అతిథిగా జైళ్ల విభాగం డీజీపీ సౌమ్య మిశ్రా హాజరవుతారని సీపీ వెల్లడించారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

పాలకుర్తి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి) : ఈనెల 3, 4 తేదీల్లో హన్మకొండలోని జేఎన్ఎస్‌లో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు పాలకుర్తి జెడ్పీఉన్నత పాఠశాల విద్యార్థి దరావత్ గాయత్రి ఎంపికైందని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ ఇటీవల జనగామలోని ధర్మకంచ మినీ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో గాయత్రి 16 ఏళ్ల విభాగంలో 60 మీటర్ల దూరం పరుగు పందెంలో పాల్గొని ప్రతిభ కనబరచడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందని తెలిపారు. రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన గాయత్రిని పీడీ మామిండ్ల సోంమల్లు, ఉపాధ్యాయులు రమేష్, బలంరాం, అశోక్, రవి, మరియా, జత్రుత, వెంకన్న అభినందించారు.

మహిళను హత్యచేసిన కేసులో వ్యక్తికి జీవిత ఖైదు

వరంగల్ లీగల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకోమని ఒత్తిడి చేసినందుకు మహిళపై కిరోసిన్ పోసి నిప్పంటించి హత్య చేసిన కేసులో నేరం రుజువైనందున ఒకరికి యావజ్జీవ కఠినకారాగారా శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ వరంగల్ జిల్లా రెండో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి మనిషా శ్రావన్ ఉన్నమ్ శుక్రవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ జిల్లా రంగశాయిపేటకు చెందిన సింగారపు పార్వతి.. తన భర్త చనిపోవడంతో రంగశాయిపేటలోని తన చెల్లెలైన కొండేటి భారతి ఇంట్లో నివాసం ఉంటున్నది. కాగా, మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం జమస్తాపూర్ గ్రామానికి చెందిన చిన్నపాక అనిల్ డ్రైవర్‌గా పనిచేస్తూ ఆమె ఇంటిపక్కన ఇంట్లో ఉంటున్నాడు. ఈ క్రమంలో ఇద్దరికి పరిచయం కావడంతో వివాహేతర సంబంధానికి దారితీసింది. దీంతో భారతి తనను పెళ్లి చేసుకోవాలని అడగడంతో గొడవలు ప్రారంభమయ్యాయి.

ఇదిలా ఉండగా, 2015 జూన్ 7న రాత్రి 7.30 గంటలకు అనిల్ ఆమె ఇంటికి రాగా.. పెళ్లి చేసుకోవాలని బలవంతం చేసింది. దీంతో ఆవేశంతో నీవు చస్తేనే నా జీవితం సాఫీగా సాగుతుందని ఇంట్లో ఉన్న కిరోసిన్ డబ్బా తీసి ఆమెపై పోసి నిప్పంటించాడు. మృతురాలి కేకలు విన్న చుట్టు పక్కల వాళ్లు మంటలను ఆర్పి ఎంజీఎంకు తరలించారు. విషయం తెలుసుకున్న మృతురాలి సోదరుడు కందుకూరి వెంకన్న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నిందితుడు చిన్నపాక అనిల్‌పై హత్యానేరం నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువైందున జీవిత ఖైదు, రూ.10 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కోర్టు పీసీ ఎ.సోమునాయక్ సాక్షులను ప్రవేశపెట్టగా సీఐలు ఆర్.సంతోష్, ఎస్.శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేశారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ టి.సంతోషిని కేసు వాదించారు.

ఇంజనీరింగ్ విభాగంలో అంతర్గత బదిలీలు

వరంగల్ కార్పొరేషన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలోని హనుమకొండ నక్కలగుట్ట, కాశిబుగ్గ, కాజీపేట సర్కిల్ కార్యాలయాల్లో పని చేస్తున్న ఇంజనీరింగ్ అధికారులకు శుక్రవారం కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అంతర్గత బదిలీలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కాశిబుగ్గ సర్కిల్‌లో పనిచేసిన ఈఈ శ్రీనివాస్ జూలై 31న ఉద్యోగ విరమణ పొందడంతో ఖాళీని భర్తీ చేసేందుకు పలువురు ఇంజనీర్లకు స్థానచలనం కల్పించినట్టు తెలిసింది. ఇన్‌చార్జి ఎస్ఈ మహేందర్ పర్యవేక్షణలో ఈ బదిలీల ప్రక్రియ నిర్వర్తించారు. నక్కలగుట్ట సర్కిల్ ఈఈగా రవికుమార్, డిప్యూటీ ఈఈగా రాజ్‌కుమార్‌లతో పాటు పలు సర్కిళ్ల డీఈలు, ఏఈలను బదిలీ చేస్తూ డివిజన్‌లు, విభాగాలు కేటాయించారు. అదే విధంగా కాశిబుగ్గ, నక్కలగుట్ట, హనుమకొండ, క్వాలిటీ కంట్రోల్ సెంటర్, ఎలక్ట్రికల్, వెహికిల్స్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, డ్రాయింగ్ బ్రాంచ్, వాటర్ సప్లయ్ విభాగాలలో పని చేస్తున్న వారిని ఇతర విభాగాలు, ఇతర సర్కిళ్లకు బదిలీ చేస్తూ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.

కాగా, గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్‌కు ఆదాయ మార్గాన్ని అందించే బాలసముద్రంలోని క్వాలిటీ కంట్రోల్ సెక్షన్‌లో పని చేస్తున్న ఓ అధికారిని బదిలీ చేయకుండా అక్కడే చాలా కాలంగా కొనసాగించడం అనుమానాలకు తావిస్తోంది. పెద్ద ఎత్తున అధికారులను, ప్రజాప్రతినిధులను తడిపితే తప్ప క్యాసీకి పోస్టింగ్, బదిలీ కాదని, సదరు అధికారి ప్రస్తుతం జరిగిన బదిలీలలో సైతం బదిలీ కాకపోవడంతో అనుమానాలకు తావిస్తోంది. అదే విధంగా ఒక స్థానంలో పనిచేస్తున్న అధికారికి పదోన్నతి లభించిన తర్వాత ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లవలసి ఉంటుంది. కానీ జీడబ్ల్యూఎంసీలో పనిచేస్తున్న కొందరు ఇంజనీర్లు ఏఈ పోస్టుల్లో భర్తీ జరిగినప్పటి నుంచి ఈఈ స్థాయిలో రిటైడ్ అయ్యే వరకు ఇక్కడే పైసా, పలుకుబడితో విధులు నిర్వర్తిస్తూ అందిన కాడికి దండుకుంటున్నట్టు ప్రచారం ఉంది. ప్రస్తుతం గ్రేటర్ ఇంజనీరింగ్ విభాగంలో బదిలీలు నిర్వహించిన కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ పుణపరిశీలన చేసి అడ్డదారిలో ఇక్కడ పని చేసే వారిని ప్రక్షాళన చేయాలని తోటి సిబ్బంది డిమాండ్ చేస్తున్నారు.

ఇసుక లారీల అసోషియేషన్ ఆందోళన



విజిలెన్స్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఇసుక లారీ అసోసియేషన్ నాయకులు

వరంగల్ క్రైం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): టీజీఎండీసీ ఇసుక రీచ్‌లపై చర్యలు తీసుకోవడం మాని లారీలను సీజ్ చేయడంపై తెలంగాణ ఇసుక లారీల యాజమనుల సంఘం అసహనం వ్యక్తం చేసింది. ఈ మేరకు నాయకులు ఆధ్వర్యంలో శుక్రవారం వరంగల్ ఆర్టీఏ, విజిలెన్స్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ మాట్లాడుతూ.. కరీంనగర్ తాడిచెర్ల ఇసుక రీచ్‌లో లోడ్ అయిన లారీలకు టీజీఎండీసీ తూకం వేయడంతో 16 టైర్ల లారీలో 49 టన్నులు తూకం వచ్చిందన్నారు.

కాగా, కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు తరలి వెళ్లతున్న లారీలను వరంగల్ విజిలెన్స్ అధికారులు గురువారం రాత్రి ఆపి తనిఖీ చేయగా 50 టన్నుల 200 క్వింటాళ్ల తూకం వచ్చిందన్నారు. తూకం విషయంలో టీజీఎండీసీని బాధ్యులను చేయా ల్సిందిపోయి లారీలను నిలిపివేయడంపై మండిపడ్డారు. టీజీఎండీసీ ద్వారా లీగల్‌గా ఇసుక రవాణా చేస్తున్న తమపై అక్రమంగా కేసులు నమోదు చేయడంపై ఆవేదన వ్యక్తం చేశారు. లారీలపై వేసిన జరిమానాను వెంటనే తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ లారీ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ నాయుడు, అసోసియేషన్ సభ్యులు జంగారెడ్డి, సత్తయ్య, శంకర్, శశీ, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

మాలేగావ్ పేలుళ్ల తీర్పు న్యాయానికే అపహాస్యం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు


మాట్లాడుతున్న సుదర్శన్‌రావు

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): మాలేగావ్ పేలుళ్లలో ఆరోపణలు ఎదుర్కొంటున్న బీజేపీ మాజీ ఎంపీ ప్రజ్ఞాసింగ్ ఠాకూర్, పూ ర్వపు ఆర్మీ అధికారి కల్నల్ ప్రసాద్ పురోహిత్‌లతో పాటు పలువురిని సరైన సాక్ష్యాధారాలు, విధానపర లోపాలున్నాయనే సాకుతో విడుదల చేయ డం న్యాయాన్ని అపహాస్యం చేసినట్లుగా ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు ధ్వజమెత్తారు. శుక్రవారం హనుమ కొండ రాంనగర్‌లోని సుందరయ్య భవన్‌లో బొట్ల చక్రపాణి అధ్యక్షతన ఏర్పాటు చేసిన పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో సుదర్శన్‌రావు పాల్గొని మాట్లాడారు. మాలేగావ్ పేలుళ్లలో ఆరుగురు అమాయకులు మృతిచెందడంతో పాటు దాదాపు వందమందికి పైగా గాయపడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా ముస్లిం కమ్యూనిటీలో ఒక వర్గాన్ని భయభ్రాంతులకు గురి చేస్తూ కుట్రదారులు నేరానికి పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. మతపరమైన ఉద్రిక్తతలు సృష్టించి, దేశ అంతర్గత భద్రతకు ముప్పుగా పరిణమించారని పేర్కొంటూ వారికి తగినశిక్ష వేయాలని జాతీయ దర్యాప్తు సంస్థ కోరిందన్నారు.

పేలుళ్ల నిందితులకు ఆర్ఎస్ఎస్, బీజేపీ అన్ని రకా లుగా మద్దతిచ్చి ఆదుకుందన్నారు. ఏ హిందువు ఉగ్రవాది కాలేదని పార్ల మెంట్‌లో హోంశాఖ మంత్రి అమిత్‌షా ప్రకటన చేసిన మరుసటి రోజే ఈ తీర్పు వెలువడటంలో అంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ నేరం తీవ్రతను పరిగణలోకి తీసుకొని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కోర్టు నిర్ణయాన్ని అప్పీల్ చేయాలని పోతినేని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి. జిల్లా కమిటీ సభ్యులు ఎం.చుక్కయ్య, టి.ఉప్పలయ్య, రమేష్, గొడుగు వెంకట్, వాంకుడోతు వీరన్న, జి.రా ములు, కాడబోయిన లింగయ్య, వేలు రజిత పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి Classifieds

WANTED
★ Multinational Company Part Time/Full Time Work Training/ Support Given. Contact.No: 81061 44217
AJW-243110

WANTED
★ Wanted English & Arithmetic Faculty to work for reputed Institution Contact. No : 9676481370
AJW-243236

WANTED
★ హస్పిటల్‌లో పని చేయుటకు PRO's అయాలు, స్విపర్స్ మరియు Beautician & Body Massage హన్మకొండ, కాకాజీ కాలనీ.సం॥ప్ర॥ 9989510003
AJW-243229

WANTED
★ హన్మకొండ స్వచ్ఛంద సంస్థలో హాస్టల్ నందు వంట చేయుటకు భార్యాభర్తలు కావలెను. ఉచిత వసతి+భోజనం మరియు జీతం కల్పించబడును. సం॥ప్ర॥ 8074465703, 9849038142
AJW-420

WANTED
★ హన్మకొండ, వరంగల్ లోకల్‌లో పనిచేయుటకు టెలికాలర్స్ మరియు రిసెప్షనిస్ట్, సిస్టమ్ ఆపరేటింగ్ అర్జెంటుగా కావలెను. జీతం : 8,000/- 10,000/- సం॥ప్ర॥ 9000463426
AJW-243232

WANTED
★ హన్మకొండ, వరంగల్ లోకల్‌లో పనిచేయుటకు సెక్యూరిటి గార్డ్స్ మరియు సూపర్‌వైజర్స్ అర్జెంటుగా కావలెను. జీతం : 12,000/-, 15,000/-. సం॥ప్ర॥ 9666336163
AJW-243233

WANTED
★ హనుమకొండలో మా సంస్థ యందు పనిచేయుటకు 3 వీలర్ ఆటో డ్రైవర్ మరియు సప్లయ్ బాయ్ కావలెను. మంచి వేతనం ఇవ్వబడును. సంప్రదించ వలసిన నెంబర్. : 9666717040.
AJM-13814

WANTED
★ డాక్టర్ నరేష్ ఆర్థ్రైటిస్ మరియు రుమటిజం సెంటర్ O.Pలో పనిచేయుటకు అనుభవం ఉన్న స్టాఫ్‌నర్స్ (GNM) కావలెను.లష్కర్ బజార్, Govt B.Ed. కాలేజ్ ఎదురుగా, హన్మకొండ. సం॥ప్ర॥ 9167231111
AJW-243106

వెంటనే కావలెను
★ మా సెక్యూరిటీ సంస్థ నందు పనిచేయుటకు ఆఫీస్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్ మరియు సెక్యూరిటీ గార్డ్స్ వెంటనే రావలెను. జీతం : 10,000 నుండి 15,000 + ESI, EPF.Cont : 8978459111
AJW-542

PLOT FOR SALE
★ జనగామ దగ్గరలోని ఫామ్ ల్యాండ్ వెంచర్ లో కేవలం 2,80,000/- కే ఒక గుంట ప్లాట్లు అమ్మబడను. సం॥ప్ర॥ 8143377119
AJW-243234

FLAT FOR SALE
★ హన్మకొండ అశోక కాలనీ 120 చ॥గజాల రోడ్ Face కి 36 X 30 South Face ఫ్లాట్లు అమ్మబడును. సంప్రదించండి 7989320200.
AJW-237250

FLATS FOR SALE
★ Ready to Occupy 1BHK, 2BHK, 3BHK Flats with all Facilities are for sale @ 941 Sqft to 1914 Sqft with Reasonable Prices at Vikas Nagar & Basit Nagar HNK. Cell.No: 8897221187, 9177592357.
AJW-243109

TO-LET
★ హంటర్ రోడ్ జూపార్క్ గేట్ ఎదుట 60 ఫీట్ల రోడ్‌లో E/F ఇండిపెండెంట్ 2BHK Ground Floor Tap Water బోర్ వాటర్ గలది. హస్పిటల్స్, ఆఫీస్‌లకు, Employes ఫ్యామిలీస్‌కు 2 కార్ల పార్కింగ్ కలదు. ఇల్లు కిరాయి ఇవ్వబడును. సం॥ప్ర॥ 9390104509
AJW-243235

SHOP FOR RENT
★ ఇ.నెం.2-1-315 కేయూ నుండి కాజీపేట, 100 ఫీట్ల మెయిన్ రోడ్, సమ్మయ్య నగర్ బస్టాప్ దగ్గర 24×65 చ॥అ॥ గల షటర్స్ (2) కిరాయికి ఇవ్వబడును. సం॥ప్ర॥ 9849432679
AJW-6639

BUSINESS OFFER
★ నెట్‌వర్క్ లీడర్స్‌కు మంచి అవకాశం నూతనంగా స్టార్ట్ అయిన మల్టీపుల్ ప్రొడక్ట్ బేస్డ్ కంపెనీలో టీమ్ వర్క్ ద్వారా డబ్బులు సంపాదించుకునే అవకాశం. సెల్:9948238050
AJH-222873

ప్రకటనల కొరకు సంప్రదించండి
హన్మకొండ
9985400013
8978510273
9985411677
వరంగల్
9985406150
9985408173
జనగామ
9866431354
మహబూబాబాద్
9985418040
తొర్రూర్
9985418040
నర్సంపేట
9985418040
భూపాలపల్లి
9985401232
పరకాల
9985401232

ప్రతి నాలుగు లైన్ల క్లాసిఫైడ్ ప్రకటనకు రూ. 250/- మాత్రమే. అదనపు లైనుకు రూ. 45/-
గమనిక : మీరు ఇచ్చే ప్రతీ ప్రకటనలకు 5% GST అదనంగా చెల్లించవలెను.

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవీటి

ఆర్‌ఐలా ? వసూల్ రాజాలా ?

- జీడబ్ల్యూఎంసీలో లంచావతారులు
- పావులుగా మారుతున్న వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లు
- ఒక్కో మ్యుటేషన్‌కు రూ.లక్షల్లో వసూళ్లు
- అడిగింది ఇవ్వకపోతే కొర్రీలు
- ఆర్‌ఐల తీరును పట్టించుకోని అధికారులు



వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ)లో కొందరు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు డబ్బులు ఇవ్వనిదే పని చేయరనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు, పాలకవర్గం చూసీ చూడనట్టు వ్యవహరిస్తుండడం అనుమానాలకు తావిస్తోంది. 11 మంది ఆర్‌ఐలలో కొందరు పని చేస్తున్న స్థానంలో మూడు సంవత్సరాలకు మించి పని చేస్తున్నా అదే స్థానంలో స్థిరంగా ఉండేందుకు ప్రజాప్రతినిధులకు డబ్బులిచ్చి మరీ రెన్యువల్ చేసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఇదంతా బల్దియా ఉన్నతాధికారులు, పాలకవర్గం కనుసన్నల్లోనే వీరు పని చేస్తున్నట్లు బాహాటంగానే చర్చ జరుగుతుంది. గ్రేటర్ పరిధిలో జూనియర్ అసిస్టెంట్ స్థాయిలో కార్యాలయాల్లో పని చేయాల్సిన వీరు అడ్డదారిలో వచ్చే డబ్బులకు రుచి మరిగి యథా స్థానాల్లోనే తిష్ట వేసి అందిన కాడికి దండుకుంటున్నట్లు విశ్వసనీయ సమాచారం. కొందరు ఆర్‌ఐలు తక్కువ కాలంలోనే విలాసవంతమైన ఇళ్లు, భారీగా బ్యాంకు బ్యాలెన్స్ కూడబెట్టినట్టు తెలుస్తోంది. బల్దియా కార్యాలయంతో పాటు కాశిబుగ్గ, కాజీపేట సర్కిల్ కార్యాలయాల్లో అర్హత కలిగిన సిబ్బందికి ఆర్‌ఐలుగా అవకాశం ఇవ్వకుండా ఓ సెక్షన్ అధికారి అక్రమార్కులను ప్రోత్సహిస్తూ గడువు దాటినా ఇంకా కొనసాగించడం వెనుక అంతర్యమేమిటని అనుమానాలు రేకెత్తుతున్నాయి. పాత ఆర్‌ఐలను తొలగించి కొత్త వారికి అవకాశం ఇవ్వాలని డిమాండ్ వినిపిస్తుంది.

గ్రేటర్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లా.. మజాకా

గ్రేటర్ పరిధిలోని 66 డివిజన్లలో ప్రజలు ఆన్‌లైన్‌లో ఇంటి నెంబర్ల జారీ (అసెస్‌మెంట్) పాత మ్యుటేషన్లు, ఇంటి పన్నుల వసూలు, ప్రభుత్వ సర్వేలు నిర్వహించాలి. కానీ వారు నిర్వహించే అన్ని డ్యూటీలను వదిలి అడ్డదారిలో వచ్చే అసెస్‌మెంట్‌పై ఎక్కువ మక్కువ చూపుతున్నట్లు తెలుస్తోంది. కాగా మిగతా డ్యూటీలను కింది స్థాయి బిల్ కలెక్టర్లు, వార్డ్ ఆఫీసర్ల ద్వారా చేయిస్తున్నారు. కొందరు ఆర్‌ఐలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వారి వద్ద పని చేస్తున్న బిల్ కలెక్టర్లు, కొత్త వార్డు అధికారులను పావులుగా వాడుకుంటూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇటీవల ఇద్దరు ఆర్‌ఐలు ఫోన్ పే చేయించుకుని ఫిర్యాదుదారులకు అడ్డంగా దొరికిపోయినట్లు తెలిసింది. వరంగల్ విలీన గ్రామాలకు చెందిన ఓ ఆర్‌ఐ ఓ వ్యక్తి నుంచి రూ. 20 వేలు ఫోన్‌పే చేయించుకుని ఇంటి నెంబర్ ఇవ్వకుండా ముప్పుతిప్పలు పెట్టినట్టు బాధితులు తెలిపారు. అన్నదమ్ముల ఆస్తుల బైవెరిఫికేషన్ చేసేందుకు ఓ ఆర్‌ఐ మధ్యవర్తి ద్వారా ఏకంగా రూ. 1 లక్ష డిమాండ్ చేసి రూ. 50 వేలు తీసుకుని పని చేసినట్లు తెలిసింది. ఓ మహిళా ఆర్‌ఐ పెద్ద మొత్తంలో డబ్బులు దండుకుని ఒకే ఇంటికి రెండు నెంబర్లు జారీ చేసి చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు అధికారులు చుట్టు తిరిగినట్లు తెలిసింది. కొందరు బిల్ కలెక్టర్లు ఆన్‌లైన్ పేమెంట్‌తో పాటు అదనంగా లంచం ఇచ్చిన ఇంటి నెంబర్ ఇస్తున్నట్లు తెలిసింది. పని కోసం లంచం తీసుకుని కొర్రీలు పెడుతుండడంతో కొందరు బాధితులు గ్రేటర్ ప్రజావాణిలో ఫిర్యాదులు చేయడం గమనార్హం. చాలాకాలంగా కొందరు ఆర్‌ఐలు ప్రభుత్వ ఔట్‌సోర్సింగ్ బిల్ కలెక్టర్లను ఏర్పాటు చేసుకుని అక్రమ సంపాదనకు తెరలేపి కోట్లు కొల్లగొట్టినట్లు సమాచారం. ఇదంతా బల్దియా ఉన్నతాధికారులకు తెలియదా ? అంటే ప్రతీ నెల ఇచ్చే మామూళ్లతో నిద్రమత్తు నటిస్తున్నట్టు ప్రచారం జరుగుతుంది.

అవీ.. ఇవీ లేవంటూ ఆఫీస్ చుట్టూ తిప్పిస్తూ..

వరంగల్ నగర పరిధిలో 11 మంది రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పని చేస్తున్నారు. వారి వద్ద డివిజన్ల పరిధిని బట్టి 5 నుంచి 8 మంది బిల్ కలెక్టర్లు, వార్డ్ అధికారులు పని చేస్తున్నారు. ప్రస్తుతం నగరంలో 66 మంది బిల్ కలెక్టర్లు పని చేస్తుండగా ఇటీవల కొత్తగా కార్పొరేషన్‌కు కేటాయించిన గ్రూప్ -4 అధికారులను సైతం వార్డు అధికారులుగా నియమించారు. యజమానుల పేరు మార్పు, బైవెరిఫికేషన్, కొత్త ఇంటి నెంబర్లు, వీఎల్‌టీ (వెకెట్ ల్యాండ్ ట్యాక్స్) తదితర పనులు చేసేందుకు నియమించారు. ఇందుకు ప్రజలు ఆన్‌లైన్ ద్వారా వారికి అవసరం ఉన్న పనిని బట్టి చలానా ద్వారా డబ్బులు చెల్లించి పని కోసం ఎదురు చూస్తుంటారు. కానీ కొందరు ఆర్‌ఐలు చేయి తడపనిదే పని చేయబోమని మొండికేస్తున్నారు. దరఖాస్తు పత్రాలు సరిగా లేవని కొర్రీలు పెడుతున్నారు. కొందరు ఆర్‌ఐలు చేతికి మట్టి అంటకుండా బిల్ కలెక్టర్లను రంగంలోకి దింపి దరఖాస్తుదారులకు నేరుగా ఫోన్ చేయిస్తున్నారు. ఫలానా దరఖాస్తు ప్లాన్‌లో తప్పులున్నాయి.. డాక్యుమెంట్లు సరిగా లేవని, హద్దులు సరిగా లేవని, రోడ్డు వెడల్పు సరిగా లేదని, కుటుంబ సభ్యుల నుంచి ఎన్‌వోసీ తేవాలని ప్రశ్నల వర్షం కురిపిస్తూ దరఖాస్తు రద్దు చేస్తున్నారు. మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని ఉచిత సలహా ఇస్తున్నారు. ఇలా డబ్బులు ఇచ్చే వరకు పట్టి పీడిస్తున్నారు. పని చేయకుండా కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారు. డబ్బులు ఇస్తాము పని చేయండి బాబోయ్.. అనే వరకు తిప్పుకుంటారు. ఇలా ఇంటి నెంబర్‌కు కనీసం రూ. 50 నుంచి రూ. 1 లక్ష వసూలు చేస్తుండగా మిగతా వాటికి పనిని బట్టి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇలా ఆరుగురు ఆర్‌ఐలు ఒకేచోట 10 సంవత్సరాలుగా పాతుకుపోయి అక్రమ వసూళ్ల దందా కొనసాగిస్తూ కోట్లు సంపాదించినట్టు తోటి ఉద్యోగులే ఆరోపిస్తున్నారు.

భూపాలపల్లికి బైపాస్ రోడ్డు

- ఫలించిన ఎంపీ కావ్య కృషి
- వార్షిక ప్రణాళికలో నిధుల కేటాయింపు
- త్వరలో డీపీఆర్, టెండర్ పనులు పూర్తి


కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి వినతిపత్రం ఇస్తున్న ఎంపీ కడియం కావ్య (ఫైల్)

హనుమకొండ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని భూపాలపల్లి పట్టణానికి బైపాస్ రోడ్డు మంజూరైంది. వరంగల్ ఎంపీ కడియం కావ్య కృషి ఫలించింది. ఈ రోడ్డు విషయమై ఎంపీ పలుమార్లు కేంద్ర రోడ్లు, రవాణా మంత్రి నితిన్ గడ్కరీని కలిసి వినతి పత్రాలు అందజేశారు. భూపాలపల్లి పట్టణంలో ప్రధానంగా భారీ ట్రాఫిక్, బొగ్గు రవాణా, పవర్‌ప్లాంట్ కార్యకలాపాల వల్ల ఎన్‌హెచ్-353సీ పైన వాహనాల రద్దీ పెరగడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, డాక్టర్ కావ్య కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. మూడేళ్లలో దాదాపు 233 మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. దీన్ని నివారించడానికి భూపాలపల్లి పట్టణాన్ని దాటి వెళ్లే వాహనాల కోసం బైపాస్ రోడ్డు పనులను వెంటనే చేపట్టాలని కోరారు. రూ.250కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న బైపాస్ రోడ్డులో రూ.175కోట్లు నిర్మాణ పనులకు, రూ.75కోట్లు భూసేకరణకు వినియోగించాలని, ఈ నిధుల మంజూరును 2025-26 వార్షిక ప్రణాళికలో చేర్చాలని కావ్య విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు స్పందించిన కేంద్ర మంత్రి గడ్కరీ ఎన్‌హెచ్-353సీపైన భూపాపల్లి పట్టణానికి బైపాస్ రోడ్డు నిర్మాణ పనులను 2025-26 వార్షిక ప్రణాళికలో చేర్చినట్టు డాక్టర్ కావ్యకు రాసిన లేఖలో పేర్కొన్నారు. డీపీఆర్‌ను, టెండరు పనులను పూర్తి చేస్తామని డాక్టర్ కావ్యకు రాసిన లేఖలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. బైపాస్ రోడ్డు నిర్మాణం వల్ల భూపాలపల్లి పట్టణ ప్రజల సమస్యలు తీరనున్నాయన్నారు.

గానమే ఆమె గమనం

- ఉత్తమ సింగర్‌గా జాతీయస్థాయి అవార్డు
- 2 వేలకు పైగా పాటలు పాడి ప్రజల మెప్పు
- తన గాత్రంతో ఉర్రూతలూగిస్తున్న వాణిశ్రీ
- వృద్ధాశ్రమం నెలకొల్పేందుకు అడుగులు


ఓ ఈవెంట్‌లో పాట పాడుతున్న వాణిశ్రీ

పరకాల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తన కంఠంతో వేలాది ప్రజల ముందు పాటలు పాడుతూ ప్రజల మెప్పు పొందాలని చిన్నతనం నుంచి ఒక లక్ష్యంగా ముందుకు అడుగులు వేస్తోంది పరకాల పట్టణానికి చెందిన వేమునూరి వాణిశ్రీ. చిన్నచిన్నగా పాఠశాల స్థాయి నుంచి పాటలు పాడుతూ నేడు ఉత్తమ సింగర్‌గా నేషనల్ అవార్డు అందుకోబోతోంది.

భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం జూకల్ గ్రామానికి చెందిన వేమునూరి లక్ష్మణాచారి - వనజ దంపతులకు ముగ్గురు కూతుళ్లు. వాణిశ్రీ, కల్యాణి, స్రవంతి, కుమారుడు నాగరాజు ఉన్నారు. వృత్తిరీత్యా వడ్రంగి కావడంతో గ్రామంలోని కార్పెంటర్ పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. వాణిశ్రీ డిగ్రీ వరకు చదివింది. శాయంపేట మండలం ప్రగతి సింగారానికి చెందిన వీరబ్రహ్మాచారితో 2002లో వాణిశ్రీకి వివాహం జరిపించారు. అప్పట్లో కొద్దో గొప్పో పాటలు పాడే వాణిశ్రీ.. భర్త సహకారంతో పరకాల పట్టణానికి చెందిన బండి సమ్మయ్య, కుమారస్వామి బృందంలో చేరి వివాహ, శుభ కార్యాలకు ఈవెంట్ చేసేందుకు వెళ్తుంది. ఇప్పటి వరకు సుమారు 2వేలకు పైగా పాటలు పాడింది. మొట్టమొదటగా అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని పరకాల పట్టణంలో 'నీ ధర్మం మరువొద్దు.. ఈ సంఘం మరవద్దు' అనే పాటను పాడి రూ.4,116 బహుమతి అందుకున్న వాణిశ్రీ.. అప్పటి నుంచి ఇప్పటి వరకు వెనుతిరగలేదు.


గాయని వాణిశ్రీ

వృద్ధాశ్రమ ఏర్పాటుకు ప్రయత్నం

చేయూత ఫౌండేషన్ ద్వారా ఒక వృద్ధాశ్రమాన్ని నెలకొల్పి వృద్ధులకు చివరి దశలో మంచి జీవితాన్ని అందించాలనే లక్ష్యంగా వాణిశ్రీ అడుగులు వేస్తోంది. ప్రస్తుతం సామాజిక సేవల్లో పాల్గొంటుంది. సరైన సహకారం, ప్రోత్సా హం ఉన్నతాధికారులతో పాటు, ప్రభుత్వం అండదండలు అందిస్తే పరకాల పట్టణ ప్రాంతంలో వృద్ధాశ్రమాన్ని నెలకొల్పి అనాథ వృద్ధులకు సేవ చేస్తానని వాణిశ్రీ పేర్కొంటోంది.

జాతీయస్థాయి అవార్డుకు వాణిశ్రీ ఎంపిక

ఈ నెల 11న ఉత్తమ సింగర్‌గా నేషనల్ అవార్డు వాణిశ్రీ అందుకోనున్నారు. హైదరాబాద్‌లో మనం ఫౌండేషన్ అనే సంస్థ 9వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించే అవార్డుల ప్రదానోత్సవంలో భాగంగా ఉత్తమ సింగర్‌గా ప్రముఖుల చేతులమీదుగా వాణిశ్రీ అవార్డు స్వీకరించనున్నట్లు తెలిపారు.


డాక్టర్ హరికిషన్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు, వైద్యులు

ఆయుర్వేద ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా హరికిషన్

గిర్మాజీపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద బోధన ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జె. హరికిషన్ నియమితులయ్యారు. ఇక్కడ పనిచేసిన డాక్టర్ జి.పద్మావతి గురువారం ఉద్యోగ విరమణ చేయడంతో ఆమె స్థానంలో జె.హరికిషన్‌ను నియమిస్తూ తెలంగాణ ఆయుష్ డైరెక్టర్ పి.శ్రీకాంత్ బాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.అశోక్ కుమార్, ఆయుర్వేద విభాగాల అధిపతులు డాక్టర్ జ్ఞానేశ్వర్, డాక్టర్ దుర్గాబాయి, డాక్టర్ విజయగణేష్ రెడ్డితో పాటు అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, వైద్యాధికారులు హరికిషన్‌కు అభినందనలు తెలిపారు.

ఒకవైపు కొరత.. మరోవైపు ప్యాకేజీ

- యూరియా కోసం రైతుల అగచాట్లు
- ఖరీదైన ఫెస్టిసైడ్లు కొనాలని డిమాండ్
- అన్నదాతలపై పెరుగుతున్న ఆర్థిక భారం



హనుమకొండ టౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లాలో ఖరీఫ్ సాగు ముమ్మరంగా సాగుతున్న వేళ.. రైతులపై ఆర్థిక భారం పడుతోంది. జిల్లాలో 14 మండలాల్లో అన్నదాతలు పత్తి సాగుతో పాటు వరి నార్లు పోసుకుంటున్నారు. పత్తి, మొక్కజొన్న ఇతర కూరగాయల పంటలకు యూరియాను రైతులు ఎక్కువ ఉపయోగిస్తుంటారు. జిల్లాలో 20 రోజులుగా యూరియా కొరత ఏర్పడింది. రైతులు యూరియా కోసం వెళ్తే ఇతర ఖరీదైన ఎరువులు తీసుకోవాలని డీలర్లు, వ్యాపారులు ఒత్తిడి చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇంత జరుగుతున్నా వ్యవసాయ శాఖ అధికారులు మౌనం పాటిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మార్పీ కంటే ఎక్కువ

యూరియా ఎమ్మార్పీ రూ.266 లభించాల్సి ఉండగా రూ.350నుంచి రూ.400 వరకు అమ్మకాలు జరుపుతున్నారు. యూరియాతో పాటు ఇతర రసాయనాల ధరతో కలిపి చూస్తే రూ.600 నుంచి 700 వరకు ఒక బస్తాకు చెల్లించాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ డబ్బులు రైతుల వద్ద వసూలు చేస్తున్నారని, వాటికి యూరియాకు బిల్లులు ఇవ్వడం లేదని, ఇతర ఎరువులు కలిపి తక్కువ బిల్లులు ఇస్తున్నట్లు రైతులు చెబుతున్నారు.

అధికారుల మౌనం

ఎరువులు తీసుకుంటేనే యూరియా ఇస్తున్నారని సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. రైతులకు సమయానికి ఎమ్మార్పీ ధరకే యూరియాను అందించాలని, అవసరమైన యూరియాను అందుబాటులో ఉంచి రైతులకు ఇబ్బందులు కలుగకుండా సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

యూరియా కొరత



హనుమకొండ జిల్లావ్యాప్తంగా పంటల సాగుకు యూరియా సరిపోవడం లేదని క్యూలో ఉన్న ఒక్కో రైతుకు రెండు బస్తాలు అందిస్తున్నారు. దీంతో కొంతమంది డీలర్లు, ఇతర రిటైల్ వ్యాపారులు యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలించి గోదాములలో నిల్వ చేస్తున్నారు. ప్రభుత్వం పంపిణీ చేసిన యూరియా స్టాక్‌ను ప్రైవేటు డీలర్లు ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

రైతులు ఆందోళన చెందవద్దు

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రవీందర్‌సింగ్

జిల్లాలో యూరియా కొరత లేదు. కొంత మంది కావాలని కొరత ఉన్నట్లు ప్రచారం చేస్తున్నారు. రైతులు అవసరానికి మించి కొనుగోలు చేసి నిల్వ చేసుకుంటున్నారు. కిందటేడు కంటే ఈ యేడు ఇప్పటికే 800 మెట్రిక్ టన్నుల ఎక్కువ యూరియా అమ్మకాలు పెరిగాయి. రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు విక్రయించిన వారిపై చర్యలు తీసుకుంటాం.

కూరగాయల సాగు.. లాభాలు బహు బాగు

- రాయితీలు అందిస్తున్న ప్రభుత్వం
- సద్వినియోగించుకోవాలంటున్న ఉద్యాన శాఖ అధికారులు


రైతులకు బిందు సేద్యం కోసం అందించిన డ్రిప్ పరికరాలు

భీమదేవరపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన శాఖ ద్వారా కూరగాయల సాగు విస్తీర్ణం పెంచేలా రైతులకు కూరగాయల సాగుకు వివిధ పథకాలతో రాయితీలు అందిస్తోంది. కూరగాయల సాగుకు ఇచ్చే రాయితీల గురించి హనుమకొండ ఉద్యాన శాఖాధికారి సుస్మిత వివరించారు.

కూరగాయల నారు

టమాటా, వంకాయ, పచ్చి మిర్చి నారు రైతులకు వంద శాతం రాయితీపై అందజేస్తారు. ఐదెకరాలలోపు ఉన్న ప్రతి రైతు కూరగాయల నారును ఉద్యాన శాఖ ద్వారా అందిస్తున్నారు. రైతులు తమకు అవసరం ఉన్న నారు వివరాలను 30 రోజుల ముందు తెలియజేస్తే వారికి వంద శాతం రాయితీతో కూరగాయల నారును అందిస్తామన్నారు. రైతులు ఇందు కోసం పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్ జిరాక్స్ పత్రాలతో ఉద్యాన శాఖాధికారులను సంప్రదించాలి.

శాశ్వత పందిళ్లు

కూరగాయాల్లో బీర, కాకర, మొదలైన తీగజాతీ కూరగాయల సాగు కోసం ఉద్యాన శాఖ శాశ్వత పందిళ్ల నిర్మాణం కోసం రాయితీ ఇస్తుంది. 50 శాతం రాయితీలు ఇస్తున్నారు. ఒక యూనిట్‌కు 50వేల రాయితీతో పాటు రెండున్నర ఎకరాలు రైతుకు ఉండాలి.

మల్చింగ్ విధానం

కూరగాయల సాగులో ముఖ్యంగా కలుపుతీత రైతులకు ప్రధాన సమస్య. ఈ సమస్యను అధిగమించడానికి మల్చింగ్ విధానాన్ని ఉద్యాన శాఖ అందిస్తుంది. ఎరువుల యాజమాన్యం తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడి చేయడానికి మల్చింగ్ విధానం ఉపయోగపడుతుంది. ఎకరాకు రూ. 8వేల రాయితీని, ఐదెకరాల వరకు అందిస్తుంది. ఊతం విధానాల్లో టమాట, ఇతర కూరగాయాల పంటలు సాగు చేయడానికి రాయితీ సదుపాయం కల్పిస్తున్నారు. ఒక ఎకరానికి రూ. 10వేల చొప్పున ఈ రాయితీ ఇస్తున్నారు.

బిందు సేద్యం

తక్కువ నీటితో ఎక్కువ పంటలు పండించేందుకు ఉద్యాన శాఖ ద్వారా బిందు సేద్యం పథకాన్ని రైతులకు అందిస్తున్నారు. బిందు సేద్యం ఇతరులకు 80శాతం, బీసీ, సన్నకారు, చిన్నకారు రైతులకు 90శాతం, ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం రాయితీ అందిస్తున్నారు. అలాగే తుంపర్ల సేద్యం కోరుకునే రైతులు 75శాతం రాయితీ అన్ని కేటగిరీల రైతులకు అందజేస్తారు. బోర్, బావి నీటి వసతి ఉన్న రైతులు తుంపర్ల సేద్యంకు అర్హులన్నారు. రైతులు ఈ రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకొని ముందుకు సాగాలన్నారు. అవసరం ఉన్న రైతులు ఉద్యాన శాఖాధికారులను సంప్రదించాలని కోరారు. సంబంధిత వివరాల కోసం 8977714068 హనుమకొండ ఉద్యాన శాఖాధికారి సుస్మితను సంప్రదించాలని కోరారు.


మల్చింగ్ పద్ధతిలో సాగు చేస్తున్న రైతు

హమాలీ.. కళల మాలి

తనకు చిన్నప్పటి నుంచి పాటలంటే ప్రాణం. గురువు బాబు వద్ద మెళకువలు నేర్చుకుని ప్రజా నాట్యమండలి కళాకారుడిగా ప్రస్థానం మొదలుపెట్టాడు. నటుడిగా, ఉద్యమకారుడిగా, సామాజిక కార్యకర్తగా, నర్తకుడిగా, పాటలు పాడుతూ ఆటలు ఆడుతూ ప్రజలు, పలువురి ప్రశంసలందుకుంటున్నాడు. సొంతంగా పల్లె పాటలను అల్లుకుని వరకట్న దురాచారం, మద్యపానం, నిరక్షరాస్యతపై ప్రజలను చైతన్య పరుస్తున్నాడు. కళామతల్లికి సేవ చేస్తూనే తన పొట్ట కూటి కోసం కూలి పనులు చేస్తున్న ప్రజా కళాకారుడు, వాగ్గేయకారుడు అయిన దామెర కృష్ణ ప్రస్థానంపై ఈ ప్రత్యేక కథనం.

- గాయకుడిగా, కళాకారుడిగా తనదైన ముద్ర చాటుతున్న దామెర కృష్ణ
- ప్రజా నాట్యమండలి తరపున చురుకైన పాత్ర
- సాంఘిక దురాచారాలపై ప్రజల్లో చైతన్యం
- కార్మిక సంఘం నాయకుడిగా సమస్యలపై పోరు


కళాకారులతో కలిసి ప్రదర్శన ఇస్తున్న దామెర కృష్ణ



రవీంద్రభారతిలో గద్దర్ పురస్కారాన్ని డిప్యూటీ స్పీకర్ బండా ప్రకాష్ నుంచి అందుకుంటున్న దామెర కృష్ణ

వరంగల్ సిటీ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కళాకారుడిగా, ప్రజా నాయకుడిగా, వాగ్గేయకారుడిగా రాణిస్తున్న దామెర కృష్ణ వరంగల్ జిల్లా దామెర మండల కేంద్రానికి చెందిన దామెర కమలమ్మ, ఆగయ్య దంపతులకు రెండో సంతానంగా 1970లో జన్మించారు. తన చిన్నతనంలో తండ్రి మృతి చెందాడు. తల్లి కమలమ్మ అన్ని తానై కృష్ణను డిగ్రీ వరకు చదివించింది. తనకు పాటలపై ఉన్న మక్కువతో గురువు బాబు వద్ద జానపద కళల్లో మెళకువలు నేర్చుకున్నాడు.



కార్మికుడు.. నాయకుడిగా..

1996లో సీపీఐ ఆధ్వర్యంలో ఏర్పడిన ఎస్‌ఆర్‌నగర్ కాలనీకి మూడు సార్లు శాఖ కార్యదర్శిగా పనిచేశారు. సీపీఐ జిల్లా సమితి సభ్యుడిగా పని చేశారు. ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా, రాష్ట్ర సమితి సభ్యుడిగా పనిచేశారు. 2019లో ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో హమాలిగా చేరి హమాలి వర్కర్స్ యూనియన్‌ను స్థాపించడమే కాకుండా ప్రధాన కార్యదర్శిగా కార్మికుల హక్కుల కోసం ఉద్యమాలు చేశారు. ప్రస్తుతం ఏఐసీటీయూ జిల్లా సహాయ కార్యదర్శిగా పని చేస్తున్నారు.

కళాకారుడిగా..

సామాజిక రుగ్మతలపై తన గానామృతంలో ప్రజలను చైతన్య పరుస్తున్నారు. బుర్రకథ, హరికథలతో పాటు మద్యపానం, వరకట్నం, నిరక్షరాస్యత, పల్లెపాటలను అల్లుకుని వందలాది ప్రదర్శనలిచ్చారు. తెలంగాణ మలి ఉద్యమంలో తన ఆట పాటలతో ప్రజలను ఉర్రూతలూగించారు. గజ్జెకట్టి గళమెత్తి చలో ధూం..ధాం...అంటూ యువతను మేలుకొల్పారు. మిలియన్ మార్చ్, సకల జనుల సమ్మె, సాగర హారం వంటి కార్యక్రమాల్లో ప్రదర్శనలు ఇచ్చారు. స్వరకర్తగా కళాబృందాన్ని నడిపించే నాయకుడిగా, నర్తకుడిగా, నటుడిగా ప్రజలను చైతన్య పరుస్తున్నారు.

అందుకున్న అవార్డులు.. ప్రశంసలు

2016లో జ్యోతిరత్న అవార్డును అందుకున్నారు. 2019లో ఎన్‌టీఆర్ లైఫ్ టైం అవార్డు, జాతీయ స్థాయి కళారత్న అవార్డు, కళా వాచస్పతి, జానపద కళారత్న అవార్డులను అందుకున్నారు. 2023లో విమలక్క చేతుల మీదుగా ఉత్తమ నంది అవార్డును సొంతం చేసుకున్నారు. 2024లో గాన కోకిల, 2025లో భారత్ విభూషణ్, గద్దర్ పురస్కారం అందుకున్నారు.

నేడు లయన్స్ ఉమ్మడి జిల్లా సదస్సు

మడికొండలో నూతన నాయకుల ప్రమాణ స్వీకారం

మడికొండ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మడికొండలోని ఏ 1 ఫంక్షన్ హాల్ వేదికగా శనివారం 320 ఎఫ్ అంతర్జాతీయ లయన్స్ జిల్లా కేబినెట్ నాయకుల ప్రమాణ స్వీకారం సాకారం పేరిట జరగనుందని ప్రమాణ స్వీకార ఉత్సవ కమిటీ కన్వీనర్ డాక్టర్ తాళ్ల రవి శుక్రవారం తెలిపారు. ప్రస్తుత గవర్నర్ డాక్టర్ చంద్రశేఖర్ ఆనవాయితీగా అమెరికాలో ప్రమాణం చేయగా ఉప గవర్నర్లు ఎస్.సుధాకర్‌రెడ్డి, పుట్ట హరికిషన్‌రెడ్డిలతో పాటు జిల్లా క్యాబినెట్ వివిధ పదవుల్లో నియమించిన నాయకులు పెద్ద సంఖ్యలో ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. ఇందుకోసం భారీ ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ప్రమాణ స్వీకారోత్సవంలో లయన్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఘట్టమనేని బాబురావు ముఖ్య అతిథిగా, గ్యాట్ ఏరియా లీడర్ మౌనిక సావంత్, మల్టిపుల్ చైర్మన్ రాజేంద్రప్రసాద్, గ్యాట్ లీడర్లు ఆవుల గోపాల్‌రావు, దీపక్ భట్టాచార్జి, హనుమాండ్ల రాజిరెడ్డి, వివిధ జిల్లాల నాయకులు పాల్గొంటారన్నారు. ఈసందర్భంగా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. సభ్యులు సకాలంలో హాజరు కావాలని డాక్టర్ తాళ్ల రవి కోరారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

ప్రతీ కాలనీని అభివృద్ధి చేయడమే లక్ష్యం

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

జూలైవాడ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ప్రతీ కాలనీని అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ధ్యేయమని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గ్రేటర్ 50వ డివిజన్ జూలైవాడలో అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. కాలనీల్లో డ్రెయినేజీ, సీసీ రోడ్లు, మంచినీటి సరఫరా, మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. డివిజన్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి అభివృద్ధి పనులు పూర్తయ్యేలా కార్యచరణ రూపొందించి ముందుకు సాగుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మేయర్ గుండు సుధా రాణి, స్థానిక కార్పొరేటర్ నెక్కొండ కవిత కిషన్, గోపు జైపాల్‌రెడ్డి, కె.రవీందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వర్తింపజేయాలి

విశ్వబ్రాహ్మణ, విశ్వ కర్మ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణమాచారి



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణమాచారి

వడ్డెపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): విశ్వ బ్రాహ్మణులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింప చేసి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటును అందించాలని తెలంగాణ విశ్వబ్రాహ్మణ, విశ్వ కర్మ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచారి అన్నారు. శుక్రవారం హనుమకొండ ఎన్జీవోస్ కాలనీ రోడ్డులోని ప్రైవేటు సమావేశ మందిరంలో కామాక్షి విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మహిళా సంక్షేమ పరపతి సంఘం సర్వ సభ్య సమావేశం సంస్థ అధ్యక్షురాలు గుగ్గిళ్ల శశిరేఖ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణమాచారి మాట్లాడుతూ.. కార్తీక మాసాన్ని పురస్కరించుకొని నిర్వహించే వన సమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు పెండోట రమాదేవి, రాష్ట్ర నాయకులు పెండోట సురేష్, రుద్రోజు భవాని, చెంగెల్లి హేమలత, కర్ణకంటి భారతి, కొక్కొండ అమల, పుష్పలీల, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలి



ప్రెస్ క్లబ్‌లో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బంజారా నేతలు

వడ్డెపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా రాంపూర్‌లో ఆదివారం నిర్వహించే గోర్ బంజారా వన భోజన, ఆత్మీయ సమ్మేళనంలో గ్రేటర్ వరంగల్ పరిధిలోని బంజారాలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని గోర్ బంజారా వన భోజన నిర్వహణ కమిటీ కన్వీనర్ అంగోత్ వినోద్ లోక్‌నాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆత్మీయ సమ్మేళనానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో గోర్ బంజారా వన భోజన, నిర్వహణ కమిటీ ప్రతినిధులు డాక్టర్ గుగులోతు రాజు నాయక్, లకావత్ రవీందర్, కేలోతు భిక్షపతి, బాదావత్ బాలాజీ నాయక్, భూక్య రాజు, భూక్య హేమానాయక్, దుంగ్రోత్ కిశోర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మడికొండలో ఆటోడ్రైవర్లకు సన్మానం



ఆటో డ్రైవర్లను సన్మానిస్తున్న విలేజ్ పోలీస్ జయరాజ్

మడికొండ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆటో కార్మికుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం మడికొండ కు చెందిన ఆటో డ్రైవర్లను స్థానిక విలేజ్ పోలీస్, హెడ్ కానిస్టేబుల్ జయరాజ్ శాలువాలతో సన్మానించారు. అనంతరం ఆయన ఆటో డ్రైవర్లకు శుభాకాంక్షలు తెలిపి మాట్లాడారు. ప్రయాణికులను భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలని సూచించారు. ఆటో డ్రైవర్లు దార సూరి, గోపనబోయిన రాజు, బరిగెల క్రిష్ణమూర్తి, జిట్ట సదానందం, పల్లపు మురళి, రాజు, నాగరాజు పాల్గొన్నారు.

పరిశ్రమలకు అనుమతులు

మంజూరు చేయాలి

అధికారులతో కలెక్టర్ స్నేహ శబరీష్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్నేహ శబరీష్

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నూతన పరిశ్రమలకు కావాల్సిన అనుమతులను త్వరగా మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం సాయంత్రం కలెక్టర్ అధ్యక్షతన సంబంధిత శాఖల అధికారులతో జిల్లా పారిశ్రామిక ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ పథకాలకు సంబంధించిన యూనిట్లకు వచ్చిన దరఖాస్తులు, పరిశ్రమల ఏర్పాటుకు వచ్చిన అనుమతులు, ఆయా శాఖల మధ్య పెండింగ్‌లో ఉన్న వాటి వివరాలను జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ కలెక్టర్‌కు వివరించారు. టీప్రైడ్ పథకం కింద 6 యూనిట్లకు సబ్సిడీ మంజూరైందని తెలిపారు. అనంతరం కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ.. జిల్లాలోని నూతన పరిశ్రమలకు కావాల్సిన చట్టపరమైన అనుమతులు ఇవ్వాలని, పీఎం విశ్వకర్మ పథకం దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలన్నారు. పీఎం విశ్వకర్మ పథకం గురించి వివిధ కుల వృత్తిదారులకు, యువతకు అవగాహన కల్పించి పథకానికి దరఖాస్తు చేసుకునే విధంగా ప్రోత్సహించాలన్నారు. తెలంగాణ డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ గురించి నిరుద్యోగ యువతకు అవగాహన కల్పించి ఉపాధి అవకాశాలు పొందేవిధంగా అధికారులు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వైవి.గణేష్, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖాధికారి మేన శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కూరగాయల నాణ్యత ఇలాగేనా?

» కాంట్రాక్టర్‌పై కలెక్టర్ ఫైర్

వేలేరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో విద్యార్థులకు అందించే భోజనంలో నాణ్యత లేకపోవడంపై కలెక్టర్ స్నేహ శబరీష్ కళాశాల నిర్వాహకులు, భోజన కాంట్రాక్టర్‌పై మండిపడ్డారు. వేలేరు మండల కేంద్రంలోని పీఎంశ్రీ తెలంగాణ బాలుర గురుకుల పాఠశాలను శుక్రవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయుల అటెండెన్స్ రిజిస్టర్, ఎఫ్ఆర్ఎస్ విధానంలో నమోదు చేస్తున్న విద్యార్థులు అటెండెన్స్‌ను పరిశీలించారు. వంటగదిలోని కూరగాయలను పరిశీలించగా కూరగాయల్లో నాణ్యతగా లేకపోవడంతో కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యత లేకుండా కుళ్లిన కూరగాయలు సరఫరా చేస్తున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని పాఠశాల నిర్వాహకులపై మండిపడ్డారు. అనంతరం డైనింగ్ హాల్ పరిశీలించి విద్యార్థులకు అందించే భోజనాన్ని పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు అందించే భోజనంలో రాజీ పడవద్దని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. పాఠశాలను తహసీల్దార్ కోమి, ఎంపీడీవో లక్ష్మిప్రసన్నలు కొంత సమయాన్ని కేటాయించి పాఠశాలను పరిశీలించాలని సూచించారు. డిజిటల్ విధానంలో విద్యార్థులు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయురాలిని పలు ప్రశ్నలు అడగా ఆమె సరైన సమాధానం ఇవ్వకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. తరగతి గదుల నిర్వహణను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. పాఠశాలలోని సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకోగా పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు అందలేదని తెలిపారు. పాఠశాల ప్రారంభమై నెలలు గడుస్తున్నా ఎందుకు విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్‌లు ఇవ్వలేదని ప్రశ్నించారు. పాఠశాలలోని వసతులపై ఆరా తీశారు.

అనంతరం శాలపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని, ఇందిరమ్మ ఇండ్లను కలెక్టర్ పరిశీలించారు. ఇందిరమ్మ ఇండ్ల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. బిల్లుల చెల్లింపులో నిర్లక్ష్యం వహించవద్దని అధికారులకు సూచించారు. ఇళ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కోమి, ఎంపీడీవో లక్ష్మిప్రసన్న, ఎంపీవో భాస్కర్, ఆర్ఐ సురేందర్, కళాశాల ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రం తనిఖీ



వైద్య సిబ్బందికి డీఎంహెచ్‌వో అయ్యప్ప

వరంగల్ మెడికల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పెద్దమ్మగడ్డలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని హనుమకొండ డీఎంహెచ్ఓ డాక్టర్ అయ్యప్ప శుక్రవారం తనిఖీ చేశారు. ఏఎన్‌సీ నమోదు, ఎన్‌సీడీ రీస్క్రీనింగ్, ఫీవర్ సర్వే జరుగుతున్న తీరు, తల్లిపాల వారోత్సవాల సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సంజయ్, ప్రోగ్రాం మేనేజర్ రుక్మద్దిన్, ఆర్.వినోద్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గిరిజన విద్యార్థులు హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ బేగంపేట, రామంతాపూర్‌లో 1వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ప్రేమకళ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో 1వ తరగతిలో ముగ్గురు బాలురు, ముగ్గురు బాలికలకు లక్కీడ్రా ద్వారా ప్రవేశాలు కల్పిస్తామని, అర్హులైన గిరిజన విద్యార్థులు ఈ నెల 8వ తేదీలోపు దరఖాస్తులను హనుమకొండలోని గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో సమర్పించాలని ప్రేమకళ ఆ ప్రకటనలో పిలుపునిచ్చారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



కాజీపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. కాజీపేట రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట ఫాతిమానగర్ రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి శుక్రవారం మృతి చెంది ఉన్నాడు.. మృతుడి వయస్సు 35 నుంచి 40 ఏళ్లు. ఎరుపు కోల రంగు ముఖం, ఎత్తు 5.5, ఎడమ చేతిపై శివలింగం, ఢమరుకం శూలం పచ్చబొట్టు ఉంది. ఛాతిపై పుట్టుమచ్చ ఉంది. మృతుడి ఒంటిపై ఎలాంటి చొక్కా లేదు. బ్లూకలర్ జీన్స్‌ప్యాంట్ ఉంది. మృతుడిని గుర్తించడానికి ఎలాంటి ఆనవాళ్లు లేవు. రైల్వే ప్రయాణికుల సమాచారం మేరకు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఎంజీఎంలో భద్రపర్చామని, ఆచూకీ తెలిసిన వారు కాజీపేట రైల్వే పోలీస్ స్టేషన్ ఫోన్ నంబర్ 87126 58609, 94400 27342 సమాచారం ఇవ్వాలని రైల్వే పోలీసులు తెలిపారు.

జేఎన్ఎస్‌లో స్పోర్ట్స్ స్కూల్

(5వ పేజీ తరువాయి)

వివరించారు. కడియం మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరంగల్ జిల్లా ప్రజలపై ఉన్న ప్రేమతో క్రికెట్ స్టేడియం, స్పోర్ట్స్ స్కూల్ కం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ మంజూరు చేయాలని అడిగిన వెంటనే ఒప్పుకున్నారన్నారు. అలాగే స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జయేష్ రంజన్‌తో త్వరితగతిన ఉమ్మడి వరంగల్ జిల్లాలో క్రికెట్ స్టేడియంలో స్పోర్ట్స్ స్కూల్, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ఏర్పాటు చేయాలని అడిగిన వెంటనే ఒప్పుకున్నారన్నారు. ఆగస్టు నుంచే స్పోర్ట్స్ స్కూల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ తాత్కాలిక ప్రారంభానికి ఏర్పాటు చేయాలని అన్నారు. బీసీసీఐతో సంప్రదించి క్రికెట్ స్టేడియం నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్, డీఐఎస్‌వో అశోక్, స్పోర్ట్స్ అథారిటీ, కుడా అధికారులు పాల్గొన్నారు.

బ్యాగుల పంపిణీ

హసన్‌పర్తి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు జీవితంలో ఉన్నతంగా రాణించినప్పుడే చదువు చెప్పిన గురువులకు, తల్లిదండ్రులకు సమాజంలో గౌరవం ఉంటుందని మండల విద్యా శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. భీమారం ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన దాత మార్క సురేష్, నవత ఆర్థిక సహాయంతో బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం, ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఇదే పాఠశాలలో చదివిన మార్క సురేష్ కష్టపడి చదివి ఇంజనీర్‌గా ఎదిగి ఇదే పాఠశాలలో చదివే విద్యార్థులకు స్కూల్ బ్యాగులను అందించి స్ఫూర్తిగా నిలవడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో బైరాన్‌పల్లి ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయులు కుమారస్వామి, ఉపాధ్యాయులు శ్రీదేవి, శ్రీధర్, సరోజ, సల్మా, సుల్తానా, నస్రత్ బేగం తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి

యాంటీ నార్కోటిక్ డీఎస్పీ రమేష్‌కుమార్



సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ రమేష్‌కుమార్

వడ్డెపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని యాంటీ నార్కోటిక్ డీఎస్పీ రమేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం హనుమకొండ వడ్డెపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు కుంట రవికుమార్ అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఎలాంటి పరిస్థితుల్లో కూడా మత్తు పదార్థాలకు అలవాటు పడొద్దని కోరారు. ఈ సదస్సులో యాంటీ నార్కోటిక్ సీఐ శ్రీకాంత్, సైక్రియాటిస్టు డాక్టర్ ప్రహసిత్, ఉపాధ్యాయులు కందగట్ల సురేష్, నర్సింహారెడ్డి, ప్రత్యూష, కృష్ణవేణి, రాజగోపాలచారి, మోహన్‌రెడ్డి, విమల బాయి, సరళతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

రాజేందర్‌పై పెట్టిన కేసులు ఎత్తివేయాలి

వడ్డెపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): సీనియర్ జర్నలిస్టు దామెర రాజేందర్‌పై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయనతో పాటు రాష్ట్ర ఉపాధ్యక్షుడు పులిపలుపుల ఆనందం మాట్లాడారు. దామెర రాజేందర్‌పై ఐనవోలు పోలీసులు తప్పుడు కేసులు పెట్టారని ఆరోపించారు. ఈ సమావేశంలో ఆ సంస్థ నాయకులు టీవీ రాజు, జక్కుల విజయ్‌కుమార్, వల్లాల జగన్, బండి విజయ్‌కుమార్, తన్నీరు శ్రీనివాస్, బాపురావు తదితరులు పాల్గొన్నారు.

మొరం తరలిస్తున్న టిప్పర్ స్వాధీనం

మడికొండ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మొరం తరలిస్తున్న టిప్పర్‌ను మడికొండ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఎస్సై పెగడ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేట మండలం తరాలపల్లి వద్ద కక్కిరాలపల్లికి చెందిన టిప్పర్ లారీ డ్రైవర్ అరూరి మహేశ్‌ను పట్టుకొని అక్రమంగా తరలిస్తున్న మొరం లోడుతో ఉన్న టిప్పర్ లారీని, డ్రైవర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించగా ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఫీజు గడువును పొడిగించాలి

కేయూ క్యాంపస్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కేయూ ప్రీ పీహెచ్‌డీ పరీక్షల ఫీజుల చెల్లింపు గడువును పొడగించాలని శుక్రవారం కేయూ పరిపాలన భవనంలో కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డిని కలిసి స్కాలర్లు వినతిపత్రాన్ని అందచేశారు. పీహెచ్‌డీ రెన్యూవల్ ఫీజుల చెల్లింపు గడువును పొడగించాలని కోరారు. రెన్యూవల్ ఫీజులను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈసీ సమావేశం నిర్వహించిన ఫీజుల చెల్లింపుపై నిర్ణయం త్వరగా తీసుకోవాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో స్కాలర్లు దొగ్గెల తిరుపతి, రేగుల నరేశ్, పోతర్ల మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

కేయూ ఫైనాన్స్ ఆఫీసర్‌గా హబీబుద్దీన్ బాధ్యతలు



హబీబుద్దీన్‌ను అభినందిస్తున్న ఎల్‌పీ రాజ్‌కుమార్, కొట్టే భాస్కర్

కేయూ క్యాంపస్ (ఆంధ్రజ్యోతి): కేయూ ఇన్‌చార్జి ఫైనాన్స్ ఆఫీసర్‌గా డిప్యూటీ రిజిస్ట్రార్ మహ్మద్ హబీబుద్దీన్ నియమితులుగా కాగా, శుక్రవారం కేయూ రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం నుంచి బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా హబీబుద్దీన్‌ను శుక్రవారం కేయూ హాస్టల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్, దూర విద్య కేంద్రం ఎస్డీఎల్‌సీఈ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొట్టే భాస్కర్, అడిషనల్ కంట్రోలర్ డాక్టర్ ఆసీం, స్కాలర్లు దొగ్గెల తిరుపతి, నరేశ్, మహేశ్, ఏఆర్ పంజాల శ్రీధర్, ఎల్.రాము, ఎన్జీవోఎస్ అధ్యక్ష కార్యదర్శులు బి.నవీన్‌కుమార్, వి.తిరుపతి, కల్పన, సౌజన్య. ప్రభాకర్, సతీశ్ కుమార్, తోట ప్రభాకర్, కృష్ణవేణి, సుధాకర్, రవీందర్, అన్వర్, యూసఫ్, కృష్ణమూర్తితో పాటు పలువురు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు.

ఆర్టీఐ ఫోరం జిల్లా కోఆర్డినేటర్‌గా వెంకట్



హనుమకొండ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఆర్టీఐ ఫోరం హనమకొండ జిల్లా కోఆర్డినేటర్‌గా మాలోత్ వెంకట్ నియమితులయ్యారు. శుక్రవారం చిట్యాల విమల్ రాజ్ అధ్యక్షతన జరిగిన తెలంగాణ ఆర్టీఐ ఫోరం (సమాచార హక్కు చట్టం) ఉమ్మడి జిల్లా సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. ఈ సమావేశంలో అన్ని జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.

నగరంలో బయోగ్యాస్ యూనిట్ల ఏర్పాటు

- » ఎన్ఐయూఏతో ఒప్పందం కుదుర్చుకున్న జీడబ్ల్యూఎంసీ
- » ఎన్ఐయూఏ డైరెక్టర్ వర్చువల్ సమావేశం
- » వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కమిషనర్ చహత్

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో బయో మిథనైజేషన్, బయోగ్యాస్ యూనిట్ల ఏర్పాటుకు ఎన్ఐయూఏతో వరంగల్ మునిసిపాలిటీ ఒప్పందం కుదుర్చుకుంది. శుక్రవారం నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అర్బన్ ఎఫైర్స్ (ఎన్ఐయూఏ) డైరెక్టర్ డాక్టర్ డెబోలినా కుందూ ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. వరంగల్ మునిసిపాలిటీ నుంచి కమిషనర్ చహత్ బాజ్‌పాయ్‌తో పాటు ఇన్‌చార్జి ఎస్ఈ మహేందర్‌తోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్ఐయూఏ డైరెక్టర్ వర్చువల్‌గా మాట్లాడారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిర్వహణలో భాగంగా జీడబ్ల్యూఎంసీ కేంద్ర ప్రభుత్వ విభాగానికి చెందిన ఎన్ఐయూఏతో బయోమిథనైజేషన్, బయోగ్యాస్ యూనిట్ల కోసం అగ్రిమెంట్ (ఒప్పందం) కుదుర్చుకున్నట్లు తెలిపారు.

కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ.. నగరంలో ప్రతీ రోజు 404 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోందన్నారు. చెత్తను ప్రాసెసింగ్ చేయడానికి ఈ యూనిట్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. నగరంలో జరుగుతున్న కార్యక్రమాలపై ఎన్ఐయూఏకు పూర్తి సమాచారాన్ని అందిస్తామన్నారు. ఇందుకు డీపీఆర్‌లు సిద్ధం చేసి టెండర్లు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్ఈ మహేందర్, డీఈ రేజారాణితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.



వెహికల్ షెడ్డులో వాహనాలను పరిశీలిస్తున్న కమిషనర్ చహత్

వెహికల్ షెడ్డు పరిశీలన

వరంగల్ కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి): హనుమకొండ బాలసముద్రంలో గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న వెహికల్ షెడ్డును జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ శుక్రవారం సందర్శించారు. నగరంలో చెత్తను తరలించేందుకు ఇటీవల నూతనంగా కొనుగోలు చేసిన వాహనాలను పరిశీలించారు. పారిశుధ్య ట్రాక్టర్లు, మంచినీటి ట్రాక్టర్లు, హైడ్రాలిక్ స్కై లిఫ్టర్లు, ఆటో రిక్షాలు, డస్ట్‌బిన్‌లను కమిషనర్ పరిశీలించారు. అనంతరం అక్కడి అధికారులకు పలు సూచనలు చేశారు. పనుల్లో పారదర్శకత ఉండాలని కమిషనర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్ఈ మహేందర్, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఏఈ శ్రీనివాస్, శానిటరీ జవాన్ మల్లికార్జున్ పాల్గొన్నారు.

దర్గా ఉత్సవాలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయండి

కాజీపేట (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 20 నుంచి మూడు రోజుల పాటు జరిగే ఉర్సు ఉత్సవాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మునిసిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కాజీపేట దర్గాలో శుక్రవారం కమిషనర్, మునిసిపల్ అధికారులతో కలిసి దర్గాను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. ఈ నెల 21, 22, 23 తేదీల్లో మూడురోజుల పాటు జరిగే దర్గా ఉర్సు ఉత్సవాలకు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివస్తారన్నారు. పారిశుధ్య పనులు, టాయిలెట్‌లు, మంచినీటి సౌకర్యంతో పాటు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆమె చెప్పారు. ఆమె వెంట దర్గా పీఠాధిపతి తనయుడు సయ్యద్ భక్తియార్, సీఎంహెచ్‌వో డా. రాజారెడ్డి, ఏఈ రవికుమార్, మాధవి, లత, డీఈ సంతోష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి సదా మీ సేవలో...

దమ్మున్న వార్తలతో అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా !

పత్రికా పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా మాకు ఫోన్ చేసి చెప్పవచ్చును. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా వుంటారు.

సంప్రదించగలరు : హన్మకొండ

Hanamkonda ACO - 9985410935,
Hasanparthy SR - 9059882000,
Hanamkonda - 9704361601
Parkal SR- 7396327489,
Kazipet SR - 8519926489 ACM - 9985411664

నవ్య
కుటుంబ కదంబం
శనివారం 2 ఆగస్టు 2025

మేకప్

పోకడలతో పోటీ పడేలా

మేకప్ వేసుకునే విధానంలో కాలానుగుణమైనా మార్పులు చోటుచేసుకుంటూ ఉంటాయి. ఫ్యాషన్ మాదిరిగానే మేకప్‌లో చోటుచేసుకునే మార్పులను ఎప్పటికప్పుడు అనుసరించగలిగితే అందరి కళ్లూ మన వైపే ఉంటాయి. అందుకోసం పాటించవలసిన నియమాలు ఇవే!

కనుబొమలను సన్నగా తీర్చిదిద్దే పోకడ పునరావృతమైంది. అయితే నిపుణుల సహాయంతో ఏ ముఖాకృతికి ఎలాంటి కనుబొమలు నప్పుతాయో తెలుసుకుని, వారి సహాయంతో కనుబొమలను విల్లుల్లా తీర్చిదిద్దుకుని నలుగురినీ ఆకట్టుకోవచ్చు. అలాగే కనుబొమలను దిద్దుకోవడం కోసం నలుపు రంగుకు బదులుగా ముదురు గోధుమ రంగు ఐబ్రో పెన్సిల్ ఎంచుకోవాలి.

ఐషాడో ఇలా...

డ్రస్ రంగుకు నప్పేలా అదే రంగు ఐషాడో ఎంచుకునే రోజులు పోయాయి. ప్రత్యేకంగా కనిపించేలా చేసే 'పేల్ బ్లూ పెర్ల్, స్మోకీ నేవీ' రంగులు వాడుకలోకొచ్చాయి. వీటిలో దేన్ని ఎంచుకున్నా, కనురెప్పలు ఎబ్బెట్టుగా కనిపించకుండా ఐలైనర్‌లో కలిసిపోయేలా ఐషాడోను పూసుకోవాలి. కనురెప్పలు దించినా, లేపినా కంటి అందం చెక్కుచెదరకుండా ఉండేలా చూసుకోవాలి.

లిప్ లైనర్‌తో...

పెదవులకు లిప్‌స్టిక్ పులిమేసుకునే రోజులు పోయి, లైనర్ మీద దృష్టిని పెంచే రోజులొచ్చాయి. లైనర్‌తో పెదవులను అంచులను తీర్చిదిద్ది, పలుచగా లిప్‌స్టిక్ అద్దుకోవడమే తాజా పోకడ. అయితే ఎంచుకునే లిప్ లైనర్ వీలైనంత ముదురు రంగులో ఉండేలా చూసుకోవాలి. పెదవుల అంచుల దగ్గరి నుంచి మొదలుపెట్టి, మధ్య వరకూ లైనర్ గీసుకుని, లేత గులాబీ, పీచ్ రంగు లిప్‌స్టిక్ పెదవులకు పలుచగా అద్దుకోవాలి.

గోళ్లకు సింగారం

నెయిల్ ఆర్ట్‌కు ఉన్న ఆదరణ అంతా ఇంతా కాదు. డ్రస్‌తో మ్యాచ్ అయ్యే రంగులతో పాటు, డిజైన్‌ను కూడా మ్యాచ్ చేసుకోవడం తాజా పోకడ. ఇందుకోసం క్రిస్టల్స్, బీడ్స్, చమ్కీలను ఎంచుకోవచ్చు.

చమ్కీ చమక్కు

ఐషాడో, లిప్ కలర్, బ్లష్.. వీటన్నిట్లో మెరుపు కలిసి ఉంటే అదొక అదనపు హంగు అవుతుంది. పార్టీలు, పెళ్ళిళ్ల లాంటి వేడుకల్లో, ఈవెంట్లలో ఇలాంటి మేకప్‌ను ఎంచుకుంటే మెరుపులు మెరిపించవచ్చు. ఈ ట్రెండ్‌కు ఆదరణ ఎప్పటికీ ఉండేదే!





"రెండు దేశాలు... రెండు సంస్కృతులు... కానీ అందరినీ కలిపేది విజ్ఞానం మాత్రమే" అని నమ్ముతారు చైత్రారావు. ఈ వారం అమెరికా అంతరిక్ష సంస్థ 'నాసా', భారత అంతరిక్ష పరిశోధన సంస్థ 'ఇస్రో' సంయుక్తంగా అభివృద్ధి చేసిన నైసార్ ఉపగ్రహ ప్రయోగం విజయవంతమయింది. ఈ ప్రాజెక్టుకు చైత్రారావు డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పనిచేశారు. గత 18 ఏళ్లుగా ఈ ప్రాజెక్టు ప్రతి అడుగులోనూ ఆమె కీలక భూమిక పోషిస్తున్నారు. నైసార్ ప్రయోగం విజయవంతయిన తర్వాత- ఆ ప్రాజెక్టులోని సాంకేతిక అంశాల గురించి వివరించారు.

దేశాలు వేరైనా అందరం ఒకటే!

'వందేమాతరం' అంటూ ముగించిన చైత్రారావు ప్రసంగం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కర్ణాటకలోని శివమొగ్గ జిల్లాలోని చిన్న పల్లెటూరు నుంచి వచ్చిన చైత్రారావు ప్రస్థానాన్ని జాగ్రత్తగా గమనిస్తే- అపరిమితమైన ఓర్పు, కొత్త విషయాలను తెలుసుకోవాలనే జిజ్ఞాస, తాను అనుకున్న లక్ష్యాలను ఎలాగైనా సాధించే పట్టుదల కనిపిస్తాయి. "నేను శివమొగ్గ జిల్లాలోని ఒక చిన్న గ్రామంలో పుట్టి పెరిగాను. మాకు బెంగుళూరు దగ్గరనే ఉండేది. నేను స్కూల్లో చదివే రోజుల్లో 'ఇస్రో'కు నాలుగైదు సార్లు వెళ్లాను. అది నాకు వేరే ప్రపంచంలా అనిపించింది. పెద్దయిన తర్వాత ఎలాగైనా 'ఇస్రో'లో పని చేయాలనుకొనేదాన్ని. కానీ అంగారకుడిపైకి 'ఇస్రో' పంపిన 'మామ్' ఉపగ్రహం టీమ్‌లో పని చేస్తానని కలలో కూడా అనుకోలేదు. నా ప్రస్థానంలో నాకు తోడుగా నిలిచిన నా కుటుంబానికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటాను" అని చైత్రారావు గతంలో ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

వడివడిగా ఎదుగుతూ...

ఇస్రోలో యువ శాస్త్రవేత్తగా తన వృత్తి జీవితాన్ని ప్రారంభించిన చైత్రారావు అనేక ప్రయోగాలలో కీలకమైన పాత్ర పోషించారు. అంగారకుడికి కక్ష్యలోకి వెళ్లి.. అక్కడ ఆ గ్రహం ఆనుపానులు కనిపెట్టడానికి ప్రయోగించిన 'మార్స్ ఆర్బిటర్ మిషన్' (మామ్)లో ఆమె కీలకమైన పాత్ర పోషించారు. 'మామ్'లో మొత్తం 90 మంది శాస్త్రవేత్తలు పనిచేస్తే- దానిలో 20 మంది మహిళలే! వీరందరూ వేర్వేరు ప్రాంతాల నుంచి వచ్చినవారు. వేర్వేరు వృత్తి నైపుణ్యాలు ఉన్నవారు. అయినా అందరూ కలిసికట్టుగా ఒక బృందంగా పనిచేసి విజయం సాధించారు. "మామ్ ప్రయోగానికి ముందు రాత్రిళ్లు కూడా పనిచేయాల్సి వచ్చేది. అందరం విపరీతమైన ఒత్తిడిలో ఉండేవాళ్లం. అయినా విజయం సాధించాలనే లక్ష్యంతోనే పని చేసేవాళ్లం" అంటారు చైత్రారావు. ఆ సమయంలోనే ఆమె బృందం మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంతో కలిసి పని చేశారు. "ఆయన మాటలు ఎప్పుడూ చాలా స్ఫూర్తిదాయకంగా ఉండేవి. ఏవైనా సమస్యలు చెబితే వాటి పరిష్కారాల కోసం ఆయన కూడా ప్రయత్నించేవారు. మాకు తోడుగా ఉండేవారు" అని అబ్దుల్ కలాంతో తమ అనుభవాలను చెబుతారు చైత్రారావు. బహుశా ఆ సమయంలో అందరితో కలిసి పని చేసిన అనుభవం నైసార్ ఉపగ్రహ అభివృద్ధిలో, నిర్మాణంలో పనికివచ్చింది. ఈ ఉపగ్రహ డిజైన్, రాడార్ల లాంటి వివిధ భాగాల తయారీ అమెరికాలో జరిగింది. దీనికోసం చైత్రారావు, ఆమె బృందం 'నాసా' శాస్త్రవేత్తలతో కలిసి.. గత ఏడాదంతా అక్కడ పనిచేయాల్సి వచ్చింది. "అది కూడా ఒక మరచిపోలేని అనుభవం" అంటారు చైత్రారావు. "నాసా వేరు. ఇస్రో వేరు అనే భావన ఎన్నడూ రాలేదు. దేశాలు వేర్వేరు కావచ్చు. కానీ అందరం ఒకటే! అందరం అంతరిక్ష సమాజానికి చెందినవాళ్ళమే అనిపించింది" అంటారామె! ఇప్పటివరకూ మన దేశానికి అంతరిక్ష రంగంలో ఎంతో కీర్తి తెచ్చిపెట్టిన చైత్రారావు మరిన్ని విజయాలను సాధించాలని కోరుకుందాం.

వంటిల్లు

వావ్... వాక్కాయ

ఒకవైపు ఎర్రగా మరోవైపు తెల్లగా లేదంటే ఆకుపచ్చగా ఉండే వాక్కాయలను ఇష్టపడనివారు ఉండరు. ఇవి పుల్లగా కాస్త వగరుతో నోరూరించేలా ఉంటాయి. పిల్లలు ఇష్టంగా తినే తియ్యని చెర్రీలను ఈ వాక్కాయలతోనే తయారు చేస్తారు. బేకరీ ఐటెమ్స్‌లో, స్వీట్ పాన్‌కు జతగా కూడా ఈ చెర్రీలను చూస్తూ ఉంటాం. ఇలాంటి వాక్కాయలతో తయారుచేసే కమ్మని రుచులు మీకోసం...



వాక్కాయ పులిహోర



కావాల్సిన పదార్థాలు

బియ్యం- రెండు కప్పులు, నూనె- అయిదు చెంచాలు, పసుపు- అర చెంచా, వాక్కాయలు- 25, ఆవాలు- అర చెంచా, జీలకర్ర- అర చెంచా, పల్లీలు- నాలుగు చెంచాలు, పచ్చి శనగపప్పు- రెండు చెంచాలు, మినపప్పు- రెండు చెంచాలు, జీడిపప్పు- కొద్దిగా, ఇంగువ- చిటికెడు, పచ్చిమిర్చి- అయిదు, ఎండు మిర్చి- రెండు, కరివేపాకు- రెండు రెమ్మలు, ఉప్పు- ఒక చెంచా

తయారీ విధానం

- ముందుగా బియ్యాన్ని కడిగి తగినన్ని నీళ్లు పోసి ఒక చెంచా నూనె, పావు చెంచా పసుపు వేసి పొడిపొడిగా ఉండేలా అన్నం వండుకోవాలి. ఈ అన్నాన్ని ఒక కంచంలో వేసి చల్లారనివ్వాలి. వాక్కాయలను శుభ్రంగా కడిగి మధ్యకు కోసి లోపలి గింజలను తీసివేయాలి. మిక్సీలో వాక్కాయ ముక్కలు, మూడు పచ్చి మిర్చి, అర చెంచా ఉప్పు వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని చిన్న గిన్నెలోకి తీసుకోవాలి.
- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి అందులో నాలుగు చెంచాల నూనె వేసి వేడి చేయాలి. ముందుగా పల్లీలు వేసి దోరగా వేపి పళ్లెంలోకి తీయాలి. తరవాత ఆవాలు, జీలకర్ర, పావు చెంచా పసుపు, ఇంగువ, ఎండు మిర్చి, పచ్చిశనగపప్పు, మినపప్పు, జీడిపప్పు, రెండు మధ్యకు చీల్చిన పచ్చి మిర్చి, కరివేపాకు వేసి దోరగా వేపాలి. తరవాత వాక్కాయల పేస్టు వేసి బాగా కలిపి నూనె పైకి తేలే వరకూ వేయించాలి. తరవాత ఇందులో చల్లారిన అన్నం, అర చెంచా ఉప్పు, వేయించిన పల్లీలు వేసి బాగా కలిపి స్టవ్ మీద నుంచి దించాలి. ఉప్పు సరిచూసుకోవాలి. ఇలా తయారుచేసుకున్న వాక్కాయ పులిహోరను వేడిగా తింటే బాగుంటుంది. చల్లారాక కూడా రుచిగానే ఉంటుంది.

చిట్కాలు

- వాక్కాయ ముక్కలను పేస్టు చేయకుండా తాలింపులో వేసుకుని కూడా పులిహోర తయారు చేసుకోవచ్చు.
- ఈ వాక్కాయ పులిహోరలో కొద్దిగా ఆవపిండి లేదా నువ్వుల పొడి కలిపితే మరింత రుచిగా ఉంటుంది.

వాక్కాయలతో ఊరగాయ



కావాల్సిన పదార్థాలు

తాజా వాక్కాయలు- పావు కిలో, కారం- నాలుగు చెంచాలు, ఉప్పు- మూడు చెంచాలు, ఆవపిండి- అర చెంచా, మెంతి పిండి- పావు చెంచా, పసుపు- పావు చెంచా, నూనె- అర కప్పు, వెల్లుల్లి రెబ్బలు- పది

తయారీ విధానం

- వాక్కాయలను ఉప్పు నీళ్లలో పది నిమిషాలు నానబెట్టాలి. తరవాత మంచినీళ్లు పోసి బాగా రుద్ది కడగాలి. వీటిని పొడిగుడ్డతో శుభ్రంగా తుడవాలి. వాటిని మధ్యకు కోసి గింజలు తీసివేయాలి. ఒక్కో వాక్కాయను పొడవుగా నాలుగు ముక్కలుగా కోయాలి.
- ఒక వెడల్పాటి గిన్నెలో వాక్కాయ ముక్కలు, కారం, ఉప్పు, పసుపు, ఆవపిండి, మెంతిపిండి, వెల్లుల్లి రెబ్బలు వేసి బాగా కలపాలి. తరవాత నూనె పోసి కలపాలి. మూత పెట్టి మూడు రోజులు ఊరనివ్వాలి. తరవాత మరోసారి ఊరగాయను బాగా కలిపి గాజు సీసాలో లేదంటే జాడీలో భద్రపరచుకోవాలి. ఇది ఆర్నెల్లు నిల్వ ఉంటుంది. వేడి అన్నం, ఉప్మా, దోశ, వడల్లోకి రుచిగా ఉంటుంది.

చిట్కాలు

- వాక్కాయలను కోసేటప్పుడు వాటికి ఏమాత్రం తడి ఉండకూడదు. చాకు, గిన్నె కూడా పొడిగా ఉండాలి.
- నువ్వుల నూనె లేదా పల్లీల నూనె వేసుకోవచ్చు. ఈ ఊరగాయ మీద నూనె తేలుతూ ఉండాలి.
- రాళ్ల ఉప్పును పొడి చేసి వేస్తే ఊరగాయ ఎక్కువ రోజులు నిల్వ ఉంటుంది.

వాక్కాయ చికెన్



కావాల్సిన పదార్థాలు

చికెన్ ముక్కలు- అర కేజీ, వాక్కాయలు- పావు కేజీ, ఉల్లిపాయలు- రెండు, పచ్చిమిర్చి- మూడు, నూనె- మూడు చెంచాలు, పసుపు- పావు చెంచా, అల్లం వెల్లుల్లి పేస్టు- ఒక చెంచా, ధనియాల పొడి- ఒక చెంచా, గరం మసాలా పొడి- అర చెంచా, కారం- మూడు చెంచాలు, ఉప్పు- ఒకటిన్నర చెంచాలు, కొత్తిమీర తరుగు- కొద్దిగా

తయారీ విధానం

- వాక్కాయలు, చికెన్ ముక్కలను విడివిడిగా నీళ్లతో శుభ్రంగా కడిగి పెట్టుకోవాలి. వాక్కాయలను మధ్యకు కోసి లోపలి గింజలను తీసివేయాలి. ఒక ఉల్లిపాయను సన్నగా తరగాలి. మరోదాన్ని నాలుగు బద్దలుగా కోయాలి. మిక్సీలో వాక్కాయ ముక్కలు వేసి మెత్తగా గ్రైండ్ చేసి గిన్నెలోకి తీయాలి. అలాగే మిక్సీలో పచ్చిమిర్చి, ఉల్లిపాయ బద్దలు వేసి పేస్టులా గ్రైండ్ చేసి పెట్టుకోవాలి.
- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి నూనె వేసి వేడి చేయాలి. అందులో సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి-ఉల్లిపాయ పేస్టు, పసుపు, అల్లం వెల్లుల్లి పేస్టు వేసి బాగా కలిపి దోరగా వేపాలి. తరవాత చికెన్ ముక్కలు, కారం వేసి కలపాలి. గిన్నెమీద మూత పెట్టి పావుగంటసేపు మగ్గించాలి. మధ్యమధ్యలో మూత తీసి కలుపుతూ ఉండాలి. తరవాత ధనియాల పొడి వేసి కలిపి ఒక గ్లాసు నీళ్లు పోసి మూతపెట్టి అయిదు నిమిషాలు ఉడికించాలి. తరవాత వాక్కాయల పేస్టు, ఉప్పు వేసి కలపాలి. అయిదు నిమిషాల తరవాత గరం మసాలా, కొత్తిమీర తరుగు వేసి బాగా కలిపి స్టవ్ మీద నుంచి దించాలి. ఇలా తయారు చేసుకున్న వాక్కాయ చికెన్ వేడి అన్నం, చపాతీ, పుల్కాల్లోకి రుచిగా ఉంటుంది.

చిట్కాలు

- చికెన్ ముక్కలను మరీ మెత్తగా ఉడికించకూడదు.
- గ్రేవీ చిక్కగా కావాలనుకుంటే అర చెంచా కార్న్‌ఫ్లోర్‌ను పావు కప్పు నీళ్లలో కలిపి... ఉడుకుతున్న కూరమీద చిలకరించాలి.

వాక్కాయలను తినడం వల్ల మూత్రనాళాలు శుభ్రపడతాయి. మూత్రపిండాల్లో రాళ్లు కరిగిపోతాయి. మధుమేహం నియంత్రణలో ఉంటుంది. వాక్కాయల రసం తాగితే గుండె జబ్బులు మాయమవుతాయి. హార్మోన్లు సమతుల్యంగా పనిచేస్తాయి. పెప్టిక్ అల్సర్ తగ్గుతుంది. ఊపిరితిత్తులు, మెదడు ఆరోగ్యంగా పనిచేస్తాయి.

వాక్కాయల్లో అత్యధికంగా సి విటమిన్, ఐరన్, పీచుపదార్థాలు ఉంటాయి. వాక్కాయలను తరచూ తినడం వల్ల శరీరంలో ఎర్ర రక్తకణాల సంఖ్య పెరుగుతుంది. రక్తహీనత, స్కర్వీ, డయేరియా, ఇన్‌ఫ్లమేషన్ సమస్యలు తగ్గుతాయి. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. కొల్లాజెన్ ఉత్పత్తి పెరిగి చర్మం నిగారింపును సంతరించుకుంటుంది.

పిల్లలకు పోషకాహారం...

పిల్లలకు ఆహారం తినిపించడం అనేది తల్లిదండ్రులకు ఒక సవాల్ అనే చెప్పాలి. వాళ్లు తినేది కొద్ది మాత్రమే అయినప్పటికీ అందులోనే పోషకాలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లలకు ఎలాంటి ఆహారాన్ని ఏ విధంగా పెట్టాలో తెలుసుకుందాం...

- పెరిగే పిల్లలకు ఎక్కువగా పిండిపదార్థాలు, ప్రోటీన్లు, కొవ్వులు, విటమిన్లు అవసరమవుతాయి. కాబట్టి వాళ్లు తినే ఆహారంలో అన్నం, చపాతీ, పరాటా, పప్పు, పనీర్, గుడ్లు, మాంసం, నెయ్యి, గింజలు, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు ఉండేలా చూడాలి. వంటకాల్లో ఉప్పు, కారం, మసాలా పొడులు, ఆవాలు, జీలకర్ర , ధనియాలు, పసుపు లాంటివి తగుమాత్రంలో వాడుతూ ఉండాలి.
- పిల్లలకు ఆహారం మీద ఆసక్తి కలిగేలా మాట్లాడుతూ తినిపించాలి. ఒకేసారి ఎక్కువగా కాకుండా కొద్దికొద్దిగా పెడుతూ ఉండాలి. దీనివల్ల పిల్లల్లో జీర్ణక్రియ మెరుగుపడుతుంది.
- కొంతమంది పిల్లలు భోజనం కంటే అల్పాహారాన్నే ఎక్కువగా ఇష్టపడుతూ ఉంటారు. అలాంటప్పుడు పిల్లలకు చిరుధాన్యాలతో తయారుచేసిన చిరుతిండ్లు, కూరగాయల చిప్స్, గ్రిల్ చేసిన కూరగాయల ముక్కలు పెట్టవచ్చు. కూరగాయలు ఉడికించిన నీళ్లతో సూప్ తయారు చేసి తాగించవచ్చు. మొలకెత్తిన శనగలు, పెసలతో గుగ్గిళ్లు చేసి తినిపించవచ్చు. తాజా పండ్లు, డ్రైఫ్రూట్స్ పెట్టవచ్చు.
- కొంచెం పెద్ద పిల్లల ముందు రకరకాల కూరగాయలను ఉంచి వాటి గురించి వివరిస్తూ ఉండాలి. పిల్లలకు ఇష్టమైన కూరలు, పండ్లు ఏవో అడిగి తెలుసుకోవాలి. కూరగాయలను తరిగేటప్పుడు వాటిని వండేటప్పుడు పిల్లల సహాయం తీసుకోవాలి. ఇలా చేయడం వల్ల ఆ వంటకాల మీద ఆసక్తి కలిగి పిల్లలు ఇష్టంగా తింటారు.
- బడికి వెళ్లే పిల్లలకు రుచిగా ఉండేలా ఆహారపదార్థాలు తయారు చేయాలి. చూడడానికి ఆకర్షణీయంగా ఉండేలా బాక్సుల్లో సర్దాలి. పిల్లలకు స్వయంగా భోజనం చేయడం నేర్పించాలి. తోటి పిల్లలతో పంచుకుని తినడాన్ని ప్రోత్సహించాలి. రాత్రి సమయంలో పిల్లలను దగ్గర కూర్చోబెట్టుకుని కుటుంబ సభ్యులంతా కలిసి భోజనం చేయడం అలవాటు చేసుకోవాలి.




భోజనకుతూహలం

అలసటకు విరుగుడు అవిసె ఆకుల టీ

'భోజన కుతూహలం' గ్రంథంలో అవిసె మొక్క గురించి విశేషంగా ప్రస్తావించారు. చిక్కుడు జాతికి చెందిన ఈ మొక్క ఆకులకు.. గింజలకు అనేక ఔషధ గుణాలు ఉన్నాయి. ఈ మొక్క మొగ్గలు పక్షి ఆకారంలో ఉంటాయి. అందువల్ల ఇంగ్లీషు వారు ఈ మొక్కను హమ్మింగ్ బర్డ్ వెజిటబుల్ అని కూడా పిలుస్తారు. ఈ మధ్యకాలంలో అవిసె గింజల నూనెను వాడమని అనేక మంది వైద్య నిపుణులు సిఫారసు చేస్తున్నారు. అంతే కాదు.. అగస్త్య రసాయనం అనే ఆయుర్వేద ఔషధం ఈ ఆకులతోనే తయారవుతుంది. దీనిని అనేక వ్యాధుల నివారణ కోసం ఉపయోగిస్తారు. ఈ మొక్కకు ఉన్న ఔషధ గుణాల గురించి తెలుసుకుందాం.

- అవిసె మొక్క ఆకులతో కూర, పప్పు, పచ్చడి చేసుకొని క్రమం తప్పకుండా తింటే తీవ్రమైన మైగ్రేన్ కూడా తగ్గుతుంది. రెటీనా సమస్యలకు ఇది మంచి మందు. 'భావప్రకాశ' గ్రంథంలో ఈ మొక్క ఆకులు కంటి సమస్యలన్నింటినీ తగ్గిస్తాయని పేర్కొన్నారు.
- ఒత్తిడి ఎక్కువగా ఉన్నవారు ఈ మొక్క పువ్వులను ముద్దగా నూరి తలకు పట్టిస్తే ఒత్తిడి తగ్గుతుంది. మంచి నిద్ర పడుతుంది.
- ఈ మొక్క నీరసాన్ని తగ్గించి తక్షణమే శక్తిని ఇస్తుంది. బాగా అలసిపోయినప్పుడు అవిసె ఆకులతో టీ బాగా పనిచేస్తుంది.
- వైరల్ జ్వరాలు వచ్చినప్పుడు- ఈ ఆకులను నీటిలో వేసి బాగా మరిగించి.. ఆ కషాయంలో తేనె కలిపి తాగితే మంచి ఫలితాలు లభిస్తాయి.
- అవిసె ఆకులు శరీరంలోని విషదోషాలను పోగొడతాయి. ఈ ఆకుల కషాయం వాతాన్ని.. పైత్యాన్ని అదుపు చేస్తుంది.
- కడుపులో నులిపురుగులకు ఈ మొక్క ఆకులు మంచి విరుగుడు. అవిసె ఆకుల రసాన్ని క్రమం తప్పకుండా తీసుకుంటే ప్రేగులు శక్తిమంతమవుతాయి. అమీబియాసిస్ వంటి వ్యాధులున్నవారికి మంచిది.



- గంగరాజు అరుణాదేవి

చూయింగ్ గమ్ అంటుకుందా..?

దుస్తులకు చూయింగ్ గమ్ అంటుకుంటే ఒక పట్టాన వదలదు. దీన్ని చిన్న చిట్కాలతో సులువుగా తొలగించవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఆ చిట్కాలు...

- చూయింగ్ గమ్ అంటుకున్న డ్రెస్‌ను వేడి నీళ్లలో ముంచాలి. తరవాత ఆ ప్రదేశంలో పాత టూత్ బ్రష్‌తో రుద్దితే సమస్య తీరుతుంది.
- స్టవ్ మీద గిన్నె పెట్టి అందులో రెండు చెంచాల వెనిగర్ వేసి వేడిచేయాలి. ఈ వేడి వెనిగర్‌ని చూయింగ్ గమ్ అంటిన చోట వేయాలి. రెండు నిమిషాల తరవాత డ్రెస్ నుంచి చూయింగ్ గమ్ విడిపోతుంది.
- దుస్తులకు అంటుకున్న చూయింగ్ గమ్ మీద ఒక ఐస్‌ముక్కను పెట్టాలి. కొద్దిసేపటి తరవాత చేత్తో తీసేస్తే గమ్ వచ్చేస్తుంది.
- ఇస్త్రీ చేసే టేబుల్ మీద ఒక కాగితాన్ని ఉంచాలి. దీనిపై చూయింగ్ గమ్ అంటుకున్న భాగం కిందికి వచ్చేలా డ్రెస్‌ను పరచాలి. పైన చిన్న చేతి రుమాలు వేసి దాని మీద ఇస్త్రీ చేయాలి. వేడికి కరిగి చూయిగ్ గమ్ కాగితానికి అతుక్కుంటుంది.
- చూయింగ్ గమ్ అంటుకున్న చోట కొద్దిగా హెయిర్ స్ప్రే చిలకరించాలి. తరవాత చేత్తో తీయడానికి ప్రయత్నిస్తే కొద్దికొద్దిగా గమ్ వచ్చేస్తుంది. మరోసారి హెయిర్‌స్ప్రే చల్లితే పూర్తిగా తీసేయవచ్చు.
- కొద్దిగా షాంపూ లేదా సర్ఫ్ నీళ్లు చల్లి బ్రష్‌తో రుద్దినా కూడా దుస్తులకు అంటిన చూయింగ్ గమ్ వదిలిపోతుంది.



ఆంధ్రజ్యోతి
చిత్రజ్యోతి
★ SINCE 1965 ★
శనివారం
2 ఆగస్టు 2025





భారతీయ చిత్ర పరిశ్రమకు 2023 సంవత్సరానికి గాను 71వ జాతీయ పురస్కారాలను కేంద్రం శుక్రవారం ప్రకటించింది. విధు వినోద్ చోప్రా తెరకెక్కించిన 'ట్వల్త్ ఫెయిల్' ఉత్తమ చిత్రంగా నిలిచింది. షారుక్ ఖాన్ (జవాన్), విక్రాంత్ మాస్సే(ట్వల్త్ ఫెయిల్) సంయుక్తంగా ఉత్తమ నటుడి అవార్డుకు ఎంపికయ్యారు. అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఈ పురస్కారాల రేసులో టాలీవుడ్ సత్తాచాటింది. ఏకంగా ఏడు పురస్కారాలను దక్కించుకుంది. అనిల్ రావిపూడి దర్శకత్వంలో బాలకృష్ణ కథానాయకుడిగా తెరకెక్కిన 'భగవంత్ కేసరి' ప్రాంతీయ చిత్రాల విభాగంలో ఉత్తమ తెలుగు సినిమాగా ఎంపికైంది. చిన్న చిత్రంగా విడుదలై సంచలన విజయం సాధించిన 'హను-మాన్' చిత్రానికి.. 'ఉత్తమ యానిమేషన్- విజువల్ ఎఫెక్ట్స్', 'యాక్షన్ కొరియోగ్రఫీ' విభాగాల్లో రెండు అవార్డులు దక్కాయి. యువతరాన్ని విశేషంగా ఆకట్టుకున్న 'బేబీ' చిత్రంతో.. ఉత్తమ స్క్రీన్ ప్లే రచయితగా చిత్ర దర్శకుడు సాయి రాజేశ్, ఉత్తమ గాయకుడుగా పీవీఎన్ఎస్ రోహిత్ ఎంపికయ్యారు. 'బలగం' చిత్రంలోని 'ఊరూ పల్లెటూరు' అంటూ అందరి హృదయాలను హత్తుకునేలా పాట రాసిన కాసర్ల శ్యామ్‌కు ఉత్తమ గేయ రచయితగా జాతీయ అవార్డు దక్కింది.

జాతీయ అవార్డులు.. సత్తా చాటిన తెలుగు సినిమా



● ఉత్తమ నటులుగా షారుక్, విక్రాంత్ ● టాలీవుడ్‌కు ఏకంగా ఏడు అవార్డులు

33 ఏళ్ల కెరీర్‌లో...

బాలీవుడ్ కింగ్ ఖాన్ షారుక్‌ఖాన్‌ను తొలిసారిగా జాతీయ ఉత్తమ చలన చిత్ర నటుడు పురస్కారం వరించింది. 2023లో విడుదలైన 'జవాన్' చిత్రంలో నటనకు గాను ఆయన ఈ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ సినిమాను తమిళ దర్శకుడు అట్లీ తెరకెక్కించారు. బాక్సాఫీసును షేక్ చేసి ఏకంగా రూ.1000 కోట్లకుపైగా వసూళ్లు సాధించింది. షారుక్‌ఖాన్ తొలుత తన కెరీర్‌ను బుల్లి తెరతో ప్రారంభించారు. అనంతరం చలనచిత్ర రంగ ప్రవేశం చేశారు. ఆయన నటించిన తొలి చిత్రం 'దీవానా'. 1992లో విడుదలైన ఈ చిత్రం ఇండస్ట్రీ హిట్‌గా నిలిచింది. షారుక్ తన 33 ఏళ్ల సినీ కెరీర్‌లో ఎన్నో ఎత్తుపల్లాలు చవి చూశారు. 'డర్', 'బాజీగర్', ' దిల్‌సే', 'దిల్‌వాలే దుల్హనియా లేజాయెంగే', 'కుచ్ కుచ్ హోతా హై', 'దేవదాస్', 'వీర్-జరా', 'కల్ హో న హో', 'పహేలి', 'స్వదేశ్' , 'చెక్ దే ఇండియా', 'మై నేమ్ ఈజ్ ఖాన్', 'పఠాన్' వంటి చిత్రాలు షారుక్‌ఖాన్ కెరీర్‌లో మైలు రాళ్లుగా నిలిచాయి. కాగా, 2005లో షారుక్ ఖాన్‌కు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డును బహూకరించింది.

తొలి జాతీయ అవార్డ్



మూడు పదుల నట జీవితంలో ఉత్తమ నటిగా తనకు ఇది తొలి జాతీయ అవార్డ్ అని నటి రాణీ ముఖర్జీ ఉద్వేగంతో చెప్పారు. తనకు ఈ అవార్డ్ రావడానికి కారకులైన 'మిసెస్ చటర్జీ వర్సెస్ నార్వే' యూనిట్ సభ్యులకు, దర్శకనిర్మాతలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. నటిగా తన 30 ఏళ్ల కష్టానికి తగ్గ ఫలితం ఇదనీ, సినిమా అంటే ఉన్న ప్రేమ, అభిమానం ఇప్పుడు జాతీయ అవార్డ్ వరకూ తీసుకువచ్చిందని రాణీ చెప్పారు.

కష్టానికి తగ్గ ఫలితం



'ధూమ్ మచావో ధూమ్' షోతో బుల్లి తెరపై తన నట ప్రస్థానాన్ని ప్రారంభించారు విక్రాంత్ మాస్సే. 2009లో 'బాలికా వధు' టీవీ షో ద్వారా పాపులర్ అయ్యారు. 2013లో 'లుటేరా' చిత్రంతో సినీ రంగ ప్రవేశం చేశారు. 'జిన్నీ వెడ్స్ సన్నీ', 'హసీన్ దిల్ రూబా', 'లవ్ హాస్టల్', 'ట్వెల్త్ ఫెయిల్', 'సెక్టార్ 36', 'సబర్మతీ ఎక్స్‌ప్రెస్' చిత్రాలతో మంచి పేరు గడించారు. '12 ఫెయిల్' చిత్రంలో సహజంగా నటించేందుకు విక్రాంత్ పడిన కష్టం అంతా ఇంతా కాదు. సినిమాలో నల్లగా కనిపించాలని దర్శకుడు వినోద్ చోప్రా చెప్పడంతో శరీరానికి ఆవనూనె పట్టించి రోజూ మూడు గంటల పాటు ఎండలో గడిపారు విక్రాంత్. దీని వల్ల స్కిన్ ఇన్‌ఫెక్షన్ వచ్చినా ఆయన లెక్క చేయలేదు. ఆ కష్టానికి ఫలితం ఇప్పుడు జాతీయ అవార్డ్ రూపంలో దక్కింది.

ప్రతిభకు పట్టం

'వాతి' అనే తమిళ సినిమాకు గాను జాతీయ ఉత్తమ సంగీత దర్శకుడిగా ఎంపికయ్యారు జీవీ ప్రకాశ్ కుమార్. ఆయన మొదటి సారిగా తన మేనమామ ఏ.ఆర్.రెహమాన్ సంగీత దర్శకత్వంలో వచ్చిన 'జెంటిల్మేన్' సినిమాకు సౌండ్ ట్రాక్ విభాగంలో పనిచేశారు. శంకర్ నిర్మాణ సారథ్యంలో, వసంత బాలన్ దర్శకత్వంలో వచ్చిన 'వేయిల్' అనే తమిళ సినిమాతో సంగీత దర్శకుడిగా మారారు. తెలుగులో 'లక్కీ భాస్కర్', 'మట్కా', 'రాబిన్ హుడ్' చిత్రాలకు సంగీతం అందించారు.

ట్వల్త్ ఫెయిల్ కాదు



ఎన్నో అవమానాలు, మరెన్నో విమర్శలు మధ్య నిజాయితీగా గెలిచిన విజయవంతమైన చిత్రం 'ట్వల్త్ ఫెయిల్'. 'ఈ ఏడాది మీరు కేవలం ఒకే ఒక్క సినిమా చూడదలుచుకుంటే కచ్చితంగా 'ట్వల్త్ ఫెయిల్' చూడండి' అంటూ ఆ చిత్రం విడుదలైన సమయంలో పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా నెటిజన్లకు సూచించారు. జాతీయ ఉత్తమ నటుడి పురస్కారానికి అర్హమైన నటనను కనబరచారు అంటూ అప్పట్లోనే ఆయన విక్రాంత్ మాస్సేను అభినందించారు కూడా. ఇప్పుడు ఆయన అంచనా నిజమైంది. 'ట్వల్త్ ఫెయిల్' ఉత్తమ జాతీయ చిత్రంగా నిలవగా, విక్రాంత్ మాస్సేకు ఉత్తమ నటుడి పురస్కారం దక్కింది. పన్నెండో తరగతి ఫెయిలైనా పట్టుదలతో సివిల్స్ సాధించి ఐపీఎస్‌కు సెలెక్టయ్యారు మనోజ్‌కుమార్ శర్మ. ఆయన జీవిత కథ ఆధారంగా అనురాగ్ పాఠక్ రాసిన పుస్తకం 'ట్వల్త్ ఫెయిల్'. అదే పేరుతో రూపుదిద్దుకున్న చిత్రమిది. పన్నెండో తరగతి తప్పిన యువకుడు సివిల్స్‌ను లక్ష్యంగా ఎంచుకోవడం, ఆ క్రమంలో మనోజ్‌కు ఎదురైన సవాళ్లను స్ఫూర్తిదాయకంగా తెరపైన ఆవిష్కరించిన తీరు ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఎన్నో విజయవంతమైన చిత్రాలను అందించిన బాలీవుడ్ దిగ్గజ దర్శకుడు విధు వినోద్ చోప్రా 13 ఏళ్ల విరామం తర్వాత 'ట్వల్త్ ఫెయిల్' కోసం మళ్లీ మెగాఫోన్ పట్టారు. అంతేకాదు కథ, నిర్మాణం, ఎడిటింగ్ బాధ్యతలను తన భుజాన వేసుకున్నారు.

నిర్మాతల సహకారం వల్లే



సంపూర్ణేష్ బాబు హీరోగా 2014లో వచ్చిన 'హృదయ కాలేయం' సినిమాతో తెలుగు తెరకు దర్శకుడిగా పరిచయమయ్యారు నీలం సాయి రాజేష్. ఆ తర్వాత 'కొబ్బరి మట్ట', 'కలర్ ఫొటో' చిత్రాలకు పనిచేశారు. 2023లో 'బేబి' సినిమాతో దర్శకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ సినిమా స్క్రీన్‌ప్లేకు గాను జాతీయ ఉత్తమ స్క్రీన్‌ప్లే రచయితగా అవార్డు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'బెస్ట్ స్క్రీన్‌ప్లే, బెస్ట్ మేల్ సింగర్..ఇలా రెండు జాతీయ అవార్డులు 'బేబీ' సినిమాకు రావడం ఆనందంగా ఉంది. స్క్రీన్‌ప్లేకి జాతీయ అవార్డు రావడమనేది చాలా పెద్ద విషయం. నన్ను నమ్మి నాతో సినిమా తీసిన నిర్మాతలకు నా ధన్యవాదాలు' అని అన్నారు.

ఆదరణ... అవార్డులు

హీరోల ఇమేజ్‌ను వాడుకుంటూ మూస ధోరణిలో సినిమాలు చేయడానికే ఎక్కువ మంది యువ దర్శకులు ప్రయత్నిస్తున్న తరుణంలో అనిల్ రావిపూడి మాత్రం బాలకృష్ణ లాంటి ఫైర్ బ్రాండ్‌ను పెట్టుకొని 'భగవంత్ కేసరి' చిత్రంతో ఓ కొత్త ప్రయత్నం చేశారు. ఆడబిడ్డను సివంగిలా తయారుచేయాలనే సందేశాన్ని హృదయాలకు హత్తుకునేలా ఆవిష్కరించారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, లైంగిక వేధింపుల అంశాలను స్పృశిస్తూనే వాటికి మన ఇంటి నుంచే ఓ పరిష్కారం రావాలంటూ చూపించిన తీరు ఆకట్టుకుంది. కొన్నాళ్లుగా అభిమానులను మాత్రమే మెప్పించే మాస్ పాత్రలతో వరుస సినిమాలు చేస్తున్న బాలకృష్ణ తన పంథా మార్చి తండ్రీ కూతుళ్ల బంధం చుట్టూ కథను అంగీకరించడమూ విశేషమే. బాలకృష్ణ సినిమా అంటే మాస్‌ను మెప్పించే హంగులు, భారీ పోరాటాలు, నేపథ్య సంగీతం ఎలివేషన్లతో థియేటర్లు దద్దరిల్లిపోవాలనే ట్రెండ్ ఉధృతంగా నడుస్తున్న టైమ్‌లో బాలకృష్ణ ఈ చిత్రంలో పిల్లలపై వాత్సల్యం కురిపించే పాత్ర చేశారు. ఆయనకు ఈ చిత్రంలో కథానాయికతో డ్యూయెట్ సైతం లేదు. స్టార్‌డమ్‌ను పక్కనపెట్టి తన పాత్ర పరిధి మేరకు ఆయన నటించారు. ఆ ప్రయత్నం వృథాగా పోలేదు. అప్పట్లో ప్రేక్షకులతో పాటు విమర్శకుల ప్రశంసలు దక్కించుకొన్న 'భగవంత్ కేసరి' నేడు జాతీయ పురస్కారాల్లో ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా ఎంపికవడం ద్వారా మరో ఘనతను సాధించింది. ఎలాంటి పరిస్థితుల్లో అయినా ఒక మహిళ ధైర్యంగా నిలబడాలి అనే సామాజిక స్పృహతో దర్శకుడు అనిల్ రావిపూడి ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. భయస్థురాలైన ఓ అమ్మాయి ధైర్యవంతురాలిగా మారేలా ప్రోత్సహించేలా మార్గదర్శకుడి పాత్రలో బాలకృష్ణ అద్భుతంగా నటించారు. స్నేహితుడి కూతురుకు తానే తండ్రై సాకడంతో పాటు ఓ సివంగిలా ఆమెను తీర్చిదిద్దేందుకు అహర్నిశలు శ్రమించే పాత్రను తన నటనతో రక్తికట్టించారు. ఆయన తెలంగాణ యాసలో చెప్పిన సంభాషణలు సైతం ఆకట్టుకున్నాయి. తెలంగాణ గద్దర్ పురస్కారాల్లో 2023లో ఉత్తమ తృతీయ చిత్రంగా 'భగవంత్ కేసరి' పురస్కారాన్ని దక్కించుకుంది. భగవంత్ కేసరి చిత్రానికి జాతీయ అవార్డు దక్కడానికి గల కారణాలను జ్యూరీ సభ్యులు వివరించారు. ఒక భయస్తురాలైన సాధారణ యువతి ధైర్యవంతురాలిగా ఎలా మారింది అనే చక్కటి కథాంశంతో ఈచిత్రం తెరకెక్కిందని జ్యూరీ ప్రశంసించింది. భావోద్వేగ సన్నివేశాలు, పోరాట ఘట్టాలు బలంగా ఉన్నాయని పేర్కొంది.



ఈ గౌరవం చిత్ర బృందానిదే!

జాతీయ పురస్కారాల్లో 'భగవత్ కేసరి' ఎంపిక కావడం నాకు అపారమైన గౌరవం. ఈ గౌరవం మొత్తం మా చిత్ర బృందానికే దక్కుతుంది. చిత్ర నిర్మాతలు సాహు గారపాటి, హరీష్ పెద్ది, ఈ కథను అద్భుతంగా ఆవిష్కరించిన దర్శకుడు అనిల్ రావిపూడి, అలాగే ప్రతి కళాకారుడు, సాంకేతిక నిపుణుడు, సిబ్బంది అందరి కృషి వల్లే ఈ విజయం సాధ్యమైంది. ఈ గుర్తింపు మాకు మరింత స్ఫూర్తినిస్తూ..ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల హృదయాలను తాకే శక్తిమంతమైన కథలను అందించాలన్న మా తపనను మరింత బలపరుస్తోంది.

\- నందమూరి బాలకృష్ణ

బాధ్యత పెంచింది



'భగవంత్ కేసరి'కి జాతీయ స్థాయి గుర్తింపు రావడం పట్ల చిత్ర దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాత సాహు గారపాటి ఆనందం వ్యక్తం చేశారు. 'కథను నమ్మి మేము చేసిన ప్రయత్నానికి గుర్తింపు లభించడం ఆనందంగా ఉంది. ప్రతి సినిమాను బాధ్యతగా చేస్తాం. ఇప్పుడు అది మరింతగా పెరిగింది' అని అన్నారు.

పల్లె పాటకు గౌరవం



వరంగల్‌లో జన్మించిన కాసర్ల శ్యామ్ బాల్యం నుంచే కళల పట్ల ఆసక్తిని ఏర్పరచుకొన్నారు. సినిమాల్లోకి రాకముందు శ్యామ్ జానపద గీతాలు రాసి పాడారు. సుమారు 50కి పైగా ఆల్బమ్స్‌కి ఆయన పాటలు రాశారు. 2003లో జయ దర్శకత్వంలో తెరకెక్కిన 'చంటిగాడు' సినిమాతో శ్యామ్‌కు తొలి అవకాశం వచ్చింది. 2009లో వచ్చిన 'మహాత్మా' సినిమాలో రాసిన 'నీలపురి గాజుల ఓ నీలవేణి' పాటకు మంచి గుర్తింపు వచ్చింది. ఇప్పటి వరకు ఆయన వంద సినిమాల్లో 250కి పైగా పాటలు రాశారు. 'బలగం' సినిమాలో 'ఊరూ పల్లెటూరు' పాటకు జాతీయ స్థాయిలో ఉత్తమ గేయ రచయిత అవార్డు దక్కింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ' ఎందరో ప్రముఖుల తర్వాత 'ఊరు పల్లెటూరు' పాటకు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం అదృష్టంగా భావిస్తున్నా. ముఖ్యంగా తెలంగాణ సంస్కృతిని, తెలంగాణ పల్లె స్వచ్ఛతను, చాటి చెప్పిన ఈ పాట జాతీయ స్థాయిలో నాకు గుర్తింపు తీసుకొచ్చినందుకు తెలుగు వాడిగా చాలా సంతోషపడుతున్నా. ఈ అవార్డు రావడానికి కారణమైన చిత్ర దర్శకుడు వేణుకు, నిర్మాతలు హర్షిత్‌రెడ్డి, హర్షిత, దిల్‌రాజుకు ప్రత్యేక ధన్యవాదాలు. ఇంత మంచి పాటకు సంగీతం సమకూర్చిన భీమ్స్‌కు, గాయకులు రామ్ మిరియాల, మంగ్లీకి నా కృతజ్ఞతలు' అని అన్నారు.

విజేతలకు అభినందనలు...

తెలుగు చలన చిత్ర పరిశ్రమకు జాతీయ అవార్డులు రావడంపై పలువురు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు. నందమూరి బాలకృష్ణ నటించిన 'భగవంత్‌కేసరి' సినిమాకు జాతీయ అవార్డు రావడం ఆనందంగా ఉందని, నాడు ప్రేక్షకాదరణ పొందిన ఈ చిత్రానికి ఇప్పుడు అవార్డులు కూడా రావడం గొప్ప విషయమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. తెలుగు సినిమా రంగానికి పలు పురస్కారాలు దక్కడం సంతోషంగా ఉందని, 'భగవంత్ కేసరి' చిత్రం ఉత్తమ తెలుగు చిత్రం పురస్కారానికి ఎంపికవడం ఆనందదాయకమని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. తెలుగు చిత్ర పరిశ్రమకు 7 అవార్డులు రావడం గర్వకారణమని తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు. తెలంగాణలోని పల్లెవాసనకు పట్టంకట్టి ఆ పరిమళాలను విశ్వవ్యాప్తం చేసిన 'బలగం' సినిమాకు అవార్డు రావడం 4 కోట్ల మంది ప్రజలకు ఎంతో గర్వకారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు.

ఉత్తమ బాలనటిగా సుకుమార్ తనయ



'గాంధీ తాత చెట్టు' చిత్రంలో నటనకు గాను జాతీయ ఉత్తమ బాలనటిగా మరో నలుగురితో కలసి సంయుక్తంగా అవార్డుకు ఎంపికయ్యారు. సుకృతి వేణి బండ్రెడ్డి. అందరి హృదయాల్ని తాకేలా, మనసుల్ని హత్తుకునేలా 'గాంధీ తాత చెట్టు' కథ ఉంటుంది. దర్శకుడు సుకుమార్ కుమార్తె అయిన సుకృతి వేణి బండ్రెడ్డి నటనకు అందరూ ముగ్ధులయ్యారు. మొదటి చిత్రంతోనే జాతీయ అవార్డు గెలిచిన సుకృతిని చిత్ర పరిశ్రమకు చెందిన పలువురు ప్రశంసించారు.





ఆంధ్రజ్యోతి

స్పోర్ట్స్

వరంగల్ ● శనివారం 2 ఆగస్టు 2025

సెమీస్‌కు తరుణ్, లక్ష్య

» సాత్విక్ జోడీ అవుట్ » మకావు ఓపెన్



తరుణ్

మకావు: తెలుగు కుర్రాడు, వర్ధమాన షట్లర్ తరుణ్ మన్నేపల్లి మకావు ఓపెన్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో టైటిల్ దిశగా దూసుకెళ్తున్నాడు. ప్రీక్వార్టర్స్‌లో టాప్‌సీడ్‌కు షాకిచ్చి సంచలనం సృష్టించిన తరుణ్, అదే జోరులో సెమీఫైనల్‌కు చేరాడు. క్వార్టర్స్‌లో తరుణ్ 21-12, 13-21, 21-18తో చైనాకు చెందిన హు ఝెను ఓడించాడు. మరో భారత షట్లర్ లక్ష్య సేన్ కూడా సెమీస్ చేరాడు. క్వార్టర్స్‌లో సేన్ 21-14, 18-21, 21-14తో గ్సువాన్ చెన్ ఝూ (చైనా)పై గెలిచాడు. కాగా, డబుల్స్‌లో భారత స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ శెట్టి పోరాటం క్వార్టర్స్‌కే పరిమితమైంది. సాత్విక్ ద్వయం 14-21, 21-13, 20-22తో మలేసియా జంట చూంగ్ హాన్ జియాన్/హైకల్ మహ్మద్ చేతిలో ఓటమి పాలైంది. ఫైనల్లో చోటు కోసం అల్వి ఫర్హాన్ (ఇండోనేసియా)తో లక్ష్య, జస్టిన్ హో (మలేసియా)తో తరుణ్ అమీతుమీ తేల్చుకోనున్నారు.

చైనా చిన్నది..పతకం పట్టేసింది

ప్రపంచ స్విమ్మింగ్ రిలేలో జిడికి కాంస్యం



సింగపూర్: చైనాకు చెందిన 12 ఏళ్ల యు జిడి.. ప్రపంచ స్విమ్మింగ్ చాంపియన్‌షి‌ప్‌లో కాంస్యం అందుకుంది. 4x200 మీటర్ల ఫ్రీస్టయిల్ టీమ్ రిలే ఈవెంట్ ఫైనల్లో జిడి లేకుండానే చైనా జట్టు బరిలోకి దిగింది. అయితే ప్రిలిమ్స్‌లో పాల్గొన్నందున జట్టు సభ్యురాలిగా జిడి కూడా పతకం అందుకుంది. ఇక ఫైనల్లో ఆస్ట్రేలియాకు స్వర్ణం, అమెరికాకు రజతం లభించాయి. ఇప్పటికే 200 మీటర్ల బటర్‌ఫ్లయ్, మెడ్లే వ్యక్తిగత విభాగాల్లోనూ పోటీపడ్డ జిడి.. ఆ రెండు ఈవెంట్లలోనూ నాలుగో స్థానంలో నిలిచింది. జిడి... ఇంకా 400 మీటర్ల వ్యక్తిగత మెడ్లే ఈవెంట్‌లో పోటీపడాల్సి ఉంది.

ఆకాంక్ష, సంచిత్‌కు స్వర్ణ పతకాలు

హైదరాబాద్: దక్షిణ కొరియాలో ఇటీవల జరిగిన ఆసియా రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో ఎండూరు ఆకాంక్ష, సంచిత్ చౌదరి స్వర్ణ పతకాలు సాధించారు. హైదరాబాద్‌కు చెందిన వీరు సీనియర్ షో గ్రూప్ విభాగంలో ఈ పతకాలు అందుకున్నారు.



జట్టు నుంచి బుమ్రా విడుదల

ప్రకటించిన బీసీసీఐ



లండన్/న్యూఢిల్లీ: పేస్ దళపతి జస్ప్రీత్ బుమ్రాను జాతీయ జట్టునుంచి విడుదలజేశారు. ముందు ప్రకటించినట్టుగా ఇంగ్లండ్‌తో ఐదు టెస్ట్‌ల సిరీస్‌లో మూడు మ్యాచ్‌లను బుమ్రా ఆడేయడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు బీసీసీఐ శుక్రవారం వెల్లడించింది. ఈ నేపథ్యంలో బుమ్రా ఆడే తదుపరి అంతర్జాతీయ సిరీస్ ఏదనే చర్చ మొదలైంది. 31 ఏళ్ల బుమ్రా ఇంగ్లండ్‌తో 3 టెస్ట్‌ల్లో 119.4 ఓవర్లు వేసి 14 వికెట్లు సాధించాడు. 'సిరీస్‌లో ఐదో టెస్ట్‌కు జట్టు నుంచి బుమ్రాను విడుదలజేశాం' అని బీసీసీఐ ఆ ప్రకటనలో తెలిపింది. సిరీస్‌లో ఒకటి, మూడవ టెస్ట్‌లలో బుమ్రా ఐదేసి వికెట్లు తీశాడు. మాంచెస్టర్‌లో జరిగిన నాలుగో టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో 100 పరుగులకుపైగా సమర్పించుకున్నాడు. కెరీర్‌లో బుమ్రా ఇంత భారీగా పరుగులు ఇవ్వడం అదే మొదటిసారి కావడం గమనార్హం.

ఆసియా కప్‌లో ఆడేనా?: భారత్ ఆడే తర్వాతి సిరీస్ ఆసియా కప్. ఈ టోర్నీ సెప్టెంబరు 9 నుంచి దుబాయ్‌లో జరగనుంది. అయితే ఆసియా కప్ ముగిసిన వారానికే వెస్టిండీస్‌తో భారత్ టెస్ట్ సిరీస్ ఆడాలి. దాంతో ఆసియా కప్ నుంచి బుమ్రా వైదొలిగినా ఆశ్చర్యం లేదంటున్నారు.

జాతీయ ఫుట్‌బాల్ కోచ్ జమీల్

చాన్నాళ్ల తర్వాత ఓ భారతీయుడి నియామకం



న్యూఢిల్లీ: సుదీర్ఘకాలం తర్వాత భారత పురుషుల ఫుట్‌బాల్ జట్టు ప్రధాన కోచ్‌గా మన దేశానికే చెందిన వ్యక్తి నియమితుడయ్యాడు. 48 ఏళ్ల ఖాలిద్ జమీల్‌ను కోచ్‌గా ఎంపిక చేసినట్టు భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్) శుక్రవారం వెల్లడించింది. స్టీఫెన్ కాన్‌స్టాంటిన్ (ఇంగ్లండ్), స్టెఫాన్ తర్కోవిచ్ (స్లొవేకియా)లను వెనక్కినెట్టి జమీల్ ఈ పదవి దక్కించుకున్నాడు. స్పెయిన్‌కు చెందిన మార్క్వెజ్ రాజీనామా చేయడంతో ఫుట్‌బాల్ కోచ్ పదవి ఖాళీ అయ్యింది. కువైట్‌లో జన్మించిన జమీల్ గల్ఫ్ యుద్ధం (1990-91) సమయంలో కుటుంబంతో ముంబై వచ్చి స్థిరపడ్డాడు. దిగ్గజ ఫుట్‌బాలర్ బైచుంగ్ భూటియా సమకాలికుడైన జమీల్ 1997లో బంగ్లాదేశ్‌పై శాఫ్ కప్ మ్యాచ్ ద్వారా జాతీయ జట్టుకు అరంగేట్రం చేశాడు.

పేసర్ వోక్స్ అవుట్



లండన్: భారత్‌తో జరుగుతున్న ఐదో టెస్టుకు ఇంగ్లండ్ పేసర్ క్రిస్ వోక్స్ గాయంతో దూరమయ్యాడు. తొలి రోజు లాంగ్ ఆఫ్‌లో ఫీల్డింగ్ చేస్తున్న వోక్స్.. కరుణ్ నాయర్ కొట్టిన బంతిని ఆపే ప్రయత్నంలో డైవ్ చేశాడు. అయితే ఈ క్రమంలో తన శరీర బరువంతా ఎడమ భుజంపై పడడంతో గాయమైంది. స్కానింగ్‌లో భుజం ఎముక స్థానభ్రంశం అయినట్టు తేలింది. దీంతో ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో అతడు బ్యాటింగ్‌కూ దూరమయ్యాడు. బౌలింగ్‌లోనూ జట్టుకు టంగ్, ఒవర్టన్, అట్కిన్సన్‌లపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

పసిడి పోరుకు భారత రెజ్లర్

అండర్-17 ప్రపంచ చాంపియన్‌షిప్

ఏథెన్స్ (గ్రీస్): భారత యువ రెజ్లర్ ల్యాకీ అండర్-17 ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో ఫైనల్ చేరాడు. 110 కిలోల విభాగం సెమీఫైనల్లో ల్యాకీ 15-7తో అమీర్‌హుస్సేన్ (ఇరాన్)ను చిత్తుచేసి పసిడి పోరులో ప్రవేశించాడు.

3 రోజుల్లోనే ముగించారు

తొలి టెస్ట్‌లో జింబాబ్వేపై కివీస్ ఘన విజయం

బులవాయో: జింబాబ్వేతో తొలి టెస్ట్‌ను మూడు రోజుల్లోనే ముగించేసిన న్యూజిలాండ్ 9 వికెట్లతో ఘన విజయం అందుకుంది. రెండు టెస్ట్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో నిలిచింది. 8 పరుగుల లక్ష్యాన్ని కివీస్ ఒక వికెట్ కోల్పోయి ఛేదించింది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 31/2తో శుక్రవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన జింబాబ్వే 165 రన్స్‌కు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో జింబాబ్వే 149, కివీస్ 307 పరుగులు చేశాయి.

ఇక.. బ్యాటర్లదే భారం

భారత్ రెండో ఇన్నింగ్స్ 75/2
ప్రస్తుత ఆధిక్యం 52
ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 247
ప్రసిద్ధ్, సిరాజ్‌లకు నాలుగేసి వికెట్లు



జైస్వాల్ (51 బ్యాటింగ్)



సిరాజ్ (4/86)కు గిల్ అభినందన

లండన్: భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య జరుగుతున్న ఆఖరి టెస్టు సైతం రసవత్తరంగా సాగుతోంది. బౌలర్లు హవా చూపిన రెండో రోజు ఆటలో ఏకంగా 15 వికెట్లు నేలకూలడం విశేషం. మరోవైపు ఇంగ్లండ్ బాజ్‌బాల్ ఆటకు భారత పేసర్లు ప్రసిద్ధ్ క్రిష్ణ (4/62), సిరాజ్ (4/86) ముకుతాడు వేయగా.. వారికి దక్కిన ఆధిక్యం కేవలం 23 పరుగులు మాత్రమే. ఇక చివరి సెషన్‌లో భారత్ రెండో ఇన్నింగ్స్ ఆరంభించగా, ఓపెనర్ యశస్వి జైస్వాల్ (51 బ్యాటింగ్) ఎదురుదాడికి దిగాడు. దీంతో శుక్రవారం వెలుతురులేమితో ఆట ముగిసే సమయానికి 18 ఓవర్లలో 75/2 స్కోరుతో నిలిచింది. ప్రస్తుతం 52 పరుగుల ఆధిక్యంలో ఉన్న భారత్‌కు మూడో రోజు ఆట అత్యంత కీలకం కానుంది. తొలి సెషన్‌లో ఇంగ్లండ్ పేసర్లను దీటుగా ఎదుర్కోవడంపైనే భారీ ఆధిక్యం ఆధారపడి ఉంటుంది. అంతకు ముందు భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 224 పరుగులు చేయగా కరుణ్ నాయర్ (57), సుందర్ (26) రాణించారు. అట్కిన్సన్‌కు 5, టంగ్‌కు 3 వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 247 పరుగులు చేసింది. క్రాలే (64), బ్రూక్ (53), డకెట్ (43) ఆకట్టుకున్నారు.

ఓపెనర్ల దంచుడు: భారత బ్యాటర్లు తడబడిన చోట ఇంగ్లండ్ ఓపెనర్లు క్రాలే, డకెట్ బ్యాట్లు ఝుళిపించారు. ప్రతీ బౌలర్‌ను బాదేస్తూ ఈ సెషన్‌లో ఆడిన 16 ఓవర్లలోనే 109 పరుగులు సాధించారు. ఈ జోడీ ధాటికి పేసర్లు ఆకాశ్, సిరాజ్, ప్రసిద్ధ్ బౌండరీల రూపంలో ధారాళంగా పరుగులిచ్చుకున్నారు. ముఖ్యంగా డకెట్ టీ20 శైలిలో చెలరేగడంతో తొలి ఏడు ఓవర్లలోనే జట్టు 51 పరుగులతో నిలిచింది. చివరికి ఆకాశ్ ఓవర్‌లో రివర్స్ స్కూప్‌నకు యత్నించి కీపర్ జురెల్‌కు క్యాచ్ ఇచ్చాడు. కానీ అప్పటికే తొలి వికెట్‌కు 77 బంతుల్లోనే 92 పరుగులు జత చేరాయి. ఆ తర్వాత లంచ్‌కు ముందు క్రాలే ఓ ఫోర్‌తో 42 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేశాడు.

వికెట్ల వేట: రెండో సెషన్‌లో భారత పేసర్లు ఒక్కసారిగా జూలు విదిల్చారు. ముఖ్యంగా సిరాజ్, ప్రసిద్ధ్ చక్కటి లైన్ అండ్ లెంగ్త్‌తో బంతులు వేసి ఆరు వికెట్లను పడగొట్టారు. జోరు మీదున్న క్రాలేను ఆరంభంలోనే ప్రసిద్ధ్ దెబ్బతీశాడు. అనంతరం పోప్‌నకు రూట్ జత కలవడంతో ఇక బౌలర్లకు కష్టాలు తప్పవనిపించింది. కానీ కెప్టెన్ గిల్ బంతిని సిరాజ్‌కు ఇవ్వగా తను ఏకబిగిన ఏడు ఓవర్లపాటు బౌలింగ్ చేసి వికెట్ల వేట సాగించాడు. కట్టుదిట్టమైన బంతులతో ఇంగ్లండ్ బ్యాటర్లను ఉక్కిరిబిక్కిరి చేశాడు. ఈక్రమంలో ముందుగా అతడు పోప్ (22), రూట్ (29), బెథెల్ (6)లను ఎల్బీగా పెవిలియన్‌కు చేర్చాడు. ఆ తర్వాత ప్రసిద్ధ్ 43వ ఓవర్‌లో స్మిత్ (8), ఒవర్టన్ (0)లను అవుట్ చేశాడు. ఈ దెబ్బకు టీ బ్రేక్ సమయానికి ఇంగ్లండ్ 215/7 స్కోరుతో ఉంది. చివరి సెషన్‌లో అట్కిన్సన్ (11)ను ప్రసిద్ధ్ అవుట్ చేశాక వర్షంతో ఆట దాదాపు గంటపాటు ఆగింది. కాసేపటికే బ్రూక్‌ను సిరాజ్ బౌల్డ్ చేయడంతో ఇంగ్లండ్ 23 రన్స్ ఆధిక్యంతో ఇన్నింగ్స్ ముగిసింది. గాయం కారణంగా వోక్స్ బ్యాటింగ్ చేయలేదు.

జైస్వాల్ దూకుడు: ప్రత్యర్థికి స్వల్ప ఆధిక్యమే దక్కేలా చేసిన జోష్‌లో భారత్ రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగింది. ఓపెనర్ జైస్వాల్ ఆది నుంచే వేగం చూపాడు. అటు డిఫెన్స్‌కు పరిమితమైన రాహుల్ (7)ను పదో ఓవర్‌లో టంగ్ అవుట్ చేయడంతో తొలి వికెట్‌కు 46 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అతడి ఓవర్‌లోనే జైస్వాల్ ఇచ్చిన సులువైన క్యాచ్‌ను డీప్ ఫైన్ లెగ్‌లో డాసన్ వదిలేశాడు. అయితే సుదర్శన్ (11)కు కూడా ఓసారి లైఫ్ లభించినా అట్కిన్సన్‌కు దొరికిపోయాడు. కాసేపటికి సరైన వెలుతురు లేకపోవడంతో 15 నిమిషాల ముందుగానే ఆటను ఆపేశారు.

1 టెస్టుల్లో భారత్‌పై ఎక్కువ (8) 50+ భాగస్వామ్యాలు నమోదు చేసిన ఓపెనింగ్ జోడీగా క్రాలే-డకెట్. గ్రీనిడ్జ్-హేన్స్ (విండీస్)తో సమంగా నిలిచారు.

2 స్వదేశంలో జరిగిన టెస్టుల్లో ఎక్కువ పరుగులు (ఇంగ్లండ్‌లో 7220) సాధించిన రెండో బ్యాటర్‌గా రూట్. పాంటింగ్ (ఆసీస్‌లో 7578) ముందున్నాడు.

స్కోరుబోర్డు



అట్కిన్సన్ (5/33)

భారత్

తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (ఎల్బీ) అట్కిన్సన్ 2, రాహుల్ (బి) వోక్స్ 14, సుదర్శన్ (సి) స్మిత్ (బి) టంగ్ 38, గిల్ (రనౌట్) 21, నాయర్ (ఎల్బీ) టంగ్ 57, జడేజా (సి) స్మిత్ (బి) టంగ్ 9, జురెల్ (సి) బ్రూక్ (బి) అట్కిన్సన్ 19, సుందర్ (సి) ఒవర్టన్ (బి) అట్కిన్సన్ 26, ఆకాశ్‌దీప్ (నాటౌట్) 0, సిరాజ్ (బి) అట్కిన్సన్ 0, ప్రసిద్ధ్ (సి) స్మిత్ (బి) అట్కిన్సన్ 0, **ఎక్స్‌ట్రాలు: 38; మొత్తం: 69.4 ఓవర్లలో 224 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-10, 2-38, 3-83, 4-101, 5-123, 6-153, 7-218, 8-220, 9-224, 10-224; **బౌలింగ్:** వోక్స్ 14-1-46-1, అట్కిన్సన్ 21.4-8-33-5, టంగ్ 16-4-57-3, ఒవర్టన్ 16-0-66-0, బెథెల్ 2-1-4-0.

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: క్రాలే (సి) జడేజా (బి) ప్రసిద్ధ్ 64, డకెట్ (సి) జురెల్ (బి) ఆకాశ్ 43, పోప్ (ఎల్బీ) సిరాజ్ 22, రూట్ (ఎల్బీ) సిరాజ్ 29, బ్రూక్ (బి) సిరాజ్ 53, బెథెల్ (ఎల్బీ) 6, స్మిత్ (సి) రాహుల్ (బి) ప్రసిద్ధ్ 8, ఒవర్టన్ (ఎల్బీ) ప్రసిద్ధ్ 0, అట్కిన్సన్ (సి) ఆకాశ్ (బి) ప్రసిద్ధ్ 11, టంగ్ (నాటౌట్) 0, వోక్స్ (ఆబ్సెంట్ హర్ట్), **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 51.2 ఓవర్లలో 247; వికెట్ల పతనం:** 1-92, 2-129, 3-142, 4-175, 5-195, 6-215, 7-215, 8-235, 9-247; **బౌలింగ్:** సిరాజ్ 16.2-1-86-4, ఆకాశ్ 17-0-80-1, ప్రసిద్ధ్ 16-1-62-4, జడేజా 2-0-11-0.

భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (బ్యాటింగ్) 51, రాహుల్ (సి) రూట్ (బి) టంగ్ 7, సుదర్శన్ (ఎల్బీ) అట్కిన్సన్ 11, ఆకాశ్‌దీప్ (బ్యాటింగ్) 4, **ఎక్స్‌ట్రాలు: 2; మొత్తం: 18 ఓవర్లలో 75/2; వికెట్ల పతనం:** 1-46, 2-70; **బౌలింగ్:** అట్కిన్సన్ 6-2-26-1, టంగ్ 7-1-25-1, ఒవర్టన్ 5-1-22-0.

జీఎస్‌టీ వసూళ్లు రూ.1.96 లక్షల కోట్లు

గతనెలలో 67% పెరిగిన రిఫండ్లు



న్యూఢిల్లీ: ఈ ఏడాది జూలైలో వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) స్థూల వసూళ్లు వార్షిక ప్రాతిపదికన 7.5 శాతం వృద్ధితో రూ.1.96 లక్షల కోట్లకు చేరుకున్నాయి. గత ఏడాది జూలైలో జీఎస్‌టీ స్థూల ఆదాయం రూ.1.82 లక్షల కోట్లుగా నమోదు కాగా.. ఈ జూన్‌లో వసూళ్లు రూ.1.84 లక్షల కోట్లుగా ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన డేటా ప్రకారం.. గత నెలలో దేశీయంగా జీఎస్‌టీ ఆదాయం 6.7% వృద్ధితో రూ.1.43 కోట్లకు చేరగా.. దిగుమతులపై పన్ను వసూళ్లు 9.5% పెరిగి రూ.52,712 కోట్లుగా నమోదయ్యాయి. కాగా, గత నెలలో రిఫండ్లు 66.8% పెరిగి రూ.27,147 కోట్లకు చేరాయి. రిఫండ్లను మినహాయించగా, గత నెలకు జీఎస్‌టీ నికర వసూళ్లు 1.7% వృద్ధితో రూ.1.69 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. అంతర్జాతీయ ప్రతికూలతలు, తాత్కాలిక మందగమనం నేపథ్యంలోనూ దేశీయంగా వినియోగంతో పాటు ఆర్థిక వృద్ధి స్థిరంగానే ఉందని తాజా జీఎస్‌టీ గణాంకాలు సూచిస్తున్నాయని ఈవై ఇండియా ట్యాక్స్ పార్ట్‌నర్ సౌరభ్ అగర్వాల్ అన్నారు. అలాగే, సకాలంలో పన్ను రిఫండ్లు వ్యాపారులకు నిర్వహణ మూలధనం కొరత రాకుండా తోడ్పడగలవని ఆయన తెలిపారు.

తెలుగు రాష్ట్రాల్లో..

గత నెల తెలంగాణ జీఎస్‌టీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 10% వృద్ధితో రూ.5,417 కోట్లకు పెరిగింది. గత ఏడాది జూలైలో ఇది రూ.4,940 కోట్లుగా ఉంది. ఈ జూలైలో ఆంధ్రప్రదేశ్ జీఎస్‌టీ రెవెన్యూ 14% పెరిగి రూ.3,803 కోట్లకు పెరిగింది. 2024 జూలైలో వసూళ్లు రూ.3,346 కోట్లుగా నమోదయ్యాయి.

బిజినెస్

మార్కెట్లకు ట్రం'పోటు'!

సెన్సెక్స్ 586 పాయింట్లు డౌన్

రూ.5 లక్షల కోట్ల సంపద ఆవిరి



ముంబై: ట్రంప్ సుంకాల పోటుతో భారత స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా రెండో రోజూ భారీగా నష్టపోయాయి. శుక్రవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ ఒక దశలో 690 పాయింట్లు పతనమై 80,500 దిగువ స్థాయికి జారుకుంది. చివర్లో కాస్త కోలుకున్న సూచీ 585.67 పాయింట్ల నష్టంతో 80,599.91 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 203 పాయింట్లు కోల్పోయి 24,565.35 వద్ద ముగిసింది. ఈక్విటీ వర్గాల సంపదగా భావించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్క రోజులోనే రూ.5 లక్షల కోట్లకు పైగా తరిగిపోయి రూ.444.52 లక్షల కోట్లకు జారుకుంది. గురువారం ట్రేడింగ్‌లోనూ సెన్సెక్స్ 296 పాయింట్లు, నిఫ్టీ 86 పాయింట్లకు పైగా కోల్పోయాయి. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 23 నష్టపోగా.. సన్‌ఫార్మా 4.49% క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ ఏకంగా 47 పైసలు పెరిగి రూ.87.18 వద్ద ముగిసింది.

ఐదు వారాలుగా నెగిటివ్ జోన్‌లోనే..

ఈ వారం మొత్తానికి సెన్సెక్స్ 863.18 పాయింట్లు (1.05 శాతం), నిఫ్టీ 271.65 పాయింట్లు (1.09 శాతం) నష్టపోయాయి. నిఫ్టీ గడిచిన ఐదు వారాలుగా నష్టాల్లో కొనసాగుతోంది. సూచీ ఇన్ని వారాలుగా నష్టాల్లో కొనసాగడం 2023 ఆగస్టు తర్వాత మళ్లీ ఇదే మొదటిసారి.

సూచీల పతనానికి కారణాలివి..

భారత్‌పై 25 శాతం సహా ప్రపంచ దేశాలపై ట్రంప్ విధించిన సుంకాలు ఆగస్టు 1 నుంచి అమల్లోకి వచ్చాయి. ఈ పరిణామం తమ ఎగుమతి వాణిజ్యంపై ప్రభావం చూపనుందన్న ఆందోళనలతో గ్లోబల్ మార్కెట్లతో పాటు దలాల్ స్ట్రీట్ ఇన్వెస్టర్లూ పెద్దఎత్తున అమ్మకాలకు పాల్పడ్డారు. ముఖ్యంగా ఫార్మా, మెటల్, ఐటీ రంగ షేర్లు అధిక ఒత్తిడికి లోనయ్యాయి. మన మార్కెట్ నుంచి విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐ) పెట్టుబడులను వెనక్కి తీసుకుంటుండటం, అంతర్జాతీయంగా డాలర్ బలోపేతం, కంపెనీల జూన్ త్రైమాసిక ఆర్థిక ఫలితాలు అంత ఆశాజనకంగా లేకపోవడం, టెక్నికల్ చార్టుల్లో సూచీలు కీలక మద్దతు స్థాయిలను కోల్పోవడం ట్రేడింగ్ సెంటిమెంట్‌ను మరింత బలహీనపరిచిందని మార్కెట్ విశ్లేషకులు పేర్కొన్నారు.

ఎన్ఎస్‌డీఎల్ ఐపీఓకు 41 రెట్ల స్పందన

నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ (ఎన్ఎస్‌డీఎల్) రూ.4,011 కోట్ల ఐపీఓకు భారీ స్పందన లభించింది. శుక్రవారంతో ముగిసిన ఈ ఐపీఓకు ఇష్యూ సైజుతో పోలిస్తే 41.01 రెట్ల సబ్‌స్క్రిప్షన్ నమోదైంది. క్యూఐబీలకు కేటాయించిన వాటా షేర్లకు ఏకంగా 103.97 రెట్ల బిడ్లు రాగా.. సంస్థాగతేతర ఇన్వెస్టర్ల వాటా షేర్లకు 34.98 రెట్లు, రిటైల్ ఇన్వెస్టర్ల నుంచి 7.73 రెట్ల బిడ్లు దాఖలయ్యాయి. ఎన్ఎస్‌డీఎల్.. ఈ నెల 6న షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేయనుంది.

విస్తరణ బాటలో రంగీతా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): స్నాప్‌డీల్ మాతృ సంస్థ ఏస్‌వెక్టర్‌కు చెందిన స్టెల్లారో బ్రాండ్స్.. ఎథ్నిక్ వేర్ బ్రాండ్ రంగీతా హైదరాబాద్‌లో తన కార్యకలాపాలు విస్తరించింది. ఇందులో భాగంగా మౌలాలిలో కొత్త స్టోర్‌ను ప్రారంభించినట్లు స్టెల్లారో బ్రాండ్స్ సీఈఓ హిమాన్షు చక్రవర్తి తెలిపారు. కాగా కంపెనీ ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో 7 స్టోర్లను నిర్వహిస్తోందన్నారు. కార్యకలాపాల విస్తరణలో భాగంగా తెలుగు రాష్ట్రాల్లోని ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లో కొత్తగా ఏడు షోరూమ్స్‌ను ఏర్పాటు చేయాలని చూస్తున్నట్లు చక్రవర్తి చెప్పారు.

బీఎస్ఎన్ఎల్ బంపర్ ఆఫర్!


రూపాయికే నెల రోజుల 4జీ ప్లాన్

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) కొత్త కస్టమర్లను ఆకర్షించేందుకు బంపర్ ఆఫర్ ప్రకటించింది. ఫ్రీడమ్ ప్లాన్ పేరుతో కేవలం రూపాయికే నెల రోజుల గడువుతో కూడిన 4జీ సేవల ప్లాన్‌ను శుక్రవారం ప్రవేశపెట్టింది. ఈ ఆఫర్ పరిమితకాలం పాటే అందుబాటులో ఉంటుందని సంస్థ స్పష్టం చేసింది. బీఎస్ఎన్ఎల్ దేశవ్యాప్తంగా తన 4జీ సేవలను ఈ మధ్యనే అందుబాటులోకి తీసుకువచ్చింది. స్వాతంత్ర్య దినోత్సవం వేడుకల సందర్భంగా సంస్థ దేశీయంగా అభివృద్ధి చేసిన 4జీ సేవలను రూపాయికే నెల రోజులపాటు వినియోగించుకునే అవకాశం కల్పిస్తోంది. బీఎస్ఎన్ఎల్ పోటీదారులైన రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా ఇదే తరహా ప్రీ-పెయిడ్ ప్లాన్‌ను నెలకు రూ.349-399 స్థాయిలో అందిస్తున్నాయి.

ఫ్రీడమ్ ప్లాన్ వివరాలు

- అపరిమిత వాయిస్ కాల్స్ (లోకల్/ఎస్‌టీడీ)
- రోజుకు 2జీబీ హైస్పీడ్ డేటా
- రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు
- ఉచిత బీఎస్ఎన్ఎల్ సిమ్

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



2వ తేదీ			
హైదరాబాద్	430	విజయవాడ	475
వరంగల్	432	గోదావరి	465
చిత్తూరు	503	విశాఖపట్నం	465
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	95	విజయవాడ	99
వరంగల్	95	గుంటూరు	104
కరీంనగర్	95	ఒంగోలు	107
మహబూబ్‌నగర్	95	చిత్తూరు	92
కర్నూలు	95	నెల్లూరు	97
విశాఖపట్నం	92	అనంతపురం	97
గోదావరి	99		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	99,820 ▼	91,500 ▼	1,23,000 ▼
విజయవాడ	1,01,300 ▼	95,500 ▼	1,13,000 ▼
విశాఖపట్నం	1,01,830 ▲	91,500 ▼	1,23,000 ▼
రాజమండ్రి	99,820 ▼	91,500 ▼	1,13,200 ▼
ప్రొద్దుటూరు	99,250 ▼	91,310 ▼	1,13,200 ▼
ముంబై	98,253 ▼	90,000 ▼	1,09,646 ▼

ఐడీబీఐ బ్యాంక్‌లో వాటాల విక్రయానికి అక్టోబరులో ఆర్థిక బిడ్స్

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని ఐడీబీఐ బ్యాంక్‌లో వ్యూహాత్మక వాటాల విక్రయాన్ని త్వరితగతిన పూర్తి చేయటానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. బ్యాంక్‌లో వాటాల విక్రయానికి సంబంధించి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తృతీయ త్రైమాసికం (అక్టోబరు-డిసెంబరు)లో ఆర్థిక (ఫైనాన్షియల్) బిడ్స్‌ను ఆహ్వానించనున్నట్లు డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ పబ్లిక్ అసెట్ మేనేజ్‌మెంట్ (దీపమ్) కార్యదర్శి అరుణీష్ చావ్లా వెల్లడించారు. విజయవంతమైన బిడ్డర్‌ను వచ్చే ఏడాది మార్చిలో ప్రకటించే అవకాశం ఉందన్నారు. ఆసక్తి కలిగిన సంస్థలతో ఇప్పటికే ప్రాథమిక చర్చల ప్రక్రియ పూర్తయిందని, మూడో త్రైమాసికంలోనే బిడ్స్‌ను ఆహ్వానించే అవకాశం ఉందని భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. విజయవంతమైన బిడ్డర్‌ను ఎంపిక చేసిన అనంతరం అనుమతుల కోసం భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ)కు పంపించనున్నట్లు చావ్లా తెలిపారు. ఐడీబీఐ బ్యాంక్‌లో మొత్తం 60.72 శాతం వాటాల విక్రయానికి సంబంధించి ప్రభుత్వం, భారతీయ జీవిత బీమా కార్పొరేషన్ (ఎల్ఐసీ).. అక్టోబరు 2022లో ఇన్వెస్టర్ల నుంచి ఆసక్తి వ్యక్తీకరణ (ఈఓఐ)ను ఆహ్వానించాయి.

వేగం తగ్గిన వాహనం

జూలైలో నెమ్మదించిన విక్రయాలు

న్యూఢిల్లీ: జూలై నెలలో ప్యాసింజర్ వాహన టోకు విక్రయాలు మందగించాయి. దేశంలో అతిపెద్ద కార్ల కంపెనీ మారుతి సుజుకీ ఇండియా విక్రయాల్లో వార్షిక ప్రాతిపదికన స్వల్ప పెరుగుదల నమోదు కాగా.. టాటా మోటార్స్, హ్యుండయ్ మోటార్ అమ్మకాలు మాత్రం తగ్గాయి. మహీంద్రా అండ్ మహీంద్రా, కియా ఇండియా సేల్స్ మాత్రం వరుసగా రెండంకెల, ఏక అంకె వృద్ధిని నమోదు చేయగలిగాయి. గత ఏడాది జూలైలో మారుతి సుజుకీ దేశీయ విక్రయాలు 1,37,463 యూనిట్లుగా ఉండగా.. ఈ ఏడాది జూలైలో అమ్మకాలు 1,37,776 యూనిట్లకు పెరిగాయి. ఈ జూలైలో హ్యుండయ్ మోటార్ సేల్స్ 10% తగ్గి 43,973 యూనిట్లకు జారుకోగా.. టాటా మోటార్స్ మొత్తం అమ్మకాలు 12% క్షీణించి 39,521 యూనిట్లకు పడిపోయాయి. మహీంద్రా అండ్ మహీంద్రా దేశీయ విక్రయాలు 20 శాతం వృద్ధితో 49,871 యూనిట్లకు పెరిగాయి. కంపెనీ యుటిలిటీ వాహనాలకు మార్కెట్లో అధిక డిమాండ్ నెలకొనడం ఇందుకు దోహదపడింది. కియా ఇండియా మొత్తం అమ్మకాలు 8 శాతం పెరిగి 22,135 యూనిట్లకు చేరుకోగా, టయోటా కిర్లోస్కర్ మోటార్ అమ్మకాలు 3 శాతం పెరుగుదలతో 32,575 యూనిట్లకు, హోండా కార్ల మొత్తం విక్రయాలు 3% వృద్ధితో 7,524 యూనిట్లుగా నమోదయ్యాయి. జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్స్ అమ్మకాలు మాత్రం ఏకంగా 46% పెరిగి 6,678 యూనిట్లకు చేరాయి.

టూవీలర్ ఓకే..

ద్విచక్ర వాహన విభాగంలో చాలా కంపెనీల అమ్మకాలు ఆశాజనకంగానే ఉన్నాయి. గత నెలలో హోండా మోటార్ సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా (హెచ్ఎంఎస్ఐ) దేశీయ విక్రయాలు 4,66,331 యూనిట్లుగా నమోదుకాగా.. హీరో మోటోకార్ప్ సేల్స్ 4,12,397 యూనిట్లకు ఎగబాకాయి. టీవీఎస్ మోటార్ దేశీయ విక్రయాలు 21% వృద్ధితో 3,08,720 యూనిట్లకు చేరగా.. రాయల్ ఎన్‌ఫీల్డ్ అమ్మకాలు 25 శాతం పెరిగి 76,254 యూనిట్లుగా నమోదయ్యాయి. దేశీయంగా బజాజ్ ఆటో టూవీలర్ సేల్స్ 18 శాతం తగ్గి 1,39,279 యూనిట్లకు పడిపోగా.. సుజుకీ మోటార్‌సైకిల్ అమ్మకాలు 96,029 యూనిట్లకు పరిమితమయ్యాయి.

రూ.44 కోట్లతో హైదరాబాద్ ప్లాంట్ విస్తరణ

ఏకేఎస్ఐ ఏరోస్పేస్

ముంబై: అంతర్జాతీయ డ్రోన్ తయారీదారు ఫిక్సర్ నుంచి రూ.85 కోట్ల ఆర్డర్‌ను అందుకున్నట్లు ఏకేఎస్ఐ ఏరోస్పేస్ గ్రూప్ వెల్లడించింది. కంపెనీ హైదరాబాద్‌లోని ప్లాంట్‌లో డ్రోన్ డిజైన్, డ్రోన్ సబ్‌సిస్టమ్స్ తయారీ సహా ఆటోపైలెట్స్, లిథియం బ్యాటరీలు, బ్యాటరీ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్ (బీఎంఎస్), నావిగేషన్ యూనిట్స్, కాంపోజిట్ ఎయిర్‌ఫ్రేమ్స్‌ను ఉత్పత్తి చేస్తోంది. కాగా వచ్చే రెండేళ్లలో రూ.44 కోట్ల పెట్టుబడితో హైదరాబాద్ ప్లాంట్ విస్తరణ, అప్‌గ్రేడేషన్ చేపట్టనున్నట్లు ఏకేఎస్ఐ ఏరోస్పేస్ ఎండీ పంకజ్ ఆకుల చెప్పారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత కంపెనీ దేశీయంగా తయారు చేసిన డ్రోన్ కాంపోనెంట్స్‌కు మంచి గుర్తింపు లభించిందన్నారు. కంపెనీ తయారు చేసిన డ్రోన్స్‌ను భారత సైనిక దళాలు పూర్తి స్థాయిలో వినియోగించుకున్నాయని ఆయన వివరించారు. కాగా వచ్చే ఆర్థిక సంవత్సరం నాటికి కంపెనీ టర్నోవర్ రూ.35 కోట్ల నుంచి రూ.70 కోట్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నట్లు పంకజ్ చెప్పారు.

బనకచర్లను అడ్డుకొని తీరతాం

» లోకేశ్ వ్యాఖ్యలపై సీఎం స్పందించరా?: హరీశ్ రావు



హైదరాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): "నిబంధనలకు విరుద్ధంగా.. తెలంగాణకు అన్యాయం జరిగేలా.. మీరు బనకచర్ల ప్రాజెక్టును కట్టితీరతామంటే.. మేం అడ్డుకొని తీరతాం" అని మాజీ మంత్రి హరీశ్ రావు ఏపీ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర బలం, రేవంత్ రెడ్డి అండ చూసుకొని.. కేంద్రం అనుమతులు సాధిస్తాం.. బనకచర్ల కట్టితీరతామని.. ఏపీ మంత్రి నారా లోకేశ్ తెగింపు మాటలు మాట్లాడుతున్నారన్నారు. ఏపీలో అధికారం, కేంద్రం మద్దతు ఉందని ఏదిపడితే అది మాట్లాడటం తగదని పేర్కొన్నారు. లోకేశ్ వ్యాఖ్యలపై తెలంగాణ ప్రభుత్వం ఇప్పటివరకు స్పందించలేదని, సీఎం, మంత్రులు ఎవరూ ఖండించకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. చంద్రబాబుకు గురుదక్షిణ చెల్లించడంతోపాటు ఢిల్లీ మెప్పుకోసం ప్రయత్నిస్తున్న రేవంత్‌కు రాష్ట్ర ప్రయోజనాలు పట్టడంలేదని విమర్శించారు. తెలంగాణ ప్రయోజనాలే తమకు ముఖ్యమని, బనకచర్లను ఆపేవరకు పోరాడతామని, అవసరమైతే.. బీఆర్ఎస్ సుప్రీం కోర్టుకు వెళ్తుందని చెప్పారు. తెలంగాణ హక్కులకు ఇబ్బంది కలగకుండా ఏపీలో ప్రాజెక్టులు కట్టుకుంటే అభ్యంతరం లేదన్నారు. సాగునీటి ప్రాజెక్టులపై లోకేశ్‌కు అవగాహన లేదని, అందుకే అలా మాట్లాడుతున్నారని విమర్శించారు. లోకేశ్ చెప్పేది నిజమైతే.. కేంద్రం పరిధిలోని నాలుగు సంస్థలు బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్‌ను ఎందుకు తిరస్కరించాయని ప్రశ్నించారు. మిగులు జలాలున్నాయని ఎవరు చెప్పారు?.. ఉంటే ఏపీకి ఎన్ని, తెలంగాణకు ఎన్ని టీఎంసీలు కేటాయించారో వెల్లడించాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు అనుమతుల్లేవని లోకేశ్ చెప్పడం అబద్ధమని, అది కొత్త ప్రాజెక్టు కాదని, ప్రాణహితలో అంతర్భాగం కాబట్టి.. రాష్ట్ర పునర్విభజన చట్టం వర్తించదని కేంద్రం స్పష్టంగా పేర్కొందని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టును టీడీపీ అడ్డుకోలేదని చెప్పడం తగదని, కాళేశ్వరాన్ని అడ్డుకునేందుకు చంద్రబాబు కేంద్రానికి ఏడు ఉత్తరాలు రాశారని వెల్లడించారు.

ఫార్మా రైతులకు రేవంత్ నమ్మకద్రోహం

» వారి భూములు తిరిగి ఇచ్చేవరకు పోరాడతాం: కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): అనుముల అన్నదమ్ముల కోసమే ఫ్యూచర్‌సిటీని నిర్మిస్తూ.. ఫార్మాసిటీ భూములను రైతులకు ఇవ్వకుండా రేవంత్‌రెడ్డి నమ్మకద్రోహానికి పాల్పడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. అడుగడుగునా అన్నదాతలు నిరసన వ్యక్తంచేస్తున్నా ముఖ్యమంత్రికి బుద్ధి రావడంలేదన్నారు. అధికారంలోకి వస్తే ఫార్మాసిటీని రద్దుచేసి భూములను తిరిగి ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం, ఇతర అవసరాలకు వాటిని మళ్లించడం దుర్మార్గమన్నారు. ఓవైపు ఫార్మాసిటీని రద్దుచేస్తున్నట్టు ప్రకటించి, మరోవైపు కొనసాగిస్తామని హైకోర్టులో అఫిడవిట్ దాఖలుచేసిన రేవంత్.. ప్రజలను, న్యాయస్థానాలను సైతం మోసం చేసిందన్నారు. ఫ్యూచర్‌సిటీకి అక్రమంగా భూములు కేటాయిస్తే చూస్తూ ఊరుకోమని, భూములు తిరిగి ఇచ్చేవరకు రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాడుతుందని కేటీఆర్ వెల్లడించారు.

లిక్కర్‌ను ప్రోత్సహించే కుట్ర: శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కల్తీ మద్యాన్ని అరికట్టలేని కాంగ్రెస్ ప్రభుత్వం.. కల్తీ కల్లు నివారణ పేరిట లిక్కర్ మాఫియాను ప్రోత్సహించేందుకు కుట్రలు చేస్తోందని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. ప్రజలపై భారంపడేలా మద్యం పాలసీని మార్చి.. మద్యం పైవచ్చే ఆదాయంతో ప్రభుత్వ ఖజానా నింపుకొంటామంటే.. చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. అధికారం చేపట్టిన నాటినుంచి బీసీలకు 42% రిజర్వేషన్ల పేరిట కాంగ్రెస్ మోసం చేస్తోందని, రిజర్వేషన్లు అమలు కాకపోతే.. ప్రభుత్వానికి శిరోముండనం తప్పదని బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రవణ్, వకుళాభరణం కృష్ణమోహన్ హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు.

కర్త కర్మ క్రియ కేసీఆరే

(మొదటిపేజీ తరువాయి)



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అందజేశారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు నిర్మించేందుకు మంత్రివర్గం ఆమోదం తీసుకోలేదని, మంత్రివర్గ ఉపసంఘం వేసినా.. దీనికి, ఆ బ్యారేజీలకు సంబంధమే లేదని పీసీ ఘోష్ కమిషన్ తేల్చింది. మంత్రివర్గ ఆమోదంతోనే బ్యారేజీలు నిర్మించినట్లు కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్‌లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు టి.హరీశ్‌రావు, ఈటల రాజేందర్ చెప్పగా.. అవన్నీ అవాస్తవాలేనని కమిషన్ నివేదికతో తేలింది. ఇక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రాణహిత-చేవెళ్ల ఎత్తిపోతల పథకంలో తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ కట్టకుండా.. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో బ్యారేజీలు కట్టాలన్న నిర్ణయానికి కర్మ, కర్త, క్రియ కేసీఆరేనని కమిషన్ వెల్లడించింది.

అది ఒక సాకు మాత్రమే!

తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యతపై కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) నివేదికను ఒక సాకుగా మాత్రమే వాడుకున్నారని కమిషన్ తెలిపింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో బ్యారేజీలు కట్టాలనే నిర్ణయం ముందే తీసుకొని నీటి లభ్యత లేదని సాకుగా మాత్రమే చూపించారని తప్పుపట్టింది. ఏ బ్యారేజీలు/డ్యామ్‌లు కట్టాలన్నా విధిగా ఇన్వెస్టిగేషన్‌లు జరగాలని, జియో టెక్నికల్/జియో ఫిజికల్ పరీక్షలు చేయాలని పేర్కొంది. కానీ.. కాళేశ్వరం బ్యారేజీల విషయంలో ఈ పరీక్షలను శాస్త్రీయ ప్రమాణాలతో చేయలేదని, కొన్నిచోట్ల పూర్తిస్థాయిలో కూడా జరపలేదని తెలిపింది. ఇలాంటి లోపాలతో బ్యారేజీలు నిర్మించడం 'బ్లండర్ మిస్టేక్' అని కమిషన్ వ్యాఖ్యానించింది. బ్యారేజీల నిర్మాణ క్రమంలో అప్పటి నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు నిబంధనలేవీ పాటించకుండా అడ్డగోలుగా మౌఖిక ఆదేశాలు జారీ చేశారని కమిషన్ పేర్కొంది. ఆ ఆదేశాల అమలు కూడా బ్యారేజీల నిర్మాణాన్ని ప్రభావితం చేసిందని తెలిపింది. మరోవైపు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏ మాత్రం బాగా లేకపోయినా.. కాళేశ్వరం ఎత్తిపోతల పథకం నిర్మాణంపై నిర్ణయం తీసుకోవడం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను కుదేలు చేస్తుందని తెలిసినా.. నాటి ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ (2014 జూన్ 2 నుంచి 2018 దాకా) మౌనం వహించారని కమిషన్ తప్పుబట్టింది. ఇది నేరపూరిత నిర్లక్ష్యమే అవుతుందని వ్యాఖ్యానించింది. ఇక ప్రతి నిర్ణయంలోనూ, కాళేశ్వరంతో ముడిపడిన ప్రతి సమావేశంలోనూ ఆనాటి సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్ పాత్ర ఉందని తెలిపింది. బ్యారేజీల నిర్మాణ నిర్ణయంలో అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితోపాటు నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శిగా/ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన శైలేంద్రకుమార్ జోషి (ఎస్కే జోషి) కూడా బాధ్యుడేనని పేర్కొంది.

నేరపూరిత నిర్లక్ష్యం!

"బ్యారేజీల నిర్మాణం 2016లో చేపట్టగా.. 2019 మే నెలలో ప్రారంభించారు. అదే సంవత్సరం బ్యారేజీల్లో నీటిని నిల్వ చేశారు. ఆ ఏడాది నవంబరులో బ్యారేజీల గేట్లు మూయగానే వాటి దిగువ భాగంలో అప్రాన్లు దెబ్బతిని.. సిమెంట్ కాంక్రీట్ బ్లాకులు కొట్టుకుపోయాయి. వరద ప్రవాహ ఉధృతిని సరిగా అంచనా వేయలేదు. ఇక బ్యారేజీల నుంచి దిగువకు వచ్చే నీటి శక్తిని నిర్వీర్యం చేసే విధంగా బ్యారేజీల దిగువ భాగంలో వ్యవస్థలను డిజైన్ చేయలేదు. దెబ్బతిన్న రక్షణ వ్యవస్థలను సరిచేయడానికి తగిన డిజైన్లు ఇవ్వాలని నిర్మాణ సంస్థ లేఖ రాసినా.. నాలుగేళ్లపాటు (2019 నవంబరు నుంచి 2023 అక్టోబరు 21న మేడిగడ్డ కుంగే దాకా) ఎటువంటి డిజైన్లు ఇవ్వకపోవడం నేరపూరిత నిర్లక్ష్యమే. మెయింటెనెన్స్ పనులు కూడా చేయలేదు. బ్యారేజీలు పూర్తికాకుండానే పూర్తయినట్లు కంప్లీషన్ సర్టిఫికెట్లు జారీ చేశారు. బ్యారేజీల వైఫల్యానికి నాటి ఈఎన్‌సీలు సి.మురళీధర్, నల్లా వెంకటేశ్వర్లు, బి.హరిరామ్, రామగుండం సీఈ సుధాకర్‌రెడ్డి, పలువురు అధికారులు కారకులు"అని కమిషన్ వివరించినట్లు తెలిసింది.

ఒక చోట ప్రతిపాదించి.. మరోచోట నిర్మాణం

అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణాన్ని ఒక చోట ప్రతిపాదించి.. మరో చోటికి గుడ్డిగా తరలించారని కమిషన్ వెల్లడించింది. ఈ క్రమంలో భూ భౌతిక/సాంకేతిక పరీక్షలను సరిగా జరపలేదని తేల్చింది. బ్యారేజీల డిజైన్లు/డ్రాయింగ్‌లకు పరీక్షలే కీలకమని, కానీ.. వాటిని శాస్త్రీయ ప్రమాణాలతో చేయలేదని గుర్తు చేసింది. బ్యారేజీల వైఫల్యానికి డిజైన్ల లోపం, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ లోపం, నిర్మాణ లోపం, నాణ్యత లోపాలున్నాయని వివరించింది. మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణం కోసం షీట్‌పైల్స్ వినియోగించాలని డిజైన్లు ఇవ్వగా.. సీకెంట్ పైల్స్ వినియోగించారని తెలిపింది. సీకెంట్ పైల్స్ అమరికలో లోపాలతో ఇసుక పైపింగ్ జరిగి.. బ్యారేజీ కుంగిపోయిందని వెల్లడించింది. దేశంలోని బ్యారేజీలన్నింటినీ నీటి మళ్లింపు కోసమే వినియోగిస్తారని, కాళేశ్వరంలో మాత్రం నీటిని నిల్వ చేశారని తప్పుబట్టింది. ఇది కూడా బ్యారేజీలు దెబ్బతినడానికి కారణమైందని పేర్కొంది. అయితే బ్యారేజీల్లో నీటి నిల్వ నిర్ణయం కేసీఆర్‌దేనని, ఆయన అనుమతి లేకుండా బ్యారేజీల్లో నీటిని ఖాళీ చేసే అవకాశం కూడా లేదని వివరించింది. "కానీ, 2021లో జాతీయ ఆనకట్టల భద్రత చట్టం వచ్చిన తర్వాత ఈ బ్యారేజీల నివేదికలేవీ సిద్ధం చేయలేదు. నిర్మాణంలో భారతీయ ప్రమాణాల కోడ్‌ను పాటించలేదు. గేట్ల ఆపరేషన్ షెడ్యూల్‌ను అమలు చేయలేదు" అని కమిషన్ వెల్లడించినట్లు తెలిసింది.

నివేదికపై త్రిసభ్య కమిటీ

పరిశీలించి.. సారాంశం సిద్ధం చేసే బాధ్యత

హైదరాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం బ్యారేజీలపై జస్టిస్ పినాకిచంద్ర ఘోష్ కమిషన్ ప్రభుత్వానికి సమర్పించిన నివేదికపై అధ్యయనం కోసం సర్కారు త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసింది. నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్, న్యాయశాఖ కార్యదర్శి రెండ్ల తిరుపతి సభ్యులుగా ఈ కమిటీని నియమించారు. ఈ కమిటీ.. నివేదికను ఆసాంతం పరిశీలించి సారాంశాన్ని (జిస్ట్) సిద్ధం చేయనుంది. కమిషన్ నివేదిక ఆధారంగా ఏయే చర్యలు తీసుకోవచ్చుననే కోణంలో న్యాయశాఖ కార్యదర్శి అధ్యయనం చేయనుండగా, ప్రాజెక్టు నిర్మాణం వల్ల జరిగిన నష్టం తీవ్రతను నీటిపారుదల ముఖ్యకార్యదర్శి అంచనా వేయనున్నారు. ఇక నివేదిక ఆధారంగా ముందుకెళ్లడానికి అవసరమైన సాధ్యాసాధ్యాలపై జీఏడీ ముఖ్యకార్యదర్శి దృష్టి సారించనున్నారు. ఈ మేరకే మూడు రంగాలకు చెందిన అధికారులను కమిటీలో చేర్చారు. మరోవైపు కాళేశ్వరం కమిషన్ నివేదికపై మాత్రమే చర్చించేందుకు సింగిల్ పాయింట్ ఎజెండాతో ఈ నెల 4న మంత్రివర్గం సమావేశం కానుంది. కాగా, శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో నివేదిక రెండు ప్రతులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అందుకున్నారు. సీల్డ్ కవర్‌లలో నివేదిక ప్రతులను నీటిపారుదలశాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, సంయుక్త కార్యదర్శి కె.శ్రీనివాస్ అందజేశారు. ఆ వెంటనే కమిటీ ఏర్పాటుపై సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 4న మంత్రివర్గ సమావేశంలో నివేదిక సారాంశాన్ని కమిటీ అందించనుంది. దాని ఆధారంగా.. ఏయే చర్యలు చేపట్టాలన్న నిర్ణయాన్ని ప్రభుత్వం తీసుకోనుంది. క్రిమినల్ కేసులు పెట్టాలా? లేక నేరపూరిత నిర్లక్ష్యం కింద కేసులకు ఉపక్రమించాలా? అనే దానిపై మంత్రివర్గంలో విస్తృతంగా చర్చించాక ప్రభుత్వం ముందుకెళ్లనుంది. ఈ నేపథ్యంలో 4న జరుగనున్న మంత్రివర్గ సమావేశం కీలకం కానుంది. మంత్రివర్గంలో చర్చించిన తర్వాత రానున్న అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో నివేదికను ప్రభుత్వం సభ ముందుంచే అవకాశాలు లేకపోలేదు. శాసనసభలో ప్రత్యేకంగా దీనిపై చర్చించాకే తదుపరి చర్యల దిశగా అడుగులు పడతాయని సమాచారం.

చర్యలు చేపడితే ఇదే తొలి నివేదిక..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కాళేశ్వరం బ్యారేజీలపై ఒక కమిషన్, విద్యుత్ కొనుగోలు ఒప్పందాలపై మరో కమిషన్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. విద్యుత్ నివేదికను జస్టిస్ మదన్ భీంరావు లోకూర్ ఇప్పటికే సమర్పించగా.. దీనిపై ప్రభుత్వం విస్తృతంగా చర్చించింది. ఇక కాళేశ్వరం బ్యారేజీలపై కూడా నివేదిక ప్రభుత్వానికి చేరింది. దీనిని అమలు చేస్తే ఉమ్మడి రాష్ట్రంలోనూ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత అమలైన తొలి నివేదికగా ఇది రికార్డులకు ఎక్కనుంది. విద్యుత్ నివేదిక చేతికి అందిన క్రమంలో.. కాళేశ్వరం నివేదిక అందిన తర్వాత రెండింటిని కలిపి అమలు చేసే విషయమై నిర్ణయం తీసుకుంటామని ప్రభుత్వం సంకేతాలు ఇచ్చింది. గతంలో పలు కమిషన్లు వేసినా.. వాటి నివేదికలేవీ అమలైన దాఖలాల్లేవు. దాంతో ఈ రెండు నివేదికల అమలు కార్యరూపం దాల్చుతుందా? అన్నది వేచి చూడాల్సిందే. ఇక ఉమ్మడి రాష్ట్రంలో ఏలేరు కాలువకు సంబంధించిన భూకుంభకోణంపై జస్టిస్ సోమశేఖర కమిషన్ వేయగా.. ఆ కమిషన్ రెండు దఫాలుగా విచారణ జరిపింది. అయితే నివేదిక ఇవ్వడానికి ముందే ఆ కమిషన్ ఏర్పాటును కొట్టివేస్తూ హైకోర్టు అప్పట్లో తీర్పు వెలువరించింది. జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారు. కాగా, విద్యుత్ విచారణ కమిషన్ చైర్మన్‌గా ఉన్న జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డిని విచారణ నుంచి తప్పిస్తూ కొన్ని నెలల కిందట సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. అయితే ఆ తర్వాత విద్యుత్ విచారణ కమిషన్ బాధ్యతలు తీసుకున్న కొద్ది రోజుల్లోనే జస్టిస్ మదన్ భీంరావు నివేదిక అందించారు.

ఏడాదిలో రూ.22,842 కోట్లు దోచేశారు!

భారత్‌లో పెరుగుతున్న సైబర్ నేరాలు.. 2024లో 22 లక్షలకుపైగా

» 'డేటా ల్యాబ్స్' సంస్థ నివేదిక వెల్లడి
» మహారాష్ట్ర, యూపీ, కర్ణాటక టాప్
» రాజ్యసభలో కేంద్రం ప్రకటన
» దేశంలో నిమిషానికి 761 సైబర్ దాడులు: డీఎస్‌సీఐ

న్యూఢిల్లీ, ఆగస్టు 1: ఒక్క ఏడాది.. ఏకంగా రూ.22,842 కోట్లు.. 2024-25 ఆర్థిక సంవత్సరంలో సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కి భారతీయులు పోగొట్టుకున్న సొమ్ము ఇది. అంతే కాదు గత ఏడాది తొలిమూడు నెలలతో పోలిస్తే.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) తొలి మూడు నెలల్లో ఎనిమిది రెట్లు అధికంగా సైబర్ నేరాలు జరిగినట్టు గుర్తించారు. ఢిల్లీకి చెందిన 'డేటా ల్యాబ్స్' సంస్థ తాజాగా విడుదల చేసిన నివేదికలో ఈ దిగ్భ్రాంతికర అంశాలను వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సైబర్ నేరాల బారినపడి సుమారు రూ.1.2 లక్షల కోట్లు కోల్పోయే అవకాశం ఉందని 'ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ)' అంచనా వేసినట్టు తెలిపింది. సైబర్ నేరాలతో భారతీయులు కోల్పోయిన మొత్తం 2022లో రూ.2,306 కోట్లు, 2023లో రూ.7,465 కోట్లు మాత్రమేనని వివరించింది. సైబర్ నేరాలకు సంబంధించి 2023లో 15.6 లక్షల ఫిర్యాదులు రాగా, 2024లో 20 లక్షల వరకు ఫిర్యాదులు అందాయని తెలిపింది. 2019తో పోలిస్తే ఈ సంఖ్య పది రెట్లు ఎక్కువని వెల్లడించింది.



స్మార్ట్‌ఫోన్లు, డిజిటల్ చెల్లింపులతో..

కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం ఈ ఏడాది జూన్ ఒక్క నెలలోనే దేశవ్యాప్తంగా రూ.24.03 లక్షల కోట్ల విలువైన యూపీఐ లావాదేవీలు జరిగాయి. ఇది సైబర్ నేరగాళ్లకు వరంగా మారింది. ఓటీపీ మోసాల నుంచి డిజిటల్ అరెస్ట్ దాకా కొత్త కొత్త విధానాలను అనుసరిస్తూ.. ప్రజల నుంచి సొమ్ము కొట్టేస్తున్నారు. వాట్సా‌ప్‌లో ప్రముఖులు, వ్యాపారవేత్తల చిత్రాలను ప్రొఫైల్ పిక్చర్‌గా పెట్టి, డీప్‌ఫేక్ వీడియోలు పంపి ఉద్యోగులను బురిడీ కొట్టించడం, యాప్‌లలో పెట్టుబడులపై భారీ లాభాల ఆశచూపి మోసగించడం, ప్రముఖ బ్యాంకుల నుంచి ఆరోగ్య బీమా, వాహన బీమా రెన్యూవల్ పేరిట కాల్స్ చేసి.. డెబిట్, క్రెడిట్‌కార్డులు, బ్యాంకు ఖాతాల నుంచి సొమ్ము కొల్లగొట్టడం, యువతులతో న్యూడ్ కాల్స్ చేయించి, మాట్లాడించి వాటిని బయటపెడతామని బెదిరించి వసూళ్లకు పాల్పడటం వంటివి పెరిగాయి.

నాలుగేళ్లలో నాలుగింతలు నేరాలు

దేశంలో సైబర్ నేరాల సంఖ్య విపరీతంగా పెరిగిపోతోందని, 2024లో 22 లక్షలకుపైగా సైబర్ నేరాలు జరిగాయని రాజ్యసభలో కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. 2021లో జరిగిన 4.5లక్షల సైబర్ నేరాలతో పోలిస్తే ఇది నాలుగు రెట్లు ఎక్కువని తెలిపింది. ఈ ఏడాది ఇప్పటికే 12 లక్షలకుపైగా సైబర్ నేరాలు నమోదయ్యాయని వెల్లడించింది. ఇందులో అత్యధికంగా మహారాష్ట్ర (1.6 లక్షల నేరాలు), ఉత్తరప్రదేశ్ (1.4 లక్షలు), కర్ణాటక (లక్ష నేరాలు)లో నేరాలు జరిగాయని తెలిపింది. మరోవైపు బాలలకు సంబంధించిన సైబర్ నేరాలూ పెరుగుతున్నాయని కేంద్రం తెలిపింది. 2018-2022 మధ్య చైల్డ్ పోర్నోగ్రఫీకి సంబంధించి 3వేలకుపైగా, పిల్లలపై ఆన్‌లైన్ వేధింపులకు సంబంధించి 500కుపైగా కేసులు నమోదయ్యాయని వెల్లడించింది. ఇక దేశంలో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు వెబ్‌సైట్లపై సైబర్ దాడులు కూడా బాగా పెరిగాయని 'డేటా సెక్యూరిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (డీఎస్‌సీఐ)' ఇటీవల వెల్లడించింది. దేశంలో ప్రతి నిమిషం 761 సైబర్ దాడులు జరుగుతున్నట్టు తెలిపింది. వినియోగదారుల డేటాను చోరీచేయడం, వెబ్‌సైట్లను బ్లాక్ చేసి సొమ్ముకోసం డిమాండ్ చేయడం పెరిగిందని వెల్లడించింది.

8 మందితో వివాహం.. తొమ్మిదో పెళ్లికి సిద్ధం

» మహారాష్ట్ర పోలీసులకు చిక్కిన నిత్య పెళ్లి కూతురు

నాగ్‌పూర్, ఆగస్టు 1: ఏకంగా ఎనిమిది పెళ్లిళ్లు చేసుకున్న ఓ నిత్య పెళ్లికూతురు.. తొమ్మిదో పెళ్లికి సిద్ధమవుతుండగా మహారాష్ట్ర పోలీసులకు చిక్కింది. సమీరా ఫాతిమా అనే ఉపాధ్యాయురాలు డబ్బు కోసం ముస్లిం సమాజంలోని ధనవంతులు, పెళ్లయిన పురుషులను లక్ష్యంగా చేసుకుంది. మ్యాట్రీమోనీ వెబ్‌సైట్లలో వారి వివరాలు సేకరించి ఫేస్‌బుక్, వాట్సాప్‌వంటి సామాజిక మాధ్యమాల్లో దగ్గరవుతుంది. అనుకోని పరిస్థితుల వల్ల విడాకులు తీసుకోవాల్సి వచ్చిందని, ఓ బిడ్డతో ఒంటరిగా ఉంటున్నానని కథలు చెప్పి నమ్మించి పెళ్లి చేసుకునేది. కొన్ని రోజులకు పథకం ప్రకారం వారి నుంచి డబ్బులు డిమాండ్ చేసేది. అవసరమైతే బెదిరించి వసూలు చేసేందుకు ఆమెకు ఒక ముఠా ఉంది. ఇలా గత 15ఏళ్లలో 8పెళ్లిళ్లు చేసుకుని బాధితుల నుంచి భారీగా డబ్బు వసూలు చేసినట్టు పోలీసులు తెలిపారు. సమీర తన నుంచి రూ.50 లక్షలు వసూలు చేసిందని ఆమె మాజీ భర్త ఒకరు ఆరోపించారు. ఆమె బాధితుల్లో రిజర్వ్ బ్యాంకు సీనియర్ అధికారులు ఉన్నారు.

భర్తకు లైంగిక సామర్థ్యం లేదనడం పరువు నష్టం కాదు: బాంబే హైకోర్టు

ముంబై, ఆగస్టు 1: భర్తకు లైంగిక సామర్థ్యంలేదని విడాకుల కేసు విచారణ సందర్భంగా భార్య ఆరోపించడం పరువు నష్టం కిందికి రాదని బాంబే హైకోర్టు స్పష్టం చేసింది. తన ప్రయోజనాలను కాపాడుకోవడం కోసం న్యాయవిచారణలో భాగంగా ఆమె అలాంటి ఆరోపణ చేయవచ్చని తెలిపింది. తన మాజీ భార్య, ఆమె కుటుంబ సభ్యులపై ఓ వ్యక్తి దాఖలు చేసిన పరువు నష్టం దావాను కొట్టివేస్తూ జస్టిస్ ఎస్.ఎం.మోదక్ ఈ మేరకు తీర్పు ఇచ్చారు.

త్వరలో కేంద్ర క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణ!

(మొదటిపేజీ తరువాయి)

ఆధారంగా తప్పించే అవకాశాలున్నాయని తెలుస్తోంది. వారిలో కొందరికి జాతీయ స్థాయిలో, రాష్ట్రాల్లో పార్టీ బాధ్యతలను అప్పగించాలని యోచిస్తున్నారు. కాగా.. ఉపరాష్ట్రపతి పదవికి నామినేషన్లు దాఖలు చేసేందుకు తుది గడువు ఆగస్టు 21 కావడం వల్ల.. బీజేపీ తరఫున నామినేషన్ దాఖలు చేసేది ఎవరనే అంశంపై మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరిగేలోపే స్పష్టతరానుంది. ఆ పదవికి.. రాజ్‌నాథ్ సింగ్, జగత్ ప్రకాశ్ నడ్డా వంటివారి పేర్లు వినిపించడంతోపాటు దక్షిణాది నుంచి బీసీని నియమించాలనే ప్రతిపాదనపైనా మంతనాలు జరుగుతున్నాయి. ఇక ఆగస్టు 15 తర్వాత బీజేపీ జాతీయ అధ్యక్షుడి ఎంపిక ప్రక్రియ కూడా ప్రారంభమవుతుందని, ఈ విషయంపై పార్టీ అగ్రనేతలకు మధ్య అవగాహన దాదాపు కుదిరినట్లేనని పార్టీ వర్గాలు తెలిపాయి. పార్టీ అధ్యక్ష పదవికి సంబంధించి శివరాజ్ సింగ్ చౌహాన్, ధర్మేంద్ర ప్రధాన్, మనోహర్ లాల్ ఖట్టర్, ప్రహ్లాద్ జోషి తదితరుల పేర్లు చర్చకు వస్తున్నాయి.

నాకొద్దీ మంత్రి పదవి..

కేంద్ర మంత్రివర్గం నుంచి తనకు విముక్తి కల్పించాల్సిందిగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్.. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాను కోరినట్లు తెలిసింది. ఈ బాధ్యతల కారణంగా తాను పార్టీలో క్రియాశీలంగా వ్యవహరించలేకపోతున్నానని.. తెలంగాణలో పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు పూర్తిస్థాయిలో కృషి చేయాలనుకుంటున్నానని వారికి ఆయన చెప్పినట్లు సమాచారం. సంఘ్ పెద్దల వద్ద కూడా బండి సంజయ్ తన మనోగతాన్ని వెల్లడించి వారి ఆమోదాన్ని పొందినట్టు విశ్వసనీయవర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఆయన స్థానంలో లక్ష్మణ్‌కు అవకాశం కల్పించే అవకాశం ఉన్నట్లు ఆ వర్గాలు వెల్లడించాయి. తెలంగాణలో ఇటీవల బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన రాంచందర్‌రావుకు అండగా బండి సంజయ్ విస్తృతంగా రాష్ట్ర పర్యటనలు చేపడతారని.. ఎట్టి పరిస్థితుల్లోనూ తెలంగాణలో పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు ఆయన కృతనిశ్చయంతో ఉన్నారని ఆ వర్గాలు పేర్కొన్నాయి.

ఇంటింటికీ సంస్కృతం చేరాలి: మోహన్ భాగవత్

నాగ్‌పూర్, ఆగస్టు 1: భారతదేశంలోని అన్ని భాషలకు సంస్కృతం మూలమని ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ అన్నారు. ఈ భాష దేశవ్యాప్తంగా ప్రతి ఇంటికీ చేరాలని, అందరూ సంస్కృతంలో మాట్లాడుకునేలా ఉండాలని ఆకాంక్షించారు. శుక్రవారం నాగపూర్‌లోని కవి కుల గురు కాళిదాస్ సంస్కృత విశ్వవిద్యాలయంలో నిర్మించిన అభినవ భారతి అంతర్జాతీయ విద్యా భవనం ప్రారంభోత్సవంలో ఆయన ప్రసంగించారు. సంస్కృతం మరింత అభివృద్ధి చెందాలంటే ప్రజలు తమ దైనందిన జీవితంలో వాడుక భాషగా ఉపయోగించాలని సూచించారు. మన నిజమైన గుర్తింపు భాషతోనే ముడిపడి ఉంటుందని పేర్కొన్నారు. సంస్కృతాన్ని తెలుసుకోవడమంటే దేశాన్ని అర్థం చేసుకున్నట్లేనని స్పష్టం చేశారు. ఈ ప్రాచీన భాషను ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలని భాగవత్ పిలుపునిచ్చారు.

మాలెగావ్ కేసులో భాగవత్‌ను అరెస్టు చేయాలన్నారు

» మహారాష్ట్ర ఏటీఎస్ అధికారి సంచలన ఆరోపణ

ముంబై, ఆగస్టు 1 : మాలెగావ్ పేలుళ్ల కేసును విచారించిన మహారాష్ట్ర తీవ్రవాద వ్యతిరేక దళం(ఏటీఎస్)లో పనిచేసిన ఓ అధికారి సంచలన ఆరోపణలు చేశారు. ఈ కేసుకు సంబంధించి ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్‌ను అరెస్టు చేయాలని దర్యాప్తు అధికారి పరమ్ వీర్ సింగ్ తనను ఆదేశించారని మెహబూబ్ ముజావర్ అనే రిటైర్డ్ పోలీసు అధికారి ఆరోపించారు. దేశంలో కాషాయ ఉగ్రవాదం ఉందనే వాదన సృష్టించాలని అలా ఆదేశించారని ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ వెల్లడించారు. పరమ్ వీర్ సింగ్, ఆయన పైనున్న అధికారులు కొందరు.. రామ్ కల్సంగ్రా, సందీప్ డాంగే, దిలీప్ పాటిదార్, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్‌లను అరెస్టు చేయాలని తనను ఆదేశించారని చెప్పారు. అప్పట్లో పరమ్ వీర్ సింగ్ చనిపోయిన వారిని బతికున్నట్లు చార్జిషీట్ రాయాలని తనను ఆదేశించారని పేర్కొన్నారు. ఆ ఆదేశాలను తాను తిరస్కరించడంతో తనను తప్పుడు కేసుల్లో ఇరికించారని పేర్కొన్నారు. అయితే వాటన్నిటి నుంచి తాను బయట పడ్డానన్నారు.

90 రోజుల నిర్వహణ దశలోకి నిసార్

న్యూఢిల్లీ, తిరువనంతపురం, ఆగస్టు 1: ఇస్రో-నాసా జంటగా ప్రయోగించిన నిసార్ ఉపగ్రహం కీలకమైన 90 రోజుల నిర్వహణ దశలోకి ప్రవేశించింది. ఈ దశలో శాస్త్రవేత్తలు భూపరిశీలన కోసం పూర్తిస్థాయిలో ఉపగ్రహాన్ని సిద్ధం చేయడానికి కొన్ని తనిఖీలు, కక్ష్య సర్దుబాట్లు చేపడతారు. 'నిసార్ ఉపగ్రహాన్ని 737 కిలోమీటర్ల ఎత్తులో ప్రవేశపెట్టాం. వాస్తవానికి దాన్ని 747 కిలోమీటర్లకు చేర్చాలి. ఇప్పుడు ఈ ప్రక్రియను పూర్తిచేయడానికి దాదాపు 40-50 రోజులు పడుతుంది' అని నాసా ఎర్త్ సైన్సెస్ డివిజన్‌లో నేచురల్ హజార్డ్స్ రిసెర్చ్ ప్రోగ్రామ్ మేనేజర్ జెరాల్డ్ డబ్ల్యూ బావ్డెన్ తెలిపారు.

విశ్రాంతి వయసులో జీవన పోరాటం

» దేశంలో వృద్ధులకు కరువైన ఆర్థిక భద్రత
» ఇతరులపై ఆధారపడ్డ 70 శాతం మంది
» పూటగడవాలంటే చాలామంది పని చేయాల్సిందే

న్యూఢిల్లీ, ఆగస్టు 1: వృద్ధాప్యం వచ్చాక విశ్రాంతి తీసుకుందామంటే దేశంలో చాలామందికి పూటగడిచే పరిస్థితి లేదు. సత్తువ లేకపోయినా పనిచేసి కడుపునింపుకోవాల్సిందే. ఇక 70% మంది ఆర్థికంగా ఇతరులపై ఆధారపడే జీవిస్తున్నారు. పలువురికి ఆర్థిక, ఆరోగ్య భద్రత లేకుండా పోయాయి. ఇదీ దేశంలో వృద్ధుల పరిస్థితి అని ఓ అధ్యయన నివేదిక తాజాగా వెల్లడించింది. 'భారతదేశంలో వృద్ధాప్యం.. సవాళ్లు, అవకాశాలు' అనే అంశంపై నీతి ఆయోగ్, సామాజిక న్యాయ, సాధికారిత మంత్రిత్వ శాఖ, జాతీయ మానవ హక్కుల కమిషన్ భాగస్వామ్యంతో శంకలా ఫౌండేషన్ సంస్థ ఓ అధ్యయనం నిర్వహించి నివేదిక విడుదల చేసింది. దేశంలో వేగంగా పెరుగుతున్న వృద్ధాప్య జనాభాపై లాంగిట్యూడినల్ ఏజింగ్ స్టడీ ఇన్ ఇండియా (ఎల్ఏఎస్ఐ) పేర్కొన్న అంశాలను ఆ



నివేదికలో వివరణాత్మకంగా విశ్లేషించింది. పలువురు వృద్ధులు పస్తులతోనే రోజులు గడుపుతున్నారని వెల్లడించింది. చాలామందిలో శారీరక, మానసిక సమస్యలు పెరిగిపోతున్నాయని పేర్కొంది.

నివేదికలోని ముఖ్య అంశాలు..

» దేశంలో 6.4% మంది వృద్ధులకు భోజన పరిమాణం తగ్గిపోయింది. 5.6% మంది ఆకలితో అలమటిస్తున్నారు. ఏడాదిలో కనీసం ఒకరోజు పస్తులుండే వారు 4.2 శాతం మంది ఉన్నారు.

» 60 ఏళ్ల పైబడిన వారిలో హృద్రోగ సమస్యలతో 35.6 శాతం, రక్తపోటుతో 32 శాతం, మధుమేహంతో 13.2 శాతం బాధపడుతున్నారు. హృద్రోగ బాధితులు ఎక్కువగా గోవా (60 శాతం), కేరళ (57 శాతం)లలో ఉన్నారు. ఎముకలు, కీళ్ల వ్యాధులతో 19 శాతం మంది వృద్ధులు బాధపడుతున్నారు. ఈ వ్యాధుల బాధితుల్లో 33 శాతంతో తెలంగాణ ప్రథమ స్థానంలో ఉంది.

» ఇక మానసిక సమస్యలు కూడా వృద్ధుల్లో ఎక్కువ అవుతున్నాయి. డిప్రెషన్ లక్షణాలు 30 శాతం మందిలో కనిపిస్తున్నాయి. ఉమ్మడి కుటుంబాలు మాయమైపోతుండటంతో వృద్ధులు ఒంటరిగా మిగిలిపోతున్నారు. వృద్ధులైన మహిళలు 18.7 శాతం, పురుషులు 5.1 శాతం ఒంటరిగా జీవిస్తున్నారు. కేరళలోని వృద్ధుల్లో 65%మంది స్మార్ట్‌ఫోన్ వినియోగిస్తున్నారు.

» ఇక 2021 నాటికి జనాభాలో 60 ఏళ్లు పైబడిన వారు కేరళలో 16.5 శాతం మంది ఉండగా, తమిళనాడులో 13.6 శాతం, హిమాచల్ ప్రదేశ్‌లో 13.1 శాతం, పంజాబ్‌లో 12.6 శాతం మంది ఉన్నారు. ఇక బిహార్‌లో (7.7 శాతం) అతి తక్కువ మంది ఉన్నారు.

రూ.5000 కోట్ల అప్పు తీసుకోనున్న రాష్ట్రం

హైదరాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఈసారి భారీగా అప్పు తీసుకోనుంది. ఏకంగా రూ.5000 కోట్ల అప్పు తీసుకునేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు శుక్రవారం ఇండెంటు పెట్టింది. 19 ఏళ్ల కాల పరిమితితో రూ.1000 కోట్లు, 22 ఏళ్ల కాల పరిమితితో రూ.1000 కోట్లు, 23 ఏళ్ల కాల పరిమితితో రూ.2000 కోట్లు, 24 ఏళ్ల కాల పరిమితితో రూ.1000కోట్ల చొప్పున అప్పు తీసుకుంటామని ఆర్‌బీఐకి తెలియజేసింది. ఈనెల5న ఆర్‌బీఐ నిర్వహించే ఈ-వేలం ద్వారా రుణాన్ని సేకరించనుంది.

జర్నలిస్టుల చెంప చెల్లుమనిపించాలనిపిస్తోందా?

- సీఎం వ్యాఖ్యలను ఖండించిన రాంచందర్‌రావు

హైదరాబాద్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఓ పత్రిక వార్షికోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి జర్నలిస్టులపై చేసిన వ్యాఖ్యలను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు ఖండించారు. జర్నలిస్టుల చెంప చెల్లుమనిపించాలనిపిస్తోందంటూ ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి మాట్లాడటం సబబేనా అని ఆయన ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలోని నాల్గవ స్తంభమైన పాత్రికేయులపై భౌతిక దాడికి దిగాలనిపిస్తుందని పరుషంగా మాట్లాడడం తగదన్నారు. సీఎం మాటలు రాష్ట్రంలో శాంతి భద్రతలకు తార్కాణంగా నిలుస్తాయని ఎక్స్‌లో విమర్శించారు.

భావోద్వేగాలతో బీఆర్ఎస్ పబ్బం: నన్నూరి

హైదరాబాద్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో తెలుగు రాష్ట్రాల మధ్య చిచ్చుపెట్టడం, భావోద్వేగాల మీద రాజకీయ పబ్బం గడుపుకోవడమే బీఆర్ఎస్ అస్త్రమని టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి నన్నూరి నర్సిరెడ్డి అన్నారు. భావోద్వేగాల ద్వారా బీఆర్ఎస్‌ను బతికించుకోవాలనుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు దగ్గర పడుతుండడంతో సముద్రంలోకి వృథాగా పోతున్న నీటిని ఆంధ్రప్రదేశ్ ప్రజలు వాడుకుంటున్నారనే నెపంతో దానిని రాజకీయంగా వాడుకోవాలని బీఆర్ఎస్ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ నేతలకు పదవులు పోగానే తెలంగాణ సెంటిమెంట్, తెలంగాణ ప్రజలు గుర్తుకు వస్తారని నర్సిరెడ్డి ఎద్దేవా చేశారు.

అనుమతి ఇవ్వకుంటే హైకోర్టును ఆశ్రయిస్తా

- 72 గంటల నిరాహార దీక్షపై ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): తాను చేపట్టదలచిన 72గంటల నిరాహార దీక్షకు ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోతే హైకోర్టును ఆశ్రయిస్తానని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చెప్పారు. రాష్ట్రంలో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించాలన్న డిమాండ్‌తో ఈనెల 4 నుంచి 7 వరకు తాను చేపట్టదలచిన 72గంటల నిరాహార దీక్షకు పోలీసులు అనుమతించలేదని పేర్కొన్నారు. దీక్షకు అనుమతి కోరుతూ సెంట్రల్ జోన్ పోలీసులకు తెలంగాణ జాగృతి నాయకులు ఇదివరకే దరఖాస్తు చేశారని, అయితే పోలీసులు సాకులు చెబుతున్నారని కవిత ఆరోపించారు.

బీటెక్‌లో ఇంటర్నల్ పరీక్షలకూ ఇంప్రూవ్‌మెంట్

- జేఎన్‌టీయూ ఆర్25 నిబంధనల్లో మార్పు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ వర్సిటీ అనుబంధ, అఫిలియేటెడ్ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల్లో ఈసారి బీటెక్ ఫస్టియర్‌లో చేరుతున్న విద్యార్థులకు జేఎన్‌టీయూ తీపికబురు చెప్పింది. ఇంటర్నల్ పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులు తమ మార్కులను మెరుగుపరచుకునే వెసులుబాటు కల్పిస్తోంది. వర్సిటీ అకాడమిక్ అండ్ ప్లానింగ్ విభాగం కొత్తగా రూపొందించిన (ఆర్25) నిబంధనల్లో ఈ అంశాన్ని చేర్చారు. గతంలో ఇంటర్నల్ పరీక్షల్లో తక్కువ మార్కులు వస్తే ఇంప్రూవ్‌మెంట్ అవకాశం లేకపోవడంతో ఏళ్ల తరబడి బ్యాక్‌లాగ్ సబ్జెక్టులను పూర్తి చేయలేకపోయేవారు. ఈ నేపథ్యంలో పూర్వవిద్యార్థుల నుంచి భారీగా అందిన విజ్ఞప్తుల మేరకు ఈ ఏడాది నుంచి అమల్లోకి తెచ్చే నిబంధనల్లో ఇంటర్నల్స్ ఇంప్రూవ్‌మెంట్ వెసులుబాటు కల్పించారు.

పోచారంలో ఫ్లాట్ల వేలం.. 36 కోట్ల ఆదాయం

- నేడూ కొనసాగనున్న వేలం పాట

ఘట్‌కేసర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పోచారం మునిసిపాలిటీలోని రాజీవ్ స్వగృహ సద్భావన టౌన్‌షిప్‌లో శుక్రవారం జరిగిన డబుల్ బెడ్‌రూం ఫ్లాట్ల వేలం ద్వారా ప్రభుత్వానికి రూ.36 కోట్ల ఆదాయం వచ్చింది. మొత్తం 190 ఫ్లాట్లను వేలం వేయగా, వాటికి దరఖాస్తు చేసుకున్న వారికి ఆ ఫ్లాట్లను కేటాయించారు. చాలా ఫ్లాట్లకు ఒక్కొక్క దరఖాస్తు మాత్రమే వచ్చింది. ఈ వేలం పాటను అత్యంత పారదర్శకంగా నిర్వహించామని రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. మిగిలిన డబుల్ బెడ్‌రూం ఫ్లాట్లకు లాటరీ పద్ధతిలో కేటాయింపులు చేస్తామని ఆయన వివరించారు. శనివారం సింగిల్ బెడ్‌రూం ఫ్లాట్లకు వేలం పాట నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఏఐతో ఉద్యోగాలకు ముప్పే.. అయినా విస్మరించలేం

- జాతీయ సదస్సులో ఐటీ రంగ నిపుణులు

హైదరాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కృత్రిమ మేధ (ఏఐ)తో ఉద్యోగాలకు ముప్పేనని, అయినా దానిని విస్మరిస్తే ఉద్యోగులైనా, కంపెనీలైనా తీవ్ర పశ్చాత్తాప పడాల్సిందేనని ఐటీ రంగంలోని దిగ్గజ కంపెనీల ఉన్నతస్థాయి ప్రతినిధులు స్పష్టం చేశారు. 'గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు-ఏఐ' అంశంపై హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్ (హైసియా), 3ఏఐ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ సదస్సు శుక్రవారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో జరిగింది. ఈ సదస్సుకు గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్, టీసీఎస్, టెక్ మహీంద్రా తదితర దిగ్గజ కంపెనీల ఉన్నతస్థాయి ప్రతినిధులు హాజరయ్యారు. ఏఐ ప్రభావంపై నిర్వహించిన వివిధ చర్చాగోష్ఠిల్లో పాల్గొని తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఏఐ ఎప్పటికీ మానవ మేధస్సుకు ప్రత్యామ్నాయంకాదని అందరూ అంటున్నారు కానీ నేడు మానవ మేధస్సు ఏఐపై ఆధారపడి ఆలోచించే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఐటీతో పాటు ఇతర ఏ రంగాల్లోనైనా ఏఐ ఆధిపత్యం చలాయిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో రియల్ పేజ్ వైస్ ప్రెసిడెంట్, ఇండియా హెచ్‌ఆర్ హెడ్ రేఖా నరేంద్ర, పెగా సిస్టమ్స్ వైస్ ప్రెసిడెంట్ స్మ్రితీ మాథుర్, 3ఏఐ సీఈవో సమీర్ ధన్‌రాజాని,ఐటీ, పరిశ్రమల శాఖ కార్యదర్శి సంజయ్ కుమార్ తదితరులు పాల్గొని మాట్లాడారు.

పోలీసులకు పందుల దొంగల సవాల్ !

- వనపర్తి జిల్లాలో రెచ్చిపోతున్న ముఠాలు
- పోలీసు వాహనంపై పందిని విసిరి అడ్డుకునే యత్నం

అమరచింత, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): అంతర్రాష్ట్ర పందుల దొంగల ముఠాలు వనపర్తి జిల్లా పోలీసులకు సవాలు విసురుతున్నాయి. తమను వెంబడిస్తున్న పోలీసుల నుంచి సినీఫక్కీలో తప్పించుకుంటున్నాయి. జిల్లాలోని ఆత్మకూరు, పెబ్బేరు, ఏదుట్ల, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్ తదితర ప్రాంతాల్లో గత వారం పందులను దొంగలించి పరారైన ముఠాలు.. బుధవారం రాత్రి తమను వెంబడిస్తున్న అమరచింత పోలీసుల వాహనాన్ని ఢీకొట్టి మరీ పరారయ్యాయి. ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. బుధవారం అర్ధరాత్రి కొల్లాపూర్‌లో 40 పందులను దొంగలించిన దొంగల ముఠా స్థానిక పోలీసుల నుంచి తప్పించుకుని ఆత్మకూరు మీదుగా అమరచింత రావచ్చుననే సమాచారంతో ఆత్మకూరు, అమరచింత పోలీసులు అప్రమత్తమయ్యారు. ప్రధాన రహదారులపై గస్తీ పెట్టారు. అయితే, ఆత్మకూరు చౌరస్తాలో పోలీసు బారికేడ్లను తమ బొలెరో వాహనంతో ఢీకొట్టి నాగల్‌కడుమూర్ గ్రామం వైపు వెళ్లిన దొంగలను అమరచింత పోలీసులు వెంబడించారు. అయితే, సినీ తరహాలో ఛేజింగ్ జరుగుతుండగా దొంగలు తమ వాహనంలోని ఓ పందిని పోలీసు వాహనంపైకి విసిరారు. దానిని తప్పించుకుని పోలీసులు వెంబడిస్తుండగా.. కత్తులు, కట్టెలు చూపించి పోలీసులను బెదిరించారు. ఆపై, ధర్మాపూర్, నాగల్‌కడుమూర్ గ్రామాల మధ్య వేగంగా వెనక్కి దూసుకొచ్చి పోలీసు వాహనాన్ని ఢీకొట్టి ధ్వంసం చేసి పరారయ్యారు. అయితే, ఆత్మకూరు సీఐ శివకుమార్ ఆధ్వర్యంలో మరో బృందం అమరచింత మీదుగా మరికల్ ప్రాంతం నుంచి దొంగలను నారాయణపేట వరకు వెంబడించినప్పటికీ తప్పించుకున్న దొంగలు కర్ణాటక రాష్ట్రం యాదగిరి జిల్లా వైపు పరారయ్యారు.

శ్రీశైలానికి వరద ఉధృతి

నాగార్జున సాగర్‌కు వచ్చిన నీరు వచ్చినట్లే విడుదల

మహబూబ్‌నగర్/ నాగార్జునసాగర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టులకు వరద ఉధృతి కొనసాగుతోంది. శుక్రవారం శ్రీశైలం ప్రాజెక్టు సైట్ వద్ద 3.17 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవ్వగా ఎనిమిది గేట్లు ఎత్తి 2.15 లక్షల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. విద్యుదుత్పత్తి ద్వారా మరో 65 వేల క్యూసెక్కులు, పోతిరెడ్డిపాడు, హంద్రీనీవా, ఎంజీకేఎల్‌ఐతో కలుపుకొని ప్రాజెక్టు నుంచి 3.20 లక్షల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 215.81 టీఎంసీలు కాగా ప్రస్తుతం 201.58 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. అటు జూరాల, ఇటు తుంగభద్ర నుంచి వస్తున్న వరదతో శ్రీశైలం వద్ద 3.17 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతోంది. కాగా నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వచ్చిన వరదను వచ్చినట్లుగా దిగువకు విడుదల చేస్తున్నారు. ఇక్కడ జూలై 29 నుంచి నీటి విడుదల ప్రారంభం కాగా, నాలుగు రోజుల్లో 54 టీఎంసీల నీటిని దిగువకు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు(312.0450 టీఎంసీలు) కాగా శుక్రవారం సాయంత్రానికి 585.20 అడుగులుగా(298.0120 టీఎంసీలు) నమోదైంది. ఎగువ నుంచి సాగర్ జలాశయానికి 2,57,545 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా, అంతే నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. పులిచింతల ప్రాజెక్టులో శుక్రవారం 40.44 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్టు ఆ ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 2,12,271 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతోంది. 2,05,278 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదలవుతోంది.



సాగర్ ప్రాజెక్టు 26 క్రస్ట్‌గేట్ల నుంచి విడుదల అవుతున్న నీరు

ఓనమాలు రానోడూ జర్నలిస్టే!

(మొదటిపేజీ తరువాయి)

జరిగిన 'నవ తెలంగాణ' సంస్థ పదో వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ముఖ్యమంత్రి రేవంత్.. సోషల్ మీడియా జర్నలిస్టుల తీరుపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఎవడు పడితే వాడు జర్నలిస్టు అంటూ తమ రాతలతో, చేతలతో సమాజాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. ఆవారాగా రోడ్ల మీద తిరిగే వాళ్లు కొందరు సోషల్ మీడియా జర్నలిస్టులమంటూ తమ అసభ్యకరమైన భాషతో జర్నలిజం వ్యవస్థను నిర్వీర్యం చేసి, విశ్వసనీయత దెబ్బతీసేలా ప్రవర్తిస్తున్నారని సీఎం అన్నారు. ఇక, మీడియా సమావేశాల్లో కొందరు.. కాలు మీద కాలు వేసుకుని కూర్చోని.. 'సీనియర్ జర్నలిస్టులకు గౌరవం ఇవ్వవా? నమస్తే పెట్టవా?' అన్నట్టు తమ వైపు చూస్తుంటారని తెలిపారు. అలాంటి వారిని చూసినప్పుడు వేదిక దిగి కొట్టాలని తనకు అనిపిస్తుందని ముఖ్యమంత్రి అన్నారు. కానీ, తన స్థాయి, హోదా గుర్తు వచ్చి ఆగిపోతున్నానని చెప్పారు. కలం, కాగితం ఇస్తే కొందరికి అ, ఆ లు, ఏబీసీడీలు కూడా రావని, అలాంటి ఓనమాలు రాని వారు పిచ్చిరాతలతో వ్యవస్థను నాశనం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఏదో ఇంటి పేరు జర్నలిస్టు అయినట్టు, తమ తాత, ముత్తాతల నుంచి జర్నలిస్టులుగా సేవలందిస్తున్నట్టు కొందరు తమ పేరు ముందు జర్నలిస్టు అని పెట్టుకుంటున్నారని సీఎం పేర్కొన్నారు. కనీస అర్హతలు లేకుండా చాలా మంది జర్నలిస్టులుగా చలామణీ అవుతున్నారని, అలాంటి వాళ్లను సీనియర్ జర్నలిస్టులే పక్కన పెట్టాలని సూచించారు. సీనియర్ జర్నలిస్టులు అలాంటి వారిని అసలు తమ పక్కన కూడా కూర్చోపెట్టుకోకూడదని తెలిపారు. జర్నలిస్టు మేధావులంతా కలిసి జర్నలిజం అనే పదానికి అర్థం వెతకాల్సిన దుస్థితి ప్రస్తుతం తలెత్తిందని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. నిజమైన జర్నలిస్టులంతా ఒక లక్ష్మణ రేఖ గీసుకుని ఓవైపు ఉండి, అరాచకాలు చేసే జర్నలిస్టులను మరోవైపునకు నెట్టాలని ముఖ్యమంత్రి కోరారు. కాగా, ప్రజావ్యతిరేక విధానాలపై గళమెత్తాలన్నా, తప్పు చేసిన అధికార పార్టీని గద్దె దించాలన్నా



సమావేశంలో సీఎం రేవంత్, మంత్రి పొంగులేటి మధ్య సరదా సంభాషణ

కమ్యూనిస్టు పార్టీలు ఎప్పుడూ ముందుంటాయని ముఖ్యమంత్రి రేవంత్ ఈ సందర్భంగా అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కమ్యూనిస్టులు చేసిన ఉద్యమాలు ఎంతగానో ఉపయోగపడ్డాయని చెప్పారు. తమ్మినేని వీరభద్రం చేసిన పాదయాత్రలు, పోరాటాలు 2023లో తమ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి పరోక్షంగా కారణమై ఉంటాయని అభిప్రాయపడ్డారు. ప్రజాపాలన మరో దఫా కొనసాగేందుకు కమ్యూనిస్టుల సహకారం కావాలని రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా కోరారు.

నిజాన్ని నిర్భయంగా ప్రజలకు అందించడమే జర్నలిజం : పొంగులేటి

నిజాన్ని నిర్భయంగా ప్రజలకు అందించడమే అసలైన జర్నలిజం అని ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ అనుకూల మీడియా సీఎం, మంత్రులపై అవాస్తవాలు ప్రచారం చేస్తూ జర్నలిజం విశ్వసనీయతను దెబ్బతీస్తోందని చెప్పారు. తమకు వ్యతిరేకంగా వార్త రాసిన వారిపై గత పాలకులు ఉక్కుపాదం మోపి అణగదొక్కారని, కానీ ప్రస్తుత ప్రభుత్వం బీఆర్ఎస్ అనుకూల మీడియా వికృత చేష్టలను ఉపేక్షిస్తోందని చెప్పారు. అయితే ఓ పరిమితి దాటిన తర్వాత వారి ఆగడాలను తాము కూడా ఉపేక్షించమని పొంగులేటి ఈ సందర్భంగా హెచ్చరించారు. సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు మాట్లాడుతూ.. పత్రికలంటే నిజాన్ని కప్పి ఉంచేవి కావని, ప్రజలకు పూర్తిగా విపులీకరించి చెప్పేవన్నారు. సీపీఐ(ఎం) మాజీ ప్రధాన కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ.. ట్రంప్ వ్యాఖ్యలను ఖండించలేని మోదీ ఒక దద్దమ్మ అని ఘాటు వ్యాఖ్యలు చేశారు. గతంలో తమకు వ్యతిరేకంగా వార్తలు రాస్తే ఒక్క ప్రకటన కూడా ఇవ్వమని మాజీ సీఎం కేసీఆర్ అన్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి జాన్ వెస్లీ, జూలకంటి రంగారెడ్డి, సమాచార కమిషనర్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ హబ్‌గా తెలంగాణ!

- నేడు స్పోర్ట్స్ కాన్‌క్లేవ్‌లో క్రీడా పాలసీని ఆవిష్కరించనున్న సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): రాష్ట్రాన్ని క్రీడా హబ్‌గా తీర్చిదిద్దేందుకు సీఎం రేవంత్ రెడ్డి కార్యాచరణ ప్రారంభించారు. శనివారం హైదరాబాద్‌లోని హెచ్‌ఐసీసీలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న స్పోర్ట్స్ కాన్‌క్లేవ్‌లో తెలంగాణ నూతన క్రీడా విధానాన్ని (స్పోర్ట్స్ పాలసీ) ఆయన అధికారికంగా ఆవిష్కరించనున్నారు. దిగ్గజ క్రీడాకారులు అభినవ్ బింద్రా, పుల్లెల గోపీచంద్, గగన్ నారంగ్, అంజు బాబీ, అనిల్ కుంబ్లే సహా పలు అంతర్జాతీయ క్రీడా రంగ ప్రముఖులు, ఎంఎన్‌సీ కంపెనీల ప్రతినిధులు ఇందులో పాల్గొననున్నారు. శుక్రవారం శాట్ చైర్మన్ శివసేనా రెడ్డి, క్రీడా శాఖ అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. రాష్ట్రంలో క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధి, స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుకు సంబంధించి తొమ్మిది ఎంఎన్‌సీ కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం ఎంవోయూలు కుదుర్చుకోనుంది.

ఢిల్లీకి ముఖ్యమంత్రి రేవంత్..

సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం ఢిల్లీ వెళ్లారు. అక్కడి విజ్ఞాన్‌భవన్‌లో ఏఐసీసీ అనుబంధ "చట్టాలు, మానవ హక్కులు, ఆర్టీఐ" విభాగం.. రాజ్యాంగం సవాళ్లు-దృక్పథం, మార్గాలు థీమ్‌తో శనివారం నిర్వహించే మెగా ఈవెంట్‌లో ఆయన పాల్గొననున్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించనుండగా.. అగ్రనేత రాహుల్ గాంధీ కూడా పాల్గొని, ప్రసంగిస్తారు. అలాగే కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ప్రస్తుత ముఖ్యమంత్రులు, మాజీ సీఎంలు పాల్గొనడంతో పాటు ప్రసంగించనున్నారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వర కు జరిగే సెషన్‌లో 'సామాజిక న్యాయం, రాజ్యాంగం: సమానత్వం, సౌభ్రాతృత్వం ప్రాధాన్యత' అనే అంశంపై సీఎం రేవంత్ మాట్లాడనున్నారు. అలాగే కర్ణాటక సీఎం సిద్దరామయ్య, కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరంతో పాటు మరికొంత మంది కూడా ఇదే అంశంపై ప్రసంగించనున్నారు. కార్యక్రమానికి డిప్యూ టీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు పలువురు మం త్రులు, కాంగ్రెస్ లీగల్ సెల్ అధ్యక్షులు కూడా హాజరుకానున్నారు.

పది రోజుల్లో బీజేపీ రాష్ట్ర కమిటీ..?!

- సునీల్ బన్సల్, అభయ్‌పాటిల్ చుట్టూ ఆశావహుల ప్రదక్షిణలు
- కమిటీలో 20 మందికి చాన్స్
- తుది దశకు చేరుకున్న కసరత్తు

హైదరాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): బీజేపీ తెలంగాణ రాష్ట్ర కమిటీ వారం, పది రోజుల్లో ఖరారవుతుందని తెలుస్తోంది. ఈ కమిటీ ఏర్పాటు కోసం చేపట్టిన కసరత్తు తుది దశకు చేరుకున్నదని సమాచారం. కొత్త కమిటీలో చోటు దక్కని వారికి పార్టీ నాయకత్వం మరో కీలక బాధ్యత అప్పగిస్తుందని వినికిడి. గతంలో ఎన్నడూ లేని విధంగా కొత్త కమిటీలో స్థానం సంపాదించుకునేందుకు ఆశావహులు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్, రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జి అభయ్ పాటిల్‌లతోపాటు కేంద్ర మంత్రులు, ఎంపీలు, సంఘ్ ముఖ్యులను కలుసుకుని తమకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. దాదాపు నెల క్రితం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన సీనియర్ నేత రాంచందర్ రావు.. గత నెలాఖరులోనే కొత్త కమిటీ ఏర్పాటవుతుందని ప్రకటించారు. సామాజిక, భౌగోళిక సమీకరణాల కనుగుణంగా కొత్త కమిటీని ఏర్పాటు చేస్తామన్న రాంచందర్ రావు.. పార్టీ ముఖ్య నేతలు, సీనియర్ల అభిప్రాయాలను తెలుసుకుంటున్నారు. మొత్తం 20 మంది సభ్యులతో కూడిన కమిటీలో 8 మంది ఉపాధ్యక్షులు, ఏడుగురు కార్యదర్శులు, ముగ్గురు ప్రధాన కార్యదర్శులు, కోశాధికారి ఉంటారు.

జనవరి నుంచి 4 వేల మెగావాట్లు

- యాదాద్రి ప్లాంటులోని యూనిట్లన్నీ డిసెంబరులోగా పూర్తి
- బీఆర్ఎస్ తప్పిదాల వల్లే ఆలస్యం: భట్టి
- రైల్వే శాఖతో ముందుగానే సమన్వయం చేసుకోండి: ఉత్తమ్
- సమీప ప్రాంతాల అభివృద్ధి: కోమటిరెడ్డి
- వైటీపీఎస్‌లో 800 మెగావాట్ల యూనిట్-1 జాతికి అంకితం



యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో యూనిట్ -1 స్విచ్ ఆన్ చేస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, చిత్రంలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తదితరులు

నల్లగొండ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో అన్ని యూనిట్లను డిసెంబరు నాటికి పూర్తి చేస్తామని, జనవరి నుంచి 4 వేల మెగావాట్ల (పూర్తి స్థాయిలో) విద్యుదుత్పత్తి చేపడతామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెంలోని యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్(వైటీపీఎస్)లో శుక్రవారం 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన యూనిట్-1ను మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌తో కలిసి ఆయన జాతికి అంకితం చేశారు. పవర్‌ప్లాంటు ఆవరణలో 65ఎకరాల విస్తీర్ణంలో రూ.970 కోట్లతో నిర్మిస్తోన్న ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం జెన్‌కో అధికారులతో డిప్యూటీ సీఎం, మంత్రులు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ తప్పిదాల వల్లనే యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంటు నిర్మాణం జాప్యమైందన్నారు. పర్యావరణ, అటవీ శాఖల అనుమతులు తీసుకోకుండా ప్లాంటు నిర్మాణం ప్రారంభించడం.. గత ప్రభుత్వ నిర్లక్ష్యమేనని మండిపడ్డారు. ప్రజాప్రభుత్వం కొలువుదీరినతర్వాత కేంద్రం నుంచి అన్ని అనుమతులు సాధించామని, ఒక్కో యూనిట్‌ను ప్రారంభిస్తూ వస్తున్నామని వివరించారు. ప్లాంటు నిర్మాణానికి భూములిచ్చిన, ఇళ్లు కోల్పోయిన వారి త్యాగాలను గుర్తుంచుకుంటామని, ఈ నెల 15వ తేదీలోగా వారికి ఉద్యోగాలు ఇస్తామని భరోసా ఇచ్చారు. పులిచింతల ప్రాజెక్టు నిర్వాసితులకు కూడా ఈలోపే ఉద్యోగాలు ఇచ్చేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. భూనిర్వాసితులకు పరిహారాలివ్వకుండా, ఉద్యోగ-ఉపాధి కల్పన చేపట్టకుండా గత ప్రభుత్వం గాలికి వదిలేసిందని దుయ్యబట్టారు. ప్లాంటులో పూర్తి స్థాయి విద్యుదుత్పత్తి జరిగే నాటికన్నా ముందే రైల్వే శాఖతో సమన్వయం చేసుకోవాలని, బొగ్గు సరఫరాకు ఇబ్బందుల్లేకుండా చూసుకోవాలని జెన్‌కో అధికారులకు మంత్రి ఉత్తమ్ సూచించారు. తాను ఎంపీగా ఉన్న సమయంలోనే విష్ణుపురం దాకా డబుల్ రైల్వే లైన్ మంజూరైనా.. ఇప్పటికీ పూర్తి కాలేదని గుర్తు చేశారు. 93కిలోమీటర్ల డబుల్ లైన్‌కు సరిపడా నిధులు కేంద్రం నుంచి రాకపోవడం వల్లే జాప్యం జరుగుతోందన్నారు. కాగా, ప్లాంట్ సమీపంలోని ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. త్వరలోనే ఇక్కడ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మిస్తామని, అత్యాధునిక వసతులతో ఆస్పత్రులు, అంబులెన్స్ సేవలు అందుబాటులోకి తెస్తామని ఆయన పేర్కొన్నారు.

గొర్రెల పంపిణీ పథకంలో వెయ్యి కోట్ల స్కాం!

(మొదటిపేజీ తరువాయి)

లెక్కలు తీస్తే ప్రభుత్వానికి కలిగిన నష్టం రూ.వెయ్యి కోట్ల దాకా ఉంటుందని ఈడీ వెల్లడించింది. గొల్ల, కురుమ లబ్ధిదారులకు వెళ్లాల్సిన ప్రభుత్వ నిధులు, ప్రైవేటు వ్యక్తుల బ్యాంకు ఖాతాలకు బదిలీ అయినట్లు ఈడీ విచారణలో తేలింది. కేసు దర్యాప్తులో భాగంగా.. హైదరాబాద్‌లో జరిపిన సోదాల్లో 200 డమ్మీ బ్యాంకు ఖాతాలు బయటపడినట్టు, ఖాళీ చెక్ బుక్స్, పాస్‌బుక్స్, డెబిట్ కార్డులు, 31 మొబైల్ ఫోన్లు, 20 పైగా సిమ్ కార్డులు స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ అధికారులు తెలిపారు. ఇటీవల పెరిగిన బెట్టింగ్ యాప్స్ వ్యవహారంలోనూ ఈ ఖాతాలు, ఫోన్లను వాడినట్లు వారు గుర్తించారు. కేసు దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలిపారు.

ఇదీ నేపథ్యం..

గొర్రెల పంపిణీ పథకంలో నిధులు దుర్వినియోగం అయినట్లు ఫిర్యాదులు రావడంతో ఈడీ అధికారులు నగదు అక్రమ చలామణీ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కింద కేసు నమోదు చేశారు. గత ప్రభుత్వంలో రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రిగా పనిచేసిన తలసాని శ్రీనివాస్ యాదవ్ ఓఎస్డీ జి. కల్యాణ్ కుమార్‌తోపాటు కొంతమంది ప్రైవేటు వ్యక్తులు, వ్యాపారులు, దళారుల ఇళ్లల్లో (మొత్తం ఎనిమిది చోట్ల) జూలై 30న సోదాలు నిర్వహించినట్లు హైదరాబాద్ జోనల్ ఈడీ అధికారులు శుక్రవారం పత్రిక ప్రకటన విడుదల చేశారు. నిజానికి ఈ అంశంపై తొలుత అవినీతి నిరోధకశాఖ(ఏసీబీ) ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. కల్యాణ్ కుమార్ పశు సంవర్ధక శాఖ కార్యాలయానికి వెళ్లి రికార్డులు మాయం చేసినట్లు, కొన్ని ఫైళ్లు దహనంచేసినట్లు, బీరువాల తాళాలు పగులగొట్టి సాక్ష్యాలు మాయం చేసినట్లు ఏసీబీకి ఫిర్యాదు వచ్చింది. లబ్ధిదారుల ఖాతాలకు నగదు బదిలీ చేయాల్సి ఉండగా.. ప్రైవేటు వ్యక్తుల ఖాతాలకు రూ. 2.1 కోట్ల ప్రభుత్వ సొమ్మును బదిలీ చేసినట్లు ఒక గొర్రెల వ్యాపారి కూడా ఫిర్యాదు చేశారు. దీంతో ఏసీబీ అధికారులు కేసు నమోదుచేశారు. ఆ నగదు బదిలీలో సంబంధిత శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ల హస్తం ఉన్నట్లు కూడా ఫిర్యాదులు రావడంతో ఏసీబీ దర్యాప్తును ముమ్మరం చేసింది. దీనికితోడు.. 'కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్'(కాగ్) 2021 మార్చిలో విడుదల చేసిన నివేదికలోనూ.. గొర్రెల పంపిణీ పథకంలో జరిగిన అక్రమాల గురించి ఉంది. అయితే కేవలం 7 జిల్లాల్లో చేపట్టిన విచారణ మేరకే 'కాగ్' నివేదిక సమర్పించింది. కరీంనగర్, మహబూబ్‌నగర్, నల్లగొండ, నిజామాబాద్, వరంగల్, ఆదిలాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో గొర్రెల పంపిణీ పథకంలో జరిగిన అక్రమాలతో దాదాపు రూ.254 కోట్ల మేర ప్రభుత్వానికి నష్టం కలిగినట్లు నివేదికలో పేర్కొంది. ఆ గణాంకాలనే ఈడీ అధికారులు ఉటంకించారు. ఈడీ దర్యాప్తులో కూడా.. నకిలీ వ్యాపారులకు భారీగా ప్రభుత్వ నిధులు బదిలీ అయినట్లు వెల్లడైంది. పథకం ప్రారంభానికి ముందే.. గొర్రెల వ్యాపారంలో లేనివారికి డబ్బు చెల్లించినట్లు, అసలు గొర్రెల కొనుగోలు, అమ్మకాలు జరగకుండానే ప్రభుత్వ సొమ్మును ప్రైవేటు వ్యక్తులకు బదిలీ చేసినట్లు, లబ్ధిదారులకు గొర్రెలు ఇవ్వకుండానే ఇచ్చినట్లు రికార్డుల్లో పేర్కొన్నట్లు తమ దర్యాప్తులో తేలిందని ఈడీ అధికారులు వెల్లడించారు.

సైబర్ పోలీసులకు చిక్కిన చిక్కాల

- కంబోడియా సైబర్ నేరగాళ్లకు మానవ అక్రమ రవాణ
- హైదరాబాద్ వాసి ఫిర్యాదుతో సంతోష్ గుట్టు రట్టు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): సైబర్ మోసగాళ్లతో చేతులు కలిపిన నిజామాబాద్ వాసి చిక్కాల సంతోష్ కుమార్ గుట్టు రట్టయింది. హైదరాబాద్‌లోని వారాసిగూడలో ఉన్న సంతోష్.. 2015-16 లో ఎయిర్‌పోర్టు గ్రౌండ్ స్టాఫ్ వర్కర్‌గా పనిచేస్తూ వీసాలు, విదేశాల్లో ఉద్యోగాలపై అవగాహన పెంచుకున్నాడు. దాంతో కన్సల్టెన్సీ సంస్థను ప్రారంభించి.. యువతను విదేశాలకు పంపుతూ.. తానూ కంబోడియాకెళ్లి.. సైబర్ నేరాలతో సులభంగా డబ్బు సంపాదించొచ్చనుకున్నాడు. ఉద్యోగాల పేర నిరుద్యోగులను అక్కడికి పంపి సైబర్ నేరగాళ్ల వద్ద నియమించేవాడు. మరోవైపు, నిజామాబాద్ యువకులతో తెరిచిన ఖాతాల్లో జమఅయిన డబ్బును క్రిప్టో కరెన్సీలో సైబర్ నేరగాళ్లకు పంపేవాడు. కాగా, ఈ క్రమంలో హైదరాబాద్ వాసికి పరిచయమైన నేహ అనే యువతి..ఓ యాప్‌లో పెట్టుబడులతో లాభాలు గడిస్తున్నట్లు నమ్మించడంతో అతడు రూ.1.70 లక్షలు పెట్టుబడి ఓ ఖాతాకు పంపితే 20 వేల డాలర్ల లాభం చూపింది. విత్‌డ్రా కోసం పన్ను చెల్లించాలంటే.. మరో రూ.4.82 లక్షలు మోసగాళ్ల ఖాతాలకు బదిలీ చేసినా విత్‌డ్రాకు అవకాశం లేదు. ఇంకా డబ్బు పంపాలనడంతో మోసపోయినట్లు గ్రహించి..సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు.. బాధితుడి ఖాతా నుంచి 4 నిజామాబాద్ ఖాతాల్లో డబ్బు జమ అయినట్లు గుర్తించారు. ఆ నలుగురిని విచారించడంతో వారు సంతోష్ పేరు చెప్పారు. అతడ్ని శుక్రవారం అరెస్టు చేసి విచారించడంతో విదేశీ కోణం బయటపడింది. నిందితుడి వద్ద 24 డెబిట్ కార్డులు, 5పాస్‌బుక్‌లు, 7 చెక్‌బుక్‌లు, లాప్‌టాప్, 15 మొబైల్ ఫోన్లు, రెండు ట్యాబ్‌లతోపాటు హైటెక్ టీవీ ప్రెస్ ఐడీ కార్డును స్వాధీనం చేసుకున్నట్లు హైదరాబాద్ అడిషనల్ సీపీ విశ్వ ప్రసాద్, డీసీపీ కవిత దార చెప్పారు.

సిరిపట్టు పితాంబరం చీరకు అరుదైన గౌరవం

» చేనేత కళాకారిణి రేఖకు కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డు



సిరిసిల్ల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిపట్టు పితాంబరం చీరకు అరుదైన గౌరవం దక్కింది. ఈ చీరను నేసిన రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన చేనేత కళాకారిణి వెల్ది రేఖ రాష్ట్రస్థాయిలో అందించే ప్రతిష్ఠాత్మక కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డుకు ఎంపికయ్యారు. ఈమేరకు శుక్రవారం చేనేత జౌళి శాఖ ప్రకటన చేసింది. ఆగస్టు 7న చేనేత దినోత్సవం సందర్భంగా అందించే ఈ అవార్డుకు ఎంపికైన తొలి మహిళా చేనేత కార్మికురాలు రేఖ కావడం విశేషం. ప్రముఖ చేనేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్ సతీమణి రేఖ. ఈమె 45 రోజులపాటు శ్రమించి చేనేత మగ్గంపై రూపొందించిన సిరిపట్టు పితాంబరం చీరను అధికారులు కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డుకు ఎంపిక చేశారు. రూ.36వేల విలువైన ఈ చీర 48 అంగుళాల వెడల్పు, ఐదు మీటర్ల పొడవు, 605 గ్రాముల బరువు ఉంది. ఈ పట్టు చీరలో కాకతీయుల శౌర్యానికి గుర్తుగా ఉన్న కమాన్‌తో పాటు వేములవాడ రాజన్న కోడె మొక్కులను సూచించే జరీబుటాలను పొందుపరిచారు.

ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ కన్నుమూత

» ద్రవిడ విశ్వవిద్యాలయం ఉప కులపతిగా సేవలు



హైదరాబాద్ సిటీ, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సాహిత్య విమర్శకుడు, కవి, ద్రవిడ విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ(78) ఇకలేరు. కొంతకాలంగా కాలిఫోర్నియాలోని కుమారుడు వంశీ దగ్గర ఉంటున్న ఆయన భారత కాలమానం ప్రకారం ఆగస్టు 1, శుక్రవారం తెల్లవారుజామున హఠాన్మరణం చెందారు. లక్ష్మీనారాయణ స్వస్థలం అనంతపురం జిల్లా కదిరి మండలంలోని పరికల్లు గ్రామం. అనేక భాషలలో పాండిత్యం కలిగిన ఆయన పలు అనువాదాలు చేశారు. ప్రఖ్యాత కన్నడ రచయిత ఎస్.ఎల్ భైరప్ప రాసిన పర్వ నవలను తెలుగులోకి అనువదించారు. దీనికిగాను 2004లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాన్ని అందుకున్నారు. ఇందిరాగోస్వామి రచించిన విషాద కామరూప నవలనూ తెలుగు పాఠకులకు అందించిన ఘనత లక్ష్మీనారాయణ సొంతం. విశ్వనాథ సత్యనారాయణ కావ్యానందం రచనను కన్నడలోకి అనువాదం చేశారు. తెలుగు చరిత్ర-కొన్ని కొత్త చూపులు, సాహిత్య పరిశోధనా కళ, తెలుగు సంస్కృతి- శాసనాల, చారిత్రక పరిణామాలు తదితర పరిశోధనాత్మక రచనలు పుస్తకాలుగా వెలువడ్డాయి. లక్ష్మీనారాయణ అంత్యక్రియలు అమెరికాలోనే నిర్వహిస్తున్నట్లు కుమారుడు వంశీ తెలిపారు.

జెన్‌కో ఉద్యోగులకు 5% జనరేషన్ అలవెన్సు

» ట్రాన్స్‌కో ఆర్టిజన్లకు ప్రత్యేక సీబీడీ అలవెన్సు

హైదరాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని జెన్‌కో థర్మల్, హైడల్ కేంద్రాల్లో విధులు నిర్వర్తించే ఉద్యోగులకు 5 శాతం జనరేషన్ అలవెన్సును వర్తింపజేస్తూ ఆ సంస్థ సీఎండీ ఎస్.హరీశ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రధానంగా కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్(కేటీపీఎస్)-ఏడో దశ, భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (బీటీపీఎస్)లలో పనిచేసే ఉద్యోగులకు దీన్ని వర్తింపచేయనుండగా.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జలవిద్యుత్తు కేంద్రాల్లో పనిచేసే వారికీ ఈ అలవెన్సు అందనుంది. ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచే ఇది అమల్లోకి రానుంది. ఇటు ట్రాన్స్‌కోలోని సీబీడీ, ఎస్ఎంజీ, ఎంఆర్‌టీ విభాగాల్లో పనిచేస్తున్న ఆర్టిజన్లకు గంపగుత్తగా ప్రత్యేక సీబీడీ అలవెన్సును వర్తింపజేస్తూ ఆ సంస్థ నిర్ణయం తీసుకుంది. గ్రేడ్-2 వారికి నెలకు రూ.6వేలు, గ్రేడ్-3 వారికి రూ.8వేలు, గ్రేడ్-4 వారికి రూ.10వేల చొప్పున ఇవ్వనుంది.

బీసీలకు 42% రిజర్వేషన్ కల్పించాల్సిందే

» బీజేపీ అడ్డుకొంటోందనడం అబద్ధం: కృష్ణయ్య

హైదరాబాద్/కవాడిగూడ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి డిక్లరేషన్‌కు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్ అమలు చేయాలని బీజేపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీలకు 42% రిజర్వేషన్ కోసం రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు శనివారం ధర్నాచౌక్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో మహా ధర్నా నిర్వహించనున్నట్లు చెప్పారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కృష్ణయ్య మీడియాతో మాట్లాడుతూ.. బీసీలకు 42% రిజర్వేషన్‌ను కేంద్రం అడ్డుకుంటోందంటూ కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తోందని ఆరోపించారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు బీసీ కాదంటూ కాంగ్రెస్ చేసిన విమర్శలపై కృష్ణయ్య మండిపడ్డారు. "యూనివర్సిటీలో ఆయన చేసిన పోరాటాల గురించి వాళ్లకేం తెలుసు. నేను స్వయంగా చూశాను. ఆయన టైగర్. రాంచందర్‌రావు మాటలు, చూపులే చల్లగ ఉంటాయి. పనులు మాత్రం ఖతర్నాక్" అని కృష్ణయ్య అన్నారు. ఇదిలా ఉండగా, ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో 'ఫీజుల పోరు' పేరుతో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ రూ.6వేల కోట్ల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ట్రస్ట్ బ్యాంకు ద్వారా ఫీజులు చెల్లిస్తామంటూ కొత్తనాటకానికి తెరలేపారని కృష్ణయ్య మండిపడ్డారు.

బీసీ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చాలి

» బీసీ ఇంటలెక్చువల్ ఫోరం చైర్మన్ చిరంజీవులు

న్యూఢిల్లీ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన బీసీ బిల్లును ఈ పార్లమెంట్ సమావేశాలలో ఆమోదించి ఆ చట్టాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని బీసీ ఇంటలెక్చువల్ ఫోరం చైర్మన్, మాజీ ఐఏఎస్ చిరంజీవులు కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో చిరంజీవులు మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల చట్టాన్ని 9వ షెడ్యూల్‌లో చేరుస్తేనే దానికి న్యాయ రక్షణ ఉంటుందని అభిప్రాయపడ్డారు. బీసీ రిజర్వేషన్ల చట్టాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్చితే న్యాయపరంగా ఇబ్బందులు వస్తాయని బీజేపీ వాదించడాన్ని చూస్తే ఆ పార్టీ వైఖరి స్పష్టమవుతోందని విమర్శించారు.

సత్ఫలితాలిస్తున్న 'ఆపరేషన్ ముస్కాన్'

» గత నెల రోజుల్లో 7,678 మంది చిన్నారుల రెస్క్యూ

హైదరాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): బాల కార్మికులను రక్షించడానికి, మానవ అక్రమ రవాణాను నిర్మూలించడానికి కేంద్ర హోం శాఖ దేశవ్యాప్తంగా చేపట్టిన 'ఆపరేషన్ ముస్కాన్' సత్ఫలితాలిస్తోంది. రాష్ట్రంలో జూలై 1 నుంచి 31 దాకా నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా మొత్తం 7,678 మంది చిన్నారులను సంరక్షించామని అధికారులు వెల్లడించారు. ఈ మేరకు ఆపరేషన్ నిర్వహణకు తీసుకున్న చర్యలు, రక్షించిన బాలల వివరాలను రాష్ట్ర మహిళా భద్రతా విభాగం డీజీ చారుసిన్హా శుక్రవారం వెల్లడించారు.

ఆర్మీ దక్షిణ భారత్ ఏరియా జీవోసీగా శ్రీహరి




అల్వాల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): భారత సైన్యంలోని దక్షిణ భారత్ ఏరియా జనరల్ ఆఫీసర్(కమాండింగ్)గా లెఫ్టినెంట్ జనరల్ వీ.శ్రీహరి శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. తమిళనాడు, కర్ణాటక, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలతో పాటు పుదుచ్చేరి, లక్షద్వీప్ కేంద్రపాలితప్రాంతాలు ఈ దక్షిణ భారత్ ఏరియా కిందకు వస్తాయి. ఈ ప్రాంతాల్లోని సైన్యానికి శ్రీహరి కమాండింగ్ లెఫ్టినెంట్ జనరల్‌గా వ్యవహరిస్తారని రక్షణశాఖ తన ప్రకటనలో వెల్లడించింది. శ్రీహరి స్వస్థలం కేరళలోని మలప్పురం. సైన్యంలో ఆయన పలు స్థాయిల్లో సేవలందించారు.

డిజిటల్ అటెండెన్స్ యాప్ దుర్వినియోగం!

పంచాయతీ కార్యదర్శుల 'నకిలీ' హాజరు.. ఏకంగా సీఎం ఫొటోతో అటెండెన్స్ వేసిన ఓ అధికారి

తీవ్రంగా స్పందించిన సీఎంవో, సస్పెన్షన్ వేటు... రంగారెడ్డి జిల్లాలో ఇద్దరు అధికారులపై చర్యలు

హైదరాబాద్/రంగారెడ్డి అర్బన్/జగిత్యాల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ రాజ్ అధికారులు సమయపాలన పాటిస్తూ.. విధుల నుంచి డుమ్మాలు కొట్టకుండా, గ్రామాల్లో సేవలు అందించేందుకు పంచాయతీ రాజ్ శాఖ ముఖ గుర్తింపు హాజరు (ఫేస్ రికగ్నిషన్ యాప్) విధానాన్ని అమలులోకి తెచ్చింది. విధానం ప్రకారం.. ప్రతీరోజు పంచాయతీ కార్యదర్శులు తాము విధులు నిర్వహిస్తున్న గ్రామం నుంచే ఉదయం 10 గంటల లోపే ఫేస్ రికగ్నిషన్ ద్వారా పంచాయతీ రాజ్ యాప్‌లో హాజరు నమోదు వేసుకోవాలి. అయితే కొందరు పంచాయతీ కార్యదర్శులు నకిలీ ముఖ హాజరుతో విధులకు ఎగనామం పెడుతూ.. డిజిటల్ అటెండెన్స్ యాప్‌ను దుర్వినియోగం చేస్తున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కార్యాలయంలోనే ఉన్నట్లు తీసిన ఫొటోను లేదా తమ బదులు ఇతరుల ఫొటోలను యాప్‌లో పెడుతూ ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారు. ఇటీవలే ఈ యాప్ లింకును జిల్లా పంచాయతీ శాఖకు అనుసంధానం చేశారు. కొంతమంది రోజూ ఒకే ఫొటో పెట్టడంతో అనుమానం వచ్చి అధికారులు తనిఖీలు ప్రారంభించారు. అందులో భాగంగానే అన్ని జిల్లాల్లో కార్యదర్శులు డిజిటల్ హాజరు నమోదును పరిశీలించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ డైరెక్టర్ జి. సృజన.. కలెక్టర్లు, డీపీవోలను ఆదేశించారు. అధికారులు యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్న ఫొటోలను డీపీవో నేతృత్వంలో పరిశీలించగా అసలు విషయం బయటపడింది.



హాజరు యాప్‌లో అప్‌లోడ్ చేసిన సీఎం ఫొటోలు

ముఖ్యమంత్రి ఫొటోతో అటెండెన్సు

తాజాగా జగిత్యాల జిల్లా చందయ్యపల్లి గ్రామ కార్యదర్శి రాజన్న, ఏకంగా సీఎం రేవంత్ రెడ్డి ఫొటోతో హాజరు నమోదు చేశారు. విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి కార్యాలయం తీవ్రంగా స్పందించింది. ఉన్నతాధికారుల ఆదేశం మేరకు రాజన్నను వెంటనే సస్పెండ్ చేస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. అలాగే రంగారెడ్డి జిల్లా సింగంపల్లి కార్యదర్శి జంగయ్య, భీమారం కార్యదర్శి అనిల్ కుమార్ కూడా విధులకు రాకుండానే హాజరైనట్లు ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. గత రెండు రోజులుగా అధికారులు జరిపిన పరిశీలనలో ఫేస్ రికగ్నిషన్ యాప్‌లో తప్పుడు ఫొటోలు అప్‌లోడ్ చేసి నిర్లక్ష్యంగా వ్యవహరించిన 200మంది కార్యదర్శులను గుర్తించినట్లు తెలుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా పూర్తి సమాచారం సేకరించిన అనంతరం సదరు పంచాయతీ కార్యదర్శులపై చర్యలు చేపట్టాలని పంచాయతీరాజ్ శాఖ నిర్ణయించింది

బనకచర్ల పాపం కేసీఆర్, హరీశ్‌దే!

బీఆర్ఎస్ సర్కారు ఏపీ పాలకులకు తలొగ్గింది.. తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెట్టింది

» కేంద్రానికి ఫిర్యాదు చేసి ప్రాజెక్టు ఆపాం

» ప్రజల కష్టాలు తెలుసుకునేందుకే యాత్ర

» దేవుడి పేరుతో బీజేపీ చిచ్చు: మహేశ్‌గౌడ్

» వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో టీపీసీసీ జనహిత పాదయాత్ర

వికారాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/పరిగి: బనకచర్ల ప్రాజెక్టు విషయంలో తెలంగాణ ప్రయోజనాలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏపీకి తాకట్టు పెట్టిందని టీపీసీసీ చీఫ్ బి.మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. అప్పటి సీఎం కేసీఆర్, సాగునీటి మంత్రి హరీశ్‌రావు ఏపీ పాలకులకు తలొగ్గి చేసిన తప్పిదాలను సరిదిద్దేందుకు.. తెలంగాణ వాటా వెనక్కి తీసుకువచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని చెప్పారు. తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతుందని కేంద్రానికి ఫిర్యాదు చేసి బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకున్నామని తెలిపారు. టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జనహిత పాదయాత్ర రెండో రోజు శుక్రవారం ఉదయం పరిగి పట్టణంలో జరిగింది. ఈ సందర్భంగా ఎస్ గార్డెన్స్‌లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం సంగారెడ్డి జిల్లా సంగుపేట నుంచి జోగిపేట వరకు పాదయాత్ర నిర్వహించారు. జోగిపేటలో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మీడియాతో మాట్లాడారు.

ప్రజలతో మమేకం అయ్యేందుకే: మహేశ్‌గౌడ్

పాదయాత్ర అనేది కాంగ్రెస్ సంస్కృతిలో ఓ భాగమని, ప్రజలతో మమేకమై కష్టసుఖాలు తెలుసుకునేందుకే టీపీసీసీ పాదయాత్రకు శ్రీకారం చుట్టిందని మహేశ్‌గౌడ్ తెలిపారు. రాబోయే రోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డి కూడా పాదయాత్రలో పాల్గొంటారని చెప్పారు. 42శాతం బీసీ రిజర్వేషన్లకు కాంగ్రెస్ కట్టుబడి ఉందని, కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలుచేసి తీరుతామని స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్ల గురించి కేసీఆర్ కూతురు, అల్లుడికి ఏం సంబంధమని మహేశ్‌గౌడ్ ప్రశ్నించారు. అసలు కవిత ఏ పార్టీలో ఉన్నారో ఆమెకైనా తెలుసా అని ప్రశ్నించారు. కేసీఆర్ మంచోడని ఏపీ మంత్రి లోకేశ్ కితాబునిస్తున్నారని, బనకచర్ల విషయంలో కేసీఆర్ ఏపీకి లాభం చేయడమే దీనికి కారణమని ఆరోపించారు. కాంగ్రెస్ అంటేనే త్యాగాల పార్టీ అని.. సోనియా, రాహుల్ ప్రధాని అయ్యే అవకాశమున్నా త్యాగం చేశారని మహేశ్‌గౌడ్ చెప్పారు. "మోదీ ఏం చదువుకున్నారు? ఏం సర్టిఫికెట్ ఉందో ఎవరికీ తెలియదు. అలాంటి వ్యక్తి కుల, మతాల పేరిట ప్రజల చిచ్చుపెట్టి పాలిస్తున్నారు. దేవుడు దేవుడే.. రాజకీయం రాజకీయమే. కానీ బీజేపీకి ఓట్ల కోసం శ్రీరాముడు కావాల్సి వస్తోంది. బీజేపీని ఏమైనా శ్రీరాముడు స్థాపించాడా? శ్రీరాముడికి బీజేపీకి ఏం సంబంధం? ఇలాంటి రాజకీయాలు చేస్తున్న బీజేపీతో వచ్చే తరాలకు కూడా శాపమే.." అని మహేశ్‌గౌడ్ పేర్కొన్నారు. ఇక బీసీలకు సామాజిక న్యాయం కల్పించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి పరితపించడం అభినందనీయమని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ అన్నారు. రాహుల్‌గాంధీ ఏ రాష్ట్రానికి వెళ్లినా తెలంగాణ మోడల్ గురించే చెబుతుంటారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.



సంగారెడ్డి జిల్లాలో పాదయాత్రలో మహేశ్‌గౌడ్, మీనాక్షి, మంత్రులు వివేక్, దామోదర, పొన్నం తదితరులు

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి: శ్రీధర్‌బాబు

సంక్షేమ కార్యక్రమాల అమల్లో కార్యకర్తల పాత్ర కీలకమని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నా కార్యకర్తలు గౌరవంగా నిలబడాలనే హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. బలమైన, గెలిచే అవకాశం ఉన్న వారికి స్థానిక సంస్థల ఎన్నికల్లో టికెట్లు ఇస్తామని చెప్పారు. పార్టీ కోసం పని చేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు.

మట్టిని ఎత్తిపోసి.. మొక్కలు నాటి..

శుక్రవారం ఉదయమే ఇక్కడి గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో మీనాక్షి నటరాజన్, మహేశ్‌గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి మట్టిని ఎత్తిపోసి, మైదానాన్ని చదును చేశారు. మొక్కలు నాటారు. కార్యకర్తల సమావేశానికి ముందు మీనాక్షి నటరాజన్ నూలు వడికారు.



జగద్గిరిగుట్టలో ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలి ముఖ హాజరు తీస్తున్న దృశ్యం

రిజిస్టర్ సంతకానికి చెల్లు

» బదులుగా 'ముఖ గుర్తింపు హాజరు'

» రాష్ట్రవ్యాప్తంగా తొలిరోజు 93.35%

» 74% హాజరుతో పెద్దపల్లి జిల్లా అత్యల్పం

హైదరాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల హాజరులో పారదర్శకత పాటించేలా.. విద్యాశాఖ ప్రవేశపెట్టిన ఉపాధ్యాయుల ముఖ గుర్తింపు హాజరు (ఫేషియల్ రికగ్నిషన్ సిస్టం-ఎఫ్ఆర్ఎస్) విధానం శుక్రవారం నుంచి అమలులోకి వచ్చింది. దీనికోసం ఉపాధ్యాయులు తమ ఆండ్రాయిడ్ ఫోన్లలో 'డీఎస్ఈ ఎఫ్ఆర్ఎస్' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇది జీపీఎస్‌కు అనుసంధానంగా ఉండటంతో.. ఉపాధ్యాయులు పాఠశాలకు వచ్చిన తర్వాతే యాప్ ద్వారా స్వీయచిత్రం(సెల్ఫీ)తో హాజరు నమోదవుతోంది. పాఠశాలకు దూరంగా ఉంటే యాప్ పనిచేయదు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 24,973 పాఠశాలలుండగా.. 24,951 (99.91%) పాఠశాలల్లో ఈ విధానాన్ని ప్రారంభించారు. అయితే ఈ యాప్ ప్రస్తుతం కేవలం ఆండ్రాయిడ్ వినియోగదారులకు అందుబాటులో ఉండటంతో.. ఐఫోన్ వినియోగదారులు దీనికి దూరంగా ఉండిపోయారు. రాష్ట్రంలో మొత్తం 1,28,760మంది ఉపాధ్యాయులుండగా.. సాంకేతిక కారణాలతో 25.18శాతం మంది కొత్త హాజరు విధానానికి దూరంగా ఉన్నారు. రిజిస్టర్ చేసుకున్న 96,327 ఉపాధ్యాయుల్లో తొలిరోజు 89,922 (93.35%) మంది హాజరయ్యారు. అయితే ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని మొదట ప్రయోగాత్మకంగా ప్రారంభించిన పెద్దపల్లిలో 2,607(97.17%) మంది ఉపాధ్యాయులు రిజిస్టర్ చేసుకోగా.. మొదటిరోజు 1,944 (74.57%)మందే హాజరయ్యారని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు నవీన్ నికోలస్ తెలిపారు.

ఐదేళ్లు కాదు.. మూడేళ్లలోనే..!

» మార్పులతో ఇందిర సౌర గిరి జల వికాసం పథకం అమలు

» సెంట్రలైజ్డ్ టెండర్లకు వెళ్లే యోచన

» కుసుమ్ మాదిరిగా సబ్సిడీ ఇవ్వండి

» కేంద్ర ప్రభుత్వాన్ని కోరిన రాష్ట్రం

హైదరాబాద్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): గిరిజన భూములను అభివృద్ధి చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపాలనే లక్ష్యంతో తెచ్చిన 'ఇందిర సౌర గిరి జల వికాసం పథకం' అమల్లో రాష్ట్ర ప్రభుత్వం మార్పులు చేపట్టనుంది. గతంలో ఉన్న ఐదేళ్ల గడువును మూడేళ్లకు కుదించనుంది. ఈ పథకానికి సంబంధించిన టెండర్ల విధానాన్నీ మార్చనుంది. ప్రస్తుత విధానంలో టెండర్లను జిల్లా స్థాయిలో నిర్వహించాలని నిర్ణయించగా.. దీనికి బదులు రాష్ట్ర స్థాయిలో కేంద్రీకృత విధానం (సెంట్రలైజ్డ్)లో టెండర్లను ఆహ్వానించాలన్న నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. ఇందిర సౌర గిరి జల పథకాన్ని రెండు నెలల క్రితం నాగర్‌కర్నూల్ జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించిన విషయం తెలిసిందే. అనంతరం పథకాన్ని ప్రయోగాత్మకంగా అమల్లోకి తేగా అధికారుల దృష్టికి వచ్చిన అంశాలను పరిగణనలోకి తీసుకుని పలు మార్పులతో పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. ఈమేరకు గతంలో ఇచ్చిన జీవో15ను సవరించి మరో జీవోను విడుదల చేయడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. దీని ప్రకారం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 10వేల మంది గిరిజన రైతులకు రూ.600 కోట్ల ఖర్చుతో 27,184 ఎకరాలను అభివృద్ధి చేయాల్సి ఉంది. 2026-27నుంచి నాలుగేళ్లలో యేటా 50వేల మంది రైతుల చొప్పున రూ.3వేల కోట్లతో 1,43,204 ఎకరాల చొప్పున సాగు యోగ్యం కల్పించాలని నిర్ణయించారు. ఈ ఐదేళ్ల గడువును మూడేళ్లకు కుదించాలని.. అవసరమైన సోలార్ మోటార్లు, ఇతర పరికరాల కొనుగోళ్లకు సెంట్రలైజ్డ్ టెండర్లు నిర్వహించాలన్న ప్రతిపాదనలు గిరిజన సంక్షేమ శాఖ నుంచి ప్రభుత్వానికి వెళ్లాయి.

30% రాయితీ భరించాలని కేంద్రానికి ప్రతిపాదన

రాష్ట్రంలోని 2.10 లక్షల మంది గిరిజన రైతులకు 6.69లక్షల ఎకరాలకు భూమి యాజమాన్యపు హక్కులు కల్పించారు. ఈ భూములకు ఐదేళ్లలో రూ.12,600 కోట్లతో సాగునీటి సౌకర్యం కల్పించేందుకు సౌరగిరి జల వికాసం పథకాన్ని రూపొందించారు. అయితే పీఎం కుసుమ్ అనే కేంద్ర ప్రభుత్వ పథకం రైతులు సౌరశక్తి ఆధారిత వ్యవసాయ పంపుసెట్లను ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పిస్తోంది. ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం 30శాతం, రాష్ట్ర ప్రభుత్వం 30శాతం చొప్పున సబ్సిడీ అందిస్తాయి. పీఎం కుసుమ్ పథకానికిసబ్సిడీని భరిస్తున్న నేపథ్యంలో ఇందిర సౌర గిరి జల వికాసం పథకానికీ అంతే సబ్సిడీ చెల్లించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది.

మెక్ సేవక్, మెక్ నిరీక్షక్!

యంత్రాల్లోని లోపాలను చెప్పే పర్యవేక్షక వ్యవస్థలు.. హైదరాబాద్ బిట్స్ పిలానీ పరిశోధకుల ఆవిష్కరణ

» 'యంత్రాయుష్' స్టార్టప్ పేరిట పరిశోధన

» ఎంఎస్ఎంఈల కోసం అభివృద్ధి, వచ్చే ఫిబ్రవరికి మార్కెట్‌లోకి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ పరిసరాల్లోని పరిశ్రమల్లో ఇటీవల సంభవించిన ఘోర ప్రమాదాలు ఎంతో విషాదాన్ని మిగిల్చాయి. ఆయా పరిశ్రమల్లోని యంత్రాల్లో తలెత్తే లోపాల వల్లే ప్రమాదాలు జరుగుతుంటాయి. అయితే వాటిని నివారించేందుకు మానవ వనరుల ప్రమేయాన్ని తగ్గిస్తూ తక్కువ ఖర్చులో యంత్రాలపై నిరంతర పర్యవేక్షణ ఉండేలా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) కోసం మెక్- సేవక్, మెక్ నిరీక్షక్ పేరిట రెండు పర్యవేక్షక వ్యవస్థలను హైదరాబాద్‌లోని బిట్స్‌పిలానీ పరిశోధకులు అభివృద్ధి చేశారు. 'యంత్రాయుష్' పేరిట ప్రారంభించిన స్టార్టప్‌తో ఈ వ్యవస్థలకు అంకురార్పణ చేశారు.

ఏడాది కష్టం, వందలాది ప్రయత్నాల ఫలితం

మెక్‌సేవక్, మెక్ నిరీక్షక్ వ్యవస్థల అభివృద్ధి కోసం ఏడాది క్రితం యంత్రాయుష్ స్టార్టప్‌ను ప్రారంభించారు. హైదరాబాద్, బిట్స్ పిలానీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెకానికల్ అండ్ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ ఫ్యాకల్టీ సభ్యులు ప్రొఫెసర్ జీఆర్ శబరీష్, రాధిక నేతృత్వంలోని పరిశోధకుల బృందం వందలాది ప్రయత్నాల తర్వాత ఈ వ్యవస్థల ప్రొటోటైప్‌లను అభివృద్ధి చేసింది. టెక్నాలజీ బిజినెస్ ఇక్యుబేటర్, బయోనెస్టీ ఫౌండేషన్ల మద్దతుతో ఈ రెండు వ్యవస్థలను పూర్తిగా అభివృద్ధి చేసి పరీక్షించింది. ఇందులో మెక్‌సేవక్.. తనకు అందుబాటులో ఉన్న సమాచారాన్ని సమీకరించి ఒకే తరహా యంత్రాన్ని పర్యవేక్షిస్తుందని పరిశోధకులు తెలిపారు. ఉదాహరణకు ఏదైనా ఒక పంపును తీసుకుంటే.. అదే తరహా అనేక పంపులను కూడా మెక్ సేవక్ పర్యవేక్షిస్తుందని యంత్రాయుష్ బృందం చెబుతోంది. మెక్ సేవక్ ముందుగానే లోపాలను గుర్తిస్తుందని, దాని వల్ల మెకానిక్‌లు అత్యంత క్లిష్టమైన ప్రక్రియలను చేయాల్సిన అవసరాన్ని తగ్గిస్తుందని చెబుతున్నారు. అదే మెక్ నిరీక్షక్.. ఒకేసారి విభిన్న యంత్రాలను పర్యవేక్షిస్తుందని పరిశోధకులు తెలిపారు. ఈ రెండు వ్యవస్థలు కృత్రిమ మేధ సాయంతో పని చేస్తాయని శబరీష్ వెల్లడించారు. ఈ వ్యవస్థలతో రసాయన పరిశ్రమల్లోని యంత్రాల్లో లోపాలను గుర్తించవచ్చన్నారు. ఈ మెక్‌సేవక్, మెక్ నిరీక్షక్ ఖర్చు తక్కువని.. సేవక్‌కు రూ.30-35 వేలు, నిరీక్షక్‌కు రూ.లక్ష దాకా వ్యయం అవుతుందన్నారు. ఈ రెండు వ్యవస్థలను రిమోట్‌గా వినియోగించుకోవచ్చునని చెప్పారు. ఈ వ్యవస్థలను మెరుగుపర్చి వచ్చే ఏడాది ఫిబ్రవరికి అందుబాటులోకి తెస్తామని వివరించారు.



యంత్రాయుష్‌ను రూపొందించిన బృందం

పారామెడికల్ పదోన్నతుల్లో నిబంధనలకు నీళ్లు!

» మధ్య క్యాడర్ వారికి పదోన్నతులివ్వడంపై అనుమానాలు

» చక్రం తిప్పిన అధికార పార్టీ అనుబంధ సంఘ నేత!

» సీఎం, వైద్య మంత్రి, హెల్త్ సెక్రటరీకి ఉద్యోగ సంఘాల ఫిర్యాదు

హైదరాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకుల పరిధిలోని పారామెడికల్ ఉద్యోగుల పదోన్నతులు నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్నాయి. నిబంధనలమేరకు పైస్థాయి నుంచి కాకుండా మధ్యక్యాడర్ నుంచి పదోన్నతులు చేపట్టడం పలు అనుమానాలకు తావిస్తోంది. దీనిపై తెలంగాణ వైద్య, ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం.. సీఎం రేవంత్‌రెడ్డి, వైద్యమంత్రి దామోదర రాజనర్సింహ, హెల్త్ సెక్రటరీ క్రిస్టినాకు ఫిర్యాదు చేసింది. పదోన్నతులపై సమగ్ర విచారణ జరపాలని, పైస్థాయి నుంచి పదోన్నతులు చేపట్టాలని కోరింది. కొందరికి లబ్ధి చేకూర్చాలన్న ధోరణితోనే మధ్య క్యాడర్‌లో పదోన్నతులు చేపట్టారంటూ ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. సుదీర్ఘకాలం తర్వాత ప్రజారోగ్య సంచాలకుల విభాగం పారామెడికల్ విభాగంలో పదోన్నతులు చేపట్టింది. పారామెడికల్ విభాగంలో పలు రకాల క్యాడర్లు ఉండగా.. ఇందులో ఎంపీహెచ్ఏలో మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ఎంపీహెచ్ఏ), మల్టీ పర్పస్ హెల్త్ సూపర్‌వైజర్(ఎంపీహెచ్ఎస్), మల్టీపర్పస్ హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్(ఎంపీహెచ్ఈవో), కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్(సీహెచ్‌వో) క్యాడర్లు ఉంటాయి. ఎంపీహెచ్ఏ నుంచి పదోన్నతి పొంది ఎంపీహెచ్ఎస అవుతారు. ఆ హోదాలో ప్రమోషన్ వస్తే ఎంపీహెచ్ఈవోగా.. ఆ క్యాడర్‌లో పదోన్నతి వస్తే సీహెచ్‌వో అవుతారు. నిబంధనల ప్రకారం పై క్యాడర్ నుంచి అంటే ఎంపీహెచ్ఈవో క్యాడర్‌లో ముందుగా ప్రమోషన్ ఇస్తారు. ఆ హోదాలో పదోన్నతి పొందితే సీహెచ్‌వో అవుతారు. ఆ తర్వాత ఆ క్యాడర్‌లో పదోన్నతులు ఉండవు. సీహెచ్‌వోగానే పదవీ విరమణ చేయాల్సి ఉంటుంది. సీహెచ్‌వోలుగా పదవీ విరమణ తర్వాత ఖాళీగా ఉన్న ఆ పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలి. అయితేప్రజారోగ్య సంచాలకుల కార్యాలయం మాత్రం అందుకు విరుద్ధంగా మధ్య క్యాడర్‌లో ప్రమోషన్లు చేపట్టడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. జూలై 29న ఎంపీహెచ్ఎస్ క్యాడర్ వారికి ఎంపీహెచ్ఈవోగా పదోన్నతులు కల్పించారు. జోన్ 1, జోన్ 2 కలిపి మొత్తం 70 మందికి ప్రమోషన్లు ఇచ్చారు. ఈరోజున పదోన్నతులకు అర్హులైన వారు వెబ్ ఆప్షన్స్ ఇవ్వాలని డీహెచ్ కార్యాలయం కోరింది. కేవలం 3 గంటలే ఆ వెబ్ ఆప్షన్స్ పనిచేశాయని, ఇలా ఎందుకు చేశారని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. తర్వాత పదోన్నతి పొందిన వారికి ఆన్‌లైన్‌లో కౌన్సెలింగ్ చేపట్టి, పోస్టింగ్‌లు ఇచ్చారు. కాగా మధ్య క్యాడర్‌లో పదోన్నతుల విషయంలో డబ్బులు చేతులు మారాయన్న ఆరోపణలున్నాయి. ఈ మొత్తం వ్యవహారం వెనుక వైద్యశాఖలోనే అధికార పార్టీకి అనుబంధ సంఘ నాయకుడు ఒకరున్నట్లు ఉద్యోగులు చెబుతున్నారు. ఉన్నతాధికారులపై ఒత్తిడి తెచ్చి మధ్య క్యాడర్‌కు ప్రమోషన్లు ఇచ్చినట్లు వివరిస్తున్నారు. కాగా ఆన్‌లైన్ ద్వారా కౌన్సెలింగ్ చేపట్టాక ఆర్డర్ కాపీ ఆన్‌లైన్ ద్వారానే పంపాలి. కానీ డీహెచ్ కార్యాలయ సిబ్బంది మాత్రం ఆర్డర్ కాపీలను ఆఫీసుకు వచ్చి తీసుకెళ్లాలంటున్నారు. ఆఫీసుకు రమ్మంటే.. కాసుల కోసమేనని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.